www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 23-4-2024 | పేజీలు: 18 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 7 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి తె. 5.19 తదుపరి పాడ్యమి; నక్షత్రం: చిత్ర రా. 10.32 తదుపరి స్వాతి; వర్జ్యం: తె. 4.38 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 8.27-9.17, రా. 10.14-10.58; అమృతఘడియలు: మ. 3.27-5.13; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.57, సూర్యాస్తమయం: 6.29 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

Happiness blooms!

Welcome to Bhashyam Blooms. The Fastest Growing CBSE Network of Schools in South India.



Bhashyam schools, spread across Telangana, Andhra Pradesh and Karnataka, offer pioneering educational CBSE programmes that have earned us several regional, national and international accolades. Our commitment to constantly evolving and keeping up with emerging skills and trends worldwide has led us to forge tie-ups with leading global organizations to bring the best practices to our schools.


The outstanding success of Bhashyamities in CBSE, SSC, and top ranks in JEE and NEET has made us South India's leading and most preferred educational group. In three decades, we have created milestones through our path-breaking and innovative programmes.

Join us in our successful journey towards excellence in education. Together, let's shape a brighter future for our students!

BHASHYAM BLOOMS® the global school

bhashyamblooms.in











UNDISPUTED SUCCESS IN IIT JEE (ADV) 2023



A. Venkata Siva Ram HT. 236055009



YV. Maneendhar Reddy HT. 236054250

BHASHYAM A TRUE FORMULA FOR SUCCESS

Bhashyamites in IITs, NITs, IIITs and India's Top Engg. Colleges

200 Below Ranks	23
500 Below Ranks	47
1000 Below Ranks	59

A Sensational Success in JEE(Advanced) 2023. Bhashyam is proud to top in India again.

TOP RANKERS BELOW 100 WHO MADE THE STATE PROUD - ALL INDIA RANKERS IN ALL CATEGORIES OF JEE ADVANCED 2023


1st Rank — Y. Maneendhar HT. 236054250


5th Rank — A.V. Siva Ram HT. 236055009


6th Rank — K.L. Surya HT. 236050116


7th Rank — P.N. Subhash HT. 236061054


8th Rank — R.A. Karthik HT. 236050527


10th Rank — Y. Maneendhar HT. 236054250


21st Rank — M.S. Vignesh HT. 236030043


22nd Rank — V. Deepesh HT. 236064143


28th Rank — A. Mourya HT. 236049789


29th Rank — I. Harshitha HT. 236049814


32nd Rank — P. Chandrahas HT. 236017006


39th Rank — Ch. Kundan HT. 236057020


53rd Rank — K.L. Surya HT. 236050116


64th Rank — V. Ajay Kumar HT. 236063050


85th Rank — B.S. Harshith HT. 236031105


95th Rank — Ch. Praneeth HT. 236030038

Success Rate 80%

Bhashyam Blooms, Andhra Pradesh:

Guntur: Ring Road, T: 98485 36968, **Vijayawada:** NH-65, Poranki, T: 95422 54444/64444.
Kakinada: Panasapadu, ADB Road, CBSE Campus, T: 88850 34224.
Vizianagaram: Beside Ramanarayanam, Via Koru Konda Road. T: 88862 86677, 88862 96677.
Rajahmundry: Gadalammapunta Road, Buchaiah Nagar, T: 88869 22422/33433.

BIIT® BHASHYAM IIT - JEE Academy

BHASHYAM®

Bhashyam Junior College | Guntur | Rajahmundry

Residential Boys : 96038 55528, 98485 36971
Residential Girls : 96035 44563, 91210 58080
Day Scholars : 95151 53264, 95151 53263, 98485 36939
CO Campus : 91210 58181, 98487 78345
Day Scholars : 98487 78358, 96035 66636

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 23-4-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

వెంకయ్యకు పద్మవిభూషణ్

వేదిక దిగి వచ్చి పురస్కారం అందించిన రాష్ట్రపతి ముర్ము

తెలంగాణ కళాకారులు గడ్డం సమ్మన్న, దాసరి కొండప్ప, సోంలాల్ నాయక్‌లకు పద్మశ్రీ

110 మందిలో 67 మందికి పురస్కారాల అందజేత 2





3

కమనీయం... కోదండరాముని
కల్యాణోత్సవం

ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణం సోమవారం సాయంత్రం నెలరాజు సాక్షిగా పండు వెన్నెల్లో నేత్రపర్వంగా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

డైమండ్.. డైమండ్.. పింక్ డైమండ్.. ఎక్కడున్నావ్? తిరుమల నుంచి వెళ్లిపోయి ఎక్కడ దాక్కున్నావ్? జగన్ సమర్పణలో రిలీజ్ అయిన 'పింక్ డైమండ్ పాయె' కథలో చెప్పిన మాటలన్నీ ఎందుకు అటకెక్కాయి? చేసిన ఆరోపణలన్నీ ఎందుకు గాలికిపోయాయి? జగన్ మార్క్ ఎన్నికల డ్రామాలో అసలు వాస్తవాలేంటి?



పింక్ డైమండ్ ఎక్కడ జగన్?

అధికారం నుంచి అధఃపాతాళానికి!

ఐటీకి సమాధి

వియ్యాలవారి వైభవం!

తొలి ఎన్నికలు ఎలా స్పెషల్?

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..



12 13

మెగా డీఎస్సీపై తొలి సంతకం

ఈ పెన్నుతోనే!



ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం: చంద్రబాబు



జగ్గంపేట సభకు హాజరైన జనం.. ఓ యువతి ఇచ్చిన పెన్ చూపిస్తూ.. అధికారంలోకి రాగానే ఈ పెన్‌తోనే డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేస్తానని ప్రకటిస్తున్న చంద్రబాబు

జాబు రావాలంటే బాబు రావాలి.. గంజాయి కావాలంటే జగన్ రావాలి

ఈ సీఎంను సవాల్ చేస్తున్నా..1న సచివాలయాల సిబ్బందిని ఇంటింటికీ పంపి పింఛన్లు ఇప్పించాలి.. మేం రాగానే 4 వేలు ఇంటికే వచ్చి ఇస్తాం

పెంచిన మొత్తం ఏప్రిల్ నుంచే అమలు.. పేదలకు 2-3 సెంట్ల ఇంటి స్థలం

ఉచితంగా టిడ్కో ఇళ్లు.. మహిళలూ.. టీడీపీ వస్తే ఎంత లాభమో లెక్కలేసుకోండి

ఆలోచించి నిర్ణయం తీసుకోండి.. దుర్మార్గుడు మళ్లీ వస్తే మన గతేంటి?

విధ్వంసం, దోపిడీయే జగన్ విధానాలు.. పవన్ కాలిగోటికి కూడా సరిపోడు

13న హుద్‌హుద్ కంటే పెద్ద తుఫాను.. వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం: బాబు

కాకినాడ/విజయనగరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీపైనే చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు పునరుద్ఘాటించారు. 'ఓ ఆడబిడ్డ జగ్గంపేటలో నన్ను కలిసినప్పుడు నాకో పెన్ను ఇచ్చింది. ఆ పెన్నుతో నేను సీఎం అయ్యాక డీఎస్సీపై తొలి సంతకం చేయాలని కోరింది. కచ్చితంగా అలాగే చేస్తా' అని ప్రకటించారు. టీడీపీ వచ్చాక ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని

మిగతా 14వ పేజీలో...

పవన్ హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

పశ్చిమగోదావరి జిల్లా పర్యటన రద్దు

నేడు పిఠాపురంలో నామినేషన్



అభిమాని సైకిల్‌పై పవన్



అవినీతి పార్టీకి ఓట్లు వేయొద్దు

దోపిడీ దొంగలకు బుద్ధి చెప్పండి

కలెక్షన్ కింగ్‌లుగా వైసీపీ ఎమ్మెల్యేలు

దోచుకుతిన్నారని సీట్లు మార్చేశారు

వెలిగొండకు తట్టెడు మట్టి పోశారా?

ప్రాజెక్టులకు గేట్లు బిగించలేని వ్యక్తి వైఎస్‌కు వారసుడెలా అవుతాడు?

ఏటా ఇస్తామన్న జాబ్ కేలెండర్ ఏదీ?

జగన్‌పై చెల్లి షర్మిల మండిపాటు

ఎర్రగొండపాలెం/అద్దంకి, ఏప్రిల్ 22: అవినీతి పార్టీకి ఓట్లు వేయవద్దని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. సిద్ధం అని వస్తున్న దోపిడీ దొంగలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం, చీమకుర్తి, బాపట్ల జిల్లా అద్దంకిలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. ఐదేళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా సిద్ధం అని ఎక్కడకు బయలుదేరారని వైసీపీ నేతలను నిలదీశారు. "చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయలేదని, ఆయనకు సిగ్గుండాలని

మిగతా 14వ పేజీలో...

చీరాలలో ఆమంచి.. పి.గన్నవరంలో చిట్టిబాబు

సుంకర పద్మశ్రీకి విజయవాడ తూర్పు

38 మందితో కాంగ్రెస్ అభ్యర్థుల మలి జాబితా

10 అసెంబ్లీ సీట్లలో మార్పులు 14

25 వేల మంది టీచర్లు ఇంటికే!

ఎనిమిదేళ్లుగా తీసుకున్న జీతాలు 4 వారాల్లో వడ్డీతోసహా చెల్లించాల్సిందే

బెంగాల్‌లో 2016 ఉపాధ్యాయ నియామకాలపై కలకత్తా హైకోర్టు తీర్పు

15 రోజుల్లోగా నియామక ప్రక్రియ చేపట్టాలని బెంగాల్ సర్కారుకు ఆదేశం

దర్యాప్తు కొనసాగించి 3 నెలల్లో నివేదిక ఇవ్వాలని సీబీఐకి సూచన


హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం

బాధితులకు అండగా ఉంటాం

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా, ఏప్రిల్ 22: పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం కేసులో కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. మమత సర్కారు రాష్ట్రస్థాయి ఎంపిక పరీక్ష (ఎస్ఎల్ఎస్‌టీ) ద్వారా 2016లో జరిపిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేసింది. ఈ తీర్పుతో 25,753 మంది ఉద్యోగాలను కోల్పోయారు. వారి నియామక ప్రక్రియ చెల్లదని జస్టిస్ దేబాంగ్సు బసక్, జస్టిస్ మహ్మద్ షబ్బార్ రషీదీతో కూడిన డివిజన్ బెంచ్ తేల్చిచెప్పింది. అంతేకాదు.. అక్రమంగా ఉద్యోగాలు పొందినవారంతా గత ఎనిమిదేళ్లుగా తాము తీసుకున్న జీతాలను వడ్డీతో సహా.. నాలుగు

మిగతా 2వ పేజీలో...





నా గెలుపు ఖాయం

జగన్‌ను గద్దె దించాలని జనంలో కసి: సీఎం రమేశ్

మోదీ ఆదేశాలతోనే అనకాపల్లి బరిలో.. నా నడవడిక చూసి సీటిచ్చారు

గెలుపు అవకాశాలను బీజేపీ పెద్దలకు వివరించే టికెట్ తెచ్చుకున్నా

ఆ ఎలక్టోరల్ బాండ్స్‌తో నాకు సంబంధం లేదు

చిరంజీవి, నేను ఒకేసారి రాజ్యసభకు.. అప్పటి నుంచి సాన్నిహిత్యం

అవినాశ్‌రెడ్డి అరెస్టు ఖాయం.. అన్ని ఆధారాలూ ఉన్నాయి 11

జగన్‌కు, భారతికీ ప్రమేయం ఉందని ప్రజలకు తెలుసు

ఈ సీఎం అవినీతి, అక్రమాలు మోదీ, అమిత్ షాలకూ తెలుసు

ఉత్తరాంధ్రలో ఎర్రన్నాయుడు లేని లోటు తీరుస్తా.. 'బిగ్ డిబేట్'లో రమేశ్

టెన్త్ ఉత్తీర్ణత 86.69%

గతేడాది కంటే 13.95 శాతం అధికం

అబ్బాయిలు 84.32%.. అమ్మాయిలు 89.17%

ఉత్తీర్ణుల్లో 69.26% మందికి ఫస్ట్ డివిజన్

2,803 బడుల్లో వంద శాతం పాస్

17 పాఠశాలల్లో మొత్తం ఫెయిల్

ఫలితాల్లో మన్యం టాప్.. కర్నూలు లాస్ట్

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు 3



మనస్వి 599/600

1400 మందికి 590 పైనే మార్కులు

570పైన 18 వేల మందికి

కార్పొరేట్ విద్య.. ఇదేనా జగన్..?

ప్రైవేటు పాఠశాలల్లోనే ఎక్కువ మంది పాస్

ప్రైవేటులో 96.72 శాతం.. జడ్పీలో 79.38%

మొత్తం మార్చేశానని బీరాలు పలికిన సీఎం

ప్రభుత్వ బడులతో కార్పొరేట్ పోటీ అని ప్రచారం

టెన్త్ ఫలితాలతో బయటపడిన డొల్లతనం

రాష్ట్రంపై ఈసీ ప్రత్యేక నిఘా



ఎన్నికల కోడ్ తర్వాతా కొనసాగుతున్న హింస

సమస్యాత్మకంగా గుర్తించి ప్రత్యేక చర్యలు

ఓటరు జాబితా, హింసా ఘటనలపై ఈసీ సీరియస్

అందుకే పార్లమెంట్ స్థానానికో పోలీస్ పరిశీలకుడు

హింసా ఘటనలకు కలెక్టర్, ఎస్పీలదే బాధ్యత

సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌పై ఫిర్యాదులు

కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలనలో వారి అంశం

పోలింగ్ రోజు రాష్ట్ర సరిహద్దులు మూసివేస్తాం

వారం ముందుగా ఇంటింటికీ ఓటరు స్లిప్పులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ 11

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో ప్రత్యేక ఇంటర్వ్యూ

పెమ్మసాని ఆస్తులు రూ. 5,705 కోట్లు



అమెరికా, హైదరాబాద్, విజయవాడ, గుంటూరులో చంద్రశేఖర్‌కు ఆస్తులు

రోల్స్‌రాయిస్ ఘోస్ట్, బెంజ్ కార్లు సొంతం.. దేశంలోని టాప్ ధనిక ఎంపీ అభ్యర్థుల్లో ఒకరు.. గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి 11

'కొండా' ఆస్తులు రూ. 4,490 కోట్లు

చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరఫున బరిలోకి విశ్వేశ్వర్‌రెడ్డి 2

జగన్ ఆస్తులు 41% పెరిగాయి!

ఆస్తుల విలువ 529 కోట్లు.. పలు కంపెనీల్లో పెట్టుబడులు.. సీఎంపై 26 కేసులు 2



దొమ్మరాజు గుకేష్.. మరో చరిత్ర

అసామాన్యుడు..

తెలుగు మూలాలు కలిగిన చెన్నై గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేష్ ప్రపంచ చెస్ చరిత్రలో అపూర్వ ఘట్టాన్ని ఆవిష్కరించాడు. అత్యంత పిన్న వయసులో క్యాండిడేట్స్ చెస్ టోర్నీ సంగ్రామంలో విజేతగా నిలిచి, చరిత్ర పుటల్లో కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. రెండు తరాల కిందట గుకేష్ పూర్వీకులు గోదావరి జిల్లా నుంచి చెన్నైకి వెళ్లి స్థిరపడ్డారు. ఇక మహిళల విభాగంలో కోనేరు హంపి త్రుటిలో టైటిల్ చేజార్చుకుని, ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో ఒక తెలుగు చెస్ ప్లేయర్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. 10



కోనేరు హంపి.. జస్ట్ మిస్

ప్రజల దృష్టి మరల్చేందుకు మోదీ కొత్త వ్యూహాలు: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రధాని మోదీ కొత్త వ్యూహాలు పన్నుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మొదటి దశ ఎన్నికల్లో నిరాశ ఎదురవడంతో మోదీ ఇప్పుడు అబద్ధాలు చెప్పడం ప్రారంభించారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయిలో ఉంటే మోదీ అంతా బాగానే ఉందని చెబుతున్నారని ఆయన సోమవారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ఆయన అబద్ధాలకు త్వరలోనే ముగింపు పడనుందని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ విషపు భాష మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

బీజేపీ ఖాతాలో సూరత్

» ఏకగ్రీవంగా ఆ పార్టీ అభ్యర్థి ఎన్నిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల ఆరు దశలు ఇంకా మిగిలి ఉండగానే బీజేపీ ఖాతా తెరిచింది. గుజరాత్‌లో సూరత్ నియోజకవర్గాన్ని ఆ పార్టీ అభ్యర్థి ముఖేష్ దలాల్ 'ఏకగ్రీవంగా' గెల్చుకున్నట్లు స్థానిక ఎన్నికల అధికారి (కలెక్టర్) సోమవారం ప్రకటించారు. ఈ మేరకు దలాల్‌కు ధ్రువీకరణ పత్రాన్ని కూడా అందించారు. సూరత్ బరిలో కాంగ్రెస్ తరఫున పోటీ పడుతున్న నీలేశ్ ఖుంభానీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ ఆయన నామినేషన్ పత్రాలపై ముగ్గురు చేసిన సంతకాలు అసలైనవి కాదని తేలిందని రిటర్నింగ్ అధికారి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీలేశ్ ఖుంభానీకి 24 గంటల్లో స్పందించాలని నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. అయితే, ఆయన ఎన్నికల అధికారి కార్యాలయానికి తన అడ్వకేట్‌తో కలిసి వచ్చినప్పటికీ.. ఆయన వెంట ముగ్గురు ప్రతిపాదకులు రాలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేష్ పడ్సాలా నామినేషన్ పత్రాలను కూడా ప్రతిపాదకుల సంతకాలు సరైనవి కావని తేలటంతో తిరస్కరించినట్లు పేర్కొన్నారు. బరిలో ఉన్న మిగిలిన ఎనిమిది మంది (వీరిలో ఒకరు బీఎస్పీ అభ్యర్థి కాగా మిగిలినవారు ఇండిపెండెంట్లు) కూడా నామినేషన్ పత్రాల ఉపసంహరణకు చివరి రోజైన సోమవారం తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో ఉన్న ఏకైక అభ్యర్థి ముఖేష్ దలాల్ ఏకగ్రీవ విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అయితే ఇదంతా బీజేపీ కుట్ర అని కాంగ్రెస్ ఆరోపించింది. ఖుంబానీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన ముగ్గురూ ఆయన బంధువులేనని, వారిని (బీజేపీ వాళ్లు) కిడ్నాప్ చేశారని, దీనివల్లే వారు రాలేకపోయారని కాంగ్రెస్ నేత, న్యాయవాది బాబూ మంగూకియా తెలిపారు. గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శక్తి సింగ్ గోహిల్ మాట్లాడుతూ, తమ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ వేస్తామన్నారు.

కర్ణాటకలో ప్రచారాస్త్రాలు.. చెంబు, చిప్ప!



బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్ కూటమి పార్టీలు కొత్త తరహా ప్రచారానికి తెరలేపాయి. గడిచిన మూడు రోజులుగా వినూత్నమైన ప్రచార ప్రకటనలను విడుదల చేస్తున్నాయి. తొలుత ప్రధాని మోదీ రాష్ట్రానికి చెంబు ఇచ్చారని కాంగ్రెస్ ప్రకటన విడుదల చేసింది. అన్న భాగ్య పథకం కోసం బియ్యం కోరితే మోదీ ప్రభుత్వం ఖాళీ చెంబు ఇచ్చిందని ఆ ప్రకటనలో విమర్శించింది. కర్ణాటక చెల్లించే ప్రతి 100 రూపాయల పన్నులో మోదీ ప్రభుత్వం వాపసు ఇచ్చేది రూ.13 అంటూ చెంబు గుర్తుతో ప్రకటన ఇచ్చింది. కాంగ్రెస్ ప్రకటనలకు దీటుగా బీజేపీ కూడా కన్నడిగుల చేతికి కాంగ్రెస్ ప్రభుత్వం కొబ్బరిచిప్ప ఇచ్చిందని ప్రకటనలు ఇచ్చింది. కాంగ్రెస్ పాలనలో కన్నడిగుల చేతికి చిక్కింది చిప్పేనని తెలిపింది. ఇందులో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు చిప్ప అని, విద్యార్థులకు చిప్ప.. కిసాన్ సమ్మాన్ ద్వారా రైతులకు రూ.4వేలు కోత విధించి అన్నదాతల చేతిలో చిప్ప పెట్టారని ఎదురుదాడికి దిగింది. తాజాగా సోమవారం కాంగ్రెస్ డేంజర్ అంటూ బీజేపీ మరో ప్రకటన విడుదల చేసింది. ఇందులో.. హోటల్లో టీ తాగేందుకు వెళ్లిన అమాయకులు బాంబు పేలుళ్లలో గాయపడాలా..? కాలేజీకి వెళ్లిన యువతి లవ్ జిహాద్‌కు బలి కావాలా..? అంటూ పలు ప్రశ్నలు సంధించింది.

మీ ఇళ్లు, నగలు.. అన్నీ లాక్కుంటుంది!

» ఆదాయం, ఆస్తులపై కాంగ్రెస్ సర్వే చేస్తుంది

» ఊళ్లో ఇల్లు, నగరంలో ఫ్లాట్ ఉంటే.. ఒక దాన్ని స్వాధీనం చేసుకుంటారు

» ఇది మావోయిస్టు, కమ్యూనిస్టు ధోరణి


» కాంగ్రెస్, ఇండి కూటమి ఈ పద్ధతిని భారత్‌లో అమలు చేయాలని చూస్తున్నాయి

» యూపీ ఎన్నికల ప్రచారంలో మోదీ విమర్శలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారంలో ఆయన.. కాంగ్రెస్ వస్తే ప్రజల సంపదను లూటీ చేసి, మైనారిటీలకు పంచుతుందని ఆరోపించిన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలు వివాదాస్పదమైనప్పటికీ మోదీ తగ్గలేదు. విమర్శల దాడిని మరింత పెంచారు. సోమవారం ప్రధాని ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. ఇండి కూటమి నేతలు భవిష్యత్తుపై ఆశలు వదులుకున్నారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజల్ని హెచ్చరించారు. కాంగ్రెస్, ఇండి కూటమి ప్రజల ఆదాయం, సంపదపై కన్నేశాయని ఆరోపించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే.. ఎవరు ఎంత సంపాదిస్తున్నారు? ఎన్ని ఆస్తులు ఉన్నాయి? ఎన్ని ఇళ్లు ఉన్నాయి? అనే దానిపై విచారణ జరిపిస్తామని ఆ పార్టీ యువరాజు చెప్పారు. అలాగే ప్రజలు సంపదపై ప్రభుత్వ నియంత్రణ ఉంటుందని, వారి ఆస్తులను అందరికీ పంచుతామనీ మేనిఫెస్టోలో చెప్పారు" అంటూ రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇక 'మంగళసూత్రం' వ్యాఖ్యలను మోదీ మళ్లీ చేశారు. కాంగ్రెస్ పార్టీ చట్టాలను మార్చి మహిళల ఆభరణాలనూ తీసేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు సర్వే చేసి.. ఉద్యోగస్థులు ఎంత మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు?, వారికి ఎన్ని వాహనాలు ఉన్నాయి?, ఎంత భూమి ఉంది? అనే వివరాలను సేకరించి ప్రజల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని మోదీ పేర్కొన్నారు. ఊళ్లో పురాతన ఇల్లు ఉండి, నగరంలో ఫ్లాట్ కొనుక్కుంటే.. వాటిలో ఏదో ఒక ఇంటిని కాంగ్రెస్ లాగేసుకుంటుందని చెప్పారు. ఒక ఇల్లు ఉన్నది కాబట్టి మరొకటి అవసరం లేదని చెబుతుందన్నారు. ఇది మావోయిస్టు, కమ్యూనిస్టు ఆలోచనా ధోరణి అని.. ఇలాంటి వాళ్లు చాలా దేశాలను నాశనం చేశారని చెప్పారు. కాంగ్రెస్, ఇండి కూటమి ఈ విధానాన్ని భారత్‌లో అమలు చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. "కూటమి నేతలు మోదీ ఎందుకు అభివృద్ధి చెందిన భారత్ అని మాట్లాడుతున్నాడు? ఎందుకు భారత్‌ను ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుస్తానని చెబుతున్నాడు? అనే ప్రశ్నిస్తున్నారు. ఈ నేతలు అధికారంలోకి రావడం కోసం, కుటుంబాల లబ్ధి కోసం తప్ప ప్రజల కోసం చేసిందేమీ లేదు" అని మోదీ మండిపడ్డారు.

మోదీపై చర్యలు తీసుకోండి: కాంగ్రెస్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు పంచిపెడుతుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. మతం పేరుతో మోదీ ఓట్లు అడిగారని, కాంగ్రెస్ పార్టీపై అబద్ధపు ఆరోపణలు చేశారని, పార్టీ నేతలను అవమానించారని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని అందులో పేర్కొంది. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. అభిషేక్ సింఘ్వి నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు సోమవారం ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదును సమర్పించారు. మోదీ వ్యాఖ్యలపై స్పందించడానికి ఈసీ నిరాకరించింది.



ఇదిలా ఉండగా, రాజస్థాన్‌లో ముస్లింలపై నేరుగా దాడికి దిగారని, మోదీపై వెంటనే చర్యలు తీసుకోవాలని 2,209 మంది పౌరులు ఎన్నికల సంఘానికి సంయుక్తంగా లేఖ రాశారు.

దేశ సంపదపై హక్కు వారికే.. మైనారిటీలకు కాదు: అమిత్ షా

దేశంలోని వనరులపై తొలి హక్కు మైనారిటీలకే చెందుతుందని కాంగ్రెస్ నమ్ముతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. కానీ, దేశ వనరులపై పేదలు, ఆదివాసీలు, దళితులు, వెనకబడినవర్గాల వారికే హక్కు ఉంటుందని బీజేపీ విశ్వసిస్తోందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ప్రచారంలో షా మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పట్ల ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అమిత్ షా స్పందిస్తూ.. "నేను కాంగ్రెస్ నేతలను అడుగుతున్నా.. వారి మేనిఫెస్టోలో సర్వే చేస్తామని చెప్పారా? లేదా? దీనిపై రాహుల్ బాబా స్పష్టతనివ్వాలి. 2006లో ప్రధాని మన్మోహన్ దేశ వనరులపై తొలి హక్కు ఆదివాసీలు, దళితులది కాదని.. మైనారిటీలదేనని చెప్పారు. కానీ, ఆ హక్కు పేదలు, దళితులు, ఆదివాసీలు, బీసీలదే. కాంగ్రెస్ కళ్లన్నీ మఠాలు, మందిరాలు, ప్రజల ఆస్తులపై ఉన్నాయి. ఆ సొమ్మంతా ఎక్కడికి పంపుతారు?" అని ప్రశ్నించారు.


మోదీజీ.. అపాయింట్‌మెంట్ ఇవ్వండి



కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి వివరిస్తా: ఖర్గే

చెన్నపట్న(కర్ణాటక), ఏప్రిల్ 22: రాజ్యాంగాన్ని మార్చడానికి లోక్‌సభలో ఎన్డీయేకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడమే మోదీ లక్ష్యమని, అందుకే 400 సీట్లు గెలవాలని కోరుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఈ ఎన్నికలు ఎంతో కీలకమని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లింలీగ్ ముద్రను కలిగి ఉందంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి కల్పిస్తామనడం, నారీ న్యాయ్, రైతులకు ఎమ్మెస్పీని చట్టబద్ధం చేయడం... ఇవన్నీ ముస్లిం లీగ్ కిందకు వస్తాయా అని ఖర్గే ప్రశ్నించారు. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రధానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోపై బహిరంగ చర్చకు సిద్ధమని ఖర్గే ప్రకటించారు. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. మోదీ అనవసరంగా గాంధీల కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని, 1989 నుంచి నేటివరకూ ఆ కుటుంబానికి చెందిన వారెవరూ ప్రధానమంత్రిగా లేదా మంత్రిగా, ముఖ్యమంత్రిగా లేరని చెప్పారు.

లోకం తీరు



వెంకయ్యకు పద్మవిభూషణ్ ప్రదానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వెంకయ్య నాయుడుతో పాటు మరో ఇద్దరు ఆ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. వారిలో ప్రముఖ భరత నాట్యం కళాకారిణి పద్మా సుబ్రహ్మణ్యం, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, దివంగత బిందేశ్వర్ పాథక్ తరఫున ఆయన సతీమణి అమోలా పాథక్ ఉన్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల విజేతలకు అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, విదేశాంగమంత్రి జైశంకర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. నటుడు మిథున్ చక్రవర్తి, గాయని ఉషా ఉతప్, మాజీ గవర్నర్ రాంనాయక్, పారిశ్రామి కవేత్త సీతారాం జిందాల్ పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. పద్మశ్రీ పురస్కారాలను అందుకున్న తెలుగు వారిలో తెలంగాణకు చెందిన చిందు యక్ష కళాకారుడు గడ్డం సమ్మన్న, బుర్ర వీణ కళాకారుడు దాసరి కొండప్ప, భగవద్గీతను బంజారాభాషలో అనువదించిన కేతావత్ సోంలాల్ నాయక్ ఉన్నారు. కాగా, వెంకయ్య నాయుడుకు పద్మవిభూషణ్ అందజేయటం ద్వారా పురస్కార కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. రాష్ట్రపతి తాను స్వయంగా వేదిక దిగి వచ్చి వెంకయ్యకు అవార్డును అందజేయడం గమనార్హం. ఈ ఏడాది ఐదుగురికి పద్మవిభూషణ్, 17 మందికి పద్మభూషణ్, 132 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించగా వారిలో 67 మందికి పురస్కారాలను అందజేశారు.

25 వేల మంది టీచర్లు ఇంటికే!

(మొదటి పేజీ తరువాయి)

వారాల్లోగా తిరిగి చెల్లించాలని తీర్పులో పేర్కొంది. వసూలు బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. అలాగే.. ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి 15 రోజుల్లోగా కొత్తగా నియామక ప్రక్రియ చేపట్టాలని ఆ రాష్ట్ర స్కూల్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. ఈ స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపి 3 నెలల్లో సీబీఐతో తదుపరి విచారణకు ఆదేశాలు జారీచేసింది. ఉపాధ్యాయ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందంటూ కోర్టును ఆశ్రయించిన పలువురు అభ్యర్థులు తీర్పు రాగానే కోర్టు వెలుపల పెద్ద ఎత్తున గుమిగూడి హర్షం వ్యక్తం చేశారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా ఈ తీర్పుపై స్పందించారు. బీజేపీ నాయకులు న్యాయవ్యవస్థను, తీర్పులను సైతం ప్రభావితం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై 2022 మేలో సీబీఐ విచారణకు ఆదేశించిన హైకోర్టు న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయ స్వచ్ఛంద పదవీ విరమణ చేసి బీజేపీలో చేరి, ఇప్పుడు తామ్లుక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయాన్ని ఆమె పరోక్షంగా గుర్తుచేస్తూ.. ఇది ప్రస్తుతం బీజేపీలో ఉన్న ఒక వ్యక్తి ఇచ్చిన ఆదేశాల ఫలితమని వ్యాఖ్యానించారు. న్యాయదేవత రోదిస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ తీర్పును తాము సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. ఎనిమిదేళ్ల జీతాన్ని నాలుగువారాల్లోగా చెల్లించడం సాధ్యమేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసలేమిటీ కేసు?

పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్.. 2014లో రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్రస్థాయి నియామక పరీక్ష నిర్వహించి 2016లో నియామక ప్రక్రియ ప్రారంభించింది. 24,640 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. చివరికి 25,753 మంది నియమితులయ్యారు. కానీ, ఈ నియామక ప్రక్రియలో పలు లోపాలు ఉన్నాయని ఆరోపిస్తూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తమకన్నా తక్కువ మార్కులు వచ్చినవారికి తమకన్నా మెరుగైన ర్యాంకు ఇచ్చారని.. అసలు మెరిట్ లిస్టులో లేని అభ్యర్థులకూ నియామక పత్రాలు అందాయని హైకోర్టుకు మొరపెట్టుకున్నారు. ఇదిలా కొనసాగుతుండగానే.. 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న 13 వేల గ్రూప్-డీ పోస్టుల భర్తీకి మరో నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టుల నియామకానికి సంబంధించిన ప్యానెల్ తుదిగడువు 2019లో ముగిసిపోయిన తర్వాత కూడా 25 మందిని నియమించిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై పలువురు అభ్యర్థులు వేసిన పిటిషన్లను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ సీబీఐ విచారణకు ఆదేశించారు. ఈమేరకు దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. 2014లో నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయని తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఈ పరీక్షలో ఫెయిల్ అయినవారికి, అనర్హులకు సైతం ప్రాథమిక పాఠశాలల్లో అసిస్టెంట్ టీచర్లుగా పోస్టులు ఇచ్చారని వెల్లడించింది. ఈ అక్రమాలన్నీ జరుగుతున్న సమయంలో విద్యామంత్రి.. పార్థ చటర్జీ. సీబీఐ ఈ విచారణ చేపట్టే సమయానికి ఆయన ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. సీబీఐ ఆయన్ను రెండుసార్లు ప్రశ్నించింది. 2022 జూలై 23న పార్థ చటర్జీకి అత్యంత సన్నిహితురాలిగా పేరున్న అర్పితా ముఖర్జీ ఇంట్లో దాడులు చేసిన ఈడీ రూ.21కోట్ల నగదు, రూ.కోటి విలువ చేసే నగలను స్వాధీనం చేసుకుంది. పార్థచటర్జీని అరెస్టు చేసింది. వారిద్దరికీ సంబంధించిన రూ.103.10 కోట్ల విలువైన నగదు, నగలు, స్థిరాస్తులను జప్తు చేసినట్టు 2022 సెప్టెంబరులో కోర్టుకు తెలిపింది. అలాగే.. ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ మాజీ సలహాదారు శాంతిప్రసాద్ సిన్హా, ప్రసన్నరాయ్ అనే మరో వ్యక్తికి చెందిన రూ.230 కోట్ల ఆస్తులను జప్తు చేసింది.

సువేందుకు ముందే ఎలా తెలుసు?

"సోమవారం దాకా వేచి చూడండి. ఓ భారీ (రాజకీయ) పేలుడు.. మేనత్త-మేనల్లుళ్ల పార్టీ (టీఎంసీ)ని కుదిపేస్తుంది. దాన్నుంచి వారు తేరుకోలేరు" ..బీజేపీ నేత సువేందు అధికారి కిందటివారం చేసిన ప్రకటన ఇది. సువేందు అధికారి ఈ ప్రకటన చేసింది సోమవారంనాటి హైకోర్టు తీర్పుగురించేనని.. ఈ తీర్పు గురించి బీజేపీకి అసలు ముందే ఎలా తెలిసిందని తృణమూల్ నేతలు మండిపడుతున్నారు. అయితే.. తాను టీఎంసీలో అంతర్గత కలహాల గురించే అలా మాట్లాడానని సువేందు అన్నారు.

అప్పట్లో చౌతాలా..

ఇప్పుడు బెంగాల్‌లో జరిగినట్టే.. దాదాపు 24 సంవత్సరాల క్రితం హరియాణాలోనూ టీచర్ల నియామకంలో కుంభకోణం జరిగింది. ఆ కేసులో.. హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా 2013లో జైలు పాలయ్యారు. 2000 సంవత్సరంలో నాటి హరియాణా సర్కారు ఫోర్జరీ డాక్యుమెంట్లతో 3208 మంది టీచర్లను అక్రమంగా నియమించిందంటూ నమోదైన కేసుపై విచారణ జరిపిన కోర్టు.. వీరిని దోషులుగా నిర్ధారించింది.

ఎంపీ, ఎమ్మెల్యేల కేసుల్లో మందకొడిగా తీర్పులు

ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు పనితీరు బాగు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: దేశవ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల పరిష్కారం మందకొడిగా సాగుతోంది. వీటి కోసం ఏర్పాటైన ప్రత్యేక కోర్టులు గత ఏడాది 2,018 కేసుల్లో తీర్పులు వెలువరించాయి. ఈ విషయం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడయింది. ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించేలా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది అశ్విన్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిల్‌పై విచారణ సందర్భంగా అమికస్‌క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కూడా క్రిమినల్ కేసులు ఉన్నవారు రంగంలో ఉన్నందున కేసుల సత్వర విచారణపై దృష్టి పెట్టాల్సి ఉందని తెలిపారు. మొదటి రెండు దశల ఎన్నికల్లో 2,810 మంది పోటీ చేస్తుండగా అందులో 501 మంది (18%)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. వీరిలో 327 మంది (12 శాతం)పై అయిదేళ్ల కన్నా ఎక్కువ కాలం పాటు శిక్షలు పడే తీవ్రమైన కేసులు ఉన్నాయని వివరించారు. క్రిమినల్ కేసులు ఉన్నవారు గణనీయ సంఖ్యలోనే ఎన్నికవుతున్నందున కేసుల సత్వర పరిష్కారానికి మరిన్ని ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని ఆ అఫిడవిట్‌లో సూచించారు. 2023 జనవరి ఒకటో తేదీ నాటికి మొత్తం 4,697 కేసులు పెండింగ్‌లో ఉండగా ఆ ఏడాది మొత్తం మీద ప్రత్యేక కోర్టులు 2,018 కేసులను పరిష్కరించాయి. కొత్తగా 1,746 కేసులు రావడంతో పెండింగ్ కేసుల సంఖ్య మళ్లీ 4,474కు పెరిగింది. మొత్తం 1,300 కేసుల్లో 766 కేసులను పరిష్కరించి ఉత్తరప్రదేశ్‌లోని కోర్టులు సంఖ్యాపరగా మొదటి స్థానంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేసుల పరిష్కారంపై హైకోర్టులు మరింత నిశితంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని అమికస్‌క్యూరీ హన్సారియా తన అఫిడవిట్‌లో సూచించారు. మూడేళ్ల కంటే ఎక్కువకాలంపాటు కేసులు పెండింగ్‌లో ఉంటే అందుకుగల కారణాలను వివరిస్తూ ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుల జడ్జీల నుంచి హైకోర్టులు నివేదిక కోరాల్సి ఉంటుందని సిఫార్సు చేశారు. హైకోర్టులు ప్రతి కేసును సూక్ష్మస్థాయిలో పరిశీలించి విచారణ త్వరగా పూర్తయ్యేలా సూచనలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కేసుల కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించేలా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసులపై తెలంగాణ, అలహాబాద్, ఢిల్లీ, పంజాబ్-హరియాణా, త్రిపుర హైకోర్టులు సూక్ష్మస్థాయి పరిశీలన జరిపి దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నాయని హన్సారియా తెలిపారు. తగిన ఉత్తర్వులు కూడా ఇచ్చాయని పేర్కొన్నారు. మిగిలిన హైకోర్టులు మాత్రం పెండింగ్ కేసుల సమాచారాన్ని తెలుసుకున్నాయని వివరించారు.

'కొండా' ఆస్తులు రూ.4,490 కోట్లు

» అప్పులు రూ.13.83 కోట్లు.. చేతిలో నగదు 9 లక్షలు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆస్తులు రూ.4,490 కోట్లు! అప్పులు రూ.13.83 కోట్లు! వేల కోట్లు ఆస్తులున్నా కొండా దంపతుల పేరున కానీ, వారి కుమారుడి పేరున కానీ ఒక్క వాహనం కూడా లేకపోవడం గమనార్హం. కొండా తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు ప్రకటించారు. ఆయన పేరుమీద రూ. 1,178.72 కోట్ల ఆస్తులు ఉండగా ఆయన భార్య సంగీతా రెడ్డి పేరిట రూ.3,203.90 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఆయన కుమారుడు వీరజ్ మాధవరెడ్డి పేరున ఉన్న ఆస్తులు రూ.107.44 కోట్లు! కొండా వద్ద 3 లక్షలు, ఆయన భార్య వద్ద 6 లక్షల నగదు ఉన్నట్లు చూపించారు. ఆయన పేరుమీద వివిధ బ్యాంకుల్లో అప్పు రూ.17.69 లక్షలు, ఆయన భార్య పేరిట రూ.12.06 కోట్ల అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన వద్ద రూ.60 లక్షలు, ఆయన భార్య వద్ద రూ.10.44 లక్షల విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు ఉన్నట్లు చూపించారు. కొండా పేరున చేవెళ్లలో మూడు ఎకరాలు, ధర్మసాగర్‌లో 43.26 ఎకరాలు, చేవెళ్ల మండలం కమ్మెటలో రెండు ఎకరాలు, కుమ్మెరలో 21.13 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు వెల్లడించారు. ఆయన భార్య పేరిట రాజేంద్రనగర్ మండలం నార్సింగిలో ఎకరం, ఏపీలోని చిత్తూరు జిల్లాలో 14.13 ఎకరాల సాగుభూమి ఉన్నట్లు ప్రకటించారు.

66 వేల మందికి యూఎస్ పౌరసత్వం

వాషింగ్టన్, ఏప్రిల్ 22: అమెరికా పౌరసత్వం పొందుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో నిలిచారు. 2022లో నాచురలైజ్డ్ యూఎస్ సిటిజన్‌షిప్ పొందిన వారిలో మెక్సికన్లు 1.06 లక్షల మందితో ప్రథమ స్థానంలో నిలవగా, ఆ తరువాతి స్థానాల్లో వరుసగా భారత్, ఫిలిప్పైన్స్, క్యూబా, డొమినిసియన్ రిపబ్లిక్, వియత్నాం, చైనా నిలిచాయి. ఆ ఏడాది మొత్తం 65,960 మంది భారతీయులకు అమెరికా పౌరసత్వం లభించింది. అమెరికాలో 2022 నాటికి 4.60 కోట్ల మంది విదేశీయులు నివశిస్తున్నారు. మొత్తం యూఎస్ జనాభా 33.3 కోట్లలో అది 14 శాతం.

జగన్ ఆస్తి 529 కోట్లు

» ఐదేళ్లలో 41 శాతం పెరిగిన సంపద

» చేతిలో నగదు రూ.7 వేలే

» భార్య భారతికి 176 కోట్ల ఆస్తి

» ఇద్దరు కుమార్తెలకు 51.50 కోట్లు

కడప, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రి అని ప్రతిపక్షాలు విమర్శించే వైఎస్ జగన్మోహన్ రెడ్డి మొత్తం ఆస్తుల విలువ రూ.529.87 కోట్లు. ఆయన భార్య వైఎస్ భారతి పేరిట మరో రూ176.63 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. జగన్ సంపద గత ఐదేళ్లలో భారీగా పెరిగింది. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న వైసీపీ అధ్యక్షుడు జగన్ తరఫున సోమవారం ఆయన చిన్నాన్న వైఎస్ మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో జగన్ తన చరాస్తుల విలువను రూ.483,08,35,064గా, స్థిరాస్తుల విలువను రూ.46 కోట్లుగా పేర్కొన్నారు. తన చేతిలో కేవలం రూ.7 వేలు నగదు ఉన్నట్టు చూపారు. అలాగే తన సతీమణి భారతి పేరిట రూ.119,38,07,190 విలువైన చరాస్తులు, రూ.56 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్టు చూపించారు. వీరిద్దరి పేరిట మొత్తం రూ.706.50 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు వెల్లడించారు. భారతి వద్ద రూ.10,022 నగదు, పెద్ద కూతురు హర్షిణీరెడ్డి వద్ద రూ.9 వేలు, రెండో కూతురు వర్షితరెడ్డి వద్ద రూ.6,989 నగదు ఉన్నట్టు అఫిడవిట్‌లో తెలిపారు. నలుగురి పేరిట నగదు మొత్తం రూ.40 వేలు కూడా లేకపోవడం గమనార్హం. ఇద్దరు కుమార్తెల పేరిట 51.50 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో జగన్ ఆస్తి రూ.375.20 కోట్లు ఉండగా, ఐదేళ్లు తిరిగే సరికి ఆయన సంపద దాదాపు 41 శాతం పెరిగింది. భార్య, పిల్లల ఆస్తులు కూడా భారీగా పెరిగాయి. 2019 ఎన్నికల్లో భారతి పేరిట రూ.124 కోట్లు, ఇద్దరు కుమార్తెల పేరిట రూ.11 కోట్లు ఆస్తులు ఉన్నట్టు వెల్లడించారు. 2022-23లో ఆదాయపన్నులో చూపించిన ఆదాయం జగన్‌కు రూ.47,74,90,600, భారతికి రూ.10.96 కోట్లుగా ఉంది.

జగన్ ఆస్తులు

జగన్ ఆస్తుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బీమా, ఇతరులకు ఇచ్చిన అప్పులు, స్థిరాస్తులు ఉన్నాయి. ఇడుపులపాయలో రూ.35.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇడుపులపాయ, భాకరాపురం, బంజారాహిల్స్, సాగర్ సొసైటీలో ఆస్తులున్నాయి. వ్యవసాయేతర భూముల విలువ రూ.46,78,89,900గా చూపించారు. భారతి సిమెంట్స్‌లో జగన్‌కు రూ.36 కోట్లు, కార్మియల్, ఏసియో హోల్డింగ్ ప్రైవేటు లిమిటెడ్‌లో రూ.8లక్షలు, క్లాసిక్ రియాలిటీ ప్రైవేటు లిమిటెడ్‌లో రూ.65.19 కోట్లు, సండూర్ పవర్‌లో రూ.130 కోట్లు, సరస్వతి పవర్ ఇండస్ట్రీస్‌లో రూ.27.60 కోట్లు, సిలికాన్ బెండర్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో రూ.2.86 కోట్లు.. మొత్తం రూ.263.64 కోట్లు పెట్టుబడులు ఉన్నాయి. అప్పులు రూ.1.10 కోట్లు ఉన్నట్టు తెలిపారు. జగన్ రూ.4.56 కోట్లు ట్యాక్స్ కట్టినట్టు తెలిపారు. జగన్ కుటుంబానికి సొంత కారు లేకపోవడం విశేషం. అలాగే జగన్‌కు తులం బంగారు కూడా లేదు.



భారతి ఆస్తులు

భారతి పేరిట రూ.5.29 కోట్ల విలువ చేసే 6.47 కిలోల బంగారు, వజ్రాలు ఉన్నాయి. ఎర్రగుడిపల్లె, కచివారిపల్లె, పులివెందుల, రాయదుర్గం, తాడేపల్లిలో ఆస్తులు ఉన్నాయి. వీటి విలువ రూ.56,92,19,104గా చూపించారు. అలాగే సండూర్ పవర్‌లో రూ.11.45 కోట్లు, సరస్వతిలో రూ.13.80 కోట్లు, హేల్‌వన్ టెక్నాలజీలో రూ.12.84 కోట్లు, క్లాసిక్ రియాలిటీ ప్రైవేటు లిమిటెడ్‌లో రూ.4.55 కోట్లు, సిలికాన్‌లో రూ.2.99 లక్షలు, ఆకాశ్‌లో రూ.10.24 కోట్లు.. మొత్తం ఆమె పేరిట రూ.53.8 కోట్లు పెట్టుబడులు ఉన్నాయి. అప్పులు రూ.7.40 కోట్లు ఉన్నట్టు వెల్లడించారు.

జగన్ కుమార్తెల ఆస్తులు

జగన్ పెద్దకూతురు హర్షిణీరెడ్డి పేరిట రూ.4.43 కోట్ల విలువ చేసే 4.187 కిలోల బంగారం, చిన్న కూతురు వర్షితరెడ్డిల పేరిట రూ.4.40 కోట్ల విలువ చేసే 3.450 కిలోల బంగారు ఉంది. జగన్ పెద్దకూతురు పేరిట కర్ణాటకలో రెండు వాణిజ్యయేతర స్థలాలు, ఇడుపులపాయలలో 4.5 ఎకరాలు, 5.50 ఎకరాలు, కే.ఎల్లమవారిపల్లెలో, పాలెంపల్లెలో రూ.1.63 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. ఇక చిన్న కూతురుకు అదే ప్రాంతంలో అంతే సమానంగా ఆస్తులు ఉన్నాయి. పెద్ద కుమార్తెకు 25.89 కోట్లు, చిన్నకుమార్తెకు 25.57 కోట్లు విలువైన ఆస్తులు ఉన్నట్టు వెల్లడించారు.

జగన్‌పై 26 కేసులు

సీఎం జగన్ తనపై 26 కేసులు ఉన్నాయి. 11 సీబీఐ కేసులు, 9 ఈడీ కేసులున్నాయి. నంద్యాల, విజయవాడ, మంగళగిరి, పొన్నూరు, సరూర్‌నగర్ పోలీసు స్టేషన్లలో ఆరు కేసులు ఉన్నాయి.

రాజమండ్రిలో అఫిడవిట్ తయారీ

జగన్ అఫిడవిట్‌ను పరిశీలిస్తే.. ఎన్నికల నోటరీని రాజమండ్రిలో తయారు చేయించారు. స్టాంపులను విజయవాడలో కొనుగోలు చేశారు. 2019 ఎన్నికల సమయంలో అఫిడవిట్‌ను పులివెందులలోనే తయారు చేశారు. ఈసారి సొంతూరు పులివెందులలో కాకుండా ఇతర ప్రాంతాల్లో చేయించడం చర్చనీయాంశమైంది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


సీతారాముల కళ్యాణ ఘట్టంలో భక్తులకు మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చక స్వామి

కన్నుల పండువగా కోదండరామయ్య కల్యాణం

- జానకిరాముల పరిణయంతో పులకించిన ఒంటిమిట్ట
- పండువెన్నెల్లో రాములోరి పెళ్లిని తిలకించిన భక్తులు

రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 22: ఒంటిమిట్ట కోదండరాముని కళ్యాణం సోమవారం పండువెన్నెల్లో అంగరంగ వైభవంగా జరిగింది. కోదండరామస్వామి వారికి, సీతాదేవికి స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశక చాంద్రమాన శ్రీక్రోధినామ సంవత్సర, చైత్రశుద్ధ చతుర్దశి సోమవారం రాత్రి 8.12 గంటల సమయంలో చిత్త నక్షత్ర యుక్త శుభలగ్నములో మాంగల్యధారణ గావించారు. తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితులు రాజేశ్ బట్టర్, కోదండరామాలయ ప్రధాన అర్చకులు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవ వేళ కోదండరామస్వామి, సీతాదేవిలకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం కన్నులపండువగా జరిగింది. కోదండ రామస్వామి, సీతాదేవి ఉత్సవ వరులను పల్లకిపై కొలువుదీర్చి ప్రధాన ఆలయం నుంచి మేళతాళాలు, భక్తుల శ్రీరామనామ ధ్వనుల మధ్య కల్యాణం మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మండపంలోని రజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఆశీనుల చేశారు. వేదపండితులు కోదండరామయ్యకు ఎదురుగా సీతమ్మ అమ్మవారిని కూర్చోబెట్టి కన్యావరణం నిర్వహించారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామచంద్రుల ప్రవరలను చదివారు. రాములవారి వంశస్వరూపాన్ని స్తుతించారు. అగ్ని ప్రతిష్ఠాపన తరువాత సీతారాముల తలమీద జీలకర్ర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను నిర్వహించారు. తదనంతరం మంగళాష్టకం, చూర్ణిక పఠించి మాంగల్యసూత్ర పూజ, మంగళ సూత్రధారణ అక్షతారోహణం చేపట్టారు. స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణ ఘట్టం పూర్తి చేశారు. కోదండరామునికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ కార్యదర్శి కరికాలవలవన్ సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున టీటీడీ ఈవో ధర్మారెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు ఉభయతెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, కడప కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థకౌశల్ పర్యవేక్షించారు.


విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

పది ఫలితాల్లో భాష్యం జయభేరి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 22: పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఎస్ఎస్‌సి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో సోమవారం ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం విద్యార్థులు జి.దీపికశ్రీ 597మార్కులు, కె.వెంకట సాయిభావన 596, వై.షరీనా 596 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. అదే విధంగా ఎస్.గాయత్రి 595, కె. లక్ష్మీహంసిని 595, ఎస్.ఆశ్రిత 596 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు 90 మంది 590కి పైగా మార్కులు, 588 మంది 580కి పైగా మార్కులు, 1299 మంది 570కి పైగా, 2809 మంది 550 పైగా, 5783 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారన్నారు. గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1,113 మంది, 95 పైగా సాధించిన వారు 3,627 మంది, 90 పైగా సాధించిన వారు 5,103 మంది ఉన్నారని వెల్లడించారు. అదే విధంగా సైన్స్‌లో 100కు 100 సాధించిన విద్యార్థులు 251 మంది, 95 పైగా మార్కులు 2,117 మంది, 90 పైగా 4,016 మంది సాధించారని వివరించారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందనలు తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయభేరి

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యధిక మార్కులు 598 సాధించి విజయకేతనం ఎగురవేశారని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఆరుగురు విద్యార్థులు రెండవ అత్యధిక మార్కు 597, 15 మంది విద్యార్థులు మూడో అత్యధిక మార్కు 596, 31 మంది విద్యార్థులు నాలుగవ అత్యధిక మార్కు 595 సాధించారని వెల్లడించారు. 524 మంది విద్యార్థులు 590 పైన మార్కులు, 2,353 మంది 580 పైన మార్కులు సాధించారని ఆమె తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్ సగటు మార్కు 600కు గాను 509, ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 98.9 కాగా.. 132 బ్రాంచ్‌లు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాయని ఆమె తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీ చైతన్య విద్యాసంస్థల మరో డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

'నారాయణ' విద్యార్థుల జైత్రయాత్ర

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో నారాయణ జైత్రయాత్ర కొనసాగింది. ఎప్పటిలాగే నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో మెప్పించారు. ఎస్.ఎస్.సి. చరిత్రలోనే అత్యధిక మార్కులతో నారాయణ విద్యార్థిని సాయి మనస్వి 599 మార్కులతో ఆల్‌టైమ్ రికార్డ్‌ను నెలకొల్పింది. అదే విధంగా 598, 597 వంటి మార్కులు సాధించారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. 15.3శాతం విద్యార్థులు గణితంలో 100కి 100 మార్కులు సాధించారని వెల్లడించారు. 64 శాతం బ్రాంచీల్లో 100 శాతం పాస్ పర్సంటేజ్ సాధించినట్టు పేర్కొన్నారు. ఏటా తన ఫలితాలను తానే అధిగమించటం నారాయణకు ఆనవాయితీగా మారిందన్నారు. ఇంతటి అద్భుత విజయాలకు కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు నారాయణ డైరెక్టర్స్ అభినందనలు తెలిపారు.

డాక్టర్ 'కె.కె.ఆర్.గౌతమ్' హవా

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాలలో డాక్టర్ కె.కె.ఆర్.గౌతమ్ స్కూల్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. 600 మార్కులకు గాను పి.ప్రభాకర్ 596 మార్కులు, పి.జోషిక ప్రియ, కె.గీతిక శ్రీ, వి.జి.స్రుజన్ సాయి తేజ 595 మార్కులు సాధించి డా.కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్స్ విజయబావుటా ఎగురవేశారని యాజమాన్యం తెలిపింది. తమ వివిధ బ్రాంచీల్లో 25 మంది విద్యార్థులు 590 మార్కులు పైన, 182 మంది 580 మార్కులు పైన, 1,427 మంది 500 మార్కులు పైన సాధించారని పేర్కొంది. స్కూల్స్ సగటు మార్కుల శాతం 85.90గా నమోదైందని వెల్లడించింది. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ఫీజు కట్టలేదని ఇంటికి పంపేశారు

- రెండు రోజులు భోజనం కూడా పెట్టలేదు
- జగనన్న విద్యా దీవెన అంతా మోసం
- బీటెక్ సెకండియర్ విద్యార్థిని ఆవేదన


బీటెక్ విద్యార్థిని ఆదిమళ్ల రూప

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 22: జగనన్న విద్యా దీవెన పథకంలోని డొల్లతనం మరోసారి బయటపడింది. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే వారి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నామని డబ్బా కొట్టుకుంటూ సీఎం జగన్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఆదిమళ్ల రూప ఆరోపించింది. ఈ మేరకు ఆ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ వద్ద ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. తాను గుంటూరు జిల్లా తెనాలి సమీపం చింతలపూడిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నానని.. వైసీపీ ప్రభుత్వం విద్యాదీవెన పథకం నగదు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యం తనను ఫీజు కట్టలేదని ఇంటికి పంపించివేసిందని పేర్కొంది. అంతకుముందు రెండు రోజులు భోజనం కూడా పెట్టలేదని వాపోయింది. ఆమె గోడు విన్న రాజగోపాల్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

బీమా కంపెనీకి వినియోగదారుల కమిషన్ వడ్డన

- రూ.3 కోట్లు చెల్లించాలని ఆదేశం

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 22: గోడౌన్‌లో ఉంచిన ధాన్యం షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో నష్టపోయిన 25 మంది రైతులకు రూ.3 కోట్లు నష్ట పరిహారంగా ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించాల్సిందేనని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. 2017 జూలై నెలలో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో ఉన్న శ్రీసాయిలక్ష్మి రూరల్ గోడౌన్‌లో 25 మంది రైతులు తమ పొలాల్లో పండించిన కందిపప్పు, శనగ పప్పు నిల్వ చేశారు. ఆ తర్వాత 2018 జూలై 4న గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి 80 శాతం ఫలసాయం మంటల్లో కాలిపోయింది. ఈ గోడౌన్‌కు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి బీమా ఉండటంతో గోడౌన్ యజమాని, నష్టపోయిన రైతులు నష్టపరిహారం కోసం క్లెయిమ్ కోసం దరఖాస్తు చేశారు. అయితే.. గోడౌన్ యజమాని ఉద్దేశపూర్వకంగానే ధాన్యాన్ని కాల్చివేశారంటూ ఇన్సూరెన్స్ కంపెనీ క్లెయిమ్‌లను తిరస్కరించింది. దీంతో రైతులు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. గోడౌన్ యజమాని ఉద్దేశపూర్వకంగా ధాన్యాన్ని కాల్చివేశారని ఇన్సూరెన్స్ కంపెనీ నిరూపించలేకపోయింది.

టెన్త్ ఉత్తీర్ణత 86.69%

- గతేడాది కంటే 13.95శాతం ఎక్కువ
- అబ్బాయిలు 84.32%... అమ్మాయిలు 89.17%
- ఉత్తీర్ణుల్లో 69.26శాతం మందికి ఫస్ట్ డివిజన్
- 2803 బడుల్లో వంద శాతం పాస్
- 17 పాఠశాలల్లో మొత్తం ఫెయిల్
- 1400 మందికి 590 పైనే మార్కులు
- 96.37శాతంతో మన్యం టాప్.. కర్నూలు లాస్ట్
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రాష్ట్రంలో 86.69% ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు 6,16,615 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కాగా వారిలో 5,34,574 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది. 2023లో 72.74% మంది ఉత్తీర్ణులైతే, ఈసారి 13.95శాతం పెరిగింది. ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి సోమవారం విజయవాడలో విడుదల చేశారు. టెన్త్ పరీక్షలకు మొత్తం 6,23, 128 మంది నమోదు చేసుకోగా 6,16,615 మంది రాశారు. అబ్బాయిలు 3,14,610 మంది పరీక్షలు రాస్తే 2,65,267 మంది(84.32శాతం) పాసయ్యారు. అమ్మాయిలు 3,02,005 మందికి గాను 2,69,307 మంది (89.17%) మంది ఉత్తీర్ణులయ్యారు. 2803 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 17 పాఠశాలల్లో విద్యార్థులంతా ఫెయిల్ అయ్యారు. ఉత్తీర్ణులైన వారిలో 69.26శాతం మంది ఫస్ట్ డివిజన్‌లో, 11.87శాతం మంది సెకెండ్ డివిజన్‌లో, 5.56% మంది థర్డ్ డివిజన్‌లో ఉత్తీర్ణత పొందారు. జిల్లాల వారీగా చూస్తే 96.37శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్రస్థానంలో ఉంటే, 62.47శాతంతో కర్నూలు అట్టగున నిలిచింది. మన్యం జిల్లా వరుసగా రెండోసారి అగ్రస్థానంలో నిలవడం గమనార్హం.

యాజమాన్యాల వారీగా..

యాజమాన్యాల వారీగా ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 98.43 శాతం, ప్రైవేటు పాఠశాలల్లో 96.72, బీసీ సంక్షేమ పాఠశాలల్లో 98.43, మోడల్ స్కూల్స్‌లో 92.88, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో 94.56, ఆశ్రమ పాఠశాలల్లో 90.13, కేజీబీవీల్లో 88.96 , గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 89.64, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 89.38, ఎయిడెడ్ పాఠశాలల్లో 80.01, మున్సిపల్‌లో 75.42, ప్రభుత్వ పాఠశాలల్లో 74.4 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3 వరకు జరగనున్నాయి. ఇందుకోసం నేటి నుంచి(మంగళవారం) దరఖాస్తులు చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. దరఖాస్తులు కేవలం ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలని, పోస్టు ద్వారాగానీ, నేరుగా పంపే దరఖాస్తులు తీసుకోరని స్పష్టంచేసింది. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం నేటి నుంచి ఈనెల 30 వరకు హెచ్ఎంల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో సబ్జెక్టుకు రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలని పేర్కొంది.

రైతు బిడ్డకు 598 మార్కులు


ప్రణతి

అనంతపురం విద్య ఏప్రిల్ 22: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం చిన్నరెడ్డిపల్లికి చెందిన తన్నేరు ప్రణతి పదో తరగతిలో 598 మార్కులు సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన సత్యనారాయణరెడ్డి, హేమావతి దంపతుల కూతురు ప్రణతి.. అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో చదివింది. ఫస్ట్ లాంగ్వేజ్‌లో 100, సెకెండ్ లాంగ్వేజ్‌లో 99, థర్డ్ లాంగ్వేజ్‌లో 100, గణితంలో 100, సైన్స్‌లో 99, సోషల్‌లో 100 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన తన కూతురు ఐఏఎస్ అధికారి కావాలని అనుకుంటోందని, ఆ దిశగా ప్రోత్సహిస్తామని ప్రణతి తండ్రి సత్యనారాయణరెడ్డి తెలిపారు.

మార్కులే మార్కులు

ఈ ఏడాది ఉత్తీర్ణతతో పాటు మార్కులు కూడా భారీగా పెరిగాయి. 600కు గాను అత్యధికంగా నూజివీడులోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన మనస్వి అనే విద్యార్థిని 599 మార్కులు సాధించింది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం. 2022లో 598, 2023లో 597 మార్కులు వచ్చాయి. ఆ రికార్డును అధిగమిస్తూ ఈసారి 599 మార్కులు వచ్చా యి. హిందీలో మాత్రమే ఒక్క మార్కు ఆ విద్యార్థినికి తగ్గింది. ఇక 590, ఆపైన మార్కులు దాదాపు 1400 మందికి వచ్చాయి. 570 మార్కులు దాటినవారు 18000 మంది ఉన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతమందికి 590 మార్కులు రాలేదు. ఇక 550 మార్కులు దాటిన విద్యార్థుల సంఖ్య అయితే లెక్కేలేదు. 360 మార్కులు ఫస్ట్ డివిజన్ అయితే ఈసారి 500 మార్కులు రావడం అనేది సర్వసాధారణం అన్నట్టుగా మారిపోయింది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లోనే 104 మందికి 590, ఆపైన మార్కులు వచ్చాయి. అన్నమయ్య జిల్లాలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన విద్యార్థికి 597 మార్కులు వచ్చాయి.


తల్లిదండ్రులతో విద్యార్థిని మనస్వి

ప్రభుత్వ టీచర్ల బిడ్డే టాపర్

599 మార్కులతో మనస్వి స్టేట్ ఫస్ట్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన ఆకుల వెంకట నాగసాయి మనస్వి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. నూజివీడు నారాయణ విద్యాసంస్థలో చదివిన మనస్వి 600 మార్కులకు గాను ద్వితీయ భాషలో ఒక మార్కు తగ్గి 599 మార్కులు సాధించింది. కాగా, మనస్వి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కావడం విశేషం. తండ్రి ఏఎస్‌వీ ప్రసాద్, నూజివీడు మండలం అన్నవరం మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, తల్లి శైలజ చాట్రాయి మండలం సోమవరం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. పాఠ్యాంశాల్లో ఎటువంటి అనుమానాలున్నా మనస్వి తల్లిదండ్రులు సహజంగా ఉపాధ్యాయులు కావడంతో నివృత్తి చేసేవారు. ప్రతి తరగతిలోనూ క్లాస్ ఫస్ట్‌గా నిలుస్తూ వచ్చిందని, అలాగే 10వ తరగతిలోనూ కష్టపడి చదివి స్టేట్ ఫస్ట్ సాధించటం తమకు గర్వకారణంగా ఉందని ప్రసాద్, నాగశైలజ ఆనందం వ్యక్తం చేశారు. ఇక, భవిష్యత్తులో ఐఐటీలో కంప్యూటర్స్ గ్రాడ్యుయేషన్ చేసి స్థిరపడాలనే లక్ష్యంతో ఉన్నానని, తన విజయంలో తల్లిదండ్రులది ప్రధాన పాత్ర అని మనస్విని తెలిపింది.

జిల్లాల వారీగా ఉత్తీర్ణత వివరాలు... శాతాల్లో

జిల్లా	అబ్బాయిలు	అమ్మాయిలు	మొత్తం
పార్వతీపురం	95.33	97.36	96.37
శ్రీకాకుళం	91.69	95.06	93.35
కడప	90.96	93.3	92.1
కోనసీమ	90.29	93.51	91.88
విజయనగరం	89.91	93.73	91.82
చిత్తూరు	88.91	93.8	91.28
ప్రకాశం	89.95	92.5	91.21
విశాఖపట్నం	90.07	92.35	91.15
అల్లూరి సీతారామరాజు	88.77	92.79	90.95
తిరుపతి	89.58	91.96	90.71
కృష్ణా	88.28	92.02	90.05
అనకాపల్లి	86.73	91.45	89.04
ఎన్టీఆర్	86.24	91.44	88.76
బాపట్ల	86.32	90.11	88.19
నెల్లూరు	86.19	90.15	88.17
గుంటూరు	86.46	89.99	88.14
అన్నమయ్య	83.65	89.71	86.67
పల్నాడు	83.73	88.45	86.05
నంద్యాల	83.17	88.24	85.62
శ్రీసత్యసాయి	80.87	88.37	84.46
తూర్పుగోదావరి	80.82	85.68	83.2
కాకినాడ	80.62	85.48	83.09
పశ్చిమగోదావరి	78.9	84.8	81.82
అనంతపురం	77.08	82.01	80.93
ఏలూరు	75.86	84.05	80.08
కర్నూలు	57.22	68.35	62.47

సర్టిఫికెట్లలో తప్పులు సరిదిద్దండి

- తప్పుల సవరణ ప్రక్రియను సులభతరం చేయండి
- గడువులోగా రాలేదంటూ తిరస్కరించడానికి వీల్లేదు
- జీవోలను సుప్రీం తీర్పునకు అనుగుణంగా మార్చండి
- పాఠశాల విద్యాశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు జారీ చేసిన సర్టిఫికెట్లలో దొర్లిన తప్పులను.. నిర్దిష్ట గడువు ముగిసిందనో, రికార్డులు అందుబాటులో లేవనే కారణాలతో సవరించకుండా తిరస్కరించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టంచేసింది. సర్టిఫికెట్లలో తప్పుల సవరణకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలు, ఇచ్చిన జీవోలను సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా మార్చుకోవాలని నిర్దేశించింది. జిగ్యా యాదవ్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను అనుసరించి సర్టిఫికెట్లలో తప్పుల సవరణ ప్రక్రియను సులభతరం చేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులకు సూచించింది. పిటిషనర్ సర్టిఫికెట్లలో దొర్లిన తప్పులను వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు ఇచ్చారు. ఉమ్మడి కృష్ణాజిల్లా, కలిదిండి గ్రామానికి చెందిన కుందేటి వెంకట శ్రీనివాసరావు, ఉషశ్రీ దంపతులకు 1999 అక్టోబరు 28న పిటిషనర్ కుందేటి వెంకట నరసయ్య జన్మించారు. శ్రీనివాసరావు 2008లో మరణించడంతో పిటిషనర్ తల్లి బిడ్డలతో కృష్ణాజిల్లా, పెదపారుపూడి మండలం, వింజరంపాడులోని తన బంధువు కోలుసు పోతురాజు ఇంటికి వచ్చారు. పిటిషనర్‌ను గుడివాడలోని ఓ పాఠశాలలో చేర్పించే సమయంలో పోతురాజు నిరక్షరాస్యత కారణంగా రికార్డుల్లో పేర్లు తప్పుగా నమోదయ్యాయి. నరసయ్య పేరును కొలుసు నరసయ్యగా, తల్లిదండ్రులుగా కొలుసు పోతురాజు, లక్ష్మిగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పిటిషనర్ స్కూలు రికార్డులతో పాటు సర్టిఫికెట్లలో దొర్లిన తప్పులను సరిదిద్దాలని అధికారులను ఆశ్రయించారు. ఆయన వినతికి సానుకూలంగా స్పందించిన గుడివాడ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ తప్పులు సవరించాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) ఆ సిఫారసును తిరస్కరిస్తూ 2016లో ఉత్తర్వులు ఇచ్చారు. రికార్డులో పేరు నమోదైన తరువాత నిబంధనల ప్రకారం మూడేళ్లలోగా తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకోవాలని, అలా చేయనందున అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కూడా డీఈవో ఉత్తర్వులను సమర్థించడంతో పిటిషనర్ 2022లో హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎంఆర్కే చక్రవర్తి వాదనలు వినిపిస్తూ.. పోతురాజు నిరక్షరాస్యత కారణంగా పాఠశాల రికార్డుల్లో పేర్లు తప్పుగా నమోదు చేయించారని తెలిపారు. పిటిషనర్‌కు 2017 అక్టోబరు 28న మైనార్టీ తీరిందని, కొవిడ్ కారణంగా నిర్దిష్ట గడువు(మూడేళ్ల)లోగా అధికారులను ఆశ్రయించలేకపోయారని వివరించారు. ఆ కారణంతో పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించడానికి వీల్లేదన్నారు. సర్టిఫికెట్లలో తప్పులను సవరించే విషయంలో సుప్రీంకోర్టు 2021లో తీర్పు ఇచ్చిందని, దానికి లోబడి అధికారులు నడుచుకోవాల్సిందేనని వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి..పిటిషనర్ కోరిన విధంగా ఆయన సర్టిఫికెట్‌లో పేర్లు మార్చాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

కార్పొరేట్ విద్య.. ఇదేనా జగన్?!

ప్రైవేటు పాఠశాలల్లోనే ఎక్కువ మంది పాస్

- ప్రైవేటులో 96.72శాతం... జడ్పీలో 79.38శాతం
- ప్రభుత్వ, మున్సిపల్ మేనేజ్‌మెంట్లలోనూ అంతే
- గురుకుల, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు కాస్త నయం
- మొత్తం మార్చేశానని బీరాలు పలికిన సీఎం
- ప్రభుత్వ బడులతో కార్పొరేట్ పోటీ అని ప్రచారం
- టెన్త్ ఫలితాలతో బయటపడిన డొల్లతనం

"ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశాం. నాడు- నేడుతో అన్ని పాఠశాలలనూ అద్భుతంగా తీర్చిదిద్దాం. ఎనిమిదో తరగతి పిల్లలకు ప్రతి సంవత్సరం ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ఇవన్నీ చూస్తే త్వరలో కార్పొరేట్ పాఠశాలలే ప్రభుత్వ బడులతో పోటీ పడాల్సిన పరిస్థితి వస్తుంది. కార్పొరేట్ కన్నా ప్రభుత్వ బడులే అన్ని రకాలుగా మెరుగ్గా ఉంటాయి".. రెండేళ్ల కిందట ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో సీఎం జగన్ పలుకులివి. ఆయన మాటలు కోటలు దాటినా వాస్తవాలను దాగలేదు. సోమవారం విడుదలైన టెన్త్ ఫలితాలు చూస్తే... ప్రభుత్వ బడులతో కార్పొరేట్ పాఠశాలలు పోటీపడటం అటుంచితే, ఫలితాల్లో కార్పొరేట్ దరిదాపుల్లో కూడా ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు కనిపించలేదు. మరి ఈ ఫలితాలు చూశాక కూడా కార్పొరేట్ పాఠశాలలు... ప్రభుత్వ బడులతో పోటీపడతాయా?!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాడు- నేడు, ట్యాబ్‌లు అంటూ పైపై మెరుగులు దిద్దిన జగన్ ప్రభుత్వం.. విద్యారంగానికి కీలకమైన బోధనా వ్యవహారాన్ని వదిలేసింది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించి వారిపై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా ఫలితాల పరంగా ప్రభుత్వ బడులు కార్పొరేట్‌తో పోటీపడలేకపోయాయి. ఈ ఏడాది టెన్త్ ఫలితాలే ఇందుకు నిదర్శనం. తక్కువ మంది విద్యార్థులుండే ఏపీ రెసిడెన్షియల్, బీసీ సంక్షేమ మేనేజ్‌మెంట్ల పాఠశాలలు మాత్రం ఉత్తమ ఫలితాలు సాధించాయి. రెండు మేనేజ్‌మెంట్ల పాఠశాలల్లోనూ 98.43శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు బడుల్లో 96.72 శాతం మంది ఉత్తీర్ణత సాధిస్తే, జడ్పీ పాఠశాలల్లో 79.38 శాతం మాత్రమే పాసయ్యారు. ఇక ప్రభుత్వ మేనేజ్‌మెంట్ బడుల్లో 74.4 శాతం, మున్సిపల్ పాఠశాలల్లో 75.42 శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 2803 పాఠశాలల్లో వంద శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో ప్రైవేటు పాఠశాలలు ఏకంగా 1988 ఉన్నాయి. జిల్లా పరిషత్ పాఠశాలలు 436, ఆశ్రమ పాఠశాలలు 69, కేజీబీవీలు 75, బీసీ సంక్షేమ పాఠశాలలు 54 ఉన్నాయి.

చివరన తెలుగు సబ్జెక్టు

సబ్జెక్టుల వారీగా చూస్తే జగన్ ప్రభుత్వంలో తెలుగుకు చాలా ప్రాధాన్యం తగ్గిపోయింది. భాషా సబ్జెక్టుల్లో తెలుగు కంటే ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల్లోనే ఎక్కువ మంది పాసయ్యారు. తెలుగు సబ్జెక్టులో 96.47 శాతం మంది పాసైతే, హిందీలో 99.24 శాతం, ఇంగ్లీష్‌లో 98.52 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గణితంలో 93.33 శాతం, సైన్స్‌లో 91.29 శాతం, సోషల్‌లో 95.34 శాతం మంది పాసయ్యారు. మీడియం పరంగా చూస్తే తెలుగు మీడియంలో చదివిన వారిలో 71.08 శాతం, ఇంగ్లీష్ మీడియంలో చదివినవారు 92.32 శాతం, హిందీ మీడియంలో 100 శాతం, ఉర్దూ మీడియంలో 87.92 శాతం, కన్నడ 56.84 శాతం, తమిళ్ 94.62 శాతం, ఒడియా 94.91 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

మేనేజ్‌మెంట్ల వారీగా ఉత్తీర్ణత

మేనేజ్‌మెంట్	విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
రెసిడెన్షియల్ స్కూల్స్	3304	3552	98.43
ప్రైవేటు స్కూల్స్	224935	217556	96.72
బీసీ వెల్ఫేర్ స్కూల్స్	5355	5271	98.43
మోడల్ స్కూల్స్	13344	12394	92.88
సోషల్ వెల్ఫేర్ స్కూల్స్	13761	13012	94.56
ఆశ్రమ్ స్కూల్స్	10829	9760	90.13
కేజీబీవీ	13020	11582	88.96
ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్	5735	5141	89.64
జిల్లా పరిషత్	257325	204272	79.38
ఎయిడెడ్	11669	9336	80.01
మున్సిపల్	33246	25074	75.42
గవర్నమెంట్	24092	17924	74.04

బోధనేతర పనులతో ప్రభావం

ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఎక్కడైనా తొలుత బోధనకు ప్రాధాన్యమిస్తారు. కానీ జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధన కంటే ఇతరత్రా పనులకు ఎక్కువగా వినియోగించింది. రోజూ విద్యార్థులకు ఆన్‌లైన్ హాజరు, మరుగుదొడ్ల ఫొటోలు తీయడం, మధ్యాహ్న భోజనం ఫొటోలు, ప్రోగ్రెస్ రిపోర్టులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, చిక్కీలు, గుడ్ల లెక్కలు చూసుకోవడం లాంటి బోధనేతర పనులను వారిపై రుద్దింది. దీంతో క్రమంగా బోధనకు సమయం తగ్గిపోయింది. నాడు- నేడు, చిక్కీలు, రాగిజావ అంటూ హడావుడి తప్ప బోధన అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టలేదు. ఈ చర్యలతో కీలకమైన బోధనను పక్కనపెట్టి, బోధనేతర పనులతో టీచర్లు సతమతమయ్యారు. ఈ కారణంగానే సర్కారు బడుల్లో ఫలితాలు నిరాశపరిచాయి.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజలూ అటే..!

మాల్దీవుల పార్లమెంటరీ ఎన్నికల్లో అధ్యక్షుడు మహమ్మద్ మొయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ భారీ మెజార్టీ సాధించింది. మజ్లిస్‌లోని మొత్తం 93స్థానాల్లో ఆయన పార్టీకి 70సీట్లు దక్కాయి. మిత్ర పక్షాలకు మరో మూడు లభించాయి. మొయిజ్జుకు అగ్నిపరీక్షగా నిలిచిన ఈ ఎన్నికలు భారత్, చైనాలకు కూడా అత్యంత ముఖ్యమైనవి. చైనా అనుకూలుడికి పేరుపడిన అధ్యక్షుడికి సభలో ఇంతబలం చేకూర్చిన ప్రజలు, భారత్‌కు అనుకూలంగా ఉండే మాజీ అధ్యక్షుడు ఇబ్రాహీం మహ్మద్ సోలీ నేతృత్వంలోని మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ (ఎండీపీ)కి పన్నెండు స్థానాలే ఇచ్చారు. గతంలో 65 స్థానాలున్న ఈ పార్టీని తన భారత వ్యతిరేక ప్రచారంతో మొయిజ్జు బలంగా దెబ్బతీయగలిగారు.

'చిన్నదేశమైనంత మాత్రాన మమ్మల్ని వేధించే హక్కు ఎవరికీ లేదు' అంటూ భారతదేశాన్ని ఉద్దేశించి పరోక్షవ్యాఖ్యలతో, మన డెబ్బయ్‌మంది సైనికులను వెళ్ళగొట్టడం వంటి చర్యలతో ప్రజలను మొయిజ్జు తనవైపు బాగా తిప్పుకోగలిగారు. గత ఏడాది ఇబ్రాహీం మహ్మద్ సోలీని ఓడించి అధ్యక్షుడైన మొయిజ్జు పార్లమెంట్ ఎన్నికల్లో అంతకంటే ఎక్కువబలాన్ని ప్రదర్శించగలడని ఎవరూ అనుకోలేదు. మొయిజ్జు చైనా అనుకూల వైఖరి మీద ప్రజల్లో అంత సానుకూలత లేదని, అధ్యక్షుడైన తరువాత ఆయన పొరుగు దేశమైన భారత్‌తో ఘర్షణాత్మకంగా వ్యవహరించడం అధికులకు నచ్చడం లేదని విశ్లేషకులు భావించారు. మహా అయితే, త్రిశంకు సభ ఏర్పడుతుంది తప్ప, విజయం అధ్యక్షుడి పక్షాన ఏకపక్షంగా ఉండబోదని విపక్షం ఎంతగానో నమ్మింది. కానీ, దాని అంచనాలకు భిన్నంగా ప్రజలు ఆయనకు భారీ మెజారిటీ కట్టబెట్టడం విచిత్రం. 2008లో మాల్దీవుల్లో ప్రజాస్వామిక పాలన ఆరంభమైన తరువాత, ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోకుండా, కూటమికట్టకుండా తొలిసారిగా ఒంటరిగా 2019లో అధికారంలోకి వచ్చిన ఎండీపీ ఇప్పుడు ఏకంగా చతికిలబడిపోయింది. అనేకమంది స్వతంత్రుల కంటే ఇబ్రాహీం సోలీ పార్టీ అభ్యర్థులు వెనుకబడ్డారు. ఇండిపెండెంట్లుగా గెలిచిన ఆరుగురూ అధ్యక్షుడి కూటమిలో చేరినపక్షంలో ఆయన మరింత బలపడతారు.

మాల్దీవుల్లో 'ఇండియా ఔట్' నినాదానికి పునాదులు వేసి, ఆరేళ్ళక్రితం వరకూ భారతదేశానికి తలనొప్పిగా పరిణమించిన దేశమాజీ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ఒక అవినీతి కేసులో పదకొండేళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్న కారణంగా తన బదులు శిష్యుడైన మొయిజ్జును అధ్యక్ష ఎన్నికల బరిలోకి దింపారు. ప్రమాణస్వీకారం చేయగానే పొరుగున ఉన్న భారతదేశాన్ని సందర్శించడమనే సంప్రదాయాన్ని పక్కనబెట్టి తుర్కియే, సౌదీ అరేబియా వెళ్ళారు. తరువాత చైనా వెళ్ళివచ్చి భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. భారతప్రధాని నరేంద్రమోదీ అనూహ్యంగా లక్షద్వీప్‌ను సందర్శించి అక్కడి ప్రకృతిశోభను ప్రశంసించి, చక్కని పర్యాటక ప్రదేశంగా అభివర్ణిస్తూ ట్వీట్లు చేయడం, వాటి ఆధారంగా అభిమానులు మాల్దీవులపని అయిపోయిందని వ్యాఖ్యానించడం, ఇందుకు ప్రతిగా మొయిజ్జు మంత్రులు ముగ్గురు నోరుపారేసుకోవడం, వారిని ఆయన సస్పెండ్ వంటి పరిణామాలు తెలిసినవే. ఆ తరువాత కూడా భారతదేశ ప్రముఖులు చాలా మంది సామాజిక మాధ్యమాల్లో మాల్దీవులను వెంటాడినందువల్ల దాని పర్యాటకం దెబ్బతిన్నది. దీనికి పోటీగా మొయిజ్జు చైనా సందర్శించి ఇరవైకు పైగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు, బీఆర్ఐని పునరుద్ధరించారు. ఈ తరహా భారత్ వైఖరి మొయిజ్జు ఘనవిజయానికి మరింత దోహదపడిందా అన్నది అటుంచితే, ఇప్పుడు ఆయన చైనాకు మరింత సన్నిహితం కావడానికి మార్గం సుగమం అయింది.

మొయిజ్జు భారత వ్యతిరేక ఎజెండా మాల్దీవులకు మేలుచేయదని ప్రధాన విపక్షపార్టీ ఎండీపీ చెప్పిచూసింది, పార్లమెంటులో తనకున్న సంఖ్యాబలంతో అధ్యక్షుడి నిర్ణయాలకు, నియామకాలకు అడ్డుతగిలి దారికి తెచ్చేందుకు విఫల యత్నంచేసింది. చివరకు అభిశంసన తీర్మానంతో ఆయనను దించేందుకు కూడా సిద్ధపడింది. కానీ, ఇప్పుడు ప్రజలు ఆయనకే భారీ విజయం చేకూర్చి సమర్థించారు. నిరంకుశమైన బలంతో ఇప్పుడు ఆయన కావాల్సిన చట్టాలు చేసుకోవచ్చు, నచ్చిన విధానాలు అమలుచేయవచ్చు. భారత్ పక్షాన ఆయనను నిలదీసే, ప్రశ్నించే ప్రధానప్రతిపక్షం ప్రస్తుతానికి తన ఉనికి కోల్పోయింది. చారిత్రకంగా, భౌగోళికంగా ఎంతో సన్నిహితంగా ఉండే భారత దేశంతో, ఇప్పటివరకూ కొనసాగిన సత్సంబంధాలను విఘాతం కలగకుండా, నిప్పురేపకుండా వ్యవహరించాలని కోరుకోవడం వినా చేయగలిగిందేమీ లేదు. విదేశాంగమంత్రి జయశంకర్ అన్నట్టుగా ఎవరు వచ్చినాపోయినా, ఇరుగూపొరుగూ అన్నాక పొద్దున్న లేస్తే మొఖాలు చూసుకోవాల్సిందే.

ప్రతిపక్షాల పగటి కలలు

భారతీయ జనతా పార్టీ కేవలం ఉత్తరాది పార్టీ అని, దక్షిణాదిలో అది నెగ్గుకు రాదని కాంగ్రెస్ నేతలు నిర్వహిస్తున్న బూటకపు ప్రచారంలో అణుమాత్రమైనా వాస్తవం లేదు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఉత్తరాది పార్టీ మాత్రమేనని, ఉత్తరాది వారికే బీజేపీ పెద్ద పీట వేస్తుందని అర్థం పర్థం లేని ఆరోపణ చేశారు. నిజానికి తెలంగాణలో బీజేపీ మూలంగానే ఆయన కాళ్ల కింద నీరు ప్రవహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ మేధావుల్లోనూ బీజేపీ ప్రభావం ఎంత విస్తరించిందంటే ఇవాళ బీఆర్ఎస్ స్థానాల్లో దూసుకురావడమే కాదు. కాంగ్రెస్ స్థానాలను కూడా అది కైవసం చేసుకునే క్రమంలో ఉన్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి సీటుతో సహా మెజారిటీ సీట్లలో ఇవాళ బీజేపీ ప్రాబల్యం కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ విస్తరిస్తున్న



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. బీజేపీ సీట్ల కోసం ప్రతి నియోజకవర్గంలోనూ నేతలు పోటీపడుతున్న తీరే బీజేపీ ప్రాబల్యానికి నిదర్శనం. బీజేపీ నేతలు ఎక్కడకు వెళ్లినా వేలాది ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. బీజేపీ-తెలుగుదేశం-జనసేన కూటమి జనాదరణ జగన్మోహన్ రెడ్డి అనుయాయుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. బీసీలు, దళితులు, ఆదివాసీలతో సహా అట్టడుగు వర్గాలు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో బీజేపీకి ఆకర్షితులవుతున్నారు. గత ఎన్నికల్లో దాదాపు 13 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, జమ్ము కశ్మీర్, ఉత్తరాఖండ్ చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ, నాగాలాండ్, సిక్కిం, త్రిపురలో ఒక్క సీటు కూడా సంపాదించుకోలేని కాంగ్రెస్, బీజేపీని ఢీకొంటుందంటే ఎవరు విశ్వసిస్తారు? అదే సమయంలో 21 రాష్ట్రాల్లోని 224 సీట్లలో 50 శాతం పైగా ఓట్లను సాధించిన బీజేపీ కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమయిందన్న ప్రతిపక్షాల విమర్శలో అర్థం ఏమైనా ఉన్నదా?

తమిళనాడు, కేరళలో బీజేపీ విస్తరిస్తోందని, ఈ ఎన్నికల్లో అనూహ్యమైన ఫలితాలు సాధిస్తుందని ఇటీవల ప్రముఖ ఆర్థికవేత్త సుర్జిత్ భల్లా వ్యాఖ్యానించారు. ఒక్క తమిళనాడులోనే బీజేపీకి 5 సీట్లు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన చెప్పారు. తమిళనాడులో ప్రధాన పోటీ డీఎంకె, బీజేపీల మధ్యే ఉన్నదని స్పష్టంగా తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో తమిళనాడులో ఒక్క సీటు కూడా సాధించలేని బీజేపీ ఈసారి కనీసం పది నియోజకవర్గాల్లో డీఎంకే కూటమికి గట్టి పోటీనిస్తోంది. కన్యాకుమారి-నాగర్ కోయిల్-తిరునల్వేలి బెల్ట్- రామనాథపురం, కోయంబత్తూరు ప్రాంతాల్లో బీజేపీ బలం రోజురోజుకూ పుంజుకుంటోంది. ఈ ఎన్నికల్లో బీజేపీకి 25 శాతం పైగా ఓట్లు లభించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. తమిళనాడులో అనేకసార్లు ఉధృతంగా పర్యటించిన మోదీ తమిళ ప్రజలకు సుపరిచితుడయ్యారు. కొత్త పార్లమెంట్ భవనంలో చోళ రాజ వంశీకుల సెంగోల్‌ను ప్రతిష్ఠాపించడం నుంచి కాశీ-తమిళ సంగమం వరకు అనేక చర్యల ద్వారా ఆయన ఉత్తరాదికి, దక్షిణాదికి వారధి నిర్మించారు. భారత దేశానికి చెందిన కచ్చతీవును శ్రీలంకకు అకారణంగా అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ఆయన తీవ్రంగా ఎండగట్టారు. గత వారం మోదీ కోయంబత్తూరులో రోడ్ షో నిర్వహించినప్పుడు వేలాది మంది మోదీ, మోదీ అంటూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మోదీ తన ప్రసంగం తమిళ భాషలో ప్రజలకు చేరేలా చూడడం వారి మనసులను హత్తుకుంది. వీటన్నిటి రీత్యా ఉత్తర-దక్షిణ విభజనను సృష్టించి దక్షిణాదిలో ప్రజలను బీజేపీకి దూరం చేయాలని చూస్తున్న ప్రతిపక్షాల ఎత్తుగడలు ఏ మాత్రం ఫలించేలా లేవు. ఈసారి దక్షిణాదిలో బీజేపీ సాధించే విజయాలు అందర్నీ దిగ్భ్రాంతి పరుస్తాయని స్వయంగా మోదీ ప్రకటించడం ఆయన ఆత్మవిశ్వాసానికి నిదర్శనం.



మోదీ చేసిన మంచిపనులే మొత్తంగా బీజేపీ గెలుపునకు కారణమవుతాయని 45 శాతం మంది విశ్లేషిస్తున్నట్లు 'ఎకానమిస్ట్' పత్రిక అంచనా వేసింది. 57 శాతం మంది ప్రజలు మోదీ పాలన పట్ల సంతృప్తికరంగా ఉన్నారని, దేశంలో సగం మంది ప్రజలు మోదీ తిరిగి రావాలని ఆశిస్తున్నారని సిఎస్‌డిఎస్– లోక్‌నీతి కూడా వెల్లడించింది. ఈ రీత్యా, మోదీ సారథ్యంలో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రాలేదని అంటున్న వారిని భర్తృహరి చెప్పిన మూర్ఖుల జాబితాలో చేర్చాలి.

ఇవాళ దక్షిణాదిన ప్రతి నియోజకవర్గంలోనూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇళ్ల నిర్మాణం, ఉచిత ఎల్పిజి, వైద్య బీమా, ఉచిత ఆహారధాన్యాల సరఫరా గురించి తెలుసు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో యువకుల్లో అత్యధికులు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్న విషయం ప్రతిపక్ష పార్టీలు గమనించడం లేదు. ముఖ్యంగా తొలిసారి ఓటర్లైనవారు బీజేపీ వల్లనే దేశం మెరుగుపడుతుందని భావిస్తున్నారు. కేరళలో కొన్ని దశాబ్దాలుగా వామపక్ష ప్రజాస్వామిక ఫ్రంట్, యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వాలను చూసిన అక్కడి ప్రజలు క్రమంగా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారు. ఈ ప్రభుత్వాల హయాంలో జరిగిన అవినీతిని, మోదీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు పోల్చి చూసుకుంటున్నారు. అక్కడ బీజేపీకి కేథలిక్ క్రైస్తవుల మద్దతు రోజురోజుకూ పెరుగుతోంది. తమిళనాడులో అన్నాడిఎంకె, తెలంగాణలో భారత రాష్ట్ర సమితి పట్ల ప్రజలకు పెరుగుతున్న ఏహ్యభావం బీజేపీ క్రమంగా బలపడేందుకు ప్రధాన కారణమవుతున్నది.

నేడు దేశంలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాల అమలు, నగదు బదిలీలు గమనించినవారెవరైనా ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉన్నదంటే విశ్వసించలేరు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి వల్ల మోదీకి అత్యధిక సీట్లు లభిస్తాయని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. తలసరి వినియోగం మెరుగుపడిందని, జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని, పేదరికం తగ్గిపోయిందని, ఇవన్నీ ప్రజల్లో మోదీ పట్ల సానుకూల అభిప్రాయాలు ఏర్పరిచాయని భల్లా అభిప్రాయపడ్డారు. ఎవరు కాదన్నా మోదీ హయాంలో జీడీపీ రెట్టింపు స్థితిలో 3.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. తలసరి ఆదాయం రెట్టింపైంది. ఎగుమతులు 400 శాతం పెరిగి 750 బిలియన్ డాలర్లకు మించిపోయాయి. ఇవాళ అనేక పట్టణాలు మెట్రోనగరాలుగా మారి ప్రజలకు అక్కడే ఉపాధి లభిస్తోంది. ఎక్స్‌ప్రెస్ హైవేలు దాదాపు 400 శాతం పెరిగి 4067 కి.మీ మేరకు విస్తరించాయి. జాతీయ రహదారులు 53,700 కి.మీ విస్తరించాయి. విదేశీ రిజర్వులు 694 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

మోదీ చేసిన మంచి పనులే మొత్తంగా బీజేపీ గెలుపునకు కారణమవుతాయని 45 శాతం మంది విశ్లేషిస్తున్నట్లు ఎకానమిస్ట్ పత్రిక అంచనా వేసింది. ఆ తర్వాత సంక్షేమ పథకాలు, నాయకత్వ లక్షణాలు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు, భారతదేశానికున్న అంతర్జాతీయ ప్రతిష్ఠ, హిందువుల ప్రయోజనాలు కాపాడడం మొదలైనవన్నీ మోదీ విజయపరంపరలో భాగమవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. 57 శాతం మంది ప్రజలు మోదీ పాలన పట్ల సంతృప్తికరంగా ఉన్నారని, దేశంలో సగం మంది ప్రజలు మోదీ తిరిగి రావాలని ఆశిస్తున్నారని సిఎస్‌డిఎస్– లోక్‌నీతి కూడా వెల్లడించింది. ఈ రీత్యా, మోదీ సారథ్యంలో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రాలేదని పగటి కలలు కంటుంటే వారిని భర్తృహరి చెప్పిన మూర్ఖుల జాబితాలో చేర్చాలి.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

వ్యవ'సాయం' మరచిన సర్కార్

ఆంధ్రప్రదేశ్‌లో గడచిన ఐదేళ్లలో కుదేలై కుప్పకూలిన రంగాలు చాలానే ఉన్నాయి. వాటిలో ప్రత్యేకంగా చెప్పుకోవల్సింది వ్యవసాయరంగం గురించే. ఇప్పటికీ అత్యధికశాతం ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడిన ఆ రంగాన్ని పాలకులెవరు నిర్లక్ష్యం చేసినా అది క్షమించరాని నేరమే. ఆ నేరానికి పాల్పడిన రాష్ట్రప్రభుత్వం వ్యవసాయాన్ని అట్టడుగుస్థాయికి చేర్చింది.

దేశంలోనే ఎక్కువ అప్పులున్న రైతుకుటుంబాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు అందజేసిన గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో మొత్తం రైతాంగంపై ఉన్న అప్పు రూ. 1,91,970 కోట్లు కాగా, ఒక్కో రైతుకుటుంబంపై ఉన్న సగటు అప్పు రూ. 2,45,554. ఈ రుణభారం రైతుల పాలిట యమపాశంగా మారి బలవన్మరణాలకు పురిగొల్పింది. నేషనల్ క్రైమ్‌బ్యూరో ఆఫ్ రికార్ట్స్ (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం కౌలురైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ 2వ స్థానంలో, రైతు ఆత్మహత్యల్లో 3వ స్థానంలో ఉంది.

వ్యవసాయం మీద, రైతుల సమస్యల మీద ఏ మాత్రం అవగాహన లేకుండా వ్యవహరించి ఈ రంగాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యం చేశారనడానికి అనేక ఉదాహరణలున్నాయి. వైసీపీ అధికారంలోకి రాకముందు వ్యవసాయరంగానికి బడ్జెట్లో సగటున 5.5 శాతం నుంచి 6 శాతం మేర నిధులు కేటాయించేవారు. కానీ, ఈ ఐదేళ్లలో జగన్ సర్కార్ బడ్జెట్‌లో చేసిన వార్షిక కేటాయింపులు సగటున 4.16 శాతం మాత్రమే. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు ఈ రంగానికి చేసిన బడ్జెట్ కేటాయింపుల్ని విశ్లేషిస్తే ఆంధ్రప్రదేశ్ అట్టడుగు స్థానంలో నిలుస్తుంది. దామాషా ప్రకారం ఈ ఐదేళ్లలో వ్యవసాయరంగంపై కనీసం రూ. 60 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా కేవలం రూ. 39 వేల కోట్లు ఖర్చు చేశారు. అంటే 35 శాతం మేర బడ్జెట్ నిధుల్లో కోతపెట్టారు. దీంతో రైతుసంక్షేమానికి గండి పడింది. అది ఈ ఐదేళ్లకాలంలో ప్రస్ఫుటంగా కనిపించింది.

దేశంలోనే ఎవరూ అందించని రీతిలో 'రైతు భరోసా' పథకం ద్వారా ఏడాదికి రూ. 13,500లను పెట్టుబడి సాయంగా ఒకేసారి అందజేస్తున్నట్టు ప్రభుత్వం ఘనంగా చాటుకుంది. కేంద్రం అందించే ఆరువేల రూపాయల్ని కూడా ఇందులో కలిపేసి గొప్పలు పోతోంది. ఆ మొత్తాన్ని తీసేస్తే రాష్ట్ర ప్రభుత్వం నికరంగా ఇచ్చింది రూ. 7,500 మాత్రమే. తొలి ఏడాది మాత్రమే ఏకమొత్తంగా సాయాన్ని రైతుల ఖాతాలో జమచేశారు. ఆ తర్వాత మూడు దఫాలుగా అందించారు. చంద్రబాబు పాలనలో రైతులకు రూ. 50 వేల వరకు రుణమాఫీ జరిగింది. 'అన్నదాత సుఖీభవ' ద్వారా ఐదేళ్లల్లో ఒక్కో రైతుకు రూ. 60 వేలు అందజేశారు. మొత్తం మీద రైతుకు అప్పుడు లక్షాపదివేలు అందితే, జగన్ సర్కార్ ఐదేళ్లలో రైతాంగానికి ఇచ్చింది రూ. 37,500 మాత్రమే. ఇక రాష్ట్రంలో 15.36 లక్షల మంది అర్హులైన కౌలురైతులు ఉండగా వారిలో లక్షమందికే రైతుభరోసా' అందించారు. మిగిలిన 14 లక్షలకు పైగా కౌలురైతులకు ఒక్కరూపాయి కూడా సాయం అందలేదు.

రైతులకు జరిగిన మరో ముఖ్యమైన నష్టం... పంటలకు కనీస మద్దతుధరలు లభించకపోవడం. ధాన్యం సేకరణను గణనీయంగా కుదించివేయడంతో రైతులు పంటలను తక్కువ ధరకే అమ్ముకుని నష్టపోయారు. ప్రధానపంటలకు కనీస మద్దతుధరలు లభించని సమయాల్లో పొరుగురాష్ట్రాలు కొన్ని పంటలకు బోనస్ ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోగా, ఇక్కడ అలాంటి ఊసేలేదు.



srini



దాదాపు ఆరు నెలల క్రితం నుంచే ఎన్నికల మీద దృష్టిపెట్టిన ముఖ్యమంత్రి జగన్ పాలనను పడకేయించారు. సమీక్షలు లేవు. క్షేత్రస్థాయి నివేదికల పరిశీలన లేదు. రైతుల్ని ఆదుకునే చర్యలు అసలే లేవు. ఆయన వారిని ఏనాడూ పరామర్శించిన పాపాన పోలేదు. రైతుసంఘాల నేతల్ని పిలిచి మాట్లాడిన సందర్భమూ లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 10 వరుస ప్రకృతి విపత్తులతో 60 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఇన్‌పుట్ సబ్సిడీగా రూ. 2వేల కోట్లు అందించి 'మమ' అనిపించారు. అంటే జరిగిన నష్టంలో ఒక్కశాతం కూడా రైతులకు పరిహారంగా దక్కలేదు. మరోవైపు కేంద్రానికి ఇచ్చే నివేదికలలో జరిగిన పంటనష్టం లెక్కలను తక్కువగా చూపడం వల్ల కేంద్రం అందించే సాయం అరకొరగానే ఉంటోంది.

వ్యవసాయపు పెట్టుబడులు ఏటా 15 నుంచి 20 శాతం మేర పెరుగుతూ రైతాంగానికి పెనుభారంగా మారుతున్న తరుణంలో దానిని తగ్గించడానికి గత ప్రభుత్వాలు నిర్దిష్ట చర్యలు తీసుకునేవి. సున్నావడ్డీకి రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, పురుగుమందుల పంపిణీ, క్రమం తప్పకుండా భూసారపరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా అవసరమైన పొలాలకు ఉచితంగా జింక్, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాల పంపిణీ వగైరాలతో చేయూతనందించేవారు. వైసీపీ పాలనలో భూసారపరీక్షల ముచ్చటే లేదు. సూక్ష్మ పోషకాల మాటేలేదు. సున్నావడ్డీపై రుణసౌకర్యాన్ని లక్ష రూపాయలకు పరిమితం చేయడమే కాక సకాలంలో చెల్లించే రైతులకే వర్తింపజేస్తామన్న నిబంధన విధించారు. గతంలో ట్రాక్టర్లు పంపిణీ చేసి యాంత్రీకరణకు ప్రోత్సాహాన్నివ్వగా దానినీ అరకొరగానే అమలు చేస్తున్నారు.

కీలకమైన భారీ, మధ్యతరహా, చిన్నతరహా నీటిప్రాజెక్టులతో పాటు మైక్రో, ఇరిగేషన్ రంగాలను సైతం అలక్ష్యం చేయడంతో సాగునీరు అందక వ్యవసాయరంగం మరింత కళ తప్పింది. చంద్రబాబు హయాంలో రూ. 64 వేల కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులతో 23 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి 32 లక్షల ఎకరాలను స్థిరీకరించగా వైసీపీ ఏలుబడిలో కేటాయించింది కేవలం రూ. 25 వేల కోట్లు మాత్రమే. రివర్స్ టెండర్ల పేరుతో 72 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును పక్కన పెట్టేశారు. చివరకు ప్రాజెక్టుల క్రస్ట్ గేట్ల నిర్వహణకూ నిధుల లేమి వేధిస్తోందంటే, ఇంతకంటే వైఫల్యం ఏముంటుంది?

చంద్రబాబు అత్యంత ప్రాధాన్యం కల్పించిన మైక్రోఇరిగేషన్ గత ఐదేళ్లుగా నేల చూపులు చూస్తోంది. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక దిగుబడులు సాధించిపెట్టే మైక్రో ఇరిగేషన్ విధానాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కుప్పంలో ప్రయోగాత్మకంగా మొదలుపెట్టి ఆ తర్వాత అన్ని ప్రాంతాలకూ విస్తరింపజేసి మంచిఫలితాలు చూపించారు. రాష్ట్రవిభజన తర్వాత కూడా సూక్ష్మసేద్యాన్ని మెట్టప్రాంతాల్లో, ప్రత్యేకించి రాయలసీమలో ప్రాధాన్యతా కార్యక్రమంగా అమలుచేశారు. ఫలితంగా దేశంలోనే సూక్ష్మసేద్యం అధికంగా సాగుతున్న 10 జిల్లాల్లో 9 ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండడం చెప్పుకోదగ్గ విశేషం. నాడు 18.60 లక్షల ఎకరాల సూక్ష్మసేద్యంతో కర్ణాటక తర్వాత రెండోస్థానంలో నిలవగా, నేడు ఆ మొత్తాన్ని 4.39 లక్షల ఎకరాలకు కుదించేశారు. దీనివల్ల రాయలసీమలోని నాలుగు ఉమ్మడిజిల్లాల రైతాంగానికి ఎంతగానో నష్టం జరిగింది.

వ్యవసాయరంగానికి అనుబంధంగా ఉండి రైతాంగానికి దన్నుగా నిలుస్తున్న పూలు, పండ్లతోటలు, ఔషధ మొక్కలు, కూరగాయలు మొదలైన ఉద్యానవనపంటలకు అందించే రాయితీలను సైతం నిలిపివేశారు. విదేశాలకు ఎగుమతిచేసే అవకాశాలు ఉన్న అరటి, మామిడి, కొబ్బరి, టమాటా తదితర పంటల్ని గత ప్రభుత్వం ప్రోత్సహించడమేకాక ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పలుప్రాజెక్టులు చేపట్టింది. ముఖ్యంగా కూరగాయలు సాగుచేసే రైతాంగానికి ఎకరాకు రూ. 1,200 చొప్పున అందించిన రాయితీని ఈ ప్రభుత్వం ఎత్తేయడంతో వాటి ఉత్పత్తి 86.16లక్షల టన్నుల నుంచి నేడు సగటున 79లక్షల టన్నులకు పడిపోయింది. పండ్ల ఉత్పత్తి కూడా సగటున 182లక్షల టన్నుల నుంచి 176లక్షల టన్నులకు తగ్గిపోయింది.

మరోపక్క, ఆక్వారైతుల పరిస్థితీ దయనీయంగానే ఉంది. సిండికేట్లు, దళారులు ఇష్టారాజ్యంగా ఈ పరిశ్రమను దెబ్బతీస్తోంటే రాష్ట్రప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోంది. ఆక్వారైతులకు యూనిట్ విద్యుత్‌ను రూపాయిన్నరకే అందిస్తామన్న హామీని పాలకులు విస్మరించారు. అలాగే, పాడిరైతులకు లీటర్ పాలకు నాలుగు రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారు. సహకార డెయిరీల ఆస్తులను అమూల్‌కు ధారాదత్తం చేస్తున్నారు.

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్, రబీ సీజన్లు రెండింటిలో కలిపి 45 లక్షల ఎకరాలలో సాగు తగ్గిపోవడం రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తుంటే, పాలకులు మాత్రం గుర్రుపెట్టి మొద్దునిద్ర పోతున్నారు. ఒకే ఏడాదిలో లక్షల ఎకరాల్లో రైతులు విత్తనాలు చల్లకపోవడాన్ని ఓ రికార్డుగా చెబుతున్నారు. ఇంకోవైపు పంటలు వేసినా తుపాన్లు, కరువు వల్ల 43 లక్షల ఎకరాల్లో సాగు దెబ్బతింది. మొత్తంగా చూస్తే... చేతికొచ్చే ఆహార ధాన్యాలెంత? రైతులకు జరిగిన నష్టాన్ని ఎవరు తీరుస్తారు? ఆహారధాన్యాలు, పండ్లు, కూరగాయల కొరత వల్ల వినియోగదారుడిపై పడే భారం ఎంత? దీనిని పట్టించుకునే నాథుడు లేడు. దాదాపు 6 నెలల క్రితం నుంచే ఎన్నికల మీద దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి జగన్ పాలనను పడకేయించారు. సమీక్షలు లేవు. క్షేత్రస్థాయి నివేదికల పరిశీలన లేదు. రైతుల్ని ఆదుకునే చర్యలు అసలే లేవు. ఆయన వారిని ఏనాడూ పరామర్శించిన పాపాన పోలేదు. రైతుసంఘాల నేతల్ని పిలిచి మాట్లాడిన సందర్భమూ లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 10 వరుస ప్రకృతి విపత్తులతో 60 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఇన్‌పుట్ సబ్సిడీగా రూ. 2 వేల కోట్లు అందించి 'మమ' అనిపించారు. అంటే జరిగిన నష్టంలో ఒక్క శాతం కూడా రైతులకు పరిహారంగా దక్కలేదు. మరోవైపు కేంద్రానికి ఇచ్చే నివేదికలలో జరిగిన పంటనష్టం లెక్కలను తక్కువగా చూపడం వల్ల కేంద్రం అందించే సాయం అరకొరగానే ఉంటోంది. రైతులకు న్యాయం చేయడానికి ప్రయత్నించకపోగా.. వారిని దెబ్బతీయడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. ఈ వైఫల్యాలతో రాష్ట్రంలో వ్యవసాయరంగ ముఖచిత్రం భయానకంగా మారింది. రైతాంగం ఆవేదనను పట్టించుకుని వారికి బాసటగా నిలవని ఈ ప్రభుత్వం వల్ల ప్రయోజనమేమిటి? దేశ ఆహార భద్రతకు దోహదం చేసే తమ మేలు కోరని ఈ ప్రభుత్వాన్ని వదిలించుకుంటేనే అన్నదాతలు బాగుపడతారు. రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయి.

• సి. రామచంద్రయ్య

శాసనమండలి మాజీ సభ్యులు

కాకతీయుల ఆలయాల్లోనూ సూర్యతిలకం!

శ్రీ రామ నవమి రోజున అయోధ్యలో బాల రాముడి నుదుటిపై సూర్య కిరణాలు ప్రసరించిన దృశ్యాలను అన్ని చానెళ్లు ప్రసారం చేశాయి. ఇటీవలికాలంలో చేపట్టిన శాస్త్ర సాంకేతిక అద్భుతమిది.

సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) ఈ సూర్య తిలకం వ్యవస్థను రూపొందించింది. రామ మందిరం మూడవ అంతస్తునుంచి సూర్య కిరణాలు గర్భగుడిలోని విగ్రహం వరకు ఏటా శ్రీ రామ నవమి రోజు ప్రసరించేలా కటకాలు, అద్దాలు, గేర్ బాక్సులు, గొట్టాలు అమర్చారు. ఈ ప్రక్రియలో ఉక్కు, ఇనుము, బ్యాటరీలు, విద్యుత్తు వాడలేదని సీబీఆర్ఐ తెలిపింది. శ్రీ రామ నవమి రోజు బాలరాముడికి సూర్య తిలకం దిద్దిన ఆ దృశ్యాలు చూసి కోట్లాది మంది భావోద్వేగానికి గురయ్యారు.

ఈ నేపథ్యంలో, ఇప్పటికే ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించిన వివిధ దేవాలయాలపై చర్చ జరుగుతోంది. దేశంలో దాదాపు 800 సంవత్సరాలకు పూర్వమే దీని వాడకం మొదలైంది. ఎన్నో రాజవంశాలు తాము నిర్మించిన ఆలయాల్లో ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించాయి. ప్రధానంగా, కాకతీయులు తాము కట్టిన ఆలయాల్లో సూర్యరశ్మిని పరావర్తనం చేయించి, సూర్య కిరణాలు మూల విరాట్టుపై నేరుగా పడేలా, తద్వారా ఆలయం చీకటిగా ఉన్నా, దేవతామూర్తిని చక్కగా దర్శించుకునేలా ఏర్పాటుచేశారు. నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్లు ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం ఈ విషయంలో ప్రత్యేకంగా చెప్పుకోదగినది. అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, సింహాచలం, కోణార్క్, ఎల్లోరా గుహలు... ఇలా ఎన్నో చోట్ల ఈ విధమైన వ్యవస్థతో వందల సంవత్సరాల క్రితమే ఆలయాలను నిర్మించారు. ఎల్లోరా గుహల్లోని 10వ గుహలో ధర్మచక్రముద్రలో ఉన్న బుద్ధుడి మొఖం మీద కాంతి పడే ఏర్పాటు 7వ శతాబ్దంలోనే చేశారు. గుడిగోపురాల్ని నిర్మించిన పాలకులు ఆ రకంగా దేవతామూర్తులపై సూర్య కిరణాలు పడే ఏర్పాట్లు చేశారు. అరసవెల్లి నుండి నాగులాపురం దాకా తెలుగుగడ్డమీద ఇలాంటి ఆలయాలున్నాయి. కాకతీయ నిర్మితమైన ఆలయాలలో, వీటిలో అత్యధికం శివాలయాలు, ప్రధాన విగ్రహమైన శివలింగంపై ప్రత్యేకంగా వెలుతురు ప్రసరించేలా నిర్మించారు. ప్రధానంగా, వేయిస్తంభాల ఆలయం, రామప్ప ఆలయం, ఘనపురం దేవాలయాల్లో వెలుతురు ప్రసరించే విధానాన్ని చూడొచ్చు. నల్లగొండలోని పానగల్లు ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం ఆధునిక శాస్త్రజ్ఞులను సైతం ఆశ్చర్యానికి గురిచేసే అద్భుత విశేషాలు కలిగినది. 11వ శతాబ్దంలో కందూరు చోళులు నిర్మించిన ఈ ఆలయంలో కాంతి పరావర్తనం ద్వారా స్తంభాల ఛాయ (నీడ) ఎదురుగాగల శివలింగంపై పడడం ఇక్కడి ప్రత్యేకత. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం... ఇలా ఏ వేళలోనైనా ఒకే వైపు ఛాయ పడడం ఈ ఛాయా సోమేశ్వర ఆలయం ప్రత్యేకత. సూర్య కిరణాలను పరావర్తనం చెందించడం ద్వారా నీడ అన్నివేళలా ఒకే దగ్గర పడేలా చేశారని పరిశోధకులు వెల్లడించారు. ఈ సోమేశ్వరాలయంలో 'ఏకఛాయా' స్తంభం కనిపిస్తుంది.



అంతేకాదు పక్కలకు నిలబడితే మననీడ వ్యతిరేకదిశలో లోపల కనిపిస్తుంది. మధ్యలో కనిపించే నీడలో ఏ తేడా ఉండదు. నిశ్చలంగా వుంటుంది. మనుషులు, వస్తువులు కదిలేవి అడ్డొస్తే వాటి నీడలు వ్యతిరేకదిశల్లో కదులుతుంటాయి. చాలా దేవాలయాల్లో నీడలు వ్యతిరేకదిశల్లో కదిలినట్టు కనిపిస్తాయి. కాని, ఇక్కడివలె స్థిరమైన ఛాయ ఎక్కడా కనిపించదు.

అయోధ్య బాల రాముడి నుదిటిపై శ్రీరామ నవమి రోజున మాత్రమే సూర్య కిరణాలు పడేలా అక్కడి వ్యవస్థను రూపొందించారు. ఈ మెకానిజమ్‌లో భాగంగా ఆలయ మూడో అంతస్తులో ఉండే అద్దంపై పడే సూర్య కిరణాలు పలు ఇత్తడి పైపులు, కటకాల గుండా ప్రసరించి అద్దాల ద్వారా ప్రతిబింబించి రామ్‌లల్లా నుదుటన పడతాయి. ప్రస్తుత కాలంలో ఇదో గొప్ప సాంకేతిక అద్భుతం. అయోధ్య రాముడి సూర్య తిలకానికి కల్పించిన ప్రాచుర్యం పానగల్లు లాంటి దేవాలయాలకు కూడా లభించిన పక్షంలో అవి గొప్ప పర్యాటక ప్రాంతాలుగా రూపొందుతాయి. అంతే కాదు, వందలేళ్ళక్రితమే సూర్యగతిని లెక్కించి, తదనుగుణంగా నిర్మాణాలను చేపట్టిన అప్పటి ప్రతిభమీద యువతలో శాస్త్రీయ పరిశోధన ఆసక్తి కూడా పెరుగుతుంది.

■ కన్నెకంటి వెంకటరమణ

జాయింట్ డైరెక్టర్, సమాచార శాఖ, హైదరాబాద్

ప్రతి మనిషి ఒక కొత్త పుస్తకమే

చదివే స్ఫూర్తి ఉండాలే కానీ
మనిషి కూడా ఒక పుస్తకమే
మనిషిని చదవాలి
రోజుకో పేజీ చొప్పున అచ్చయ్యే
అనుభవాల సరికొత్త సంకలనమే పుస్తకం
కన్నీటి అక్షరాలు చిరునవ్వుల పదాలు
కష్టసుఖాల వాక్యాలు నిండిన గ్రంథమే మనిషి
ఎన్నో ఆశల్ని ఆశయాలనీ స్వప్నించిన మహాకావ్యం
బతుకు జలధిలో ఎగిసిపడే కెరటాలు, బంధాల గంధాలను రాసుకొనే
పర్యాయాలు, మాటలు మంత్రాలను పాటించే ఆత్మీయతలు,
చిరునవ్వుల సిరుల్ని మార్చుకొనే పరిచయాలు...
నవరసాల నిత్య నూతన నాటకం మనిషి



నూరేళ్ల పుస్తకాన్ని నిండు మనసుతో చదవాలి
ప్రతి అక్షరానికి సరికొత్త అర్థాల సంచయం జరగాలి
మనిషితో ఎదుగుతున్న...
నానా జంతుజీవజాతుల జ్ఞానాన్వేషణలో
తక్షణం మనిషిని చదవాలి
మనిషే కదా మహాకావ్యం
అందుకే మనిషిని చదవాలి
తప్పనిసరిగా మనిషి పుస్తకం చదవాలి

– ఈతకోట సుబ్బారావు

(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)

ఆమె ఒక మహావృక్షం!

ఒక మహా వృక్షాన్ని దూరం నుంచి చూస్తే దాని వైశాల్యం, కన్ను పారినంత ప్రాంతంలో అదెలా భాగమైపోయిందనే విషయాలు తెలుస్తాయి. వ్యక్తుల విషయంలోనూ దూరం నుంచి తెలుసుకున్నప్పుడు వారి ప్రతిభాపాటవాలు, విజయాలు తెలుస్తాయి.

గత వారం ఆకస్మికంగా మరణించిన సాయి పద్మ గారి గురించి చెప్పుకోవాలంటే ఆవిడ పుట్టిన నలభై ఐదు రోజులకే పోలియో బారిన పడ్డారు. ఎన్నెన్నో సర్జరీలు, మరెన్నో ట్రీట్‌మెంట్స్ జరిగాక శరీరం పై భాగాన్ని కూడదీసుకుని వీల్ చెయిర్‌లో కూర్చోగలిగే అంతగా మాత్రమే కోలుకున్నారు. శారీరక వైకల్యాన్ని అధిగమించి కామర్స్‌లో డిగ్రీ చేసి, ఆ పైన ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ, సైబర్ చట్టాలపై స్పెషలైజేషన్‌తో ఎల్ఎల్‌బిలో పట్టభద్రులయ్యారు. సంగీతం నేర్చుకున్నారు. గ్లోబల్ ఎయిడ్, బ్రేస్ టెక్ వంటి సంస్థలు స్థాపించారు. తెలుగులో కథలు, కవితలు రాశారు. సామాజిక సేవ చేశారు. వికలాంగుల హక్కుల కోసం పోరాడారు. దేశవిదేశాలలో సభలు, సమావేశాలలో తన ఆలోచనలను వందల వేల మందితో పంచుకున్నారు. బ్రేసెస్ సాయంతో నడవడంతో పాటు ఈత కొట్టడం, డ్రైవింగ్ నేర్చుకున్నారు.

నివాళి



సాయి పద్మ

ఒక వ్యక్తి జీవిత కాలంలో ఇన్ని సాధించినప్పుడు 'గొప్ప వ్యక్తి'గా, 'ప్రతిభాశాలి'గా గుర్తించబడడంలో వింత లేదు. అయితే సాయి పద్మ మరణ వార్త విన్నాక సంతాప సందేశాల దగ్గర ఆగకుండా, ఎంతో మంది ఆవేదన చెందారు. దుఃఖం వ్యక్తం చేశారు. ఆవిడ లేకపోవడం వల్ల ఏర్పడ్డ శూన్యాన్ని పూరించలేమంటూ వాపోయారు. ఎందుకని?

ఒక మహా వృక్షం కిందకు చేరుకొని తలెత్తి పైకి చూసినప్పుడే దాని దృఢమైన కొమ్మలు, ఆకులతో అల్లిన దట్టమైన పందిరి కనిపిస్తాయి. కాస్తున్న కాయలు, రాలిపోతున్న పూలు కనిపిస్తాయి. అన్నింటికన్నా ముఖ్యంగా ఆ వృక్షం ఎన్ని ప్రాణులను తల్లిగా సాకిందో, ఎన్ని పక్షులకు, జంతువులకు ఆవాసమైందో అర్థమవుతుంది.

సాయి పద్మ ఆఫ్‌లైన్ ప్రపంచంలో తన సామాజిక కార్యక్రమాల ద్వారా ఎందరికో విద్య, ఉపాధి కలిపించారు. ఆన్‌లైన్ లోకంలో వేదనాభరితమైన తన రోజూవారీ జీవితాన్ని, దానిలో జయాపజయాలను, ఆశానిరాశలను అలతి పదాలతో, ఏ మాత్రం మెలోడ్రామా లేకుండా డాక్యుమెంట్ చేసుకుంటూ పోయారు. సోషల్ మీడియా అనగానే అనవసరమైన హంగూ ఆర్భాటమే అన్న అభిప్రాయం ఏర్పడిపోయిన ఈ కాలంలో ఆవిడ ఫేస్‌బుక్ పేజ్ ఒక ఒయాసిస్. అక్కడ జీవకాంక్ష, ధైర్యం, ఓదార్పు, హాస్యం, ఊరట, ప్రేరణ అన్నీ దొరికేవి. అన్నింటికన్నా ముఖ్యంగా వైవిధ్యం, బహుళత్వం పట్ల అసహనం, ఏకపక్ష కథనాల (singular narratives) వైపే మోజు ఉన్న ఈ కాలంలో, ఆవిడ సూక్ష్మాన్ని, మరో దృక్పథాన్ని పరిచయం చేయడానికే ప్రయత్నించారు. సంక్లిష్ట ఆలోచనలనూ సరళ భాషలో వ్యక్తీకరించగలిగారు. ఉదాహరణగా ఈ మాటలు చూడండి:


'అంగవైకల్యం ఉన్న ఆడవాళ్ళను అయితే సూపర్ ఉమన్‌గా, లేదంటే సూపర్ నథింగ్‌గా చూస్తారు. వాస్తవానికి రెండూ కారు'. 'మాతృత్వం అంటే పిల్లల్ని కనడమనే కాదు. మాతృత్వం మనం ప్రకృతికి స్పందించే విధానం లోనూ ఉంటుంది. మన పట్ల మన స్పందించే తీరులోనూ ఉంటుంది. ఒకరిద్దరు పిల్లలకు జన్మనిచ్చి తల్లి అవ్వడం కన్నా నా శక్తిసామర్థ్యాల మేరకు అనేక మంది అనాథలకు ఆసరా అవుదామని నిర్ణయించుకున్నాను'. 'మనసుతో పని చేయండి, మేధతో పని చేయండి అంటుంటారు. అసలు పని చేసి పెట్టే శరీరాన్ని మర్చిపోతుంటాం. మనలో అలసటను గుర్తించడం ముఖ్యం'.

అచ్చయిన పుస్తకాలు, వరించిన అవార్డులు ఒక రచయిత ప్రతిభకు ప్రధాన కొలమానంగా ఉన్న నేపథ్యంలో కూడా సాయి పద్మ రచనలు ముఖ్యమైనవి. #అమ్మకథలు, #అమ్మమ్మకథలు, #అకవిత్వం, #సాయిమ్యూజింగ్స్ వంటి హాష్ టాగులలో ఆవిడ పంచుకున్న జీవితానుభవాలు 'కంటెంట్' అన్న లేబుల్ కన్నా 'సాహిత్యం' కిందకే వస్తాయి. రచనలపై కాపీరైట్స్, మహిళా రచయితలపై సైబర్ బుల్లియింగ్ వంటి అంశాలపైన వ్యాసాలు రాయాలని అనుకున్నారు.

సాయి పద్మ అటు చేతలతోనూ, ఇటు మాటలతోనూ తన చుట్టూ ఉన్న జీవితాల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించారు. కంటికి కనిపించే అంగవైకల్యాల గురించే కాక, మానసిక, ఆర్థిక, సామాజిక డిజబిలిటీస్ కూడా గుర్తించారు. స్త్రీలు తమ జీవితాలను డాక్యుమెంట్ చేసినప్పుడు అవి ఎందరికో ప్రేరణగా మారతాయనడానికి ఆవిడ రచనలే ఒక ఉదాహరణ. చేస్తున్న సామాజిక సేవ ద్వారానే కాకుండా, అక్షరాల మాధ్యమంతో కూడా ఎందరికో దగ్గరయ్యారు.

– పూర్ణిమ





నందివాహనంపై ఆదిదంపతులు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆది దంపతులు నంది వాహనంపై ఊరేగారు. గంగా పార్వతీ సమేత మల్లేశ్వర ఉత్సవమూర్తులను నందివాహనంపై ఉంచి ఈవో రామారావు తదితరులు ఊరేగింపుగా సాగారు. ఈ ఉత్సవం వన్‌టౌన్ వీధుల మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంది. కాగా, చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 5.55 గంటలకు శ్రీదుర్గామల్లేశ్వరుల గిరి ప్రదక్షిణ జరగనుంది. - వన్‌టౌన్



నందిగామ నామినేషన్ ర్యాలీలో అభిమానులు ఇచ్చిన కత్తి, డాలు పట్టుకుని విజయ చిహ్నం చూపిస్తున్న తంగిరాల సౌమ్య

కోలాహలంగా..

నామినేషన్ల స్వీకరణ సోమవారం సందడిగా సాగింది. జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో 38 నామినేషన్లు దాఖలయ్యాయి. ర్యాలీల హోరు, ప్రచారాల జోరుతో జిల్లా అంతటా పండుగ వాతావరణం కనిపించింది.



నగరంలో తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ నామినేషన్ ర్యాలీ



ఇబ్రహీంపట్నంలో మైలవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ ర్యాలీ. చిత్రంలో మాజీమంత్రి దేవినేని ఉమా

పాత స్థానాలు పదిలం

'పది' ఫలితాల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు పాతస్థానాలనే పదిల పరుచుకున్నాయి. గత ఏడాది కృష్ణా 11, ఎన్టీఆర్ 13 స్థానాల్లో నిలవగా, ఈ ఏడాది కూడా అవే స్థానాలు దక్కించుకున్నాయి. ఉత్తీర్ణతా శాతంలో మాత్రం భారీ పెరుగుదల కనిపించింది. కృష్ణాలో 90.05 శాతం, ఎన్టీఆర్‌లో 88.76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏటా మాదిరిగానే ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు.



ఫలితాలను విడుదల చేస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

పది ఫలితాల్లో కృష్ణాకు 11, ఎన్టీఆర్‌కు 13వ స్థానం

గత ఏడాది కూడా ఇవే స్థానాలు

- ఉత్తీర్ణతా శాతంలో మాత్రం భారీ పెరుగుదల
- రెండు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయి
- కృష్ణాజిల్లాలో 90.05 శాతం ఉత్తీర్ణత
- ఎన్టీఆర్ జిల్లాలో 88.76 శాతం ఉత్తీర్ణత

విజయవాడ/మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పది ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లాలో అమ్మాయిలు హవా చాటారు. జిల్లావ్యాప్తంగా 88.76 శాతం ఉత్తీర్ణత నమోదై.. రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. మొత్తం 27,899 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 24,763 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 14,401 మంది పరీక్షలకు హాజరుకాగా, 12,420 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 13,498 మంది పరీక్షలు రాయగా, 12,343 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 86.24 శాతం, బాలికలు 91.44 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. గడిచిన ఏడాది జిల్లా 13వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాదీ ఆ స్థానాన్నే పదిలం చేసుకుంది. గడిచిన ఏడాది జిల్లా ఉత్తీర్ణత శాతం 73.07గా ఉండగా, ఈ ఏడాది 88.76 శాతానికి పెరిగింది. ఈ ఏడాది 15.69 శాతం ఉత్తీర్ణత పెరగడం గమనార్హం. మొదటి డివిజన్‌లో 20,541 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో డివిజన్‌లో 3,007 మంది, మూడో డివిజన్‌లో 1,215 మంది ఉత్తీర్ణతను సాధించారు.

వత్సవాయి మండలం ఫస్ట్

ఎన్టీఆర్ జిల్లాలో నమోదైన ఉత్తీర్ణతలో వత్సవాయి మండలం అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించింది. ఈ మండలంలో 96.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తర్వాత స్థానంలో జగ్గయ్యపేట మండలం ఉంది. ఈ మండలంలో 93.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 92.43 శాతం ఉత్తీర్ణతతో విజయవాడ తూర్పు తృతీయ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత గంపలగూడెం 92.24, విజయవాడ సెంట్రల్ 91.34, చందర్లపాడు 90.98, విజయవాడ ఉత్తరం 90.00, విజయవాడ పశ్చిమ 89.14, తిరువూరు 89.08, పెనుగంచిప్రోలు 87.75, వీరులపాడు 87.50, నందిగామ 87.42, రెడ్డిగూడెం 86.52, ఇబ్రహీంపట్నం 86.35, ఎ.కొండూరు 86.29, విస్సన్నపేట 84.86, కంచికచర్ల 84.65, మైలవరం 82.45, జి.కొండూరు 80.23 శాతం, రెడ్డిగూడెం 56.52 ఉత్తీర్ణత నమోదు చేశాయి.

కృష్ణాజిల్లాలో..

పది ఫలితాల్లో కృష్ణాజిల్లా 90.05 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 21,112 మంది పరీక్ష రాయగా, 19,011 మంది ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 19,670 మంది పరీక్షలు రాయగా, 14,688 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది ఉత్తీర్ణతా శాతం 74.67గా ఉన్నా జిల్లా 11వ స్థానంలోనే నిలిచింది. కాగా, ఈ ఏడాది బాలికలే పైచేయి సాధించారు. బాలురు 11,138 మంది హాజరు కాగా, 9,833 మంది ఉత్తీర్ణులై 88.28 శాతం నమోదు చేశారు. బాలికలు 9,974 మంది హాజరు కాగా, 9,178 మంది ఉత్తీర్ణులై 92.02 శాతాన్ని నమోదు చేశారు. దీంతో బాలుర కంటే బాలికలే 3.74 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ స్థానంలో మచిలీపట్నం డివిజన్

జిల్లాలో 54 ఉన్నత పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. గుడివాడ డివిజన్‌లో 114 పాఠశాలల్లో 6,379 మందికి 5,736 మంది పాసయ్యారు. 89.92 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఉయ్యూరు డివిజన్‌లో 102 ఉన్నత పాఠశాలల్లో 7,174 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 6,449 మంది ఉత్తీర్ణులై 89.89 శాతం సాధించారు. మచిలీపట్నం డివిజన్‌లోని 162 పాఠశాలల్లో 7,559 మందికి.. 6,826 మంది ఉత్తీర్ణత సాధించి 90.30 శాతం నమోదు చేశారు. మచిలీపట్నం డివిజన్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లాలో మొదటి డివిజన్‌లో 15,396 మంది, రెండో డివిజన్‌లో 2,381 మంది, మూడో డివిజన్‌లో 1,234 మంది ఉత్తీర్ణులైనట్లు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. గుడివాడ ఏకేటీపీ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థిని అల్లంపల్లి భానుప్రసన్న 600కు 590 మార్కులు సాధించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని తుమ్మల అఖిల 600కు 588 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, కోడూరు మండలం స్వతంత్రపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని వై.ఉజ్వల 600కు 586 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. జిల్లాలో 575 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 904 మంది ఉన్నారన్నారు. ఈ ఏడాది పది ఫలితాల్లో ర్యాంకు పెరగలేదు కానీ, ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగిందని డీఈవో తెలిపారు.

టీడీపీ కంచుకోటలో పాగా ఎవరిదో..

నందిగామ నియోజకవర్గం ఏర్పడ్డాక 8 సార్లు గెలుపొందిన టీడీపీ

- ప్రస్తుత ఎన్నికల బరిలో పాతకాపులే..
- టీడీపీ తరపున తంగిరాల సౌమ్య
- వైసీపీ నుంచి మొండితోక జగన్మోహనరావు



జన కేతనంలో..

ఆయన రాష్ట్రంలోనే కాదు. దేశంలోనే పేరున్న కేన్సర్ వైద్యుల్లో ఒకరు. ఆయన తండ్రి దేవుడి మంత్రిగా పేరొందిన వ్యక్తి. ఆయన ఇమేజ్‌ను సొమ్ము చేసుకునేందుకు వైసీపీ పెద్దలు స్కెచ్ వేశారు. ముగ్గులోకి దింపారు. తొలుత అవనిగడ్డ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించారు. వైసీపీ పెద్దల మాటలు నమ్మి అన్యమనస్కంగానే రాజకీయాల్లోకి వచ్చిన ఆయనకు కొద్దిరోజులకే పరిస్థితి అర్థమయ్యేలా చేశారు వైసీపీ నాయకులు. తొలుత అవనిగడ్డ అసెంబ్లీ అని ఆ తర్వాత తూచ్.. అది మీ స్థాయి కాదు మచిలీపట్నం పార్లమెంటుకు పోటీ చేయండి అంటూ టికెట్ ఇచ్చారు. సరే అని ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయనకు ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థులు మొదలు.. గ్రామస్థాయి నాయకుల వరకు ప్రతి ఒక్కరూ చుక్కలు చూపిస్తున్నారు. ఆయన మరెవరో కాదు.. మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్..!



ఒంటరి పోరాటం

సోమవారం నాటి నామినేషన్‌కు ముఖ్య నేతలు దూరం

ఏకాకిలా మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

- ఎంపీ అభ్యర్థిత్వాన్ని లైట్ తీసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు
- చుక్కలు చూపిస్తున్న సొంత పార్టీ నాయకులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి వైసీపీ తరపున పోటీ చేస్తున్న సింహాద్రి చంద్రశేఖర్ వచ్చింది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచే అయినా ఆయనకు రాజకీయాలు మాత్రం పూర్తిగా వంటబట్టలేదు. ఆయన తండ్రి సింహాద్రి సత్యనారాయణ సైతం రాజకీయాల్లో ఉన్నంతకాలం నిజాయితీగా, ముక్కుసూటిగా వ్యవహరించేవారు. 2010లో సింహాద్రి సత్యనారాయణ మృతిచెందారు. తండ్రి ఉన్నప్పుడు, ఆయన తదనంతరం కూడా తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకునే అవకాశం ఉన్నా ఏనాడూ చంద్రశేఖర్ ఆ ప్రయత్నాలు చేయలేదు. అలాంటిది ఈసారి వైసీపీ పెద్దల మాటలు నమ్మి రాజకీయాల్లోకి దిగారు. వైసీపీ ఆడుతున్న రాజకీయ క్రీడలో పావుగా మారారు.

మార్పులు చేర్పులతో..

దివిసీమలో సింహాద్రి సత్యనారాయణ కుటుంబానికి మంచి పేరుంది. ఆ మంచి పేరును వాడుకునేందుకు వైసీపీ పెద్దలు పావులు కదిపారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సింహాద్రి రమేశ్ అవినీతి అక్రమాలతో విసిగిపోయిన అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు ఈ ఎన్నికల్లో ఆయన్ను ఓడిస్తారని వైసీపీ పెద్దల భావించారు. దీంతో ఆయన్ను మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయించాలని నిర్ణయించారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి చంద్రశేఖర్‌ను బరిలో దింపాలని భావించారు. ఆది నుంచి అన్యమనస్కంగా ఉన్న చంద్రశేఖర్ తాను పోటీ చేయబోనని, తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈలోగా మచిలీపట్నం ఎంపీగా రమేశ్ సామర్థ్యం సరిపోదన్న రిపోర్టులు రావడంతో వైసీపీ పెద్దలు పునరాలోచన చేశారు. ఎంపీ అభ్యర్థిగా సరైన వ్యక్తి లేకపోతే ఆ ప్రభావం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై పడుతుందని భావించి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న చంద్రశేఖర్‌ను ఎంపీ అభ్యర్థిగా, రమేశ్‌ను తిరిగి అవనిగడ్డ నుంచే పోటీ చేయించేందుకు నిర్ణయించారు. ఈ పరిణామాలను జీర్ణించుకోవడానికి చంద్రశేఖర్‌కు సమయం ఇవ్వకుండా ఆయన పేరును ప్రకటించేశారు. దీంతో తాడోపేడో తేల్చుకునేందుకు చంద్రశేఖర్ సిద్ధమయ్యారు.

కలిసి రారు.. కలుపుకొని పోరు..

మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల సహకారం ఉంటేనే ఎంపీ అభ్యర్థి నెగ్గుకురాగలరు. కానీ, ఒకరిద్దరు మినహా పార్లమెంట్ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యే అభ్యర్థులందరూ చంద్రశేఖర్‌ను లైట్ తీసుకుంటున్నారు. కొందరు అభ్యర్థులు ఆయన్ను తమ నియోజకవర్గంలో పర్యటించమని కూడా కోరడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సోమవారం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా చంద్రశేఖర్ నామినేషన్ వేశారు. గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులెవరూ ఈ కార్యక్రమానికి రాలేదు. సాధారణంగా ఎంపీ అభ్యర్థి నామినేషన్ వేస్తున్నారంటే ఆ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులంతా హాజరవుతారు. భారీ ఎత్తున జనసమీకరణ చేస్తారు. కానీ, సోమవారం చంద్రశేఖర్ నామినేషన్ సమయంలో ఆ హడావిడి కనిపించలేదు. కేవలం అవనిగడ్డ నుంచి మాత్రమే ఆయన అభిమానులు తరలివచ్చారు. అభ్యర్థుల నుంచి సహాయ నిరాకరణ ఒక ఎత్తయితే, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి వైసీపీ నాయకుల నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోవడం మరో ఎత్తులా ఉందని చంద్రశేఖర్ సన్నిహితులు వాపోతున్నారు. ఫలానా గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బాలశౌరి గ్రామపెద్దలకు ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు ఇచ్చారని, మనం ఇవ్వకపోతే కేడర్ తిరిగే పరిస్థితి లేదని బెదిరింపులతో కూడిన హెచ్చరికలు రోజూ పదుల సంఖ్యలో వస్తున్నాయని సమాచారం. ప్రార్థనా మందిరాలకు ఆర్థికసాయం చేయాలని ఓ నాయకుడు.. గ్రామంలో యువకులకు క్రీడా పరికరాలు ఇవ్వాలని మరో నాయకుడు ఇలా రకరకాల ప్రతిపాదనలతో ఎంపీ కార్యాలయంలో వాలిపోతున్నారు. వీటన్నింటినీ జీర్ణించుకోవడం కష్టంగా ఉందని చంద్రశేఖర్ సన్నిహితులు పేర్కొన్నారు. ఇంకా రెండు వారాలకు పైగా ప్రచారం ఎలా నిర్వహిస్తారోనని వారు వ్యాఖ్యానించడం గమనార్హం.



పరిశ్రమల కోసం ఏర్పాటు చేసిన రోడ్లు

పరిశ్రమలెక్కడ..?

నందిగామలో పడకేసిన పారిశ్రామికాభివృద్ధి

వందల సంఖ్యలో పరిశ్రమలు, వేలమందికి ఉద్యోగాలు కల్పించే ఆశల సౌధం కళ్లముందే కుప్పకూలుతుంటే ఏ ప్రభుత్వమైనా చూస్తూ ఊరుకుంటుందా..? వైసీపీ ప్రభుత్వం చేసిందదే..! టీడీపీ అధినేత చంద్రబాబుపై పగతో ఆయన హయాంలో నందిగామలో చేపట్టిన పారిశ్రామికీకరణను సీఎం జగన్ కావాలనే కాలదన్నారు. ఫలితంగా ఏపీఐఐసీ టీడీపీ ప్రభుత్వం అందించిన 550 ఎకరాల భూములు, కల్పించిన మౌలిక సదుపాయాలన్నీ నేడు నిరుపయోగంగా మారి, పరిశ్రమలతో కళకళలాడాల్సిన ప్రాంతం కళావిహీనంగా మారింది.

- నందిగామ

- టీడీపీ హయాంలో 550 ఎకరాలు ఏపీఐఐసీకి అప్పగింత
- వందల సంఖ్యలో పరిశ్రమలు రావడానికి ఆసక్తి
- వేలాది మందికి ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యం
- వైసీపీ వచ్చాక అంతా వెనక్కి.
- కళావిహీనంగా మారిన నాటి పారిశ్రామిక ప్రాంతం

టీడీపీ హయాంలో శ్రీకారం

నందిగామ మండలం పెద్దవరం పంచాయతీ పరిధిలో కృష్ణానది ఒడ్డున కొండ పోరంబోకు భూమిని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సర్వే చేయించింది. సర్వే నెంబర్ 666, 667, 668లో మొత్తం 1,100 ఎకరాలను గుర్తించింది. సదరు భూమిని ఏపీఐఐసీకి అప్పగించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భూమిలో కొంతభాగం తమదంటూ కొందరు జమిందారీ వారసులు కోర్టుకు వెళ్లారు. కోర్టు పరిధిలో ఉన్న భూమి కాకుండా, మిగిలిన 550 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించింది. ఎకరం రూ.6 లక్షల చొప్పున ఏపీఐఐసీకి అప్పగించింది. సదరు సంస్థ భూమిని చదును చేసి, కొండరాళ్లను తొలగించి, మౌలిక వసతుల కల్పన చేపట్టింది. ఈ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం టీడీపీ ప్రభుత్వం అనేక రాయితీలు కూడా ప్రకటించింది. రోడ్లు వేసి, విద్యుత్ సరఫరాకు స్తంభాలను సిద్ధం చేసింది. ఒకవైపు కృష్ణానది, మరోవైపు అందమైన కొండల సమీపంలో ఉన్న ఈ భూములను పారిశ్రామికవేత్తలను ఆకర్షించాయి. పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించేందుకు దరఖాస్తులు కూడా అందాయి. అప్పటికే ఆ ప్రాంతంలో భారీ పరిశ్రమ స్థాపన కోసం సుజనా సంస్థ 300 ఎకరాల ప్రైవేటు భూమి కొనింది. సదరు భూమిలో టైటానియమ్ డయాక్సైడ్ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ పరిశ్రమపై ప్రభుత్వం చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కూడా సానుకూలంగా జరిగింది. అదే ప్రాంతంలో ప్రస్తుతం ఒక డిస్టిలరీ పరిశ్రమ నడుస్తుంది. మరో డిస్టిలరీ సంస్థ ఏర్పాటుకు కూడా ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయింది. పర్యావరణహితమైన అనేక పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున భూములు కొన్నారు. ఒక్కసారిగా ప్రభుత్వం మారడంతో పరిస్థితులు తారుమారయ్యాయి.

వైసీపీ వచ్చాక అస్తవ్యస్తం

చంద్రబాబు ప్రభుత్వం ముందుచూపుతో పరిశ్రమలను ప్రోత్సహించగా, వైసీపీ ప్రభుత్వం తన అధ్వాన విధానాలతో పారిశ్రామిక వ్యవస్థను భయపెట్టింది. ఫలితంగా ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు నిలిచిపోయింది. మరోవైపు కొవిడ్ సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించింది. ఎటువంటి ఇబ్బందులూ లేని విధానాన్ని అమలు చేసింది. ప్రజాభిప్రాయ సేకరణతో పనిలేకుండా పరిశ్రమ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో పారిశ్రామిక వేత్తలు నందిగామ, జగ్గయ్యపేట మండలాల పరిధిలో భూములు కొన్నారు. 30 మందికి పైగా బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు దరఖాస్తు చేసినట్లు తెలిసింది. కానీ, పారిశ్రామిక వేత్తలపై వైసీపీ పాలకులు వ్యవహరిస్తున్న తీరుతో వారంతా వెనక్కి తగ్గారు. ఫలితంగా పారిశ్రామికీకరణ నిలిచిపోయి యువతకు ఉపాధి లేకుండాపోయింది.

ఉపాధి కరువు

పెద్దవరం గ్రామంలో ఒక డిస్టిలరీ పరిశ్రమ నడుస్తోంది. ఆ పరిశ్రమ ఏర్పాటు జరిగాక ఈ పంచాయతీ పరిధిలో సుమారు 500 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించింది. ఈ ప్రాంత రైతులు పండిస్తున్న మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర అందింది. ఆ ప్రాంతంలో పరిశ్రమ యాజమాన్యం సామాజిక కార్యక్రమాలు కూడా చేపడుతోంది. ఒక పరిశ్రమకే రెండు గ్రామాలకు మేలు జరిగితే, వంద పరిశ్రమలు వస్తే ఇంకెంత అభివృద్ధి జరుగుతుందోనని స్థానికులు ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

విషాదం

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 22 : రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతిచెందిన విషాదకర ఘటన సోమవారం నవాబుపేటలో జరిగింది. ఎస్‌ఐ పి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. చందర్లపాడు మండలం కోనాయిపాలెం గ్రామానికి చెందిన వనపర్తి సురేశ్ (42), తన తల్లి ఆదిలక్ష్మి (73), భార్య అంజమ్మ, కూతురు లాస్యను తీసుకుని తన బైకుపై వత్సవాయి మండలంలోని మంగొల్లు గ్రామంలో మృతిచెందిన మామగారిని చూసేందుకు బయల్దేరారు. నవాబుపేట వద్దకు రాగానే, ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు వేగంగా వచ్చి వీరి బైకును ఢీకొంది. దీంతో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. మిగతా ముగ్గురిని అంబులెన్సులో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, సురేశ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతులు వనపర్తి ఆదిలక్ష్మి, సురేశ్



మైలవరంలో ఆర్వోకు నామినేషన్ పత్రాలు ఇస్తున్న వసంత



ఆర్డీవోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సౌమ్య



నామినేషన్ పత్రాలు ఇస్తున్న బుద్ధప్రసాద్



నామినేషన్ పత్రాలు ఇస్తున్న గద్దె రామ్మోహన్



నామినేషన్ పత్రాలు ఇస్తున్న కొలికపూడి శ్రీనివాసరావు

పొలిటికల్ హీట్



నామినేషన్ వేసేందుకు ఇబ్రహీంపట్నం వద్ద ర్యాలీగా వెళుతున్న మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత

- రెండు జిల్లాల్లో రికార్డ్ బ్రేక్ నామినేషన్లు
- ఎన్టీఆర్ జిల్లాలో గరిష్టంగా 38, కృష్ణాలో 31 దాఖలు
- రిజిస్టర్డ్ పార్టీల తరపున కొనసాగుతున్న నామినేషన్లు
- స్వతంత్ర అభ్యర్థులుగా భారీ సంఖ్యలో
- ర్యాలీలు, ప్రదర్శనలతో హోరెత్తిన రహదారులు

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎన్నికల వేడి రాజుకుంటేంది.. ఇప్పటి వరకు మందకొడిగా ఉన్న అభ్యర్థుల ప్రచారం నామినేషన్ల ఘట్టంతో గ్రామాల్లో, పట్టణాల్లో 'పొలిటికల్ హీట్' పుట్టిస్తోంది. మండే ఎండలను సైతం లెక్కచేయక పార్టీల అభ్యర్థులు ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు తమ నేతలపై పూల వానలు కురిపిస్తూ.. గజమాలలతో స్వాగతిస్తూ.. రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల సమరంలో విజయ సంకేతాలిస్తూ భరోసా కల్పిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా నామినేషన్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. సోమవారం నాలుగో రోజున రికార్డుస్థాయిలో 38 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 32 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరపున అత్యధికంగా నామినేషన్లు పడ్డాయి. అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ తరపున మొత్తం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు నామినేషన్లు, అసెంబ్లీ నియోజకవర్గాల తరపున నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ల జోష్..

ప్రధాన పార్టీల అభ్యర్థులనుంచి రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు రంగంలోకి దిగుతున్నారు. ఈసారి ప్రతి నియోజకవర్గానికి రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పురుషులు, మహిళలు పెద్దసంఖ్యలో నామినేషన్లు వేస్తున్నారు. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలలో చైతన్యం.. స్వతంత్ర అభ్యర్థుల పోటీ.. రాజకీయాల్లో మార్పులకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

● విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఆరు నామినేషన్లు పడ్డాయి. వైఎస్సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత ఒక సెట్ నామినేషన్‌ను ఆర్వో, కలెక్టర్ ఢిల్లీరావుకు సమర్పించారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సయ్యద్ కరిముస్నీసా, ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అభ్యర్థిగా ఎన్.దశరథరామిరెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా సీహెచ్ గంగాధర గాంధీ, స్వతంత్ర అభ్యర్థిగా డి.మల్లిఖార్జునరావు నామినేషన్ దాఖలు చేశారు.

● విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ తరపున రేష్మ మహమూద్ నామినేషన్ దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మోహన్ డి.ప్రసాద్, బహుజన సమాజ్ వాదీ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థిగా మద్దిరాల వినోద్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా శ్రీరామ్ నాగమల్లేశ్వరరావు, ఈట్ల భవాని పొప్పూరి అశోక్‌లు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ తరపున వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కె.శివశంకర్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా శ్రీధర దక్షిణామూర్తి, ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి అభ్యర్థిగా జి.ఫణిరాజ్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎం.ప్రశాంత్ కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా బొప్పన రాఘవేంద్రరావు, డి.సుభాషిణిలు ఒక్క సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గద్దె రామమోహన్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణి గద్దె అనూరాధ నామినేషన్ వేశారు. వైసీపీ తరపున కోగంటి సుధీర రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. స్టూడెంట్ యునైటెడ్ ఫర్ నేషన్ అభ్యర్థిగా జి.వెంకట రెడ్డి, తెలుగు రాజాధికార సమితి పార్టీ అభ్యర్థిగా వై.వినయ్‌కుమార్, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థిగా జె.అనీల్ కుమార్‌లు ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● మైలవరం నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరపున వసంత క్రిష్ణ ప్రసాద్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. వసంత శిరీష ఒక సెట్టు, వేములపల్లి పృథ్వీ ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సీ) అభ్యర్థులుగా బొర్రా కిరణ్, అక్కల నాగేంద్ర ప్రసాద్‌లు ఒక్కో సెట్ నామినేషన్ వేశారు.

నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తంగిరాల సౌమ్య ఒక సెట్టు నామినేషన్‌ను దాఖలు చేశారు.

● తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు ఒక సెట్టు, జనవాహిని పార్టీ అభ్యర్థిగా బి.నాగరాజు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ తరపున సామినేని విమల, స్వతంత్ర అభ్యర్థులుగా జెఅహరోన్, ఎం.ఫ్రాన్సిస్, ఐ.వెంకటేశ్వర్లు ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా కె.మధు నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు.

కృష్ణా జిల్లాలో 31 నామినేషన్లు దాఖలు

మచిలీపట్నం, ఏప్రిల్ 22 : కృష్ణాజిల్లాలో నాల్గవ రోజైన సోమవారం 31 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు వైసీపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర రావు నామినేషన్ దాఖలు చేశారు. పార్లమెంటు నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గూడవల్లి వెంకట కేదారేశ్వర రావు, బహుజన సమాజ్ పార్టీ తరపున దేవరపల్లి దేవమణి నామినేషన్ దాఖలు చేశారు. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా కలపర్తి భాస్కర రావు, స్వతంత్ర అభ్యర్థిగా కర్రిపోలు శ్రీనివాసరావు నామినేషన్ను దాఖలు చేశారు. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), వైసీపీ అభ్యర్థిగా కొడాలి నాగేశ్వరరావు(చిన్ని)లు రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా నల్లగంచు వెంకట రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా రేమల్లి నీలకాంత్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా అల్లూరి హేమంత్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్, కాగిత శిరీషలు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా రాజులపాటి జమదగ్ని, సేనాపతి గోపిలు, కాంగ్రెస్ పార్టీ తరపున శొంఠి నాగరాజు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఈడే కాశీ విశ్వేశ్వరరావులు నామినేషన్లు దాఖలు చేశారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా పేర్ని వాకసాయి కృష్ణమూర్తి(కిట్టు), బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సొదాడ బాలాజీ, స్వతంత్ర అభ్యర్థిగా చింతపల్లి మనోహర్, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా కోన నాగార్జునలు నామినేషన్లు దాఖలు చేశారు. అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పామర్రు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్, కైలే జ్ఞానమణి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా రాయవరపు బాబూ రాజేంద్రప్రసాద్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. పెనమలూరు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థులుగా పచ్చిపాల కనక దుర్గారావు, గోగం రాము, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సోము మహేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు.



లక్ష్మీపురంలో సీజ్ చేసిన ట్రాక్టర్లతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది

మట్టి అక్రమ రవాణాకు బ్రేక్

- నాలుగు ట్రాక్టర్లు సీజ్, జరిమానా

కృత్తివెన్ను, ఏప్రిల్ 22 : మండలంలో మట్టి అక్రమ రవాణాకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. కొంతకాలంగా యథేచ్ఛగా సాగుతున్న అక్రమ తోలకాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'తోలుకో.. తవ్వుకో..' కథనానికి రెవెన్యూ ఉన్నతాధికారులు, పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి స్పందించారు. తక్షణమే మట్టి తోలకాలను నిలుపుదల చేసి, పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ట్రాక్టర్లు సీజ్ చేసి, జరిమానాలు విధించారు. అనుమతి లేకుండా తోలకాలు జరిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండల పరిధిలోని జాతీయ రహదారి పొడవున వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి, మెరక పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులు, అధికార పార్టీ నేతల అండతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ విచ్చలవిడి మట్టి మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులతో పాటు పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకట రమణ స్పందించారు. తక్షణమే మట్టి తోలకాలపై పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాలని ఆదేశించారు. నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు 1500 చొప్పున రూ.6 వేలు జరిమాన విధించారు. అనుమతి లేకుండా మట్టి తోలకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

పోలింగ్ విధులకు అంగన్వాడీ వర్కర్లు!

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదన
- పోలింగ్ విధులకు 2319 మందికి పైగా సిబ్బంది కొరత
- అదర్ పోలింగ్ సిబ్బంది(ఓపీ)గా అనుమతించిన ఈసీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో యంత్రాంగం సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. దీనిని అధిగమించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అంగన్వాడీలను వినియోగించాలని నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి 23 వేల పైచిలుకు ఉద్యోగ సైన్యం అవసరం కాగా.. ఒక్క పోలింగ్ విధులకే సుమారుగా 13 వేల మంది ఉద్యోగుల సేవలు అవసరమౌతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ విధులకు 13414 మంది ఉద్యోగులు అవసరం కాగా.. 11095 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. పురుషులు 6186, మహిళలు 4909 మంది ఉన్నారు. ఇంకా 2319 మందికి పైగా సిబ్బంది అవసరం ఉంది.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1874 పోలింగ్ కేంద్రాలలో విధులకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులుగా 1874 మంది, ఫస్ట్ పోలింగ్ ఆఫీసర్లుగా 1874 మంది, సెకండ్ పోలింగ్ ఆఫీసర్లుగా 1874, థర్డ్ పోలింగ్ ఆఫీసర్లుగా 1874, ఫోర్త్ పోలింగ్ ఆఫీసర్లుగా 1874 మంది, మహిళల పోలింగ్ అధికారులుగా 1874 మంది, రిజర్వు ప్రిసైడింగ్ అధికారులు (20%)గా 374 మంది, రిజర్వు అదర్ పోలింగ్ స్టాఫ్(20%) 1874 మంది చొప్పున సిబ్బంది అవసరమౌతున్నారు. అందుబాటులో 13414 మంది మాత్రమే ఉండగా.. వీరిలో గ్రూప్-బి ఉద్యోగులు 2310 మంది, గ్రూప్-సి ఉద్యోగులు 8785 మంది ఉన్నారు. ఫైనాన్స్, ట్రెజరీ, బ్యాంక్ సర్వీసు ఉద్యోగులు 910 మందిని తీసుకున్నప్పటికీ సిబ్బంది కొరత ఏర్పడింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు ఇటీవల లేఖ రాశారు. సుమారు రెండు వేలమంది పైచిలుకు అంగన్వాడీలను ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల విధులకు ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి తాజాగా ప్రతిపాదించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదించటంతో అదర్ పోలింగ్ ఆఫీసర్లు (ఓపీ)గా అంగన్వాడీ సిబ్బంది పనిచేయనున్నారు.

ఐదు వేలకు పైగా పోలీసు సిబ్బంది కొరత

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే మొత్తంగా 7200 మంది పోలీసు సిబ్బంది అవసరమని గుర్తించారు. అందుబాటులో 2680 మంది మాత్రమే ఉన్నారు.దాదాపుగా ఐదు వేలమంది సిబ్బంది అవసరం ఉంది. ఇప్పటికే ఐదు కంపెనీల పోలీసు బలగాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు వచ్చాయి. ఇవి జిల్లా చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్నాయి. నామినేషన్ల ఘట్టం ముగిసే నాటికి పోలీసు సిబ్బంది సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

సతీష్‌ను ఇంకా విచారించాలి

- ఏడు రోజులు కస్టడీకి ఇవ్వండి
- గులకరాయి కేసులో పిటిషన్ దాఖలు చేసిన పోలీసులు

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్‌పై రాయి దాడి కేసులో ప్రధాన నిందితుడు వేముల సతీష్ కుమార్‌ను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విజయవాడలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో సోమవారం ఈ పిటిషన్‌ను సమర్పించారు. సతీష్ నుంచి మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అతడిని ఏడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. న్యాయాధికారి సి.రమణారెడ్డి దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని సతీష్ తరపున న్యాయవాది అబ్దుస్ సలీంను ఆదేశించారు. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

సీఆర్పీసీ 164పై 29కి వాయిదా

వేముల సతీష్‌కుమార్ నుంచి సీఆర్పీసీలోని 164 ప్రకారం వాంగ్మూలం ఇప్పించాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కోర్టు ఈనెల 29వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం దీనిపై విచారణ జరిగింది. పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయవాది సలీం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితుడి నుంచి వాంగ్మూలం తీసుకున్నారని స్పష్టం చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు సలీంను ఆదేశించింది.

అట్టహాసంగా నామినేషన్లు..

నీరాజనాలు.. గజమాలలతో ఘన స్వాగతాలు

మైలవరం/ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 22 : బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అశేష జనసందోహం మధ్య అట్టహాసంగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఐతవరం నుంచి ఉదయం బయలు దేరి పరిటాల అభయాంజనేస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లిన ఆయనకు మూలపాడు, జూపూడి, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు వై.జంక్షన్ వద్ద అపూర్వ స్వాగతాలు లభించాయి. దొనబండలో మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ), మూలపాడులో గరికపాటి శ్రీనివాసరావు, కాకి నాగరాజుల ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ర్యాలీలో విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బీజేపీ నేత నూతులపాటి బాలకోటేశ్వరరావు, జనసేన నేత అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ)లు పాల్గొన్నారు.

వసంతను అడ్డుకున్న పోలీసులు

నామినేషన్‌కు ముహూర్త సమయం మించిపోతుండటంతో మైలవరం ఎల్బీఆర్సీఈ రింగ్ నుంచి ఆయన కార్యకర్త మోటార్ బైక్‌పై ఆర్వో కార్యాలయానికి వెళుతుండగా రహదారిపై విధుల్లో ఉన్న పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఎట్టకేలకు 11.55 గంటలకు ఆయన భార్య శిరీష, కుమారుడు ధీమంత్ సాయితో కలిసి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, కె.విజయబాబు, ఉయ్యూరు వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. వసంత నామినేషన్‌కు అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ క్యాడర్‌తో పాటు జనం కూడా తరలిరావడంతో ఎన్.హెచ్ 30 ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లతో కిక్కిరిసిపోయింది. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావడంతో మైలవరం పసుపుమయమైంది.

నందిగామలో సౌమ్య నామినేషన్..

నందిగామ : ఉవ్వెత్తున ఎగసిన జనతరంగం, కూటమి బలం, ప్రజాభిమానం నడుమ తంగిరాల సౌమ్య నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నందిగామ టీడీపీ కూటమి అభ్యర్థిగా సౌమ్య సోమవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆమెకు మత పెద్దలు సర్వమత ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. అనంతరం తండ్రి తంగిరాల ప్రభాకరరావు ఘాట్ వద్ద ఆమె నివాళులర్పించారు. రైతుపేట పార్టీ కార్యాలయం నుంచి ఆమె ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరవడంతో పట్టణం కిటకిటలాడింది. ఎండ, ఉక్కపోతను సైతం లెక్క చేయకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక వాహనంపై ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జనసేన కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవిలతో కలిసి ర్యాలీగా బయలు దేరగా.. అభిమానులు అడుగడుగునా పూలవర్షం కురిపించారు. రైతుపేటలో టీడీపీ నాయకుడు మాగంటి పూర్ణచంద్రరావు భారీ బత్తాయి దండను సౌమ్యకు వేసి అభిమానం చాటుకున్నాడు. ముహూర్త సమయానికి ఆమె ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబు ఆమెను ప్రతిపాదించారు. సీనియర్ న్యాయవాది యర్రంరెడ్డి బాబూరావు, బీజేపీ నేత తొర్లికొండ సీతారామయ్య, జనసేన నియోజకవర్గ కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవిల సమక్షంలో ఆమె ఆర్డీవో రవీంద్రరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సౌమ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు, బీజేపీ, జనసేన పార్టీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



భారీ బత్తాయిల దండతో సౌమ్యకు ఘన స్వాగతం

టీడీపీలో చేరిన ముస్లిం మైనారిటీ కార్యకర్తలు



మచిలీపట్నం టౌన్ : బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర సోమవారం రాత్రి 28వ డివిజన్‌లో పర్యటించారు. 70 మంది ముస్లిం మైనారిటీ యువకులు టీడీపీలో చేరారు. మచిలీపట్నం డివిజన్ ఇన్‌చార్జి బాజానీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మిస్టరీగా కాంగ్రెస్ నేత అదృశ్యం

- రెండు రాష్ట్రాల పోలీసులకు సవాల్
- ప్రత్యేక బృందాలతో పరిశోధన
- గుర్తు తెలియని మృతదేహాలపై దృష్టి
- డ్రోన్‌తో అటవీ ప్రాంతంలో అన్వేషణ
- పలువురు అనుమానితుల విచారణ

జగ్గయ్యపేట, ఏప్రిల్ 22 : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అదృశ్యమైన తెలంగాణా రాష్ట్ర సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య కేసు రెండు రాష్ట్రాల పోలీసులకు సవాల్‌గా మారింది. ఈనెల 18న సూర్యాపేట నుంచి ఒక కేసులో మధ్యవర్తిత్వం కోసం జగ్గయ్యపేట వచ్చిన వడ్డె ఎల్లయ్య (55)ను శ్రీనివాస్ అనే వ్యక్తి డబ్బులు ఇస్తానని తీసుకెళ్లినప్పటి నుంచి కనిపించకపోవటం, అతడిని మధ్యవర్తిత్వానికి తీసుకువచ్చిన అపర్ణ అనే మహిళా తర్వాత కనిపించకపోవటం, వారి ముగ్గురు ఫోన్‌లు స్విచ్ఛాఫ్ కావటం తెలిసిందే. కేసులో జగ్గయ్యపేట, సూర్యాపేట పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. మొదట ఆరు ప్రత్యేక బృందాలు వేయగా ఇప్పుడు 9కి పెంచారు. జగ్గయ్యపేట అటవీ ప్రాంతాల్లోను డ్రోన్ కెమెరాలతో గాలిస్తున్నారు. ఎక్కడా వారి ఆచూకీ దొరకలేదు. జగ్గయ్యపేటలో చిల్లకల్లు రోడ్డులో వారు మాట్లాడుకునేందుకు కూర్చున్న ప్రాంతంలో ఆధారాలు సేకరించారు. అపర్ణ అనే మహిళ చేసిన ఫోన్ నెంబర్ నుంచి కాల్‌డేటాను విశ్లేషిస్తున్నారు. అదేవిధంగా అపర్ణను ఎల్లయ్య వద్దకు పంపిన, పరిచయం ఉన్న వ్యక్తులను, అనుమానితులను విచారిస్తున్నారు. సంఘటన జరిగి మూడురోజులు దాటటంతో రెండు రాష్ట్రాల్లో గుర్తు తెలియని మృతదేహాలపై దృష్టి సారించారు. జిల్లాలో దొరికిన మృతదేహాలను గుర్తించే పనిలో ఉన్నారు. నిందితులు తెలివిగా టెక్నాలజీకి సైతం అందకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. కోసం ఎక్కడ ఆనవాళ్లు దొరకకుండా కొత్త సిమ్‌లు వాడినట్టు తెలుస్తున్నది. ఎల్లయ్యపై అనేక కేసులు ఉండటం, ప్రత్యర్థులు, శత్రువుల నుంచి ప్రమాదం పొంచి ఉండటంతో అనేక కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని మృతదేహాల్లో ఆచూకి దొరికితే కేసులు చిక్కుముడి వీడే అవకాశం ఉంది. హైదరాబాద్ నుంచి సూర్యాపేట, జగ్గయ్యపేట దాకా విస్తరించిన అదృశ్యం కేసు రెండు రాష్ట్రాల పోలీసులకు తలనొప్పిగా మారింది. తెలంగాణాలో అధికార పార్టీ నేత కావటంతో పోలీసులకు ప్రతిష్టాత్మకంగా మారింది.

మీకెందుకు వేయాలి ఓటు!

- ఉద్యోగాల్లేవు.. ఏమీ లేవు!
- డిగ్రీ చదివి వలంటీరు ఉద్యోగం చేయాలా
- ఉదయభానును నిలదీసిన యువతి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి సామినేని ఉదయభానుకు ప్రచారంలో నిలదీతలు ఎదురవుతున్నాయి. ఆదివారం సాయంత్రం చిల్లకల్లు ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఉదయభానుకు ఓ యువతి నుంచి చేదు అనుభవం ఎదురైంది. ఇంటింటి ప్రచారం చేస్తున్న ఆయన ఓ యువతిని ఓటు అభ్యర్థించగా ఆమె ఆయన్ను.. 'మీకు దేనికేయాలి సార్ ఓటు అని ప్రశ్నించింది.. తాను డిగ్రీ చదివి, కుటుంబ పోషణకు ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశానని, మీ ఆఫీసు వద్దకు కూడా చాలాసార్లు వచ్చి విన్నవించుకున్నానని.. కానీ ఉద్యోగం రాలేదని ఆవేదన వ్యక్తం చేసింది.' ఈ ఘటనతో ఖంగుతిన్న అయన వలంటీర్ ఉద్యోగాలు ఉన్నాయిగా అని సమాధానం చెప్పే ప్రయత్నం చేయగా, డిగ్రీ చదువుకున్న నేను వలంటీర్ ఉద్యోగం చేయాలా? అని ఎదురు ప్రశ్నించింది. అందుకు ఉదయభాను అసహనం వ్యక్తం చేస్తూ ఇప్పుడేం చేయమంటావ్.. ఏంకావాలి నీకు.. అని యువతిని అడగ్గా అసలేం చేశారు.. మీరు అని మళ్లీ ప్రశ్నించడంతో ఆయన ఏం చేయలేదులే అంటూ ముందుకు కదిలారు. ఈ వ్యవహారాన్ని అక్కడి వారు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా ఉదయభాను పక్కన ఉన్న అనుచరులు వీడియో తీస్తున్న వారిని వీడియో ఆపాలంటూ ఆ ఫోనును లాక్కునే ప్రయత్నం చేశారు.



ఓటు ఆశ.. కేసేయ్ దోశ..!

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి సోమవారం 52వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)తో కలిసి ప్రచారం నిర్వహించారు. కోమలవిలాస్ సెంటర్, చేపల మార్కెట్, శ్రీనివాస మహల్, కొండ ప్రాంతాల్లో పర్యటించారు. కూరగాయల వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అల్పాహార బండి వద్ద దోశలు వేసి ఓట్లు అభ్యర్థించారు.

– వన్‌టౌన్





గుడ్లవల్లేరులో మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్

గుడ్లవల్లేరులో మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్‌ను ఆర్డీవో పద్మావతి సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో మూడు మోడల్ పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామని అందులో భాగంగా గుడ్లవల్లేరు మండలంలో 187/72ను పింక్ పోలింగ్ స్టేషన్ (మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్)గా ఏర్పాటు చేశామన్నారు. 2019 ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ జరిగిందని, ఈసారి 90 శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగేట్టు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

– గుడ్లవల్లేరు



ఊరంతా కదిలొచ్చింది..!

కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య నామినేషన్‌కు ఊరంతా కదలింది. సోమవారం సౌమ్య నామినేషన్ సందర్భంగా పట్టణ శివారు హనుమంతుపాలెం కదలి వచ్చింది. ప్రతి ఇంటి నుంచీ యువకులు, మహిళలతో పాటు వృద్ధులు సైతం నందిగామకు తరలివచ్చారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా తరలివచ్చి సౌమ్యకు మద్దతు తెలిపారు. ఊరంతా కలిసికట్టుగా సౌమ్య కోసం తరలిరావడంపై దేశం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – నందిగామ

జన చేతనం



రాజకీయ ఉద్దండులకు నెలవైన నందిగామ నియోజకవర్గం జిల్లాలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడి నుంచి ఎన్నికైన వసంత నాగేశ్వరరావు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, దేవినేని వెంకట రమణ మంత్రులుగా పనిచేశారు. ఈ నియోజకవర్గంలో కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాలు, నందిగామ మున్సిపాలిటీ సహా మండలంలో సగం గ్రామాలున్నాయి. ఉప ఎన్నికతో కలుపుకుని ఈ నియోజకవర్గంలో 1955 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా, సీపీఐ రెండు సార్లు, కాంగ్రెస్ పార్టీ మూడు సార్లు, జనతా పార్టీ ఒకసారి, వైసీపీ ఒకసారి గెలుపొందగా, టీడీపీ మాత్రం ఎనిమిది సార్లు విజయం సాధించింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత కేవలం 1989, 2019లో మాత్రమే ఓడిపోయింది.



తంగిరాల సౌమ్య

మొండితోక జగన్మోహనరావు




నియోజకవర్గ చరిత్ర

ప్రస్తుతం నందిగామ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న కంచికచర్ల ప్రారంభంలో అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. 1952లో కంచికచర్ల, జగ్గయ్యపేట నియోజకవర్గాలుండేవి. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో రెండు చోట్ల ఓటర్లు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టారు. కంచికచర్ల నుంచి వి.రామారావు, జగ్గయ్యపేట నుంచి పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గెలుపొందారు. 1955లో నందిగామ నియోజకవర్గం ఏర్పడింది. జగ్గయ్యపేట నియోజకవర్గం లేదు. కంచికచర్ల, నందిగామ నియోజకవర్గాలుగా ఉన్నాయి. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో కంచికచర్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మాగంటి రామయ్య, నందిగామ నుంచి కమ్యూనిస్టు అభ్యర్థి పిల్లలమర్రి వెంకటేశ్వర్లు విజయం సాధించారు. 1962 తరువాత కంచికచర్ల నియోజకవర్గం కనుమరుగై జగ్గయ్యపేట ఏర్పడింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో పిల్లలమర్రి మరోసారి విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వసంత నాగేశ్వరరావు నియోజకవర్గంపై తనదైన ముద్ర వేశారు. 1972లో కాంగ్రెస్ నుంచి గెలుపొందగా, తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తరువాత 1983, 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలుపొందారు. మొత్తంగా మూడుసార్లు విజేతగా నిలిచి మంత్రి పదవి చేపట్టారు. ముక్కపాటి వెంకటేశ్వరావు, దేవినేని ఉమా, తంగిరాల ప్రభాకరరావు రెండుసార్లు విజేతలుగా నిలవగా, అడుపుమల్లి సూర్యనారాయణ (1967), దేవినేని వెంకట రమణ (1994), తంగిరాల సౌమ్య (2014), డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు (2019) ఒకసారి చొప్పున గెలుపొందారు. ఇందులో 2009లో దేవినేని ఉమా నియోజకవర్గం మారి మైలవరం నుంచి పోటీ చేసి మంత్రి పదవి చేపట్టారు.

టీడీపీ కంచుకోటలో.. పాగా ఎవరిదో..

- నియోజకవర్గం ఏర్పడ్డాక 8 సార్లు గెలుపొందిన టీడీపీ
- ప్రస్తుత ఎన్నికల బరిలో పాతకాపులే..!

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో మరోసారి పాత కాపులే తలపడుతున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంఎల్‌ఏ తంగిరాల సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా ఎంఎల్‌ఏ డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పేర్లు ఖరారయ్యాయి. మొదటిసారి విజయం సాధించిన సౌమ్య రెండోసారి ఓడిపోయారు. మొదటిసారి ఓడిపోయిన మొండితోక రెండోసారి గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తంగిరాల ప్రభాకరరావు, వైసీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్మోహనరావుపై విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో మొత్తం 1,84,061 ఓట్లకుగాను 1,56,260 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లతో కల్పి తంగిరాలకు 78,721 ఓట్లు రాగా, మొండితోకకు 73,509 ఓట్లు వచ్చాయి. తంగిరాలకు 5,212 ఓట్ల మెజార్టీ వచ్చింది. ప్రమాణ స్వీకారం చేయకముందే ప్రభాకరరావు ఆకస్మికంగా మృతిచెందటంతో ఆ ఏడాది సెప్టెంబరులో జరిగిన ఉప ఎన్నికలో తంగిరాల కుమార్తె సౌమ్య భారీ మెజార్టీతో విజయం సాధించారు. అయితే ఉప ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయలేదు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బోడపాటి బాబూరావుకు 24,921 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యకు 99,748 ఓట్లు వచ్చాయి. రికార్డు స్థాయిలో 74,827 ఓట్ల ఆధిక్యతతో ఆమె గెలుపొందారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా మొండితోక పోటీ చేశారు. జగన్మోహనరావుకు 87,493



వ్యవసాయమే ప్రధానాధారం

ఈ నియోజకవర్గానికి వ్యవసాయమే ప్రధానం. కృష్ణా, మునేరు, వైరా ఏరు, కట్లేరు ప్రవహిస్తున్నప్పటికీ తాగు, సాగునీటికి ఇంకా ఇబ్బందులు తప్పటం లేదు. వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఎత్తిపోతల పథకాల ద్వారా కొద్దిపాటి భూములకు మాత్రమే సాగు నీరందుతోంది. సాగర్ కాల్వలున్నప్పటికీ ఉపయోగం లేదు. పారిశ్రామికంగా చెప్పుకోదగ్గ అభివృద్ధి లేదు. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలని ఎప్పటి నుంచో రైతులు డిమాండ్ చేస్తున్నా ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. ఇసుక, మెటల్ (కాంక్రీటుకు వినియోగించే కంకర) ఎక్కువగా దోపిడీకి గురవుతున్నాయి తప్పితే స్థానిక సంస్థలకు రావల్సినంత ఆదాయం రావటం లేదు.

నందిగామ విజేతలు వీరే :

సం..	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1955	పిల్లలమర్రి వెంకటేశ్వర్లు	సీపీఐ	కొఠారు వెంకటేశ్వర్లు	కాంగ్రెస్	218
1962	పిల్లలమర్రి వెంకటేశ్వర్లు	సీపీఐ	బండి తిరుపతయ్య	కాంగ్రెస్	1,723
1967	అడుపుమల్లి సూర్యనారాయణ	కాంగ్రెస్	పాటిబండ్ల కోదండరామయ్య	సీపీఐ	7,731
1972	వసంత నాగేశ్వరరావు	కాంగ్రెస్	వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్	స్వతంత్ర	161
1978	ముక్కపాటి వెంకటేశ్వరరావు	జనతా	గుదే మధుసూదనరావు	కాంగ్రెస్-ఐ	7,728
1983	వసంత నాగేశ్వరరావు	టీడీపీ	ముక్కపాటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	10,498
1985	వసంత నాగేశ్వరరావు	టీడీపీ	బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి	కాంగ్రెస్	1,938
1989	ముక్కపాటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	మల్లెల పుల్లయ్యబాబు	టీడీపీ	2,004
1994	దేవినేని వెంకట రమణ	టీడీపీ	బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి	కాంగ్రెస్	10,251
1999	దేవినేని ఉమామహేశ్వరరావు	టీడీపీ	వసంత కృష్ణ ప్రసాద్	కాంగ్రెస్	23,511
2004	దేవినేని ఉమామహేశ్వరరావు	టీడీపీ	వసంత నాగేశ్వరరావు	కాంగ్రెస్	4,285
2009	తంగిరాల ప్రభాకరరావు	టీడీపీ	వేల్పుల పరమేశ్వరరావు	కాంగ్రెస్	5,215
2014	తంగిరాల ప్రభాకరరావు	టీడీపీ	డాక్టర్ మొండితోక జగన్మోహనరావు	వైసీపీ	6,074
(ప్రమాణ స్వీకారం కూడా చేయక ముందే ప్రభాకరరావు మృతిచెందారు. దీంతో ఉప ఎన్నిక జరిగింది)					
2014	తంగిరాల సౌమ్య	టీడీపీ	బోడపాటి బాబూరావు	కాంగ్రెస్	74,827
(ఈ ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయలేదు)					
2019	డాక్టర్ జగన్మోహనరావు	వైసీపీ	తంగిరాల సౌమ్య	టీడీపీ	10,881



మొండిగోడలతో వెక్కిరిస్తున్న షాదీఖానా

- ఉత్తుత్తి హామీలతో ముస్లింలను మోసం చేసిన గుడివాడ ఎమ్మెల్యే
- షాదీఖానా హామీ తూచ్..!
- వదిలేసిన.. కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- ఈద్గా నిర్మాణం ఊసే లేదు..
- వక్ఫ్ ఆస్తులపై కన్ను
- ఐదేళ్ల పాలన తీరిదీ..

మాటల్లో.. కోతలు.. చేతల్లో.. చుక్కలు!

నా మైనార్టీలన్నారు. మోసం చేసి గెలిచారు!
ముస్లిం సోదరులకు ఈద్గా ఏర్పాటు చేస్తామన్నారు.
అధికారం వచ్చాక ఆ ఊసే వదిలేశారు!
మైనార్టీల అభివృద్ధి బాధ్యత నాదేనన్నారు.
గెలిచాక ముఖం చాటేశారు!
షాదీఖానా నిర్మిస్తానన్నారు!
ఐదేళ్లుగా మొండిగోడలే మిగిల్చారు!
అంతేనా.. నిర్మించిన మసీదులకు మళ్లీ బిల్లులు చేసి నిధులు మింగేశారు!
ఈ ఘనకీర్తి ఎవరిదో.. ఈ ఘనాపాటి ఎవరో ఈపాటికే అర్థమై ఉంటుంది కదా! అవును.. ఆయనే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని!



గుడివాడ : మైనార్టీలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తానని గత ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని హామీ ఇచ్చారు. ఆయన మాటను నమ్మి నియోజకవర్గంలోని ముస్లిం ఓటర్లు గంపగుత్తగా వైసీపీని గెలిపించారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు నీటమూటలయ్యాయి.

● జగన్ రివర్స్ దెబ్బకు షాదీఖానా బలి

స్థానిక పాత బైపాస్ రోడ్డులో షాదీఖానా పునఃనిర్మాణానికి గత ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.96 లక్షలు మంజూరు చేశారు. పని ప్రారంభించి 30 శాతం పనులు పూర్తి చేశారు. ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. రివర్స్ టెండరింగ్ దెబ్బకు షాదీఖానా బలైంది. స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని ఒత్తిడి మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు 25 శాతం పనులు కూడా పూర్తికాలేదని తప్పుడు నివేదికను సమర్పించి నిర్మాణ పనులు నిలుపుదల చేయించారు. నేటికీ మొండిగోడలు మిగిలేలా చేశారు.

● అనుయాయులకు కాంట్రాక్టు రాలేదనే అక్కసుతో..

పట్టణంలోని బేతవోలులో 3.25 ఎకరాల విస్తీర్ణంలోని ముస్లిం శ్మశానవాటికకు పడమర వైపున గోడను నిర్మించేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.34.70 లక్షలు మంజూరయ్యాయి. జనసేన జిల్లా నాయకుడు పొలంకి సారథిబాబుకు కాంట్రాక్టు దక్కిందనే అక్కసుతో నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాని, వైసీపీ నాయకులు నిలుపుదల చేశారు. స్థానిక ఎమ్మెల్యే నానీని కాదని పనులను ప్రారంభించడం కుదరదని మున్సిపల్ అధికారులు తెల్చి చెప్పేశారు. తాము సూచించిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని హుకుం జారీ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఎమ్మెల్యే నాని చేతులెత్తేశారు.

అసంపూర్తిగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం

వార్డుల్లోని పేదలు చిన్నపాటి ఫంక్షన్‌లు చేసుకోవాలనే తలంపుతో టీడీపీ ప్రభుత్వం పట్టణంలోని ముస్లిం నివాసిత ప్రాంతాల్లో రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. స్థానిక యానాది కాలనీలోని కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తవ్వగా, 11వ వార్డులోని కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. ఇంతలో వైసీపీ అధికారంలోకొచ్చింది. ఆ వెంటనే యానాదికాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను సచివాలయంగా మార్చేశారు. 11వ వార్డులోని కమ్యూనిటీ హాల్ 95 శాతం పనులు పూర్తవ్వగా మిగిలిన పని ఆపేశారు.

ఈద్గా హామీ ఏమైంది?

గుడివాడలో ముస్లింలందరూ పండుగ పూట ఒకేచోట నమాజు చేసేలా ఎకరం విస్తీర్ణంలో ఈద్గా ఏర్పాటు చేస్తామని మంత్రిగా ఉన్నప్పుడు నానీ హామీ ఇచ్చారు. ఆ హామీ ఏమైందంటే ఇప్పటికీ సమాధానం లేదు

వక్ఫ్ ఆస్తులపై కన్నేసి

మంత్రిగా నాని గుడివాడ మండలం మల్లాయిపాలెంలోని వక్ఫ్ ఆస్తులపై కన్నేశారు. కారుచౌకగా 100 ఎకరాలను దక్కించుకోవాలని రైతులపై ఒత్తిడి తెచ్చారు. చిన్న, సన్నకారు మైనార్టీ రైతులపై ప్రతాపం చూపేందుకు ప్రయత్నించారు. రైతులు ఎదురు తిరగడంతో వెనక్కి తగ్గారు.

వైసీపీ నాయకులను తరిమికొట్టారు

గుడివాడ మండలం మల్లాయిపాలెంలో మసీదుకు చెందిన పొలాలను అక్రమంగా చెరువుగా తవ్వేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించారు. దీంతో గ్రామంలోని మహిళలు, యువత, వృద్ధులు వైసీపీ నాయకులను తరివికొట్టారు. మసీదుల అభివృద్ధికి వచ్చిన నిధులపై వైసీపీ నాయకులు కన్నేశారు. బినామీ కాంట్రాక్టర్‌ను రంగంలోకి దించి గత ప్రభుత్వ హయాంలో జరిగిపోయిన పనినే మళ్లీ చేసినట్టు చూపి బిల్లు చేసుకుని రూ.11 లక్షలు జేబులో వేసుకోవాలని ఎమ్మెల్యే నాని అండతో వైసీపీ మైనార్టీ నాయకుడు ప్రయత్నించాడు. టీడీపీ నాయకులు అడ్డుపడి వాస్తవాలను లోకాయుక్త ముందుంచడంతో బిల్లు చెల్లించకుండా నిలుపుదల చేశారు.

సబ్ ఎడిటర్ నుంచి ఎమ్మెల్యేగా ఎదిగి..

- ఆదర్శ రాజకీయవేత్తగా పాటూరు రామయ్య
- నిడుమోలు నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక



చల్లపల్లి : ఆయన నీతినిజాయితీలకు నిలువెత్తు రూపం. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడేతత్వం. నిరాడంబర రాజకీయ జీవితానికి నిఖార్సయిన తార్కారణం. ఆయనే ఆదర్శ రాజకీయవేత్త పాటూరు రామయ్య. నిడుమోలు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడుసార్లు వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. 1985, 1989, 1994లలో వరుస విజయాలు సాధించిన రామయ్య 1999లో ఓటమి చెందారు. తిరిగి 2004 ఎన్నికల్లో విజయం సాధించారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ అత్యంత సాదాసీదా జీవితాన్నే గడిపేవారు. నెల్లూరు జిల్లా జమ్మలపాలెంలో పాటూరు వెంకయ్య, సుబ్బమ్మ దంపతులకు 1941 అక్టోబరు 9వ తేదీన రామయ్య జన్మించారు. 1965లో మహాలక్ష్మమ్మను వివాహం చేసుకున్నారు. కమ్యూనిస్టు మహానేత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శంతో రామయ్య దంపతులు ప్రజాసేవకు పిల్లలు అడ్డుగా ఉంటారని భావించారు. పిల్లలే వద్దనుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారు.

ప్రూఫ్ రీడర్‌గా మొదలై..

1967లో జనశక్తి పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా ఉద్యోగంలో చేరి తర్వాత ఎడిటోరియల్ బోర్డు సభ్యుడయ్యారు. ఆ తరువాత ప్రజాశక్తి పత్రికకు ఎడిటర్‌గానూ పనిచేశారు. అంచెలంచెలుగా ఎదిగి శాసనసభ్యుని స్థాయికి చేరుకున్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షునిగా, సీపీఎం కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితునిగా పనిచేశారు. సొంత ఇల్లు లేని ఆయన ప్రస్తుతం ఉయ్యూరులోని రోటరీ వృద్ధాశ్రమంలో ఉంటున్నారు.

పాత శివాలయంలో భ్రమరాంబ మల్లేశ్వరుల కల్యాణోత్సవం



వన్‌టౌన్, ఏప్రిల్ 22: భ్రమరాంబ మల్లేశ్వరాలయం (పాత శివాలయం)లో సోమవారం భ్రమరాంబ మల్లేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. నవరాత్ర సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవాల క్రమంలో వివిధ విశేష ఆగమోక్త కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాచకొండ సుమంత్ శర్మ, అభిషేక పురోహితుడు కొత్తపల్లి సాయికృష్ణశర్మల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి, ఈవో కానూరు సురేష్‌బాబు పర్యవేక్షించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.80

ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులనే అసెంబ్లీకి పంపండి



కరపత్రం అందిస్తున్న కోటేశ్వరరావు

వన్‌టౌన్, ఏప్రిల్ 22: ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులనే అసెంబ్లీకి పంపాలని పశ్చిమ సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి. కోటేశ్వర రావు అన్నారు. సోమవారం 52 వ డివిజన్‌లోని కొండప్రాంతం మాకినవారి వీధిలో ప్రచారం నిర్వహిం చారు. ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 49 మంది వైసీపీ కార్పొరేటర్లను గెలిపించినా వారు చేసిందేమీ లేదన్నారు. పన్నులను భారీగా పెంచి నడ్డి విరిచారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ గుర్తించి ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులనే అసెంబ్లీకి పంపాలని కోరారు.



ఎర్త్‌డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలు, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థుల ప్రదర్శన, మొక్కలు పంపిణీ చేస్తున్న సర్వీస్ స్టేషన్ ఉద్యోగులు

భూమిని సంరక్షించుకోవాలి

ధరిత్రి దినోత్సవంలో కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ జేడీ కృష్ణ

మొగల్రాజపురం, ఏప్రిల్ 22: విశ్వంలో మనిషి మనుగడ ఒక్క భూమి మీదే ఉందని, ప్రాణి కోటి బతకాలంటే భూమిని సురక్షితంగా ఉంచాల్సిన అవసరం మనిషికి ఉందని, కాని నేటి జీవన విధానంలో కాలుష్యంతో భూ వాతావరణాన్ని పాడుచేస్తున్నాడని కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సి. కృష్ణ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ధరిత్రి దినోత్సవం (ఎర్త్‌డే) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనిషి తన దైనందిన జీవితంలో కాలుష్య రహిత వస్తువులను వినియోగించాలని, పరిసరాలను సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ ప్రకృతిని జాగ్రత్తగా సంరక్షించుకుంటే ప్రకృతే మనిషిని కాపాడుతుందని అన్నారు. డీన్ ప్రొఫెసర్ రాజేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టిఎస్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, ఎకో క్లబ్, గ్రీన్ క్లబ్ అధ్యక్షులు శ్రావణి, కుసుమరోహిణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

వన్‌టౌన్: భూమిని కాపాడుకోకపోతే మానవ మనుగడకు ముప్పు వస్తుందని వక్తలు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం కాలేజీకి అనుబంధంగా ఉన్న రోటరాక్ట్ క్లబ్, హాబీస్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ పి. నరేష్ బీ.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ఏ.రమాదేవి, నవీన్‌కుమార్‌ల పర్యవేక్షణలో ఎర్త్‌డే సందర్భంగా కార్యక్రమాలను నిర్వహించారు. భూమిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వక్తలు విశదీకరించారు. భూమిని కాపాడుకోవాలంటూ విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందచేశారు. కళాశాల కమిటీ కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఏ పతంజలి శాస్త్రి, రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడు కే సాకేత్, సెక్రటరీ ఉమామహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ ఆశ్రిత్, కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

లబ్బీపేట: బందర్‌రోడ్డులోని పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో సోమవారం వినియోగదారులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి నేల తల్లి రుణం తీర్చుకోవాలని అన్నారు. ఈ ధరిత్రి దినోత్సవం రోజున మొక్కలు పెంచే ఆసక్తి గల వారికి ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పైలెట్ సర్వీస్ స్టేషన్ అధినేత ఎంవీవీ సత్యనారాయణ, మేనేజర్ కె.వెంకటప్పయ్య, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గద్దె నామినేషన్‌కు తరలిన టీడీపీ శ్రేణులు

స్టెల్లా కాలేజ్ సర్వీస్ రోడ్డులో ర్యాలీగా..



భారతీనగర్, ఏప్రిల్ 22: బీజేపీ, జనసేన, టీడీపీల ఉమ్మడి కూటమి బలపరిచిన విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ నామినేషన్ సందర్భంగా సోమవారం నాలుగో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. గద్దె రామ్మోహన్‌కు మద్దతూ తెలుపుతూ డివిజన్ పార్టీ కార్యాలయం నుంచి పటమట డిమార్ట్ వరకు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం అని, ప్రజలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గద్దె దంపతులను గజమాలతో సత్కరిస్తున్న 18వ డివిజన్ టీడీపీ నేతలు

రాణిగారితోట: నామినేషన్ సందర్భంగా రాణిగారితోటకు ర్యాలీగా చేరుకున్న గద్దె రామ్మోహన్, అనురాధ, వారి కుమారులను అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు, నాలుగు రోడ్ల సెంటర్‌లో 18వ డివిజన్‌కు చెందిన మహిళలు గద్దె దంపతులకు హారతులు ఇవ్వగా, పార్టీ నాయకులు గజమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. 15, 16, 17, 18 డివిజన్ల ప్రజలు బారులుతీరి ఆయనకు స్వాగతం పలికారు. ● 17వ డివిజన్ టీడీపీ నాయకుడు ముని పోలిపల్లి ఆధ్వర్యంలో కార్యకర్తలకు మజ్జిగ పంపిణీ చేశారు. మండుటెండలో భారీగా వచ్చిన కార్యకర్తలకు చల్లని మజ్జిగ అందించిన పోలిపల్లిని గద్దె అభినందించారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం

పాతరాజేశ్వరిపేట, ఏప్రిల్ 22 : రాబోయే ఎన్డీయే ప్రభుత్వంలో చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రానికి తిరిగి పూర్వ వైభవం వస్తుందని యువ నాయకుడు కేశినేని వెంకట్ అన్నారు. 56వ డివిజన్‌లో సోమవారం బీజేపీ, జనసేన బలపర్చిన టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి వై.సుజనా చౌదరి విజయాన్ని కాంక్షిస్తూ వెంకట్ ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ఆయన వివరించారు. ఓల్డ్ ఆర్ఆర్‌పేట, బ్రిడ్జి డౌన్ నుంచి సాయిబాబా గుడి వరకు ప్రచారం సాగింది. టీడీపీ నాయకులు ధనేకుల వెంకట సుబ్బారావు, ఈశ్వర్, శ్యామ్, పుల్లారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న కేశినేని వెంకట్

జగన్ మోసాలు, డ్రామాలకు చరమగీతం పాడండి: కేశినేని శ్రీదేవి

భవానీపురం: బీజేపీ, జనసేన బలపర్చిన టీడీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని),పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి వై.సుజనా చౌదరిల విజయాన్ని కాంక్షిస్తూ కేశినేని శ్రీదేవి సోమవారం 41వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. భవానీపురం హజ్రత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా నుంచి ప్రచారం మొదలై రంగూన్ సాహెబ్ వీధిలో పూర్తిగా ప్రజల్లో ఆమె కలియతిరిగారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే అందించబోయే సంక్షేమ పథకాలను వివరించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా, రాష్ట్ర తెలుగు మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు షేక్‌ఆషా, సుభానీ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్‌లో రమేష్ ట్యూషన్ పాయింట్ విద్యార్థుల సత్తా

పటమట, ఏప్రిల్ 22 : టెన్త్ ఫలితాల్లో విజయవాడ పంటకాల్వ రోడ్‌లోని రమేష్ ట్యూషన్ పాయింట్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారని నిర్వాహకులు తెలిపారు. కె. త్రిష 588 మార్కులు, ఎస్. రాహిత్య 588 మార్కులు, పి.జయదీప్‌కు 570 మార్కులు వచ్చాయని, మ్యాథ్స్‌లో 100/100 ముగ్గురికి, సోషల్‌లో 100/100 ఇద్దరికి, సైన్స్‌లో 100/100 ఒక్కరికి వచ్చాయని తెలిపారు. 500 మార్కులకు పైగా 15 మంది విద్యార్థినీ విద్యార్థులకు వచ్చాయని, మొత్తం 24 మంది విద్యార్థులకు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని రమేష్ ట్యూషన్ పాయింట్ నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి హనుమాన్ చాలీసా పారాయణం

లబ్బీపేట, ఏప్రిల్ 22: గుంటూరు జిల్లాలోని పెనుమాక గ్రామంలో ఉన్న శ్రీ వైష్ణవ మహాదివ్య క్షేత్ర ప్రాంగణంలో మంగళవారం నుంచి 365 రోజులు అఖండ శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు దివ్యక్షేత్ర కార్యదర్శి దూపుగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు.

ఎంజీరోడ్డులోని ఒక హోటల్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 7గంటలకు హనుమాత్ వైభవ శోభయాత్ర, శ్రీ హనుమాత్ విగ్రహ స్థాపన కార్యక్రమం, 8.30కు హనుమాత్ ఇష్టి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెస్ శ్రీనివాస్ భక్తులతో హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కరపత్రాలను ఆవిష్కరించారు. దివ్యక్షేత్రం చైర్మన్ మాజేటి వెంకట దుర్గాప్రసాద్, మందిర నిర్వహణ కమిటీ చైర్మన్ తాడికొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఘట్టా ధనప్రసాదరావు, కోశాధికారి ఉమామహేశ్వర గుప్తా, సూర్యప్రకాశరావు, మురళీరావు, భవన్నారాయణ తదితులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అండగా ఉంటా

52వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో సుజనా చౌదరి

వన్‌టౌన్, ఏప్రిల్ 22: తాను గెలిస్తే పశ్చిమ నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాలను ఏర్పాటు చేసి నియోజకవర్గ ప్రజలకు తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు 24 గంటలు అందేలా ఏర్పాట్లు చేయనున్నట్లు కూటమి పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. సోమవారం ఆయన 52వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతాల్లో పర్యటించారు. కూరగాయల వ్యాపారుల స్థితిగతులను తెలుసుకున్నారు. అల్పాహార బండి వద్ద దోసెలు వేసి చిరువ్యాపారులకు అండగా ఉంటా మన్నారు. కోమలవిలాస్ సెంటర్, చేపలమార్కెట్, శ్రీనివాస మహల్, కొండప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఇదే సందర్భంలో సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ ఇన్‌చార్జి పోతిన బేసు వెంకటేశుడు సుజనాకు స్వాగతం పలికారు. మరుపిళ్ల చిట్టి చిత్రపటానికి పూలమాలలు వేసిన సుజనా చౌదరి నివాళులు సమర్పించారు. పార్టీలకతీతంగా కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రావుల సత్యనారాయణతో కలిసి చేపల మార్కెట్‌లో ప్రచారం చేశారు. నాయకులు అడ్డూరి శ్రీరామ్, ఎంఎస్ బేగ్, నాగుల్‌మీరా, పైలా సోమినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బ్రాహ్మణవీధిలో జరిగిన ప్రచారంలో సుజనాచౌదరి, పక్కన బుద్దా వెంకన్న, నాగుల్ మీరా తదితరులు

● 53వ డివిజన్‌లోని కొత్తపేట హనుమంతరాయ చేపల మార్కెట్‌లో సుజనా చౌదరి ప్రచారం నిర్వహించారు. మార్కెట్ అసోసియేషన్ పెద్దలు సయ్యద్ సలీం అహ్మద్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు మార్కెట్‌లోని సమస్యలు, ఇతర అంశాలను వివరించారు. ముస్లిం మైనార్టీలు కూటమికి అండగా ఉండి, అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రావుల సత్యనారాయణ, 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, ఈగల సాంబ తదితరులు పాల్గొన్నారు.

●39వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. డివిజన్ అధ్యక్షురాలు పితాని పద్మ ఆధ్వర్యంలో సోమవారం బుద్దా వెంకన్న కార్యాలయం నుంచి బ్రాహ్మణవీధి పోస్టాఫీసు వరకు ప్రచారం సాగింది, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, వాసు, శ్రీరామ్, పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో కార్తీక్ ప్రచారం

చిట్టినగర్: పశ్చిమ అభివృద్ధి తన తండ్రి సుజనా చౌదరి ద్వారానే సాధ్యమని, ఆయనను అత్యధిక మెజారిటీతో గెలించాలని పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి తనయుడు కార్తీక్ అన్నారు. సోమవారం 47వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సుజనాతోనే వడ్డెరల సమస్యల పరిష్కారం

విద్యాధరపురం: వడ్డెరల సమస్యల పరిష్కారం సుజనా చౌదరితోనే సాధ్యమని వడ్డెర సామాజికవర్గ నాయకులు తెలిపారు. భవానీపురంలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడ్డెర సామాజికవర్గం నాయకులు వేముల సీతారాం, ఏ శ్రీనివాసరావు, ప్రసాద్, కనకారావు, నాగరాజు సంయుక్తంగా మాట్లాడారు. ఎన్నికల్లో సుజనాచౌదరికే మద్దతు ఇస్తున్నామన్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

టీడీపీలో కళాకారుల చేరిక

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 22 : సెంట్రల్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, కళాకారిణి మద్దాలి సత్యవాణి, తపస్వీ కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు సూర్యదేవర జగన్నాథం తదితర సాంస్కృతిక కళాపీఠం సభ్యులు సోమవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే కళాకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మరో వంద మంది... సెంట్రల్ నియోజకవర్గం 62వ డివిజన్‌కు చెందిన 100 మంది సోమవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వెలంపల్లి నామినేషన్

సత్యనారాయణపురం, ఏప్రిల్ 22: సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు. సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్ నుంచి సోమవారం ఉదయం మేయరు, డిప్యూటీ మేయరు, వైసీపీ కార్పొరేటర్‌లతో కలిసి ఊరేగింపుగా వెళ్లి వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు.

పశ్చిమలో ఆరుగురు అభ్యర్థులు...

వన్‌టౌన్: పశ్చిమలో సోమవారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మోహన డి. ప్రసాద్, బీఎస్‌పీ అభ్యర్థిగా మద్దిరాల వినోద్‌కుమార్, వైసీపీ అభ్యర్థిగా రేష్మ మహమూద్, స్వతంత్ర అభ్యర్థులుగా శీరం నాగమల్లేశ్వరరావు, ఈట్ల భవానీ, పొష్పూరి వెంకట అశోక్‌లు ఒక్కో నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి కిరణ్మయి వద్ద దాఖలు చేశారు.

అనుమానాస్పద స్థితిలో బంకు ఉద్యోగి మృతి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 22 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో సోమవారం జరిగింది. వివరాల ప్రకారం కృష్ణలంక ప్రాంతానికి చెందిన భైవరపు సూరినారాయణ(44) తోటవారి వీధి ఎదురుగా గల పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం బంకు యజమాని బంక్ శ్లాబ్‌కు ఉన్న బూజును శుభ్రం చేయమని చెప్పాడు. సూరినారాయణ 4 అడుగుల ఎత్తుగల సిపాయిబల్లపై ఎక్కి శ్లాబ్‌ను శుభ్రపరుస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు తీవ్రగాయం అవడంతో సిబ్బంది చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ధ్రువీకరణ పత్రాలు పొందిన విద్యార్థినులతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకట లక్ష్మి

'మార్పు'లో శిక్షణ పొందిన విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందచేత

వన్‌టౌన్, ఏప్రిల్ 22: మనోరమ అర్జునరావు పబ్లిక్ యుటిలిటీ ట్రస్ట్ (మార్పు) స్వచ్ఛంద సంస్థలో ఆహారం, పోషణ, సైబర్ సెక్యూరిటీ, యుక్తవయసులో వచ్చే మార్పులు, వ్యక్తిగత ప్రేరణ, ఆత్మహత్యను ముందుగానే నివారించడం వంటి వాటిపై ఆరునెలలు శిక్షణ పొందిన 25 మంది మారీస్ స్టెల్లా విద్యార్థినులకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి తన కార్యాలయంలో సోమవారం ధ్రువీకరణ పత్రాలను అందచేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు దేశగౌరవాన్ని పెంచేలా తమ కార్యకలాపాలను సాగించాలని సూచించారు మార్పు సంస్థ వ్యవస్థాపకురాలు రావూరి సూయజ్, మహిళా కమిషన్ కార్యదర్శి వసంతబాల, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పాయకాపురం, ఏప్రిల్ 22 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని కేపీ నగర్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, ఓల్డ్ పీఅండ్‌టీ కాలనీ, భద్రయ్య నగర్, వర్కుమెన్ పేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భవానీపురం: కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో నూతన విద్యుత్ లైన్ల నిర్మాణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కబేళా సెంటర్, కోట నాగేశ్వరరావు, ఆకుల సాంబయ్య వీధి, లీడ్‌వెల్ స్కూల్ వీధి, భీవర కనకారావు వీధి, 18 పోర్షన్ల వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మలబద్ధకం, అతి వేడి లేదా అతి చల్లని నీళ్లతో స్నానం చేయడం వల్ల గుండె మీద ఒత్తిడి పడే సమస్య ఉన్నవాళ్లు ఓ పక్క హృద్రోగానికి మందులు వాడుకుంటూనే, గుండెకు చేటు చేసే అలవాట్లను మానుకోవాలి.

హార్ట్ కేర్

హృద్రోగులకు బాత్రూమ్ గండం



ఉదయాన్నే బాత్రూమ్‌లో కాలకృత్యాలు తీర్చుకోవడం లేదా స్నానం చేయడం లాంటి సాధారణ పనులు హృద్రోగులకు ప్రమాదకరంగా పరిణమించవచ్చు. ఈ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉండాలంటే ఏం చేయాలో, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వైద్యులు వివరిస్తున్నారు.

కార్డియాక్ అరెస్ట్ ఎక్కడైనా, ఎప్పుడైనా జరగవచ్చు. కానీ రోజు మొత్తంలో ఉదయం వేళ గుండె పోట్లు, కార్డియాక్ అరెస్టులు తలెత్తే అవకాశాలు ఎక్కువ. గుండె కొట్టుకోవడం ఆగిపోయే ఇలాంటి పరిణామాలు బాత్రూమ్‌ను ఉపయోగించే సందర్భంలోనే ఎక్కువగా చోటు చేసుకుంటూ ఉంటాయి. స్నానానికి లేదా కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం బాత్రూమ్‌లోకి అడుగు పెట్టిన పెద్దలు అక్కడే కుప్పకూలిపోయి, ప్రాణాలొదిలేసిన సందర్భాలు కూడా ఉంటూ ఉంటాయి. అదృష్టవశాత్తూ కొందరు పెద్దలు స్పృహ కోల్పోవడం లేదా కోలుకుని కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయడం లాంటివి చేయగలుగుతారు. కానీ ప్రధానంగా ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూసుకోవాలి. ఒక వేళ తలెత్తితే, వీలైనంత త్వరగా చికిత్స అందేలా చేయాలి. హృద్రోగులకు ఎంత త్వరగా వైద్య చికిత్స అందించగలిగితే గుండెకు జరిగే నష్టాన్ని అంత మెరుగ్గా నివారించగలుగుతాం!

మలబద్ధకం మూలంగా...

మలవిసర్జన సమయంలో మలబద్ధకం మూలంగా ముక్కడం చేస్తే, ఆ ఒత్తిడి మూలంగా రక్తపోటులో ఒడిదొడుకులు ఏర్పడతాయి. ముక్కడం మొదలుపెట్టిన వెంటనే రక్తపోటు పెరిగిపోతుంది. ముక్కడం కొనసాగిస్తే, పెరిగిన రక్తపోటు తిరిగి విపరీతంగా పడిపోతుంది. రక్తపోటులో ఇంతటి వ్యత్యాసాలు గుండె మీద ప్రభావాన్ని చూపిస్తాయి. మరీ ముఖ్యంగా గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నవాళ్లు, హార్ట్ ఫెయిల్యూర్ సమస్య ఉన్న వాళ్లు.. ఈ రెండు కోవలకు చెందిన వాళ్లకు ఈ పరిస్థితి ప్రమాదకరం. రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నవాళ్లలో రక్తపోటులో హెచ్చుతగ్గుల వల్ల గుండె మీద ఒత్తిడి పెరిగి అది స్ట్రోక్‌కు దారి తీయవచ్చు. రక్తాన్ని పంప్ చేసే శక్తి లోపించిన, బలహీనమైన గుండె కలిగి ఉన్నవాళ్లలో ముక్కడం మూలంగా పెరిగిన రక్తపోటు వల్ల పంపింగ్ మరింత సన్నగిల్లుతుంది. కాబట్టి ఈ రెండు సమస్యలున్నవాళ్లు మలబద్ధకం లేకుండా మలవిసర్జన సాఫీగా జరిగేలా చూసుకోవాలి.



గోరువెచ్చని నీళ్లే సురక్షితం

తాపమానాల్లో హెచ్చుతగ్గుల ప్రభావం రక్తనాళాల మీద పడుతుంది. చల్లదనంతో రక్తనాళాలు కుంచించుకుపోతే, వేడి వల్ల రక్తనాళాలు విప్పారతాయి. గుండె సమస్యలున్న వాళ్లు ఈ రెండు పరిస్థితులకూ దూరంగా ఉండాలి. చల్లనీళ్ల స్నానం చేసినప్పుడు, రక్తనాళాలు ముడుచుకుపోయి రక్తపోటు పెరుగుతుంది. అప్పటికే గుండె పోటు, ఫెయిల్యూర్ చరిత్ర ఉన్న వాళ్లలో ఆ సమస్యలు పెరిగి గుండె పోటు రావచ్చు లేదా గుండె ఫెయిల్ అయిపోవచ్చు. అలాగే మరింత వేడిగా ఉండే నీళ్లతో స్నానం చేసినప్పుడు కూడా ఇవే సమస్యలు తలెత్తవచ్చు. ఎక్కువ వేడి కలిగి ఉన్న నీళ్లతో స్నానం చేసినప్పుడు రక్తనాళాలు విప్పారి, రక్తపోటు పడిపోతుంది. కాబట్టి మరీ చల్లగా లేదా మరీ వేడిగా ఉన్న నీళ్లతో కాకుండా గోరువెచ్చని నీళ్లతోనే స్నానం చేయాలి.

లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు

హృద్రోగులు స్వల్ప మార్పులను కూడా కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అవేంటంటే...

- ఛాతీలో నొప్పి
- అకస్మాత్తుగా శ్వాసలో ఇబ్బంది తలెత్తడం
- మైకం
- వాంతులు

వేగస్ నాడి వల్ల...

శరీరంలో వేగల్ యాక్టివిటీ పెరిగినప్పుడు, న్యూరోకార్డియోజెనిక్ సింకోప్ అనే పరిస్థితి తలెత్తుతుంది. మెదడు నుంచి పొట్ట వరకూ కొనసాగే ఈ పొడవాటి వేగల్ నాడి, ముక్కుతూ మూత్రవిసర్జన, మలవిసర్జన చేసే సమయాల్లో ప్రేరేపితమవుతూ సదరు



వ్యక్తులు స్పృహ కోల్పోయేలా చేస్తుంది. అయితే ఇది ప్రాణాంతకమైన పరిస్థితి కాదు. తాత్కాలికంగా స్పృహ కోల్పోయినా, తిరిగి నిమిషంలో మేల్కొని బాత్రూమ్ నుంచి బయటకు రాగలుగుతారు. కానీ ఇదే పరిస్థితి హృద్రోగుల్లో తలెత్తడం ప్రమాదకరం.

బాత్రూమ్ కేర్

గుండె జబ్బుల నుంచి కోలుకుంటున్న వాళ్లు, లక్షణాలు ఇంకా సమసిపోని వాళ్లు తప్పనిసరిగా కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో నడుచుకోవాలి. కుటుంబ సభ్యులు కూడా హృద్రోగులను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. తీవ్రమైన గుండె సమస్య ఉన్నవాళ్లు కాలకృత్యాలు, స్నానపానాలను తగిన పరికరాల సహాయంతో, పడక మీదే ముగించుకోవడం ఉత్తమం. ఒకవేళ బాత్రూమ్‌కు వెళ్లగలిగే ఓపిక ఉంటే...

- బాత్రూమ్‌లో బెల్ ఏర్పాటు చేయాలి
- బాత్రూమ్‌లో ఫోన్ సౌలభ్యం చేతికి అందుబాటులో ఉండాలి
- పెద్దలు సెల్‌ఫోన్ ఉపయోగించడం నేర్చుకోవాలి
- పడిపోయినప్పుడు దెబ్బలు తగలకుండా పదునైన కొక్కేలు లాంటివి బాత్రూమ్‌లో లేకుండా చూసుకోవాలి
- హృద్రోగులు బాత్రూమ్ తలుపు గడి పెట్టుకోకూడదు
- పెద్దలు బాత్రూమ్‌లో నుంచి బయటకు రావడం ఆలస్యమైతే, వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తం కావాలి
- అసహజ లక్షణాలను వ్యక్తం చేసేలా కుటుంబసభ్యులు పెద్దలను ప్రేరేపించాలి
- బాత్రూమ్‌లో టైమర్ లేదా అలారంను సెట్ చేసుకోవాలి
- పైకి లేవడానికీ, పట్టుకుని నడవడానికీ బాత్రూమ్ బయట, లోపల రైలింగ్స్ ఏర్పాటు చేయాలి

మూల కారణాలను సరిదిద్ది

మలబద్ధకం, అతి వేడి లేదా అతి చల్లని నీళ్లతో స్నానం చేయడం వల్ల గుండె మీద ఒత్తిడి పడే సమస్య ఉన్నవాళ్లు ఓ పక్క హృద్రోగానికి మందులు వాడుకుంటూనే, గుండెకు చేటు చేసే అలవాట్లను మానుకోవాలి. మలబద్ధకం తలెత్తకుండా చూసుకోవాలి. తాగే నీళ్ల మీద నియంత్రణ, శరీరంలో నీటి శాతాన్ని తగ్గించే మందుల వాడకం, ఎక్కువ సమయాల పాటు మంచానికే పరిమితమవడం, మందులు, ఆకలి లోపించడం, జీర్ణకోశానికి సరిపడా రక్తప్రవాహం లోపించడం లాంటివన్నీ మలబద్ధకానికి దారి తీస్తాయి. కాబట్టి అత్యంత సహజంగా తలెత్తే మలబద్ధక సమస్యను హృద్రోగులు తేలికగా తీసుకోకుండా, వైద్యుల సూచన మేరకు సుఖ విరోచనానికి తోడ్పడే మందులు వాడుకోవాలి. ఆహారంలో పీచుపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.

డాక్టర్ ఎ. శరత్ రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.



ఆలస్యం ప్రాణాంతకం

హృద్రోగుల్లో సమస్య తలెత్తినప్పుడు వీలైనంత వేగంగా చికిత్సను అందించాలి. స్పృహ కోల్పోయి తిరిగి మేల్కొన్నా, కింద పడిపోయి తిరిగి లేచినా, ఆ విషయాలను కూడా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అలాగే సరైన పద్ధతిలో ఆస్పత్రికి తరలించి, సత్వర చికిత్స అందించాలి.

పడుకోబెట్టి: సమస్య తలెత్తినప్పుడు హృద్రోగులను హడావిడిగా ఆస్పత్రికి తరలించడం సరి కాదు. బాత్రూమ్‌లో పడిపోయిన పెద్దలను మంచం మీద పడుకోబెట్టి, విశ్రాంత స్థితిలోనే ఆస్పత్రికి తరలించాలి. అలా కాకుండా నెమ్మదిగా నడిపించి, కార్లో కూర్చోబెట్టి ఆస్పత్రికి తీసుకొచ్చేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల రక్తపోటులో హెచ్చుతగ్గులు జరిగి, గుండె మీద ఒత్తిడి పెరిగి, పరిస్థితి మరింత విషమించవచ్చు.



స్ట్రెచర్‌లు, చక్రాల కుర్చీలు: అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించే సమయంలో అంబులెన్స్‌కు కబురు పెడుతూ ఉంటారు. అంబులెన్స్ వచ్చేలోగా, ఆలస్యానికి తావు లేకుండా, రోగిని ట్రాలీ మీద విశ్రాంత స్థితిలో సిద్ధంగా ఉంచితే, అంబులెన్స్‌లోకి ఎక్కించడం తేలికవుతుంది. అందుకోసం నివాస ప్రాంతాల్లో, హౌసింగ్ సొసైటీల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, వీల్ చైర్స్, స్ట్రెచర్‌లు అందుబాటులో ఉంచుకోవాలి. ఇవి ఉన్నప్పటికీ సొసైటీలో ఎక్కడున్నాయో, వాటినెలా ఉపయోగించాలో తెలిసిన వాళ్లు తక్కువ. కాబట్టి ఫెసిలిటీ మేనేజర్‌తో పాటు, ప్రతి ఒక్కరికీ వాటి వివరాలు, వాడకం గురించి తెలిసి ఉండాలి.

అవేర్‌నెస్

ఎలాంటి వంటపాత్రలు సురక్షితం?

అల్యూమినియం, స్టీల్, నాన్ స్టిక్, చేత ఇనుము, మట్టి.. ఇలా వంటలకు ఎన్నో రకాల ప్రాతలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏది సురక్షితం?

అల్యూమినియం: అద్భుతంగా వేడిని సంగ్రహించే గుణం కలిగిన అల్యూమినియం ఆమ్లగుణం కలిగిన పదార్థాలకు రియాక్ట్ అవుతూ ఉంటుంది. కాబట్టి ఈ పాత్రలను నాన్ రియాక్టివ్ కోటింగ్ లేకుండా వాడకూడదు. ఈ కోటింగ్ లేని అల్యూమినియం పాత్రల్లో వంటలు వండితే, ఈ లోహం ఆహారంలో కలిసిపోయి, హై బ్లడ్ అల్యూమినియంకు దారి తీస్తుంది. ఈ పరిస్థితి అల్జీమర్స్ సమస్యను తెచ్చి పెడుతుంది.



స్టెయిన్‌లెస్ స్టీల్: ఇది వంటపాత్రల తయారీకి సురక్షితమైన లోహం. అయితే ఉప్పని, ఆమ్లగుణం కలిగిన పదార్థాలను వండితే, పాత్రలోని నికెల్, క్రోమియంలు కొద్ది పరిమాణాల్లో ఆహారంలో కలిసే అవకాశం ఉంటుంది. అయితే ఇవి సురక్షితమైన పరిమాణాల్లోనే ఉంటాయి కాబట్టి ప్రమాదం ఉండదు. కానీ ఈ రెండు లోహాల పట్ల రియాక్షన్ కలిగిన వాళ్లు స్టీల్ పాత్రలను వంటకు ఉపయోగించకూడదు.

రాగి: ఆమ్ల గుణం కలిగిన పదార్థాలతో రియాక్ట్ అవకుండా ఉండడం కోసం వీటికి స్టీల్ లేదా టిన్ పైపూత వేస్తూ ఉంటారు. ఇలా పైపూత వేయని రాగి పాత్రలను వాడితే శరీరంలో కాపర్ టాక్సిసిటీ పెరిగి, వాంతులు, విరోచనాలు వేధిస్తాయి. పొట్ట, కాలేయ సంబంధ సమస్యలు కూడా మొదలవుతాయి.

నాన్‌స్టిక్ కుక్‌వేర్: టెఫ్లాన్ కోటింగ్ ఉన్న నాన్‌స్టిక్ పాత్రలు వేడెక్కినప్పుడు విషపూరిత వాయువులను వెలువరిస్తాయి. ఈ వాయువులు పాలిమర్ ఫ్యూమ్ ఫీవర్ అనే శ్వాససంబంధ సమస్యలను కలిగిస్తాయి. కాలేయ కేన్సర్, రొమ్ము కేన్సర్, థైరాయిడ్ సమస్యల ముప్పు కూడా ఎక్కువే! కాబట్టి ఈ పాత్రలను తక్కువ వేడితో వాడుకోవాలి.

ఇనుము: ఐరన్ లోపాన్ని అరికట్టే పాత్రలివి. ఆమ్ల గుణం కలిగిన పదార్థాలను ఈ పాత్రల్లో వండడం వల్ల పదార్థాల్లోని ఐరన్ మోతాదు పెరుగుతుంది. అయితే ఈ పాత్రలను ఉపయోగించే ముందు అవి శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఆక్సిడైజ్డ్ పొర ఏర్పడే వీలు లేకుండా వాటిని ఎప్పుడూ పొడిగా ఉంచాలి.

పింగాణీ: కొన్ని సెరామిక్ పైపూతల్లో సీసం, క్యాడ్మియంలు ఉంటాయి. వీటితో బ్రెయిన్ డ్యామేజ్ మొదలు కొన్ని రకాల కేన్సర్లు తలెత్తే ప్రమాదం ఉంటుంది.

మట్టి: పదార్థాలకు ప్రత్యేకమైన రుచిని తెచ్చి పెట్టే పాత్రలివి. సరైన పద్ధతిలో తయారుచేసిన మట్టి పాత్రలు నూరు శాతం సురక్షితమైనవి. కొన్ని మట్టి పాత్రల్లో క్యాడ్మియం, సీసం ఉండే అవకాశాలుంటాయి. కాబట్టి పాత్ర ఎలాంటి మట్టితో తయారైందో తెలుసుకోవాలి.

హెల్త్ వెల్త్

వాము టీ తాగితే...

కప్పు వేడి నీళ్లలో ఒక టీస్పూను వాము వేసి, కొద్ది సేపటి తర్వాత వడగట్టి, తేనె కలిపి, పరగడుపున తాగితే, కడుపుబ్బరం, ఛాతీ మంట, మలబద్ధకం వదులుతాయి. వాములోని థైమాల్, జీర్ణశక్తిని మెరుగు పరిచి పొట్ట నొప్పిని తగ్గిస్తుంది. వేసవిలో మందగించే ఆకలిని ప్రేరేపిస్తుంది. వాముకు ఉండే డైర్యూటిక్ గుణం వల్ల, శరీరంలోని విషాలన్నీ బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా మెటబాలిజం పెరిగి, అధిక బరువు అదుపులోకొస్తుంది. కాబట్టి వేసవిలో పరగడుపున వాము తేనీరు తాగడం అలవాటు చేసుకోవాలి.



నిరాశ, నిస్సహాయతలు... మానసిక కుంగుబాటుకూ, ఆత్మహత్య ప్రయత్నానికీ ప్రధాన సంకేతాలు. నా సమస్య పరిష్కారమయ్యే మార్గాలే లేవు, నా సమస్యను ఎవరూ పరిష్కరించలేరు... లాంటి నిరాశ, నిస్సహాయతలు జీవితం మీద విరక్తిని కలిగిస్తాయి. నిజానికి ఆత్మహత్యకు ముందు, ఈ నిరాశ, నిస్సహాయ స్థితులకు లోనవకుండా ఉండడం కోసం, సదరు వ్యక్తులు వీలున్న ప్రయత్నాలన్నీ చేసే ఉంటారు. అందుకోసం చేసిన ప్రయత్నాలు ఫలితాన్నివ్వని సందర్భాల్లోనే ఆత్మహత్య ఆలోచనలు మొదలవుతాయి. అయితే ఆ ఆలోచనలు నిర్ణయానికి దారి తీయకుండా ఉండాలంటే ఎవరికి వారు కొన్ని లక్షణాలను గమనించుకోవాలి. అవేంటంటే...

మనసు అలసిపోయిందా?

- ఇష్టపడి చేసే పనుల మీద ఆసక్తి, ఏకాగ్రత తగ్గుతాయి
- జీవితం బోర్‌గా, ఖాళీగా అనిపించడం
- మనసులోని బాధను ఇతరులతో పంచుకోడానికి వెనకాడడం, సిగ్గుపడడం
- చేద్దామని మొదలుపెట్టిన పనిని, మధ్యలోనే వదిలేస్తూ ఉండడం
- నిద్ర పట్టకపోవడం, ఆకలి లేకపోవడం
- శ్రేయస్సును కోరే వ్యక్తులతో సైతం మనసులోని బాధను పంచుకోవాలని అనిపించకపోవడం
- ఎవరికి చెప్పినా ప్రయోజనం ఉండదు, నా సమస్యను ఎవరూ తీర్చలేరు అనే సైకలాజికల్ లోన్లీనెస్‌కు గురవడం
- చనిపోవడమే పరిష్కారం అనే ఆలోచన కలగడం

ఆత్మహత్యను ఆపొచ్చు

ఎవరికి వారు ఒంటరితనం తాలూకు డిప్రెషన్ లక్షణాలను గ్రహించినప్పుడు, వాటిని తమలోనే దాచుకోకుండా, సన్నిహితులు, స్నేహితులు, కుటుంబసభ్యులకు తెలియపరచాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఒంటరితనానికి లోనై, మనసు కుంగిపోయినప్పుడు, మనసును మెలిపెట్టే బాధను ఇతరులతో మాటల్లో వ్యక్తపరచాలి. ఇందుకు సిగ్గుపడకూడదు. గుండె, కాలేయం, మూత్రపిండాలు.. ఈ అవయవాలన్నీ పని చేసీ, చేసీ ఎలా అలసిపోతాయో, మెదడు కూడా ఒక సమయానికి అలసిపోతుంది. ఆ పరిస్థితిని డిప్రెషన్ లాంటి పేర్లతో సంబోధించవలసిన అవసరం కూడా లేదు. గుండె ఉన్న వాళ్లకు గుండె సమస్యలు ఎంత సహజమో, మనసు ఉన్న ప్రతి ఒక్కరికీ మానసిక సమస్యలు అంతే సహజం అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. కాబట్టి అలసిన మనసు సేద తీరడం కోసం మనసు విప్పి మాట్లాడాలి.

కొట్టిపారేయకూడదు

డిప్రెషన్‌కు లోనై మనసులోని బాధను వెళ్లబోసుకుందామనుకునే వ్యక్తులు, ఆత్మన్యూనతకు, సిగ్గుకు లోనవుతారు. కానీ బాధను బయటపెట్టే వారి మాటలను కొట్టిపారేయకూడదు. డిప్రెషన్‌ను... అంతగా పట్టించుకోవలసిన అవసరం లేని విషయంగానో, పనిలేని వాళ్లు అవసరానికి మించి ఆలోచించి తెచ్చుకునే సమస్యగానో తేలికగా తీసిపారేసేలా మాట్లాడకూడదు. బదులుగా సదరు వ్యక్తి, ఇటీవలి కాలంలో అనుకోని ఒత్తిడికీ, బాధకూ, ఊహించని పరిణామానికీ లోనయ్యారా? అనేది గమనించాలి. దీర్ఘకాలికంగా హుషారు తగ్గినా, ఆసక్తి లోపించినా, మాటల్లో, ప్రవర్తనలో తేడాలు కనిపించినా, చనిపోతానని పదే పదే అంటున్నా, ఉద్యోగానికీ, కాలేజీకి వెళ్లకపోతున్నా, గదిలో ఒంటరిగా ఉండిపోతూ, ఎక్కువగా మొబైల్ ఫోన్‌తో గడుపుడూ, కదిలిస్తే కంటతడి పెట్టుకుంటూ ఉంటే, ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. సాధారణంగా ఎవరైనా మానసికంగా కుంగిపోయినప్పుడు, అందరూ చుట్టూ చేరి, భుజం తట్టి, భరోసా ఇచ్చి ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోతారు. కానీ అలా చేతులు దులుపుకుని వెళ్లిపోకుండా, డిప్రెషన్‌కు గురైన వ్యక్తి చెప్తున్నది సానుకూలంగా వినాలి.




అంతకంటే ముఖ్యంగా వైద్య సహాయం అవసరమనే నమ్మకాన్ని వాళ్లకు కలిగించాలి.

ఒంటరితనం ఇలా దూరం

- అభిరుచులు ఏర్పరుచుకోవాలి
- నచ్చిన పనులు చేయడానికి పూనుకోవాలి
- సోషల్ గ్రూప్స్ ఏర్పరుచుకోవడం, స్పోర్ట్స్ యాక్టివిటీస్‌లో పాలుపంచుకోవడం చేయాలి
- బుక్ ఫ్రెండ్స్, పెన్ ఫ్రెండ్స్‌ను పెంచుకోవాలి
- అభిప్రాయాలూ, అభద్రతాభావాలను సన్నిహితులతో పంచుకుంటూ ఉండాలి
- పరిస్థితుల ప్రభావంతో ఆవరించే ఒంటితనం తాత్కాలికం అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.

క్యాన్సర్‌పై విజయభేరి!

"ప్రతి రోగి నాకు ఒక కొత్త సవాలు. ఈ ప్రపంచానికి చెప్పటానికి ఒక ప్రత్యేకమైన కథ. అనుభూతి చెందటానికి ఒక కొత్త ఆశాకిరణం. నేర్చుకోవటానికి కొత్త పాఠం. ఆకాంక్షించడానికి కొత్త ప్రేరణ. పరిపక్వత సాధించటానికి కావాల్సిన కొత్త అంతర్దృష్టి." అంటారు డాక్టర్ సచిన్ మర్దా. ప్రతి రోగిని- 'మరో కేసుగా' కాకుండా- మానవతా కోణంలో చూసే డాక్టర్లు తక్కువ మంది ఉంటారు. పైగా డాక్టర్ సచిన్ స్పెషాలిటీ అంకాలజీ (క్యాన్సర్ రోగ చికిత్స). ఎక్కువ మంది రోగులు చివరి దశలోనే డాక్టర్ దగ్గరకు వస్తారు. అలాంటి స్పెషాలిటీలో- క్యాన్సర్ చికిత్స ద్వారా అనేక మంది రోగులను రక్షించిన డాక్టర్ సచిన్ రాసిన పుస్తకమే- "ఐ యామ్ అన్‌స్టాపబుల్ టుగెదర్ వి కెన్". ఈ పుస్తకంలో కేవలం అనుభవాలు మాత్రమే కాకుండా- క్యాన్సర్ చికిత్సలో వచ్చిన ఆధునిక మార్పులు, చికిత్సా విధానంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, రోగులతో పాటుగా వారి కుటుంబ సభ్యులకు ఉండాల్సిన ఆత్మస్థైర్యం మొదలైన విషయాలన్నింటినీ కూడా ఆ పుస్తకంలో వివరించారు. డాక్టర్ సచిన్ రాసిన ఈ పుస్తకాన్ని తెలుగులోకి -జర్నలిస్ట్ రచనా ముడుంబై- అనువదించారు.



ఐయామ్ అన్‌స్టాపబుల్ టుగెదర్ వికెన్
రచయితలు: డాక్టర్ సచిన్ మర్దా
రచన మంకాని
అనువాదం: రచన ముడుంబై
పబ్లిషర్: గురుకూల్ పబ్లిషింగ్
ధర: రూ. 1749

ఈ పరీక్షలు ఏడాదికోసారి

ముంచుకొచ్చే అనారోగ్య ముప్పును ముందుగానే పసిగట్టాలంటే ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఆ ఆరోగ్య పరీక్షలు ఏవంటే...

కంప్లీట్ బ్లడ్‌కౌంట్: తెల్ల, ఎర్ర రక్త కణాలతో పాటు, ప్లేట్‌లెట్‌ల మోతాదును కచ్చితంగా లెక్కించే పరీక్ష ఇది. అనీమియాతో పాటు, బ్లడ్ కేన్సర్ మొదలైన ప్రాణాంతక వ్యాధులను సైతం ఈ పరీక్షతో తేలికగా పసిగట్టవచ్చు.

లిపిడ్ ప్రొఫైల్: రక్తంలోని కొలెస్ట్రాల్, ట్రిగ్లిసరైడ్స్ మోతాదును కనిపెట్టే పరీక్ష ఇది. ఈ మోతాదులు పెరగడం గుండె జబ్బుకు సూచన. కాబట్టి ఈ పరీక్షతో రాబోయే గుండె జబ్బులను ముందుగానే పసిగట్టవచ్చు.



విటమిన్ డి: ఆస్టియొపొరొసిస్ అనే ఎముకలు గుల్లబారే సమస్యను ఈ పరీక్షతో తెలుసుకోవచ్చు.

థైరాయిడ్: థైరాయిడ్ గ్రంథి అవసరానికి మించి పని చేస్తోందా లేదంటే, పనిచేయడం మందగించిందా అనేది తెలుసుకోడానికి ఈ పరీక్ష సహాయపడుతుంది.

'క్యాండిడేట్స్ చెస్‌లో మన ఆటగాళ్లు టైటిల్ గెలిచే అవకాశం లేదు..మెరుగైన ప్రదర్శన కనబరిస్తే చాలు'.. ఈ టోర్నీకి ముందు భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ అన్న మాటలివి. మనోళ్ల ప్రదర్శనను తక్కువ చేయడం ఆనంద్ ఉద్దేశం కాకపోవచ్చు.. కానీ, ఆ టోర్నీలో పోటీ ఏస్థాయిలో ఉంటుందో చెప్పేందుకు అతని మాటలే నిదర్శనం.

ఏమాత్రం అంచనాలు లేని ఓ భారత కుర్రాడు అసామాన్య ప్రదర్శన చేసి ఏకంగా విజేతగా నిలవడం అద్భుతం..
అదీ ఎవరికీ సాధ్యం కానిరీతిలో 17 ఏళ్ల వయసులోనే ఈ టైటిల్ నెగ్గి చదరంగ క్రీడలో సరికొత్త చరిత్ర లిఖించడం మహాద్భుతం..
అసాధారణమైన ఈ ఘనతతో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ పోరుకు కూడా అర్హత సాధించిన తెలుగు మూలాలున్న తమిళనాడు కుర్రాడు దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు చెస్‌లో సరికొత్త సంచలనం.

యంగ్ 'క్యాండిడేట్'.. మన గుకేశ్

కొత్త కుర్రాడు కొల్లగొట్టాడు



ప్రపంచ చెస్‌లో భారత టీనేజర్ గుకేశ్ సంచలనం

- 17 ఏళ్లకే క్యాండిడేట్స్ టైటిల్ నెగ్గిన ఆటగాడిగా చరిత్ర
- వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత

టొరంటో: భారత యువ గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ అంతర్జాతీయ చెస్‌లో ప్రభంజనం సృష్టించాడు. తమిళనాడుకు చెందిన ఈ టీనేజర్ ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఆఖరిదైన 14వ రౌండ్లో అమెరికా గ్రాండ్‌మాస్టర్ హికారు నకమురాతో గేమ్‌ను డ్రా చేసుకున్న గుకేశ్.. మొత్తం 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ దక్కించుకున్నాడు. దీంతో తన మెంటార్ విశ్వనాథన్ ఆనంద్ (2014లో) తర్వాత ఈ టోర్నీ విజేతగా నిలిచిన రెండో భారత ఆటగాడిగా గుకేశ్ రికార్డుకెక్కాడు. అంతేకాదు.. క్యాండిడేట్స్ చెస్ చరిత్రలో టైటిల్ నెగ్గిన పిన్న వయస్కుడు ఇతడే కావడం విశేషం. ఈ క్రమంలో రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ పేరిటనున్న 40 ఏళ్ల రికార్డును గుకేశ్ బద్దలు కొట్టాడు. కాస్పరోవ్ 22 ఏళ్ల వయసులో చాంపియన్‌గా నిలిచాడు. ఈ విజయంతో గుకేశ్.. చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో చాలెంజర్ హోదాలో ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ పోరులో తలపడతాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల తేదీలు, వేదికలు ఖరారు కావాల్సి ఉంది. క్యాండిడేట్స్ విజేతగా నిలిచిన గుకేశ్‌కు రూ. 78.5 లక్షలు ప్రైజ్‌మనీగా దక్కింది.

ప్రత్యర్థికి అవకాశమే లేకుండా...: విజేతగా నిలవాలంటే కనీసం డ్రా చేసుకోవాల్సిన ఆఖరి రౌండ్లో నల్లపావులతో ఆడిన గుకేశ్ ఎక్కడా ప్రత్యర్థికి పైచేయి సాధించేందుకు అవకాశమివ్వలేదు. చివరకు 71వ ఎత్తు వద్ద ఇద్దరూ డ్రాకు అంగీకరించడంతో చెరో అరపాయింట్ లభించింది. దీంతో మొత్తం ఎనిమిది మంది పోటీపడ్డ ఈ టోర్నీలో గుకేశ్ అందరికంటే అత్యధిక పాయింట్లతో టైటిల్ విజేతగా అవతరించాడు. ఆఖరి రౌండ్లో నెపోమ్నియాచి (రష్యా), కరువానా (అమెరికా) మధ్య జరిగిన గేమ్ డ్రాగా ముగియగా.. ఫిరౌజా అలీరెజా (ఫ్రాన్స్)తో గేమ్‌ను భారత ఆటగాడు విదిత్ డ్రా చేసుకున్నాడు. మరో గేమ్‌లో అబసోవ్ (అజర్‌బైజాన్)ను ప్రజ్ఞానంద ఓడించాడు. అన్ని రౌండ్లు ముగిసిన అనంతరం నకమురా, నెపోమ్నియాచి, కరువానా తలా 8.5 పాయింట్లతో సంయుక్తంగా రెండోస్థానంలో నిలిచారు. ఏడు పాయింట్లతో ప్రజ్ఞానందకు ఐదో స్థానం, ఆరు పాయింట్లతో విదిత్‌కు ఆరో స్థానం దక్కాయి.

హంపికి రెండో స్థానం

వైశాలికి నాలుగో స్థానం

చైనా స్టార్ జోంగ్యీ టాన్‌కు మహిళల టైటిల్



క్యాండిడేట్స్ మహిళల విభాగంలో చైనాకు చెందిన జోంగ్యీ టాన్ చాంపియన్‌గా నిలిచింది. ఆఖరిదైన 14వ రౌండ్లో అన్నా ముజిచెక్ (ఉక్రెయిన్)తో గేమ్‌ను డ్రా చేసుకున్న జోంగ్యీ ఓవరాల్‌గా 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక, తెలుగమ్మాయి కోనేరు హంపి, ఆర్. వైశాలి వరుసగా రెండు, నాలుగు స్థానాల్లో నిలిచారు. చివరిరౌండ్లో టింగ్జీ లీ (చైనా)పై హంపి, క్యాటరీనా లాగ్నో (ఉక్రెయిన్)పై వైశాలి గెలిచారు. అయితే ఆఖరి రౌండ్ ముగిసేసరికి హంపి, వైశాలి, టింగ్జీ తలా 7.5 పాయింట్లతో సమంగా నిలిచారు. దీంతో సుపీరియర్ టైబ్రేక్ విధానంతో హంపి రెండు, టింగ్జీ మూడు, వైశాలి నాలుగు స్థానాలకు పరిమితమయ్యారు.

ఆ ఓటమితో.. ప్రేరణ

ఏడో రౌండ్‌లో అలీరెజా చేతిలో ఓటమి నాలో గెలవాలనే కసిని రగిల్చింది. టోర్నీ ఆరంభ రౌండ్లలో చక్కని ప్రదర్శన చేసినా.. ఏడో రౌండ్‌లో ఓడడంతో చాలా బాధపడ్డా. కానీ, పరాజయం నాలో ఉత్సాహాన్ని, ప్రేరణను రగిల్చింది. దీంతో సానుకూల ధోరణితో ఆలోచిస్తూ.. టైటిల్ కోసం పోరాడా.

- గుకేశ్

చిచ్చరపిడుగు


తల్లిదండ్రులతో..

ఆటలో ఎప్పుడూ వయసుకంటే ఎక్కువ పరిణతిని కనబర్చే గుకేష్ దొమ్మరాజు.. క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్‌తో ఒక్కసారిగా వరల్డ్ ఫేమస్ అయ్యాడు. ఆర్థిక కష్టాలు వెంటాడినా వెనుకడుగు వేయకుండా.. క్రౌడ్ ఫండింగ్‌తో పోరాటం కొనసాగించాడు. 12 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్ అయిన గుకేష్ .. 17 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌తో సవాల్‌కు సిద్ధమయ్యాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఆ అరుదైన ఘనతను అందుకొన్న గుకేష్.. నిశ్శబ్దంగా ప్రపంచచెస్‌ను ఏలడానికి సిద్ధమయ్యాడు.

చిన్నవయసులోనే 64 గళ్లను అవపోసన పట్టేశాడు గుకేష్. సహచరులు ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి, విదిత్ గుజరాతీ లాంటి యువ ఆటగాళ్లు ఎప్పుడూ వార్తల్లో ఉంటే.. ప్రచార ఆర్భాటం లేకుండా కూల్‌గా తనపని తాను చేసుకొంటూ వెళ్లిపోతుంటాడు.

12 ఏళ్లకే జీఎం..: చెన్నైలోని వేళమ్మాల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఏడేళ్ల వయసులో చెస్ ఓనమాలు దిద్దుకొన్నాడు. 2015 ఆసియా స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొన్న గుకేష్ మరింత ఉత్సాహంతో టోర్నీల్లో పాల్గొనేవాడు. 2018లో ఆసియా యూత్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో 5 పతకాలతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. 11 ఏళ్లకే ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించిన గుకేష్.. 2019లో 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో జీఎం టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. 2022లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో టీమ్‌కు కాంస్యం అందించిన గుకేష్.. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించాడు. 2023లో జూనియర్ స్పీడ్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు. గత జూలైలో 2750 రేటింగ్ సాధించిన గుకేష్.. చిన్నవయసులో ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకొన్న వాడిగా రికార్డులకెక్కాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కొడుకు కల కోసం..

గుకేష్ విజయాల వెనుక అతడి తల్లిదండ్రుల త్యాగం ఎంతో ఉంది. కొడుకు కోసం అతడి తండ్రి, ఈఎన్‌టీ డాక్టర్ రజనీకాంత్ తన కెరీర్‌నే పణంగా పెట్టారు. గుకేష్‌ను టోర్నీలు ఆడించడానికి అతడితో కలిసి పర్యటించేవాడు. దీంతో మైక్రోబయాలజిస్ట్ అయిన తల్లి పద్మ ఇంటి బాధ్యతలు చూసుకొనేది. నాలుగో తరగతి తర్వాత స్కూల్‌కు వెళ్లడం ఆపేసిన గుకేష్.. పూర్తిగా చెస్ సాధనపైనే దృష్టి సారించాడు. తన కొడుకు కల నెరవేర్చడానికి విరాళాలు కూడా సేకరించేవారు. అరకొర డబ్బుతోనే ఎన్నోసార్లు గుకేష్‌ను విదేశీ టోర్నీలకు తీసుకెళ్లారు.

గర్వంగా ఉంది

క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని నీవు గెలిచిన తీరుతో ఎంతో గర్వపడుతున్నాం.

- విశ్వనాథన్ ఆనంద్

శతక 'జై'స్వాల్



జైస్వాల్ (60 బంతుల్లో 104 నాటౌట్)

- సందీప్‌నకు ఐదు వికెట్లు
- రాజస్థాన్ ఘనవిజయం
- ముంబైకి నిరాశ

జైపూర్: ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (60 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 104 నాటౌట్) ఎట్టకేలకు బ్యాట్ ఝుళిపిస్తూ అజేయ శతకం సాధించాడు. అటు బౌలింగ్‌లో పేసర్ సందీప్ శర్మ (5/18) అద్భుత గణాంకాలు నమోదు చేయడంతో.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ 'టాప్'షో కొనసాగుతూనే ఉంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై రాజస్థాన్ 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులు చేసింది. తిలక్ వర్మ (65), నేహాల్ వధేరా (49) మాత్రమే రాణించారు. బౌల్ట్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 18.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 183 పరుగులు చేసి గెలిచింది. శాంసన్ (38 నాటౌట్), బట్లర్ (35) ఆకట్టుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సందీప్ శర్మ నిలిచాడు.

అవలీలగా..: స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించిన ఓపెనర్ యశస్వీ జైస్వాల్ లీగ్‌లో తన రెండో శతకంతో మెరిశాడు. తొలి ఓవర్‌లో బట్లర్ రెండు ఫోర్లతో జోరు చూపగా.. నాలుగో ఓవర్‌లో జైస్వాల్ 6,4,4తో 16 రన్స్ అందించాడు. ఇక పవర్‌ప్లేలో జట్టు 61 పరుగులు సాధించింది. ఆ తర్వాత వర్షంతో ఆట 40 నిమిషాలపాటు ఆగింది. ఎనిమిదో ఓవర్‌లో బట్లర్ అవుటయ్యాడు. జైస్వాల్‌కు కెప్టెన్ శాంసన్ జత కలవడంతో ముంబై బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. 31 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. తర్వాత 19వ ఓవర్‌లో తొలి బంతికి సెంచరీ పూర్తి చేయగా.. నాలుగో బంతికి ఫోర్‌తో మ్యాచ్‌ను సైతం ముగించాడు.

1
ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా చాహల్


సందీప్ శర్మ (5/18)

అదుకున్న తిలక్-వధేరా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో తిలక్ వర్మ, నేహాల్ వధేరా బ్యాటింగే కీలకంగా నిలిచింది. పేసర్లు బౌల్ట్, సందీప్ శర్మల ధాటికి తొలి నాలుగు ఓవర్లలోనే ఓపెనర్లు రోహిత్ (6), ఇషాన్ (0), సూర్యకుమార్ (10) పెవిలియన్‌కు చేరారు. ఆరో ఓవర్‌లో నబీ (23) 6,4,4తో 18 రన్స్ సాధించగా పవర్‌ప్లేను 45/3తో ముగించింది. అయితే నబీని 8వ ఓవర్‌లో చాహల్ అవుట్ చేయడంతో 52/4తో ముంబై కష్టాలు మరింత పెరిగాయి. ఈ దశలో తిలక్-వధేరా ఇన్నింగ్స్ బాధ్యత తీసుకున్నారు. 16వ ఓవర్‌లో సిక్సర్‌తో తిలక్ ఫిఫ్టీ పూర్తి చేయగా వధేరా మరో రెండు సిక్సర్లు బాది 20 రన్స్ రాబట్టాడు. కానీ ప్రమాదకరంగా మారిన ఈ జోడీని బౌల్ట్ విడదీస్తూ వధేరాను అవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక 19వ ఓవర్‌లో హార్దిక్ (10)ను అవేశ్ అవుట్ చేయగా.. ఆఖరి ఓవర్‌లో సందీప్ మూడు పరుగులే ఇచ్చి తిలక్, కొట్జీ (0), డేవిడ్ (3)ల వికెట్లు తీయడంతో ముంబై స్కోరు 180లోపే ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 179/9 (తిలక్ వర్మ 65, నేహాల్ వధేరా 49, సందీప్ శర్మ 5/18, బౌల్ట్ 2/32); **రాజస్థాన్:** 18.4 ఓవర్లలో 183/1 (యశస్వీ జైస్వాల్ 104 నాటౌట్, సంజూ శాంసన్ 38 నాటౌట్, బట్లర్ 35).

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
చెన్నై	7	4	3	0	8	0.529
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
గుజరాత్	8	4	4	0	8	-1.055
ముంబై	8	3	5	0	6	-0.227
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

కోహ్లీపై 50 శాతం జరిమానా

కోల్‌కతా: బెంగళూరు స్టార్ విరాట్ కోహ్లీ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో తన అవుట్ నిర్ణయంపై కోహ్లీ అంపైర్లతో వాగ్వాదానికి దిగి కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమించాడు. మరోవైపు ఇదే మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆర్‌సీబీ కెప్టెన్ డుప్లెసిపై రూ.12 లక్షల జరిమానా విధించారు. గుజరాత్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ కర్రాన్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేయడంతో అతడి మ్యాచ్ ఫీజులోనూ 50 శాతం కోత విధించారు.

నేటి మ్యాచ్ — రాత్రి 7.30 గం.
చెన్నై X లఖ్‌నవూ

బిజినెస్

ధ్రువ స్పేస్ రూ.78 కోట్ల సమీకరణ

హైదరాబాద్: అంతరిక్ష రంగానికి చెందిన హైదరాబాద్ స్టార్టప్ 'ధ్రువ స్పేస్' తాజాగా 94 లక్షల డాలర్లు (రూ.78 కోట్లు) సమీకరించింది. ఈక్విటీతో పాటు డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్ జారీ ద్వారా ఐఏఎన్ ఆల్ఫా ఫండ్ సహా ఇతర ఇన్వెస్టర్ల నుంచి ఈ నిధులను సేకరించింది. దీంతో కలిపి సిరీస్ ఏ ఫండింగ్‌లో భాగంగా ఈ స్టార్టప్ సమీకరించిన నిధుల మొత్తం 1.4 కోట్ల డాలర్ల (రూ.123 కోట్లు)కు చేరుకుంది. హైదరాబాద్‌లో 2.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న స్పేస్‌క్రాఫ్ట్ తయారీ యూనిట్ తొలి దశను పూర్తి చేసేందుకు తాజాగా లభించిన నిధులను వినియోగించుకోనున్నట్లు ధ్రువ స్పేస్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ సంజయ్ నెక్కంటి తెలిపారు. ఈ కంపెనీ గడిచిన రెండేళ్లలో నాలుగు స్పేస్ మిషన్స్‌ను పూర్తి చేసింది. మౌలిక వసతుల అభివృద్ధి అవసరాలతో పాటు కస్టమర్ల తరఫున చేపడుతున్న కొన్ని కార్యక్రమాల కోసం వచ్చే 12-18 నెలల్లో మరో 3 కోట్ల డాలర్ల (సుమారు రూ.250 కోట్లు) నిధులు సమీకరించాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.15 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసుకుంది.

వచ్చే 3-5 ఏళ్లలో కంపెనీ ఆదాయం రూ.1,500-2,000 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని నెక్కంటి అన్నారు. సంజయ్ నెక్కంటి, చైతన్య సూరపు రెడ్డి, అభయ్ ఎగూర్, కృష్ణ తేజ పెనమకూరు కలిసి 2012లో ధ్రువ స్పేస్‌ను హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభించారు.

విమానయానం ఒక్క రోజు రికార్డు

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన రంగం ఆదివారం ఒక కొత్త రికార్డును నమోదు చేసింది. ఒక్క రోజులోనే 4,71,751 మంది ప్రయాణికులు విమానయానం చేశారు. ఒక రోజులో ప్రయాణికుల అత్యధిక రికార్డు ఇది. ఆదివారం మొత్తం 6,128 విమానాల్లో 4,71,751 మంది దేశీయంగా వివిధ గమ్యాలకు ప్రయాణించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. కొవిడ్ ముందు నమోదైన ఒక రోజు ప్రయాణికుల సగటు సంఖ్య 3,98,579 కన్నా ఇది 14 శాతం అధికం. అలాగే గత ఏడాది ఏప్రిల్ 21వ తేదీన నమోదైన 5,899 విమానాల్లో 4,28,389 ప్రయాణికుల కన్నా కూడా అధికం. దేశీయంగా విమానాల్లో ప్రయాణించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని, మరింత అధిక శాతం ప్రజలకు విమానయానం అందుబాటులో ఉన్నందు వల్ల ఈ రంగానికి మరింత వృద్ధి అవకాశాలున్నాయని విమానయాన శాఖ పేర్కొంది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో విమాన ప్రయాణికుల సంఖ్య గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 375.04 లక్షల నుంచి 391.46 లక్షలకు పెరిగినట్టు డీజీసీఏ గత వారం ప్రకటించింది.

టయోటా ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్



టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం).. దేశీయ మార్కెట్లోకి లీడర్ ఎడిషన్ పేరుతో సరికొత్త ఫార్చ్యూనర్‌ను తీసుకువచ్చింది. ప్రస్తుత కస్టమర్ అవసరాలకు తగ్గట్టుగా ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్‌ను రూపొందించినట్లు పేర్కొంది. రెండు వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న లీడర్ ఎడిషన్ ధరలు వరుసగా రూ.35.93 లక్షలు, రూ.38.21 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. 2.8 లీటర్ డీజిల్ ఇంజన్, 6 స్పీడ్ ఆటోమేటిక్, 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో ఈ ఎస్‌యూవీ అందుబాటులో ఉండనుంది. టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ (టీపీఎంఎస్) దీని ప్రత్యేకత అని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,690 ▼	67,550 ▼	89,000 ▼
ముంబై	72,875 ▼	66,754 ▼	81,554 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	360	విజయవాడ	380
వరంగల్	362	గోదావరి	380
చిత్తూరు	473	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	121
వరంగల్	118	విజయవాడ	121
కరీంనగర్	118	గుంటూరు	125
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	125
కర్నూలు	118	చిత్తూరు	107
విశాఖపట్నం	113		

రిలయన్స్ @ రూ.10 లక్షల కోట్లు

వార్షిక టర్నోవర్‌లో సరికొత్త రికార్డు.. ఈ ఘనత సాధించిన తొలి భారత కంపెనీ

- రూ.లక్ష కోట్లు దాటిన వార్షిక స్థూల లాభం
- మార్చి త్రైమాసిక లాభం రూ.18,951 కోట్లు
- రూ.2.4 లక్షల కోట్లకు పెరిగిన ఆదాయం
- ఒక్కో షేరుకు రూ.10 డివిడెండ్ ప్రకటన

Reliance Industries Limited

ముంబై: మార్కెట్ విలువపరంగా దేశంలో అతిపెద్ద కార్పొరేట్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మోస్తరుగానే నమోదైనప్పటికీ వార్షిక గణాంకాలు మాత్రం అద్భుతం అన్పించాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి గాను రిలయన్స్ నికర లాభం రూ.69,621 కోట్లకు పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.66,702 కోట్లుగా నమోదైంది. కాగా, 2023-24 టర్నోవర్ (స్థూల ఆదాయం) వార్షిక ప్రాతిపదికన 2.6 శాతం వృద్ధితో రూ.10 లక్షల కోట్లకు చేరుకుంది. దేశంలో రూ.10 లక్షల కోట్ల వార్షిక టర్నోవర్‌ను నమోదు చేసిన తొలి కార్పొరేట్ కంపెనీ రియలన్సే కావడం గమనార్హం. అంతేకాదు, వార్షిక స్థూల లాభం (పీబీటీ) కూడా తొలిసారిగా రూ.లక్ష కోట్ల స్థాయిని దాటింది. అలాగే, కంపెనీకి చెందిన డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్ వార్షిక లాభం సైతం తొలిసారిగా రూ.20,000 కోట్ల మైలురాయిని దాటింది. రిలయన్స్ రిటైల్ లాభం కూడా రూ.10,000 కోట్ల మార్క్‌ను అధిగమించింది.



విభాగాల వారీగా పనితీరు

జియో ప్లాట్‌ఫామ్

రిలయన్స్ జియో సహా కంపెనీ డిజిటల్ సేవలన్నింటినీ కలిపి ఏర్పాటు చేసిన విభాగమైన జియో ప్లాట్‌ఫామ్ క్యూ4 లాభం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.5,583 కోట్లకు చేరుకుంది. నికర ఆదాయం 13.4 శాతం పెరిగి రూ.28,871 కోట్లుగా నమోదైంది. కాగా, వార్షిక నికర లాభం రూ.21,423 కోట్లకు, నికర రాబడి రూ.1,09,558 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియో కస్టమర్లు మరో 4.24 కోట్లు పెరిగి మొత్తం 48.18 కోట్లకు చేరుకున్నారు. క్యూ4లో కంపెనీకి ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పు) రూ.181.7గా నమోదైంది.

రిలయన్స్ రిటైల్

రిలయన్స్ చిల్లర వర్తక వ్యాపారాల విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) క్యూ4 లాభం 11.7 శాతం పెరిగి రూ.2,698 కోట్లుగా, నికర రాబడి 9.8 శాతం వృద్ధితో రూ.67,610 కోట్లకు చేరుకుంది. వార్షిక లాభం రూ.11,101 కోట్లుగా, నికర ఆదాయం రూ.2.73 లక్షల కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో తమకు చెందిన అన్ని ఫార్మాట్ల రిటైల్ స్టోర్లను మొత్తం 27.2 కోట్ల మంది సందర్శించారు. 31.1 కోట్ల లావాదేవీలు జరిగాయని ఆర్ఆర్‌వీఎల్ తెలిపింది. క్యూ4లో కొత్తగా తెరిచిన 562 విక్రయ కేంద్రాలతో కలిపి మొత్తం స్టోర్ల సంఖ్య 18,836కు చేరుకుంది.

ఓ2సీ

రిలయన్స్ ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) విభాగ ఆదాయం క్యూ4లో 10.9 శాతం వృద్ధితో రూ.1,42,634 కోట్లకు పెరగగా.. నిర్వహణ లాభం (ఎబిటా) 3 శాతం పెరిగి రూ.16,777 కోట్లుగా నమోదైంది. కాగా, వార్షికాదాయం రూ.5.64 లక్షల కోట్లు దాటగా.. నిర్వహణ లాభం రూ.62,393 కోట్లకు చేరుకుంది.

ఆయిల్ అండ్ గ్యాస్

కంపెనీకి చెందిన ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి విభాగ ఆదాయం (ఆయిల్ అండ్ గ్యాస్) క్యూ4లో 42 శాతం ఎగబాకి రూ.6,468 కోట్లకు, నిర్వహణ లాభం 47.5 శాతం వృద్ధితో రూ.5,606 కోట్లకు చేరుకుంది. వార్షికాదాయం రూ.24,439 కోట్లుగా, నిర్వహణ లాభం రూ.20,191 కోట్లుగా నమోదైంది. ఏపీలోని కృష్ణా గోదావరి బేసిన్‌లోని కేజీ డీ6 బ్లాక్ నుంచి ప్రస్తుతం రోజుకు 30 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను, 23,000 బ్యారెళ్ల ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికానికి (క్యూ4) రిలయన్స్ ఏకీకృత నికర లాభం రూ.18,951 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.28.01) పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇదే కాలానికి ఆర్జించిన రూ.19,299 కోట్ల (ఒక్కో షేరుకు రూ.28..52) లాభంతో పోలిస్తే 2 శాతం తగ్గింది.
- క్యూ4లో కంపెనీకి వ్యాపార కార్యకలాపాల ద్వారా సమకూరిన నికర ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధితో రూ.2.4 లక్షల కోట్లకు పెరిగింది. 2022-23లో ఇదే త్రైమాసికానికి ఆదాయం రూ.2.16 లక్షల కోట్లుగా నమోదైంది. కంపెనీకి చెందిన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ), కన్స్యూమర్ (టెలికాం, రిటైల్) వ్యాపారాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం ఆదాయం మెరుగుదలకు దోహదపడింది.
- గడిచిన మూడు నెలల్లో రిలయన్స్ నిర్వహణ లాభం (ఎబిటా) 14 శాతం వృద్ధి చెంది రూ.47,150 కోట్లకు చేరుకోగా.. నిర్వహణ లాభాల మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 0.50 శాతం పెరిగి 17.8 శాతానికి ఎగబాకింది.
- డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)తో పోలిస్తే మాత్రం క్యూ4 లాభంలో 10 శాతం, ఆదాయంలో 6 శాతం వృద్ధి నమోదైంది.
- గత ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 డివిడెండ్‌ను చెల్లించేందుకు రిలయన్స్ బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే చెల్లించిన రూ.9 డివిడెండ్‌తో కలిపి 2023-24కు గాను కంపెనీ చెల్లించబోయే మొత్తం డివిడెండ్ రూ.19కి చేరుకోనుంది.
- మార్చి 31 నాటికి కంపెనీ స్థూల రుణభారం రూ.3.24 లక్షల కోట్లకు పెరిగింది. కాగా, సంస్థ వద్దనున్న నగదు నిల్వలను కూడా పరిగణనలోకి తీసుకుంటే నికర రుణ భారం రూ.1.16 లక్షల కోట్లుగా నమోదైంది.
- కంపెనీకి చెందిన పలు వ్యాపారాలు చేపట్టిన కార్యక్రమాలు భారత ఆర్థిక వ్యవస్థలో ఆయా రంగాల త్వరితగతి వృద్ధికి గణనీయమైన తోడ్పాటును అందించాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ ముకేశ్ అంబానీ అన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి కంపెనీ స్థూల లాభం (పన్నులు చెల్లించక ముందు లాభం) రూ.లక్ష కోట్లు దాటిందని, భారత కార్పొరేట్ రంగంలో ఈ మైలురాయిని చేరిన తొలి కంపెనీ తమదేనని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

దేశీయంగా తయారైన సౌండ్‌బాక్స్ ఆవిష్కరించిన పేటీఎం

న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీలు, యూపీఐ మాధ్యమంలో క్రెడిట్ కార్డు చెల్లింపుల కోసం పేటీఎం దేశీయంగా తయారైన సౌండ్‌బాక్స్‌ను ఆవిష్కరించింది. ఆధునిక సౌండ్‌బాక్స్‌లు మంచి ధ్వని నాణ్యత, మెరుగైన బ్యాటరీ లైఫ్ కలిగి భారతదేశంలోని పరిస్థితులకు మెరుగ్గా సరిపోయేలా ఉంటాయని పేటీఎం వ్యవస్థాపకుడు, సీఈఓ విజయ్ శేఖర్ శర్మ అన్నారు. దేశంలోని వాతావరణంలో ధ్వనులు అధికంగా ఉంటాయి గనుక మెరుగైన సామర్థ్యం గల హైబ్రిడ్ సౌండ్‌బాక్స్‌ల ఆవశ్యకత పెరిగిందని శర్మ చెప్పారు.

కొనసాగిన రికవరీ

సెన్సెక్స్ 560 పాయింట్లు అప్

ముంబై: ఆసియా, యూరోపియన్ మార్కెట్లలో ర్యాలీతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్లో రెండో రోజు కూడా రికవరీ కొనసాగింది. తగ్గిన బ్రెంట్ క్రూడ్ ధరలు ఈ రికవరీకి మరింత మద్దతు ఇచ్చాయి. దీంతో సోమవారం సెన్సెక్స్ 560.29 పాయింట్ల లాభంతో 73,648.62 వద్ద, నిఫ్టీ 189.40 పాయింట్ల లాభంతో 22,336.40 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో ఎన్‌టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మినహా ప్రధాన కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అలాగే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.26 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.93 శాతం లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో యుటిలిటీస్ మినహా అన్ని సూచీలు లాభాల్లో ముగిశాయి. మరోవైపు బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.80 శాతం తగ్గి 86.59 డాలర్ల వద్ద స్థిరపడింది. ఎఫ్ఐఐలు గత శుక్రవారం రూ.129.39 కోట్ల విలువ గల ఈక్విటీలు కొనుగోలు చేశారు.

నా గెలుపు ఖాయం

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' బిగ్ డిబేట్‌లో సీఎం రమేశ్



తెలంగాణలో బీఆర్ఎస్‌ను ప్రజలు మరిచిపోవడానికి వంద రోజులు పట్టింది. కానీ ఆంధ్రలో ఎన్నికల తర్వాత 100 గంటల్లో వైసీపీ కనిపించకుండా పోతుంది.

జగన్ బీజేపీ భుజాన తుపాకీ పెట్టి తప్పులు చేస్తున్నారు. వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డి తప్పకుండా అరెస్టవుతాడు. అన్ని ఆధారాలూ ఉన్నాయి.
- సీఎం రమేశ్

అనకాపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, కేంద్రంలో ఆ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని రాజ్యసభ మాజీ సభ్యుడు, అనకాపల్లి లోక్‌సభ స్థానంలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ అన్నారు. తన విజయం ఖాయమని.. రాష్ట్రంలో జగన్‌ను సాగనంపాలని జనం కసితో ఉన్నారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. తాను ఐదేళ్ల కిందట బీజేపీలో చేరానని.. తన పనితీరు, నడవడిక చూసి మోదీ ఆదేశిస్తేనే అనకాపల్లి నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. సోమవారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన 'బిగ్ డిబేట్‌'లో రమేశ్ ఎన్నో విషయాలు పంచుకున్నారు. ఆ వివరాలు..

ఆర్కే: మొదటిసారి ప్రత్యక్ష ఎన్నికల్లోకి దిగుతున్నారు. టెన్షన్‌గా ఉందా?

సీఎం రమేశ్: నాకెందుకు టెన్షన్! నాకు 30 ఏళ్ల వయసు నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి ఉంది. చిత్తూరు ఎంపీ సీటు జనరల్ కేటగిరీలో ఉన్నప్పుడు టీడీపీ తరఫున పోటీ చేసేందుకు యత్నించాను. చివరి క్షణాల్లో సామాజికవర్గ సమీకరణల్లో ఆదికేశవులునాయుడికి అవకాశం లభించింది. నా కోర్కె ఇన్నాళ్లకు తీరింది. బీజేపీ ఎటువంటి సామాజిక సమీకరణలపై ఆలోచన చేయకుండానే నాకు అనకాపల్లి ఎంపీ సీటు కేటాయించింది.

ఈ సీటు కోసం బీజేపీని ఎలా మాయ చేయగలిగారు?

మీరు మాయ అంటున్నారు. కానీ అధిష్ఠానానికి నా గెలుపు అవకాశాలను వివరించి సీటు తెచ్చుకోగలిగాను. బీజేపీలో సీటు కోసం ఎవరినీ మేనేజ్ చేయలేం. ఐదేళ్ల కిందటే పార్టీలో చేరాను. అదృష్టవశాత్తూ పార్లమెంటులో నా శక్తిసామర్థ్యాలు, పనితీరును అమిత్‌షా చూశారు. టీడీపీలో చంద్రబాబుకు ఎంత దగ్గరగా ఉన్నానో, బీజేపీలో కూడా నెల రోజుల వ్యవధిలోనే మోదీ, అమిత్‌షా వంటి నేతలతో సాన్నిహిత్యం పెంచుకోగలిగాను. రమేశ్‌కు ఏ పని అప్పగించినా సమర్థంగా చేయగలడనే గుర్తింపు పొందగలిగాను. దేశంలో చాలామంది నేతలకు మోదీ, షా వద్దకు వెళ్లాలంటే సాధ్యం కాదు. కానీ నాకు ఆ ఇబ్బంది లేదు. దేవుడి దయతో బీజేపీ పెద్దలతో మంచి సంబంధాలు నెరపగలుగుతున్నాను. తెలంగాణ కాంగ్రెస్‌తో నాకు ఎలాంటి సంబంధాలు లేవు. రేవంత్ రెడ్డి, నేను టీడీపీలో సుదీర్ఘకాలం కలిసి పనిచేశాం. స్నేహం వేరు, రాజకీయాలు వేరు. నాకు అన్ని పార్టీల్లో స్నేహితులున్నారు. ఎలక్టొరల్ బాండ్స్ కాంగ్రెస్‌కు ఇవ్వలేదు. ఆ బాండ్స్‌కు, నాకు ఎటువంటి సంబంధం లేదు. జగన్ పత్రిక తప్పుడు ప్రచారం చేసింది. నాకు చెందిన కంపెనీని 15 సంవత్సరాల కిందటే వదిలేశాను. రాజకీయాల్లోకి వచ్చాక కంపెనీలో జరిగే లావాదేవీలతో నాకు సంబంధం ఉండదు. ఖర్చులకంటారా.. అద్దెల రూపంలో నాకు, నా భార్యకు నెలకు రూ.25-30 లక్షల వరకు ఆదాయం వస్తుంది. రాజ్యసభ సభ్యుడిగా జీతం కూడా వస్తుంది.

చిరంజీవి మద్దతు ఎలా పొందగలిగారు..?

నేను, చిరంజీవి ఒకేసారి రాజ్యసభకు ఎన్నికయ్యాం. అప్పటి నుంచి ఆయనతో సాన్నిహిత్యం కొనసాగుతోంది. ఆర్ఆర్ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంలో ఢిల్లీలో అమిత్‌షా చేతులమీదుగా రామ్‌చరణ్‌కు శాలువా కప్పి సన్మానం చేశాం. ఆ సందర్భంలో చిరంజీవి చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వద్దకు నేనే వెళ్లి అనకాపల్లి నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పాను. అంతే.. ఆయన నా గురించి మాట్లాడుతూ నన్ను గెలిపించాలని కోరారు. కూటమిని రాష్ట్రంలో గెలిపించాలని కూడా కోరారు. చిరంజీవి నా గురించి ఇచ్చిన సందేశాన్ని యూట్యూబ్‌లో లక్షల మంది చూశారు. వైసీపీ వాళ్లు ఆయన్ను కూడా విమర్శిస్తున్నారు. గాంధీమహాత్ముడు సందేశం ఇచ్చినా వాళ్లు విమర్శిస్తారు.

అనకాపల్లి కొత్త ప్రాంతం, మీరు కొత్త వ్యక్తి. అక్కడ రాజకీయాలు ఎలా చేస్తున్నారు..?

శాసనసభకు స్థానికుడు, పార్లమెంటుకు పరిచయాలు, పలుకుబడి కావాలి. నేను ఆ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలతో పాటు దేశంలో అందరికీ తెలుసు. జగన్‌తో కాకుండా నాకున్న పరిచయాలతో దేశంలో ఏ రాష్ట్ర సీఎంతోనైనా నేను డైరెక్ట్‌గా ఫోన్ చేసి మాట్లాడగలను. ఏదైనా సాధించగలననే నమ్మకం ఉంది. బీజేపీ ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా మొట్టమొదట మన అనకాపల్లికే వస్తుందని ప్రజలు నమ్ముతున్నారు. కేంద్రంలో నాకున్న పరిచయాలు వారికి తెలుసు. జగన్ జాబ్ కేలెండర్ అని చెప్పి ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు. నేను ఎంపీ అయితే ఈ ప్రాంతానికి పరిశ్రమలు వస్తాయి. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని నమ్ముతున్నారు.

కడప నుంచి అనకాపల్లి వెళ్లి రాజకీయాలు చేయగలమనే ధైర్యం ఎక్కడిది?

మాడుగుల నియోజకవర్గాన్ని చూస్తే బాధేస్తోంది. మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా ఉండి బూడి ముత్యాల నాయుడు తన సొంత నియోజకవర్గానికే ఏమీ చేయలేకపోయారు. ఎంపీగా ఢిల్లీ వెళ్లి ఏం సాధిస్తారు? అందుకే అనకాపల్లి ప్రాంత ప్రజలు ఆయన్ను వ్యతిరేకిస్తున్నారు. అనకాపల్లి ప్రజలు స్థానికుడా, స్థానికేతరుడా అని చూడడం లేదు. నా పనితనాన్ని చూసి ఆదరిస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా కూటమిలో నాయకులు, ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు. అనకాపల్లిలో కూటమి తరఫున గెలిచి, ఉత్తరాంధ్రలో ఎర్రన్నాయుడు లేని లోటు తీరుస్తా. విశాఖలో రాజధాని ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుకోవడం లేదు.

బీజేపీకి అనకాపల్లిలో ఓటు బ్యాంకు లేదు.. మీ ధైర్యం ఏంటి..?

గత ఎన్నికలు వేరు. ఈసారి ఎన్నికలు వేరు. ఈ ఐదేళ్లలో మోదీ ప్రభుత్వం అన్ని ప్రాంతాలను బాగా అభివృద్ధి చేసింది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడం వల్ల నా విజయం నల్లేరు మీద నడకేనని నమ్ముతున్నాను. నియోజకవర్గంలో బీజేపీ ఓటు శాతం కూడా పెరిగింది. అన్నిటికంటే ముఖ్య విషయం ఏమిటంటే.. జగన్‌ను ఎప్పుడు గద్దె దించాలా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆయన్ను దించాలని కసితో ఉన్నారు. చిన్నాన్న వివేకానంద రెడ్డిని చంపిన అవినాశ్‌రెడ్డిని పక్కన పెట్టుకుని హత్య ఎవరు చేశారో దేవుడికి తెలుసని జగన్ అంటున్నాడు. ఆడబిడ్డలకు న్యాయం చేస్తానంటున్న ఆయన.. ఇంట్లో ఆడబిడ్డలకే న్యాయం చేయలేకపోయాడు. జగన్ ఏ తప్పు చేసినా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతో చెప్పే చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారు. ఈ విషయాన్ని మా పార్టీ పెద్దలకు చెప్పాం. నడ్డా, అమిత్‌షా.. జగన్ గురించి క్లారిటీగా చెప్పారు. అవినాశ్‌రెడ్డిని సీబీఐ తప్పకుండా అరెస్టు చేస్తుంది. హత్య వెనుక ఉన్నవారు కూడా బయటకు వస్తారు. ఈ హత్యతో జగన్‌కు, భారతికి ప్రమేయం ఉందని ప్రజలకు తెలుసు. కడపలో షర్మిల, సునీత ప్రచారంతో జగన్‌కు బాగా నష్టం జరుగుతుంది. ఇంటిలో ఆడబిడ్డకు అన్యాయం చేసిన ఆయనకు శాపం తగులుతుంది.

టీడీపీతో పొత్తును మోదీ అయిష్టంగానే ఒప్పుకొన్నారన్న మాట వాస్తవమేనా?

బీజేపీలో అమిత్‌షాను, మోదీని ఎవరూ ప్రభావితం చేయలేరు. జగన్ అవినీతి, అక్రమాలు వారికి తెలుసు. ఇసుక, మైనింగ్, లిక్కర్, అరాచకాలు.. అన్నీ తెలుసు. కేంద్ర పథకాలకు తన స్టిక్కర్లు వేసుకుంటున్నారని కూడా తెలుసు.

జగన్‌కు ప్రధాని ఆశీస్సులున్నాయని అంటున్నారు? సీఎంపై చిన్న దాడి జరిగితే ఆయన స్పందించడాన్ని ప్రజలు ఏమనుకోవాలి?

జగన్‌పై దాడిని ఆయన రేత మీడియాతో పాటు మరి కొందరు హత్యాయత్నంగా చిత్రీకరించారు. అది చూసి మోదీ ట్వీట్ చేసి ఉండవచ్చు. తర్వాత అంతా మోసమని బీజేపీ పెద్దలకు తెలిసింది. జగన్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేక తను చూసి చిలకలూరిపేట సభలో ఆయన పేరు కూడా చెప్పడానికి మోదీ ఇష్టపడలేదు. త్వరలో అనకాపల్లి సభకు ప్రధాని వస్తున్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం, మోదీ ప్రధాని కావడం ఖాయం.

రాష్ట్రంపై ఈసీ ప్రత్యేక నిఘా

- ఎన్నికలకోడ్ తర్వాతా కొనసాగుతున్న హింస
- ఓటరు జాబితా,హింసా ఘటనలపై ఈసీ సీరియస్
- హింసా ఘటనలకు కలెక్టర్, ఎస్పీలదే బాధ్యత
- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా హింసాత్మక సంఘటనలు జరగడంతో ఏపీని సమస్యాత్మక (సెన్సిటివ్) రాష్ట్రంగా ఈసీఐ చూస్తోందన్నారు. ఈ కారణంగానే రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక పోలీస్ పరిశీలకుడిని నియమించిందని చెప్పారు. సోమవారం అమరావతి సచివాలయంలోని తన కార్యాలయంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. "రాష్ట్రం నుంచి ఫిర్యాదులు కేంద్రఎన్నికల సంఘానికి ఎక్కువగా వెళ్లాయి. ఇంతముందు ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు వచ్చాయి. హింసాత్మక సంఘటనలు, ఓటర్లకు నగదు పంపిణీ, తాయిలాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి అందుతున్నాయి. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం...మొదటిసారి రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను పంపించింది. రాష్ట్రానికి వచ్చి అన్ని శాఖల అధికారులతో వీరు సమీక్షలు నిర్వహించారు. అనంతరం వారు ఢిల్లీకి వెళ్లారు. ప్రత్యేక పరిశీలకులతోపాటు 25 పార్లమెంటు స్థానాలకు 25 మంది ప్రత్యేక పోలీస్ పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. రాష్ట్రంలో రోజూ హింస చెలరేగడంపైనా కేంద్ర ఎన్నికల సంఘం నిఘా ఉంది. ఇప్పటికే ఆరుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లను బదిలీ చేసింది. కోడ్ అమల్లో ఉండగా రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై ముగ్గురు ఎస్పీలను పిలిచి మాట్లాడాను. వారి వివరాలను ఈసీఐకి పంపగా, వారిలో ఇద్దరిని బదిలీ చేశారు. హింసరహిత ఎన్నికలు ఈసీ లక్ష్యం. ఈ విషయంలో పోలీసులదే ప్రధాన బాధ్యత. జిల్లాల స్థాయిలో ప్రతి అంశానికీ కలెక్టర్లు, ఎస్పీలదే బాధ్యత" అని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..



"సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌పై ప్రతిపక్ష పార్టీలనుంచి కేంద్ర ఎన్నికల సంఘానికి రెండు, మూడు ఫిర్యాదులు వెళ్లాయి. వాటిపై కేంద్ర ఎన్నికల సంఘం నివేదిక అడిగింది. ఏ అధికారిపై ఫిర్యాదు వచ్చిందో వారందరి దగ్గర నుంచి వివరణ తీసుకుని వారంరోజుల క్రితం కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాం. ఈసీఐ దృష్టిలో ఈ అంశం ఉంది"

"మంత్రులకు వర్తించే మోడల్ కోడ్ ప్రభుత్వ సలహాదారులకు కూడా వర్తిస్తుంది. సలహాదారులది రాజకీయ నియామకం. వారు రాజకీయ ప్రచారం చేసుకోవచ్చు, ప్రకటనలు కూడా ఇవ్వొచ్చు. కానీ, దాని కోసం ప్రభుత్వ కార్యాలయాలు, సదుపాయాలు, ప్రభుత్వ సిబ్బందిని వినియోగించరాదు. వారిని తమ వెంట ఉంచుకోరాదు"
- ముఖేశ్‌కుమార్ మీనా

స్పందించని అధికారులపై చర్యలు

"పోలీసులు బ్యాలెన్స్‌డ్ మ్యానర్‌లో వ్యవహరించాలని ఆదేశించాం. హింసాత్మక సంఘటనలపై వెంటనే స్పందించని అధికారులపై చర్యలు ఉంటాయి. కేంద్ర ఎన్నికల సంఘం... వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయవద్దని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఈ పంపిణీ తీరుపై ప్రతిపక్ష పార్టీ నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పెన్షన్ల పంపిణీలో ఇబ్బంది జరిగిందని, కొంత మంది చనిపోయారంటూ ఈసీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఎందుకు జరిగింది, ఏం జరిగింది అనేది ప్రభుత్వం నుంచి వివరణ తీసుకుని ఎన్నికల సంఘానికి నివేదిక పంపాం. దీనిపై ఎన్నికల సంఘం నిర్ణయం రావాల్సి ఉంది. పోస్టల్ బ్యాలెట్లను ఆర్వోలు తీసుకోవడంలేదనే ఫిర్యాదులు వచ్చాయి. రెండురోజులక్రితం పూర్తి స్థాయి మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులకు ఇచ్చాం"

వారిని ఎయిర్‌లిఫ్ట్ చేస్తాం..

"రాష్ట్రంలో పోలింగ్‌కు వారంరోజుల ముందు స్లిప్‌లు ఇంటింటికి వెళ్లి అందిస్తాం. దానివల్ల అక్కడ ఓటరు ఉన్నారా లేదా..వెళ్లిపోయారా..డూప్లికేటా... అనేది తెలుస్తుంది. దాని ఆధారంగా ఏ.ఎస్.డి. (ఆబ్సెన్స్, షిఫ్టెడ్, డెడ్) లిస్ట్ తయారు చేస్తాం. ఆ లిస్ట్ ను ఆర్వో ద్వారా ప్రతి పోలింగ్ స్టేషన్‌కు పంపుతాం. పోలింగ్ రోజు పోలింగ్ ఏజెంట్లకు కూడా ఇస్తాం. రాష్ట్రంలో 12,500 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అక్కడ ఎక్కువ భద్రత ఏర్పాట్లు చేస్తాం. వాటిలో వెబ్ కాస్టింగ్ చేస్తాం. రంపచోడవరం నియోజకవర్గంలోని ఆరు పోలింగ్ స్టేషన్లు చాలా దూరంగా ఉన్నాయి. ఆ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయాన్ని తగ్గించాం. ఎన్నికలు నిర్వహించడానికి ఉద్యోగులు ఈ పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో వెళ్లవచ్చు. పోలింగ్ ముగిసిన తర్వాతచీకటి కారణంగా వాహనాల్లో తిరిగి రావడం కష్టం. అందువల్ల వారిని, పోలింగ్ సామగ్రిని ఏయిర్ లిఫ్ట్ చేస్తాం." "ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్రంలో హోంగార్డ్స్‌తో కలిపి సివిల్ పోలీసులు లక్షా 14 వేల మంది అవసరం. సుమారు 490 వరకు సీఏపీఎఫ్, ఎస్ఏపీఎఫ్ బలగాలు కావాలి. అయితే, ఏపీలో సివిల్ పోలీసులు, హోంగార్డులు కలిపి 25 వేలకు మించి లేరు. ఇతర రాష్ట్రాల నుంచి పోలీస్ ఫోర్సును తీసుకొచ్చే అంశంపై కేంద్ర హోం సెక్రటరీతో సంప్రదింపులు జరిపాం. తెలంగాణ, ఏపీకి ఒకే రోజు పోలింగ్ జరుగుతుంది కాబట్టి ఇప్పటికే సరిహద్దులను కట్టడి చేశాం. పోలింగ్ రోజు పూర్తిగా సీజ్ చేస్తాం. తెలంగాణలో ఓటు వినియోగించుకున్నవారు ఆంధ్రలోనూ వినియోగించుకోనున్నారని ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. ఆ దిశగా తనిఖీలు చేయడానికి సరిహద్దుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాం"

21 వందల టీమ్‌లు... రూ. 145 కోట్లు సీజ్

"రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి 16 తేదీ నుంచి ఇప్పటి వరకు రూ145 కోట్లు నగదు, లిక్కరు, బంగారం, వెండి, ఇతర లోహాలను సీజ్ చేశాం. 21 వందల టీమ్‌లు పనిచేస్తున్నాయి. లిక్కర్ తయారీ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మ్యాన్‌ఫ్యాక్చరింగ్ నుంచి స్టోరేజ్ పాయింట్‌కు లిక్కరు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేశాం. లిక్కరు తీసుకెళ్లే వాహనాలను ట్రాకింగ్ చేస్తున్నాం."

రాజీనామా చేసినా వలంటీర్లపై కన్ను

"వలంటీర్లను సర్వీస్ నుంచి తొలగించినా, వారు రాజీనామా చేసినా.. ఎన్నికలు ముగిసేవరకు వారిపై ఈసీ నియంత్రణ ఉంటుంది. వారు డబ్బులు పంచడం వంటి పనులు చేస్తే చర్యలు తీసుకుంటాం.

పెమ్మసాని ఆస్తులు రూ.5,705 కోట్లు

- అమెరికా, హైదరాబాద్, విజయవాడ గుంటూరులో చంద్రశేఖర్‌కు ఆస్తులు
- రోల్స్‌రాయిస్ ఘోస్ట్, బెంజ్ కార్లు సొంతం
- దేశంలోని ధనిక ఎంపీ అభ్యర్థుల్లో ఒకరు
- కుటుంబం అప్పులు రూ.1,038 కోట్లు
- గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ అభ్యర్థిగా టీడీపీ తరఫున ప్రవాస భారతీయుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో మొత్తం ఆస్తులను రూ.5,705.47 కోట్లుగా పేర్కొన్నారు. మొత్తం 37 పేజీల అఫిడవిట్‌లో ఆయన తన కుటుంబ ఆస్తుల వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఓ సాధారణ కుటుంబంలో పుట్టి వైద్య వృత్తి ద్వారా అంచెలంచెలుగా ఎదిగిన ఆయన.. అమెరికా, గుంటూరు, కృష్ణా జిల్లాలు, తెలంగాణలోని హైదరాబాద్‌లో ఆస్తులను సమకూర్చుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంతపెద్ద మొత్తంలో స్థిర చరాస్తులను ఏ అభ్యర్థీ చూపించకపోవడం గమనార్హం. ఒకవిధంగా దేశంలోని అత్యంత ధనిక ఎంపీ అభ్యర్థుల్లో పెమ్మసాని ఒకరుగా ఉన్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పెమ్మసాని కుటుంబం కొన్నేళ్ల పాటు నరసరావుపేటకు వలస వెళ్లి అక్కడ నివాసం ఉన్నది. అప్పట్లోనే పెమ్మసాని ఎంసెట్‌లో 27వ ర్యాంకు సాధించి ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతరం ఎండీ చేయడానికి అమెరికా వెళ్లారు. సొంతంగా మెటీరియల్ తయారు చేసుకుని ఎండీని పూర్తి చేశారు. అప్పట్లో ఆయన రూపొందించిన మెటీరియల్ నేటికీ అక్కడి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అలా అమెరికాలో ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగారు. యూఎస్‌లో వివిధ రూపాల్లో రూ.28.93 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. జేపీ మోర్గాన్ వంటి బ్యాంకులో డిపాజిట్లు ఉన్నాయి. పెమ్మసాని పేరు మీద రూ.519 కోట్లు, ఆయన సతీమణి కోనేరు శ్రీరత్న పేరుతో మరో రూ.519 కోట్లు అప్పులు ఉన్నాయి.



పెమ్మసాని కుటుంబానికి చరాస్తులు ఎక్కువగా ఉన్నాయి. పెమ్మసాని పేరు మీద రూ.2,316 కోట్లు, ఆయన సతీమణి శ్రీరత్న పేరుతో రూ.2,289 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. పిల్లల్లో ఒకరి పేరుతో రూ.496 కోట్లు, మరొకరి పేరు మీద రూ.496 కోట్ల చరాస్తులున్నాయి. స్థిరాస్తులు పెమ్మసాని పేరుతో రూ.69.33 కోట్లు, భార్య పేరుతో రూ.25 కోట్లు ఉన్నాయి. పెమ్మసానికి 181 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆయన సతీమణికి 2.5 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. కుటుంబం పేరుతో రూ.4.20 లక్షల విలువైన 5.5 కేజీల వెండి ఆభరణాలున్నాయి. సొంతం గా మెర్సిడెస్ బెంజ్-ఎస్ క్లాస్, సీ క్లాస్, టెస్లా మోడల్ ఎక్స్ క్లాస్, రోల్స్ రాయిస్ ఘోస్ట్, టోయోటా ఫార్చునర్ కార్లు ఉన్నాయి. వీటి విలువ వచ్చి రూ.6.11 కోట్లు ఉంది.

పెమ్మసాని సోదరుడి ఆస్తి 1,655 కోట్లు

గుంటూరు లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థి పెమ్మసాని సోదరుడు పెమ్మసాని రవిశంకర్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఏ కారణంతో అయినా చంద్రశేఖర్ నామినేషన్ తిరస్కరణకు గురైతే అప్పుడు రవిశంకర్ టీడీపీ అభ్యర్థి అవుతారు. ఈ సందర్భంగా రవిశంకర్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆయన ఆస్తులు రూ.1,655 కోట్లుగా పేర్కొన్నారు. రవిశంకర్ పేరు మీద స్థిర చరాస్తులు రూ.593.68 కోట్లు, ఆయన సతీమణి చోడే జ్యోతి పేరుతో రూ.542.87 కోట్లు ఉన్నట్టు తెలిపారు. కుమారుడు అర్జున్ పేరుతో రూ.260.30 కోట్లు, కుమార్తె సంజన పేరుతో రూ.260.34 కోట్ల ఆస్తులు ఉన్నాయి.



బొత్స ఆస్తులు 19.76 కోట్లు!

- అఫిడవిట్‌లో విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ వెల్లడి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

విశాఖ లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తమ కుటుంబానికి రూ.19.76 కోట్ల ఆస్తులున్నట్టు తెలిపారు. బొత్స ఝాన్సీ వద్ద రూ.4.5 లక్షలు, బొత్స సత్యనారాయణ వద్ద రూ.4.75 లక్షల నగదు ఉందన్నారు. ఝాన్సీ వద్ద 325 తులాలు, సత్యనారాయణ వద్ద 31 తులాల బంగారం ఉంది. చరాస్తులు ఝాన్సీ వద్ద రూ.4.75 కోట్లు, ఆమె భర్త వద్ద రూ.3.78 కోట్లు ఉన్నాయి. స్థిరాస్తుల విలువ(భూమి, భవనాలు) ఝాన్సీ పేరిట రూ.4.46 కోట్లు, ఆమె భర్త పేరిట రూ.6.75 కోట్లు ఉన్నట్టు తెలిపారు. ఝాన్సీకి రూ.2.32 కోట్లు, సత్యనారాయణకు రూ.1.92 కోట్ల అప్పులు ఉన్నాయి.

గీత ఆస్తులు రూ.29.15 కోట్లు

పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత తన వద్ద రూ.29.15 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ప్రకటించారు. 2019లో కాకినాడ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసే సమయానికి, ఇప్పటికి ఆస్తులు రూ.9 కోట్ల మేరకు పెరిగాయి. తాజా అఫిడవిట్‌లో తనవద్ద రూ.20 లక్షల నగదు ఉండగా, ఐదు బ్యాంకు ఖాతాల్లో రూ.18.80 లక్షలు, ఆమె భర్త కాశీ విశ్వనాథ్‌వద్ద రూ.8.50 లక్షల నగదు ఉందని తెలిపారు. క్వాలిస్, ఇన్నోవా కార్లు, హీరోహోండా సీబీజెడ్ మోటార్ బైక్ ఉందని పేర్కొన్నారు. గీత వద్ద 2 కిలోల బంగారం ఉండగా, భర్త వద్ద 300 గ్రాముల బంగారం ఉందని తెలిపారు. భూములు, ఇళ్లస్థలాలు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు కలిపి స్థిరాస్తుల విలువ రూ.13.11 కోట్లు ఉందన్నారు.

శ్రీభరత్ ఆస్తులు రూ.393.41 కోట్లు

విశాఖ లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేస్తున్న ఎం.శ్రీభరత్, ఆయన భార్య తేజస్విని పేరిట రూ.393.41 కోట్ల స్థిర, చర ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శ్రీభరత్ వద్ద నగదు రూ.2,79,974, బంగారం 750 గ్రాములు, వెండి 51.8 కిలోలు ఉన్నాయి. చరాస్తుల విలువ రూ.16.89 కోట్లుగా పేర్కొన్నారు.

ద్వారంపూడి ఆస్తులు రూ.77.43 కోట్లు

కాకినాడ సిటీ వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తనకు రూ.77.43 కోట్ల ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అప్పులు రూ.51.45 కోట్లు ఉన్నట్టు తెలిపారు. ద్వారంపూడికి ఇన్నోవా కారు, ఆయన భార్యకు హోండాసిటీ వెర్నా కారు ఉన్నాయి. ద్వారంపూడికి 134 గ్రాముల బంగారం, 150 కిలోల వెండి ఉన్నాయి. ఆయన భార్య మహాలక్ష్మికి 3.3 కిలోల బంగారం, 110 కిలోల వెండి ఉన్నాయి. అయితే, ద్వారంపూడి ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్‌లో 2018-19లో రూ.15.6 లక్షల ఆదాయం చూపించగా, 2022-23లో రూ.78.08 లక్షలకు పెరిగింది. కాగా, రాజమహేంద్రవరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా గిడుగు రుద్రరాజు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు.

అచ్చెన్నపై 24 కేసులు

- టెక్కలిలో నామినేషన్.. భారీగా తరలివచ్చిన శ్రేణులు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా వందల మంది కూటమి పార్టీల కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చారు. ఇక, ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై 24 కేసులున్నట్టు వెల్లడించారు. వీటిలో 11 కేసులు హౌస్ అరెస్టులేనని, మిగిలినవి వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నడుస్తున్నాయని పేర్కొన్నారు.

ధరావత్తుగా చిల్లర నాణేలు

శ్రీకాకుళం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ సమయంలో ధరావత్తు సొమ్మును చిల్లర నాణేల రూపంలో అందించడంతో, వాటిని లెక్కించేందుకు అధికారులు ఇబ్బంది పడ్డారు. శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా బీఎస్పీకి చెందిన నాయుడుగారి రాజశేఖర్ సోమవారం నామినేషన్ వేశారు. ధరావత్తు సొమ్ముగా రూ.5,21 నాణేలను తీసుకొచ్చి అధికారుల ముందు ఉంచారు. వాటిని అధికారులు లెక్కించగా రూ.10వేలు ఉన్నాయి.

వలంటీర్ల రాజీనామాలు ఆమోదించొద్దు

- సీఎస్‌కు ఆదేశాలివ్వాలంటూ హైకోర్టులో రిట్ పిటిషన్

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తేదీ సమీపిస్తున్న ఈ దశలో గ్రామ-వార్డు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించేలా కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ)కు ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. వలంటీర్ల రాజీనామాలు ఆమోదిస్తే వైసీపీకే మేలు జరుగుతుందన్నారు. అత్యవసరంగా విచారణ జరపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర సోమవారం హైకోర్టును కోరారు. మంగళవారం విచారణ జరుపుతామని న్యాయమూర్తి జస్టిస్ బీ.కృష్ణమోహన్ తెలిపారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి

- ముగ్గురికి తీవ్ర గాయాలు.. పల్నాడు జిల్లాలో ఘటన

సత్తెనపల్లి, ఏప్రిల్ 22: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన-పెదకూరపాడు మధ్యలోని పెట్రోల్‌బంకు వద్ద సోమవారం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్‌కు వెళ్లేందుకు పెదమక్కెనకు చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నేతలు మత్తుపల్లి మేరిబాబు, దిడ్ల నాగరాజు తదితరులు పెట్రోల్ కొట్టిస్తున్నారు. ఈ సమయంలో వారు జై బాలయ్య.. జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు. అదే సమయంలో పెదకూరపాడులో నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న వైసీపీ కార్యకర్తలు పెట్రోల్ బంకు వద్ద నినాదాలు చేస్తున్న టీడీపీ కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడటంతో వారిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

టీడీపీ కార్యాలయానికి నిప్పు

బెల్లంకొండ, ఏప్రిల్ 22: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ కార్యాలయాన్ని దహనం చేశారు. ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. వైసీపీ నాయకులే టీడీపీ కార్యాలయాన్ని దహనం చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు సోదరి రాణిరుద్రమదేవి ప్రచారానికి రాగా వైసీపీ నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారన్నారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వారని తెలిపారు. ఈ క్రమంలోనే కార్యాలయానికి నిప్పు పెట్టారన్నారు. తొమ్మిది మందిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రధాని మోదీపై కేసు నమోదు చేయండి

- సీఈసీకి మానవ హక్కుల వేదిక లేఖ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 'రాజస్థాన్‌లోని బన్స్వారాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ద్వేషపూరిత ప్రసంగం చేశారు. ఆయనపై కేసు నమోదు చేయాలి' అని మానవ హక్కుల వేదిక విజ్ఞప్తి చేసింది. ఈమేరకు వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, కార్యదర్శి జి.రోహిత్ సోమవారం సీఈసీ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. 'దేశంలో హింసను ప్రేరేపించి, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రధాని మోదీ ద్వేషపూరిత ప్రసంగం చేశారు. అది ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉంది. ప్రధాని ప్రసంగాన్ని పరిశీలించి, కేసు నమోదు చేయాలి' అని కోరారు.


నా కాళ్లు పట్టుకున్నారని ప్రమాణం చేస్తా!

- నేను బంగారం కాజేసినట్టు పెద్దిరెడ్డి ప్రమాణం చేస్తారా?:కిరణ్

పుంగనూరు, ఏప్రిల్ 22: 'డీసీసీ పదవి కోసం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నా కాళ్లు పట్టుకున్నట్లు తరిగొండ, కాణిపాక ఆలయాల్లో ప్రమాణం చేస్తా, నేను సత్యసాయిబాబా బంగారాన్ని కాజేసినట్లు పెద్దిరెడ్డి అయ్యప్ప ఆలయంలో ప్రమాణం చేస్తారా?' అని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సవాలు విసిరారు. పుట్టపర్తిలో సత్యసాయిబాబా చనిపోయిన తర్వాత ట్రస్ట్ బంగారాన్ని తాను కాజేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి ఆరోపించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చిత్తూరు జిల్లా పుంగనూరులో ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి భూదందాలతో రైతులను దోపిడీ చేశారని ఆరోపించారు. నాలుగేళ్లలో పాల రైతుల సొమ్ము రూ.132కోట్లు లూటీ చేశారని దుయ్యబట్టారు.

ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024
ప్రజా అజెండా
ఆంధ్రజ్యోతి
మంగళవారం ◇ 23-4-2024

జన చైతన్యం



అభివృద్ధి.. సంక్షేమం.. సమన్యాయం..

కౌంట్ డౌన్ 20 రోజులు

కోడికత్తి ఒక బూటకం! బాబాయ్ హత్యపై తప్పుడు నాటకం! వీటన్నింటికంటే ముందే... 2019 ఎన్నికలు మరో ఏడాది ఉండగానే ఒక భారీ నీచ నాటకానికి వైసీపీ తెర లేపింది. అదే... పింక్ డైమండ్! ప్రజల మనసులను కలుషితం చేసి, అనుమానపు బీజాలు నాటి... దాని ఆధారంగా అధికారంలోకి రావడమే ఈ నాటకం లక్ష్యం.





పింక్ డైమండ్ ఎక్కడ జగన్?

సినిమా టైటిల్: 'పింక్ డైమండ్ పాయె'
మూల కథ, నటన: రమణ దీక్షితులు
సహ నటుడు: విజయసాయి రెడ్డి
వాయిద్య సహకారం: జగన్ రోత పత్రిక
స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం
వైసీపీ సెంట్రల్ ఆఫీస్



- 2019 ఎన్నికల ముందు చేసిన రచ్చ మరిచారా?
- నాడు అధికారం కోసం టీడీపీ, టీటీడీపై బురద
- శ్రీవారి పింక్ డైమండ్ పోయిందంటూ డ్రామా
- రమణ దీక్షితులుతో ఆరోపణలు, అభాండాలు
- విజయసాయి, జగన్ రోత పత్రిక అదనపు అల్లికలు
- అలాంటి వజ్రమే లేదని తేల్చిన విచారణ కమిషన్లు
- అధికారంలోకి రాగానే 'ముఠా' మొత్తం గప్‌చుప్




'ఎన్నికల్లో గెలిచేందుకు ఎంత నీచానికైనా సిద్ధం'.. ఇదీ వైసీపీ సిద్ధాంతం!

2019 ఎన్నికలకు ఏడాది ముందు నుంచి నడిపిన 'పింక్ డైమండ్ పాయె' నాటకమే దీనికి నిదర్శనం. ఎవరు పడితే వారు చెబితే జనం నమ్మరని... ఏకంగా అప్పటి టీటీడీ ప్రధానార్చకుడు రమణ దీక్షితులునే రంగంలోకి దించారు. ఆయన... 'పింక్ డైమండ్' అనే కథ అల్లారు. 'వైసీపీ క్యాంప్' దర్శకత్వంలో అద్భుతమైన నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. విజయసాయి రెడ్డి 'సహాయ నటుడి'గా వ్యవహరించారు. జగన్ రోత పత్రిక ఈ స్క్రీన్‌ప్లేకు 'అదనపు' అల్లికలు జత చేసింది. వెరసి... 'పింక్ డైమండ్' పేరుతో గల్లీ నుంచి ఢిల్లీ దాకా దాదాపు ఏడాదిపాటు రచ్చ చేశారు.

నీచ నాటకానికి ఇలా బీజం

వజ్ర, వైఢూర్య, మరకత, మణి, మాణిక్యాదులు పొదిగిన అపురూప ఆభరణాలు ఎన్నెన్నో శ్రీవారికి ఉన్నాయి. నాటి రాజుల నుంచి నేటి భక్తుల వరకు కానుకలు సమర్పిస్తూనే ఉన్నారు. అయితే.... ఇందులో 'పింక్ డైమండ్' అనేది ఒకటుందని, అది మాయమైపోయిందని 2018 మే నెలలో అప్పటి ఆలయ ప్రధానార్చకుడు రమణ దీక్షితులు చెన్నైలో ప్రెస్ మీట్ పెట్టి చెప్పారు. శ్రీవారికి అలంకరించే ఆభరణాల్లో పింక్ డైమండ్ 2001 నుంచీ కనిపించడం లేదన్నారు. వెంకటేశ్వరుడితో ముడిపడిన వ్యవహారం కావడం... పైగా ప్రధానార్చకుడే ఈ ఆరోపణలు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రమణ దీక్షితులు అంతటితో ఆగలేదు. రకరకాల వేదికలపై రకరకాల ఆరోపణలు చేస్తూ వచ్చారు. జెనీవాలో రూ.500 కోట్లకు అమ్ముడుపోయిన డైమండ్ శ్రీవారిదే కావచ్చునంటూ నాటకాన్ని రక్తి కట్టించారు. "శ్రీవారికి పల్లవ, చోళ రాజులతోపాటు కృష్ణదేవరాయలు, మైసూరు మహారాజు వంటి నాటి పాలకులు కానుకలుగా సమర్పించిన ఆభరణాలు కనిపించడం లేదు. ఇపుడు దేవుడికి అలంకరిస్తున్న నగలన్నీ ఇటీవల కానుకలుగా అందినవే" అని కూడా చెప్పారు. 'పింక్ డైమండ్' కథకు 'నేల మాళిగ' అధ్యాయాన్నీ జోడించారు. "2017 డిసెంబరు 8వ తేదీన పోటు శాలను మూసివేశారు. నేను వెళ్లి... చిన్న రంధ్రం ద్వారా లోపలికి చూశాను. అక్కడంతా భూకంపం వచ్చినట్లుగా ఉంది. వంటగదిలో నిధులు ఉన్నాయనే అక్కడ తవ్వకాలు జరిపారు" అంటూ రమణదీక్షితులు మరో కథ చెప్పారు. అంతేకాదు... సీఎం (చంద్రబాబు), మేడమ్ అనుమతితోనే ఈ పనులు చేసినట్లు జేఈవో చెప్పారని... 'మేడమ్' ఎవరో తనకు తెలియదని ఈ నాటకాన్ని మరింత రక్తి కట్టించారు.



వంత పాడిన విజయసాయి

రమణ దీక్షితులు ఇలా ఆరోపణలు చేయగానే... వైసీపీ కీలక నేత విజయసాయిరెడ్డి వాటిని అలా అందుకున్నారు. హైదరాబాద్, వైజాగ్, ఢిల్లీ తదితర చోట్ల ఆయన ప్రెస్‌మీట్లు పెట్టి టీడీపీ సర్కారుపై ఆరోపణలు చేశారు. మరో అడుగు ముందుకేసి... శ్రీవారికి చెందిన కొన్ని విలువైన ఆభరణాలు, పింక్ డైమండ్ చంద్రబాబు వద్దే ఉన్నాయని తేల్చేశారు. కేంద్ర బలగాలతో వెంటనే చంద్రబాబు నివాసంలో తనిఖీలు చేపడితే అవన్నీ దొరుకుతాయన్నారు. దీనిపై చీటికీ మాటికీ ట్విటర్‌లో అవాకులూ చెవాకులూ పోస్ట్ చేస్తూ వచ్చారు. రమణ దీక్షితులు, ఇటు విజయసాయి మైకుల ముందు నోటికొచ్చినట్లు చెప్పిన కథలను... జగన్ రోత పత్రిక మరింత మసాలా జోడించి ప్రచురించింది. ఉత్సవాల సందర్భంగా శ్రీవారికి అలంకరించిన పింక్ డైమండ్ పగిలి కింద పడిపోయిందని, దానినే చంద్రబాబు తీసుకెళ్లి ఇంట్లో పెట్టుకున్నారని, ఆ తర్వాత జెనీవాలో రూ.500 కోట్లకు అమ్ముకున్నారని రకరకాల ప్రచారాలు చేసింది.

లేదూ, కాదూ అని మొత్తుకున్నా..

శ్రీవారి నగల జాబితాలో పింక్ డైమండ్ పొదిగిన నగ ఏదీ లేదని టీటీడీ పదేపదే వివరణ ఇచ్చింది. అప్పటి టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అంతకుముందు ఈవోగా పని చేసిన ఎల్వీ సుబ్రమణ్యం దీనిపై స్పష్టత ఇచ్చారు. 'పింక్ డైమండ్ లేనే లేదు. గరుడ సేవలో భక్తులు విసిరిన నాణేలు తగిలి కెంపు ఒకటి ముక్కలైంది. దాని విలువ కేవలం 50 రూపాయలని అప్పటి టీటీడీ ఈవో ఐవైఆర్ కృష్ణారావు స్వయంగా నిర్ధారించారు. కానీ... అది పింక్ డైమండ్ అంటూ రమణ దీక్షితులు తప్పుదారి పట్టిస్తున్నారు" అని టీటీడీ మాజీ సీవీఎస్‌వో రమణ కుమార్ కూడా స్పష్టం చేశారు. మిరాశీ వ్యవస్థ రద్దయినప్పటి నుంచీ తామే శ్రీవారి పోటులో ప్రసాదాలు చేస్తున్నామని, రమణ దీక్షితులు చెబుతున్నట్లుగా అక్కడ తవ్వకాలే జరగలేదని పోటు కార్మికులు తెలిపారు. శ్రీవారికి ఆగమోక్తంగా కైంకర్యాలు జరుగుతున్నాయని ఇతర అర్చకులు స్పష్టం చేశారు. అయినా సరే... రమణ దీక్షితులు, విజయసాయి రెడ్డి ఒక వ్యూహం ప్రకారం ఆరోపణలు చేస్తూనే వచ్చారు.

చెరి వంద కోట్లకు పరువునష్టం కేసు

రమణ దీక్షితులు, విజయసాయి రెడ్డి ఆరోపణలతో టీటీడీ ప్రతిష్ఠ దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. దానికి తోడు నాటి సీఎం చంద్రబాబుపై కూడా ఆరోపణలు చేయడంతో ప్రభుత్వ ప్రతిష్ఠకూ ఇబ్బందిగా మారింది. దీంతో టీటీడీ వెంటనే నష్ట నివారణ చర్యలకు దిగింది. వయో పరిమితి కారణం చూపుతూ రమణ దీక్షితులను ప్రధాన అర్చకుడి పదవి నుంచీ తొలగించింది. ఆయనతో పాటు విజయసాయిరెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. వారు స్పందించకపోవడంతో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా టీటీడీతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన కారణంగా రమణ దీక్షితులు, విజయసాయిరెడ్డిలపై టీటీడీ చెరి రూ.వంద కోట్లకు పరువు నష్టం దావా వేసింది. నిబంధనల ప్రకారం రూ.2 కోట్లను డిపాజిట్‌గా చెల్లించింది.

అధికారంలోకి రాగానే గప్‌చుప్

2018 మే నుంచీ 2019 మే దాకా... ఎన్నికల ఏడాదంతా 'పింక్ డైమండ్'ను వైసీపీ వదల్లేదు. తప్పుడు ప్రచారం చేస్తూనే ఉంది. దీంతోపాటు అనేక కుట్రలు, కుయుక్తులు పన్ని... అధికారంలోకి వచ్చింది. అంతే... 'పింక్ డైమండ్ పాయె' చిత్రాన్ని అంతటితో ముగించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అటు రమణ దీక్షితులుకానీ, ఇటు విజయసాయిరెడ్డికానీ దీనిపై నోరు మెదపలేదు. అసలా విషయమే తెలియనట్లుగా మౌనంగా ఉండిపోయారు. వారిద్దరిపై అంతకు ముందు టీటీడీ వేసిన పరువు నష్టం దావాను వెనక్కి తీసుకోవాలని 2020 ఫిబ్రవరి 29న జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానం చేశారు. టీటీడీ న్యాయవాదులు అదే ఏడాది సెప్టెంబరు 14న కోర్టులో కేసు వాపసు తీసుకుంటున్నట్లు (ఐఏ నంబరు 158-2020) పిటిషన్ వేశారు. కానీ... కోర్టుకు డిపాజిట్‌గా చెల్లించిన రూ.2 కోట్లకు బాధ్యత ఎవరు తీసుకుంటారని బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డి, రాయలసీమ పోరాటసమితి నేత నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు గట్టిగా ప్రశ్నించడం... తెలంగాణకు చెందిన హిందూ జనశక్తి అనే సంస్థ కూడా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇంప్లీడ్ పిటిషన్ వేయడంతో టీటీడీ ఇరకాటంలో పడింది. కేసు వాపస్ తీసుకుంటామని దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.

అసలా డైమండే లేదు..

'పింక్ డైమండ్' ఉందని రమణ దీక్షితులు... లేనేలేదని టీటీడీ అధికారులు చెబుతుండటంతో దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ విద్యాసాగర్ అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రభుత్వం నియమించిన రెండు విచారణ కమిషన్లు 1952 నుంచీ టీటీడీ రికార్డులు పరిశీలించి.. పింక్ డైమండ్ అనేది లేదని నిర్ధారించాయి. ఈ నేపథ్యంలో సీబీఐ విచారణ అవసరం లేదని హైకోర్టు 2021 ఫిబ్రవరి 7న తీర్పు చెప్పింది.

రమణ దీక్షితులుకు 'శిక్ష'

పింక్ డైమండనేదే లేనపుడు అది మాయమైందని నానా యాగీ చేసిన రమణ దీక్షితులుపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కానీ... ఒకరకంగా చెప్పాలంటే ఆ దేవదేవుడే ఆయనకు తగిన శాస్తి చేశారు. టీటీడీకి వ్యతిరేకంగా ఆరోపణలు చేసి శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకత్వం కోల్పోయిన రమణ దీక్షితులు... వైసీపీ రాగానే మళ్లీ ఆలయంలోకి ఎంట్రీ ఇచ్చారు. ఈసారి ప్రధాన అర్చకుడిగా కాకుండా అంతకంటే ముఖ్యమైన ఆగమ సలహా మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. తప్పుడు ఆరోపణలతో టీటీడీ పరువు ప్రతిష్ఠలు దెబ్బతీశారంటూ రూ.వంద కోట్లకు పరువునష్టం దావా వేసి... మళ్లీ అదే వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వచ్చాయి. ఈవో ధర్మారెడ్డికీ, రమణ దీక్షితులుకీ మధ్య పొసగలేదు. ఆలయంలో ఆయనకు ప్రాధాన్యం లభించలేదు. వైసీపీ కోసం రచ్చ చేసిన రమణ దీక్షితులును అదే ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రస్తుతం అడపాదడపా సోషల్ మీడియాలో టీటీడీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, కాసేపటికి వాటిని తొలగించడం... వంటివి చేస్తున్నారు. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయనకూ విలువ ఇవ్వడంలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

దీక్షితులు 'వెనుక' వైసీపీ

పింక్ డైమండ్ ఎత్తుకెళ్లారు, నేల మాళిగలు తవ్వేశారు అంటూ హైదరాబాద్‌లో రమణ దీక్షితులు పెట్టిన ప్రెస్ మీట్‌లో... ఆయన వెనుకే వివాదాస్పద వ్యక్తి, క్రైస్తవ మత ప్రచారంతో సంబంధాలున్న బోరుగడ్డ అనిల్ కుమార్ కూడా పాల్గొనడం విశేషం. బోరుగడ్డపై అనేక కేసులున్నాయి. 'జగన్ నాకు బంధువు' అని చెప్పుకొంటారు. అలాంటి వ్యక్తితో రమణ దీక్షితులుకు సంబంధమేమిటి, టీటీడీపై ఆరోపణలు చేసేందుకు ఆయనను వెనక ఎందుకు పెట్టుకున్నారు అని అప్పట్లో అంతా ఆశ్చర్యపోయారు.

?

అట్లుంటది అన్నతోని..



పచ్చదనంపై పిచ్చితనం

'అశోకుడు చెట్లు నాటించెను' అని చదువుకున్నాం! భవిష్యత్తులో 'జగన్మోహన్ రెడ్డి చెట్లను నరికించెను' అని చదువుకోబోతున్నాం! అదేం పిచ్చితనమో కానీ... జగన్మోహన్ రెడ్డి పచ్చదనంపై పగబట్టారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి అడుగు బయటపెడితే చాలు... పచ్చని చెట్లకు మూడినట్లే! ఆయన పర్యటించే మార్గంలో ఒక్క పచ్చటి చెట్టూ ఉండేందుకు వీల్లేదంతే! కొమ్మలను ట్రిమ్ చేయడం కాదు... ఏకంగా మొదలుదాకా నరికి పడేయడమే! ఇలా ఈ ఐదేళ్లలో జగన్ కారణంగా గొడ్డలివేటు పడిన చెట్లకు లెక్కే లేదు. విచిత్రమేమిటంటే... ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత కూడా ఈ దారుణం కొనసాగుతూనే ఉంది.



చిత్రజ్యో!



చింటూ: అన్నియ్యకు అర్థ బలం, అంగబలం లేవంటరా.. పాపం కదూ!

చిన్నూ: తొడుక్కోవడానికి చొక్కా, వేసుకోవడానికి చెప్పులూ లేవంటాడేమో... చూడు మరి!

చింటూ: సొంత మీడియా కూడా లేదంట!

చిన్నూ: అయనది మీడియానే కాదు.. అంతా రోత అని ఒప్పుకొన్నాడన్న మాట!

చింటూ: సరేగానీ... ఆయన చానల్‌లో పెద్దాయన బొమ్మ తీసేశారే!

చిన్నూ: చెల్లీతల్లీ దూరమయ్యారు కదా! ఇక ఆయన మాత్రం ఎందుకనుకున్నాడో ఏమో!

చింటూ: అన్నియ్య పేదల పక్షపాతి., అస్సలు అబద్ధాలు చెప్పడంట!

చిన్నూ: కాస్త గ్యాప్ ఇవ్వరా సామీ... నవ్వీనవ్వీ పొట్ట నొప్పోంది!



ఆనాటి ముచ్చట

అధికారం నుంచి అధఃపాతాళానికి!

- నాడు ఏపీలో కాంగ్రెస్‌కు విపక్ష హోదా గల్లంతు



కాంగ్రెస్ పార్టీ 1994 అసెంబ్లీ ఎన్నికల్లో చావుదెబ్బ తింది. 1989 నుంచి 94 వరకు ఐదేళ్లు అధికారం అనుభవించిన ఆ పార్టీ.. ఒక్కసారిగా అధఃపాతాళానికి జారిపోయింది. 1989 ఎన్నికల్లో 181 స్థానాలు గెలిచిన ఆ పార్టీ.. 94లో కేవలం 26 చోట్లే గెలిచి ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయింది. ఆంధ్ర రాష్ట్రం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కాంగ్రెస్‌కు ఇంత పరాభవం ఎప్పుడూ ఎదురుకాలేదు. 294 స్థానాలకు గాను 288 చోట్ల పోటీచేసిన టీడీపీ-వామపక్ష కూటమి ఏకంగా 250 చోట్ల ఘనవిజయం సాధించింది. 8 స్థానాల్లో టీడీపీ రెబెల్స్ గద్దె రామ్మోహన్‌రావు (గన్నవరం), వీరపనేని యల్లమందరావు (వినుకొండ), గొట్టిపాటి హనుమంతరావు (మార్టూరు), బాచిన చెంచుగరటయ్య (అద్దంకి), జంకె వెంకటరెడ్డి (మార్కాపురం), కంభం విజయరామిరెడ్డి (ఉదయగిరి), తోట త్రిమూర్తులు (రామచంద్రపురం), మాలెం మల్లేశం (మేడారం) ఇండిపెండెంట్లుగా గెలిచారు. అలాగే పార్టీ టికెట్లు దక్కక స్వతంత్రులుగా పోటీచేసిన నలుగురు కాంగ్రెస్ నేతలు.. ఎడ్మ కిష్టారెడ్డి (కల్వకుర్తి), డి.కె.భరతసింహారెడ్డి (గద్వాల), పి.పురుషోత్తమరావు (సిర్పూర్), రామిరెడ్డి దామోదర్‌రెడ్డి (తుంగతుర్తి) కూడా విజయం సాధించారు. 1983, 85ల్లో ఎన్టీఆర్ ప్రభంజనంలో కూడా కాంగ్రెస్ వరుసగా 60, 50 సీట్లు సాధించింది. 1999లో 91 స్థానాలు దక్కించుకుంది. 2004, 2009ల్లో కాంగ్రెస్ గెలిచి అధికారం దక్కించుకున్నా.. రాష్ట్ర విభజన తర్వాత 2014, 19ల్లో జరిగిన ఎన్నికల్లో నవ్యాంధ్రలో ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. కనీసం మూడో స్థానంలో కూడా లేదు. డిపాజిట్లు గల్లంతైపోయాయి. తెలంగాణలో మాత్రం ప్రతిపక్షంగా ఉండి.. నిరుడు డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఏపీలోనూ ఉనికి కోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల సారథ్యంలో పోరాడుతోంది.

ఓటు, సత్యాగ్రహం.. ఈ రెండూ ప్రజల చేతిలో ఆయుధాలు



- మహాత్మా గాంధీ




సజ్జల రామకృష్ణా రెడ్డి, ప్రభుత్వ సలహాదారు

అబ్బ-ఛా!

అవినీతికి ఆస్కారం లేని సర్కారు మాది

అవినీతికి ఆస్కారం లేకుండా మా ప్రభుత్వం పని చేసింది. అందుకే మేం ధర్మ యుద్ధానికి సిద్ధం అయ్యాం. పిఠాపురంలో పవన్‌ను తప్పిస్తారు. రాష్ట్రమంతా ప్రచారం చేయాలి కాబట్టి ఆయన్ను పోటీ నుంచి తప్పించొచ్చు.



చంద్రబాబు దార్శనికత

విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటించేనాటికి ఈ ప్రాంతంలో ఒకటీ అరా తప్ప ఐటీ కంపెనీలు ఉండేవి కావు. ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, దార్శనికతతో ఐటీ రంగాన్ని ప్రోత్సహించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో విజయవాడ పరిసరాల్లో దాదాపు 100 ఐటీ కంపెనీలు వచ్చాయి. ఎంతోమందికి యువతకు ఉద్యోగాలు వచ్చాయి. దీనివెనుక నాటి ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి కూడా ఉంది.

జగన్ విధ్వంసక పాలన

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఏడాదిలోనే ఐటీ రంగానికి సమాధి కట్టారు. చంద్రబాబు నాటిన విత్తనాల ఫలాలు భావితరానికి అందకుండా తుంచేశారు. చంద్రబాబుపై కక్షతో ఆయన హయాంలో వచ్చిన ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు కట్ చేశారు. దీంతో దాదాపుగా ఐటీ సంస్థలన్నీ వెనక్కి వెళ్లిపోయాయి. యువత ఉద్యోగాలు కోల్పోయారు. విజయవాడలో మూతపడిన ఐటీ కంపెనీలు, టవర్ల ముందు పెట్టిన టు లెట్ బోర్డులే ఇందుకు సాక్షి.



నోట్ దిస్ పాయింట్!



సర్వీసు ఓటరు

అత్యధికం శ్రీకాకుళం జిల్లా 16,100	అత్యల్పం అల్లూరి సీతారామరాజు జిల్లా 283
అత్యధికంగా ఉన్న అసెంబ్లీ గిద్దలూరు 5,375	అత్యల్పంగా ఉన్న అసెంబ్లీ సర్వేపల్లి 23

ఐటీకి సమాధి

యువత ఆశలు చిదిమేసిన జగన్

- చంద్రబాబుపై కక్షతో ఆయన నాటిన విత్తనాలకు చెదలు పట్టించిన వైనం
- ప్రోత్సాహక విధానాలకు చెల్లుచీటీ
- సీఎం అయిన 6 నెలలకే కంపెనీలు వెనక్కి
- వందలాది ఉద్యోగాలు కోల్పోయిన యువత

(అమరావతి/విజయవాడ/విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్ల కృషి, శ్రమను.. ముఖ్యమంత్రి జగన్ సర్వనాశనం చేశారు. యువత ఐటీ ఆశల్ని చిదిమేశారు. ఏ ముఖ్యమంత్రి కూడా చేయనివిధంగా ఉన్న కంపెనీలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారు. యువత ఉద్యోగ అవకాశాలను కాలరాసి.. రోడ్డున పడేలా చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విస్తరించిన ఐటీ రంగాన్ని చీకట్లోకి నెట్టారు. ఐటీ ప్రోత్సాహక విధానాల నుంచి వైసీపీ ప్రభుత్వం వైదొలగడంతో అమరావతి రాజధాని ప్రాంతంలో నెలకొల్పిన ఐటీ సంస్థలన్నీ వరుస కట్టి వెళ్లిపోయాయి. చూస్తుండగానే.. విజయవాడ, రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఐటీ సంస్థలన్నీ మూతపడ్డాయి. యువత ఐటీ కొలువుల కోసం మళ్లీ ఇతర రాష్ట్రాలకు పోయే పరిస్థితిని కల్పించారు. విజయవాడతో పాటు విశాఖపట్నంలోని ఐటీ కంపెనీలదీ ఇదే పరిస్థితి.

చంద్రబాబు కృషితో...

రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని ప్రకటించిన తర్వాత సీఆర్‌డీఏ పరిధిలో విజయవాడతోపాటు కూతవేటు దూరంలో ఉన్న కేసరపల్లిని సైబర్ సిటీగా అభివృద్ధి చేయటానికి గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అభిముఖంగా ఉన్న ఏస్అర్బన్-ఏపీఐఐసీ హైటెక్ సిటీలో ఐటీ పరిశ్రమలు లేక అలంకారంగా మారిన పరిస్థితులలో.. దీనిపై దృష్టి సారించింది. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కక్షపూరిత విధానాలకు పోకుండా... అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వం స్థాపించిన హైటెక్ సిటీలోని మేధ టవర్‌లో ఐటీ కంపెనీలు కిటకిటలా చర్యలు చేపట్టింది. దీనికోసం నూతన ఐటీ పాలసీని రూపొందించింది. ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు సరికొత్త విధానాలను తీసుకువచ్చింది. దీంతో ఐటీ సంస్థలు రాజధాని ప్రాంతంలో కంపెనీల ఏర్పాటుకు ఆసక్తి చూపాయి. అలాగే స్టార్టప్ కంపెనీలకు కూడా టీడీపీ ప్రభుత్వం భారీ రాయితీలను ప్రకటించింది. స్టార్టప్ కంపెనీల ఎదుగుదల కోసం ఐటీ ఉద్యోగుల సగం వేతనాల ఖర్చును కూడా భరించింది. మరెన్నో రాయితీలు కల్పించింది. అటు స్టార్టప్ ఐటీ కంపెనీల బలోపేతానికి, ఇటు ఐటీరంగంపై ఆసక్తి చూపించే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం రాయితీలను కొనసాగించింది.



విజయవాడకు కంపెనీల క్యూ



విజయవాడలో మూతపడిన కే బిజినెస్ స్పేసెస్

గత ప్రభుత్వంలో విజయవాడలో భారీ ఎత్తున ఐటీ సంస్థలు కొలువు తీరాయి. విజయవాడ పటమటలంకలో ఎన్‌హెచ్-16 వెంబడి ఆర్ఎస్ టవర్స్‌లో ఐటీ పార్క్ ఏర్పాటు చేశారు. ఇందులో పెర్నాడ్ రికార్డ్, ఎల్‌టెక్ అప్లయన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈటీఏ జనరల్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా హిటాచి, వీవో, ఐడియా సెల్యూలార్ వంటి ఐటీ ఆధారిత సంస్థలు ఏర్పడ్డాయి. గురునానక్ కాలనీలో కే స్క్వేర్ ఐటీ పార్క్ ఏర్పడింది. ఈ పార్క్‌లో దాదాపుగా 8 ఐటీ సంస్థలు నెలకొల్పారు. ఏపీస్పేస్ అప్లికేషన్ సెంటర్, ఈలం సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, అర్నియన్‌టెక్ సొల్యూషన్స్, సుప్రీం నెట్‌సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ఏపీటీ ఆన్‌లైన్ లిమిటెడ్, జీటీ కొన్నెక్ట్ ఇండియా లిమిటెడ్ వంటి అనేక సంస్థలు కొలువుతీరాయి. ఆటోనగర్‌లో ఇండెవెల్ టెక్నాలజీస్ పార్క్ ఏర్పాటు చేశారు. ఇందులో ఎడ్రిక్స్, ఎంఎస్ఆర్ కాస్మోస్, విఠెక్, డేమియన్ కన్సల్టెంగ్, పేటీఎం, అల్-వాసి ఐటీ సొల్యూషన్స్, అడ్వాన్స్ సాఫ్ట్ ఇంటర్నేషనల్, యాక్సెల్ ఇంటర్నేషనల్ వంటి కంపెనీలు ఏర్పాటు చేశారు. ఇలా చిన్నా చితకా అనేక ఐటీ సంస్థలు వచ్చాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీ రంగానికి వచ్చిన జోష్ చూసి కేంద్ర ప్రభుత్వం కూడా విజయవాడ మీద దృష్టి సారించింది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) కూడా విజయవాడలో తమ కేంద్రం విస్తరణకు ముందుకొచ్చింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విన్‌సిటీ పేరుతో ఒక ఐటీ పార్కును అభివృద్ధి చేసింది. ఇలా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీ రంగం విస్తరించింది. అమరావతి రాజధాని ప్రాంతంలో వంద వరకు ఐటీ కంపెనీలు ఏర్పాటు చేశారు. ప్రత్యక్షంగా దాదాపు 1500 మందికి ఉద్యోగాలు కల్పించారు.

కేసరపల్లి నాడు కళకళ



విజయవాడ దగ్గర మేథ టవర్స్ పక్కనే ఆగిపోయిన రెండో టవర్ నిర్మాణం. పూర్తయి ఉంటే ఇలా ఉండేది.



ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు అమరావతి వైపు చూడటానికి గత ప్రభుత్వ కృషి ఎంతో ఉంది. ఏపీఎస్ఆర్‌టీ అనే సంస్థను స్థాపించి దాని ద్వారా ఐటీరంగ ప్రముఖులు, నిపుణులతో సమావేశాలు ఏర్పాటు చేయించారు. ఐటీ పాలసీల గురించి వారిలో నమ్మకం కల్పించిన తర్వాతే ఒక్కొక్కటిగా అమరావతి వచ్చాయి. గతంలో కేసరపల్లి ఐటీ సెజ్ పరిధిలోని హైటెక్ సిటీలో మేథ టవర్‌లో నాలుగు ఐటీ కంపెనీలు కూడా ఉండేవి కావు. టీడీపీ ప్రభుత్వ చొరవ వల్ల 2015-16 ఆర్థిక సంవత్సరంలోనే పదిహేనుకు పైగా ఐటీ కంపెనీలు వచ్చాయి. ఆతర్వాత మేథ టవర్ ఐటీ కంపెనీలతో కిక్కిరిసిపోయింది. మేథలోని 13,306 చదరపు అడుగుల స్థలంలో ఎక్స్‌ట్రానెట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, గల్లా ఐటీ సర్వీసెస్, ఇండ్‌మ్యాక్స్ ఐటీ సర్వీసెస్, గ్లాట్ డేటా డిస్కవరీ, హెచ్‌సీఎల్ స్టేట్ స్ట్రీట్ అనే సంస్థలతో పాటు అనేక స్టార్టప్ కంపెనీలు కొలువుతీరాయి. దీంతో కేసరపల్లి ఐటీ సెజ్ పరిధిలో హైటెక్ సిటీ విస్తరణకు నాంది పడింది. రెండో టవర్ నిర్మాణానికి టీడీపీ హయాంలోనే అంకురార్పణ జరిగింది. నాటి ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రెండో టవర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. 'మేథ మనం నిర్మించింది కాదు.. దీనిని ఆపేద్దాం' అని ఏనాడూ టీడీపీ ప్రభుత్వం భావించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బిగ్ ఐటీ టవర్ పనులు మూడొంతులు పూర్తయ్యాయి. గోడలు, ఫినిషింగ్, ఇంటీరియర్ పనులు మాత్రమే అప్పటికి మిగిలాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి.

రాజధానికి హెచ్‌సీఎల్



చంద్రబాబు హయాంలో విజయవాడ దగ్గర ఏర్పాటు చేసిన హెచ్‌సీఎల్ క్యాంపస్

చంద్రబాబు ప్రభుత్వంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కు చెందిన అతి పెద్ద ఐటీ సెజ్ ఏర్పాటైంది. హెచ్‌సీఎల్ రావటానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రధాన కారణం. హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివనాడార్‌తో చంద్రబాబు భేటీ అప్పట్లో ఓ ప్రత్యేకమని చెప్పాలి. ఆ భేటీలో చంద్రబాబు దూరదృష్టి, ఐటీ పట్ల ఆయనకున్న విజన్‌ను చూసి రాజధాని ప్రాంతంలో హెచ్‌సీఎల్ క్యాంపస్ ఏర్పాటుకు శివనాడార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. శివనాడార్ నుంచి అంగీకారం రావటమే తరువాయి కేసరపల్లిలోని హైటెక్ సిటీకి దగ్గర్లోనే గన్నవరంలో హెచ్‌సీఎల్ ఏర్పాటుకు 25 ఎకరాలు కేటాయించారు. టీడీపీ హయాంలోనే హెచ్‌సీఎల్ భవన సముదాయాలు పూర్తయ్యాయి. హెచ్‌సీఎల్ పెద్ద ఐటీ ఇండస్ట్రీ కావడంతో వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తట్టుకుని నిలబడింది. యువతకు స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తోంది. 3 వేల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు.

జగన్ వచ్చాక అధోగతి


2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐటీ రంగాన్ని నాశనం చేసింది. వచ్చీ రావటంతోనే ఐటీ రంగ పాలసీని మార్చి వేసింది. ఐటీ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలకు ఎగనామం పెట్టేసింది. గత ప్రభుత్వంలో ఐటీ సంస్థలు వచ్చాయన్న కారణంగా.. ఆ సంస్థలను టార్గెట్ చేసింది. ప్రభుత్వ తరఫున సహాయ సహకారాలను నిలిపివేసింది. స్టార్టప్ ఐటీ కంపెనీలకైతే రాయితీలన్నింటినీ తొలగించింది. రాష్ట్ర ప్రభుత్వ ఐటీ పాలసీ విధానాలతో విసుగు చెందటంతో పాటు ప్రోత్సాహకాలు నిలిచిపోవటంతో ఐటీ కంపెనీలకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ ఐటీ వ్యతిరేక విధానాలతో మనుగడ కష్టంగా మారింది. దీంతో ఎలా వచ్చాయో అలా ఐటీ కంపెనీలన్నీ వెనుదిరిగిపోయాయి. 2019-20 మధ్య కాలంలో కేవలం ఆరునెలల వ్యవధిలోనే ఐటీ కంపెనీలన్నీ మూతపడ్డాయి. ఉద్యోగాలు పొందిన వందలాది మంది రోడ్డున పడ్డారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవాల్సి వచ్చింది. ఐటీ, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లోనూ రాష్ట్రం అట్టడుగు స్థాయికి దిగజారిపోయింది.

విశాఖ నుంచి వెనక్కి



తెలుగుదేశం హయాంలో ఐటీ కంపెనీలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వడంతో విశాఖకు అనేక కంపెనీలు వచ్చాయి. టెక్ హబ్‌లో ఎనిమిది కంపెనీలు ప్రారంభమయ్యాయి. ఇదే భవనంలో ఐటీ శాఖకు చెందిన ఎపీటా కార్యాలయం ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం రాగానే అవన్నీ తీసేశారు. సీతమ్మధారలోని వుడా కాంప్లెక్స్‌లో రెండు ఫ్లోర్లు ఐటీ కంపెనీలకు కేటాయించి, చంద్రబాబు పది కంపెనీలను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాయితీలు ఇవ్వకపోవడంతో అవి మూతపడ్డాయి. ఐటీ పార్కులో కూడా అనేక కంపెనీలు వెళ్లిపోయాయి. రుషికొండ ఐటీ పార్కులో ఐబీఎంను బెదిరించి 20 ఎకరాల భూమి వెనక్కి తీసుకున్నారు. అందులో ఐటీ బిజినెస్ పార్క్ నిర్మిస్తామని టెండర్లు పిలిచి అటకెక్కించారు. విశాఖలో అతి పెద్ద ఐటీ సంస్థ హెచ్ఎస్‌బీఎస్ వెళ్లిపోయింది.

లక్ష్మన్న మాట



హుందాగా.. ఆర్భాటాలకు దూరంగా..

తొలి ఎన్నికల తీరే వేరు..

"1952లో మా గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి మిట్టపల్లె స్కూల్‌లో తొలిసారి ఓటు వేశాను. ఆనాటి నుంచి క్రమం తప్పకుండా 15 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశాను. కాంగ్రెస్ విడిపోకముందు కాడెద్దులు, ఇందిరా కాంగ్రెస్‌కు ఆవుదూడ గుర్తులు ఉండేవి. ఆ తర్వాత హస్తం గుర్తు వచ్చింది. ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఏనుగు గుర్తు కేటాయించేవారు. ఉదయం ఏడుగంటలకు పోలింగ్ మొదలైతే 11 గంటలకే 70శాతం పోలింగ్ జరిగేది. సబ్‌కలెక్టర్ ఆఫీసులో ఓట్లు లెక్కించేవారు. ఇప్పటిలాగా హంగూ ఆర్భాటాలతో ఎన్నికల ప్రచారాలు ఉండేవి కావు. కేవలం గోడపై రాతలు రాసేవారు. సాయంత్రాలు గ్రామంలో ఒకచోట గ్రామపెద్ద ఎన్నికల సభ నిర్వహించేవారు. ఎన్నికల్లో పోటీకి నిలబడిన వ్యక్తులు అనుచరులతో కలిసి ప్రచారానికి వచ్చేవారు. నియోజకవర్గం అభివృద్ధికి తామేవిం చేస్తారో చెప్పేవారు. ఇప్పటిలాగా డబ్బులూ, ప్రలోభాలూ ఉండేవి కావు. అంతేకాదు, గెలిచిన అభ్యర్థులు హుందాగా వ్యవహరించేవారు. ఈసారి నేను 16వ సారి ఓటువేయబోతున్నాను. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి"

- పోకల లక్ష్మన్న(90),సీటీఎం గ్రామం,మదనపల్లె మండలం

వియ్యాలవారి వైభవం!

టీడీపీలో కొందరికి వర్తించని 'ఒకే టికెట్' నిబంధన

- చంద్రబాబు నుంచి యనమల వరకు
- బాలయ్య నుంచి ఎర్రనాయుడి దాకా
- రాజకీయంగా బలమైన కుటుంబాలు కావడం వల్లే!! ఎన్నికల వేళ ఆసక్తికర చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో వియ్యాలవారి వైభవం కొనసాగుతోంది. ఆది నుంచీ ఈ కుటుంబాలు తమ తమ ప్రాంతాల్లో రాజకీయంగా పట్టున్నవి కావడంతో వియ్యమందుకున్నాక కూడా తమ ఆధిపత్యానికి ఢోకా లేకుండా చూసుకుంటున్నాయి. వీరిని ఒకే కుటుంబం కింద పరిగణించే అవకాశం లేకపోవడంతో నాయకత్వం కూడా వీరికి ఒకే టికెట్ నిబంధనను వర్తింపజేయడం లేదు.



నారాయణ-గంటా





టీడీపీ ప్రభుత్వంలో ఇద్దరు వియ్యంకులు ఐదేళ్లపాటు మంత్రులుగా కొనసాగారు. పురపాలక శాఖ మాజీ మంత్రి పొంగూరు నారాయణ, విద్యా శాఖ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వియ్యంకులు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గంటా విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. నారాయణ నెల్లూరు సిటీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుల్లో ఈయనా ఒకరు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన నెల్లూరు సిటీ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. గంటా కొంత కాలం స్తబ్దుగా ఉన్నా ఇటీవలి కాలంలో పార్టీలో చురుగ్గా కనిపిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయన భీమిలి నుంచి పోటీ చేస్తున్నారు.

నారా-నందమూరి



టీడీపీ అధినాయకత్వంలో కూడా ఇద్దరు వియ్యంకులు ఉన్నారు. పార్టీ అధినేత చంద్రబాబుకు సినీ హీరో బాలకృష్ణ వియ్యంకుడు. బాలయ్య కుమార్తె బ్రాహ్మణిని చంద్రబాబు తనయుడు లోకేశ్ వివాహం చేసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు కుప్పం నుంచి.. బాలయ్య హిందూపురం నుంచి తిరిగి పోటీ చేయనున్నారు. ఈ ఇద్దరూ ప్రస్తుతం ఈ రెండు సీట్లకు సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. బాలయ్య మరో వియ్యంకుడు ఎం.రామారావు టీడీపీ మాజీ ఎంపీ, దివంగత ఎంవీవీఎస్ మూర్తి కుమారుడు. రామారావు కుమారుడు భరత్ బాలయ్య చిన్న కుమార్తెను వివాహం చేసుకున్నారు. విశాఖ నుంచి టీడీపీ తరఫున లోక్‌సభకు పోటీచేస్తున్నారు.




లోకేశ్



భరత్

యనమల-పుట్టా

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసన మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ వియ్యంకులు. ఇద్దరూ టీడీపీలో క్రియాశీలంగా ఉన్నారు. యనమల అనేకసార్లు మంత్రిగా, స్పీకర్‌గా పనిచేయగా.. సుధాకర్ యాదవ్ టీటీడీ చైర్మన్‌గా వ్యవహరించారు. యనమల గత రెండు ఎన్నికల నుంచి తునిలో పోటీ చేయడం లేదు. అక్కడ ఆయన తమ్ముడు ఓడిపోతుండడంతో ఈసారి యనమల తన కుమార్తె దివ్యను తెరపైకి తెచ్చారు. సుధాకర్ యాదవ్ కడప జిల్లా మైదుకూరు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈసారి కూడా అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. ఈసారి ఈ కుటుంబానికి బోనస్‌గా మరో సీటు దక్కింది. సుధాకర్ యాదవ్ తనయుడు మహేశ్ యాదవ్ ఏలూరు లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.



యనమల



పుట్టా సుధాకర్



మహేశ్ యాదవ్

కింజరాపు-ఆదిరెడ్డి

దివంగత టీడీపీ సీనియర్ నేత కింజరాపు ఎర్రన్నాయుడి ఇద్దరు వియ్యంకుల కుటుంబాలు రెండు జిల్లాల్లో రాజకీయంగా చురుగ్గా ఉన్నాయి. ఆయన కుమార్తె ఆదిరెడ్డి భవాని ప్రస్తుతం రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఆమె భర్త ఆదిరెడ్డి వాసు అక్కడి నుంచి పోటీచేస్తున్నారు. భవానీ అత్త, ఎర్రన్నాయుడి వియ్యపురాలు రాఘవమ్మ గతంలో రాజమహేంద్రవరం మేయర్‌గా చేశారు. ఎర్రన్నాయుడి మరో వియ్యంకుడు బండారు సత్యనారాయణమూర్తి మాజీ మంత్రి. ఈయన కుమార్తెను ఎర్రన్నాయుడి కుమారుడు రామ్మోహన్‌నాయుడు వివాహం చేసుకున్నారు. బండారు అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ సీటు పొత్తులో జనసేనకు వెళ్లడంతో ఆయన మాడుగుల నుంచి పోటీ చేస్తున్నారు.



బండారు



రామ్మోహన్



ఆదిరెడ్డి వాసు

ఆనం-కొండ్రెడ్డి



ఆనం రామం నారాయణరెడ్డి



విజయమ్మ

నెల్లూరు జిల్లా వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి ఆనం రామంనారాయణరెడ్డి వియ్యపురాలు కొండ్రెడ్డి విజయమ్మ కడప జిల్లా టీడీపీలో చురుగ్గా ఉన్నారు. ఆనం కుమార్తెను ఆమె కుమారుడు రితీశ్ వివాహం చేసుకున్నారు. బద్వేలు (ఎస్సీ) నియోజకవర్గ రాజకీయ వ్యవహారాలను పూర్తిగా ఆమె కుటుంబమే చూస్తోంది. ఆ కుటుంబం సిఫారసుతో ఈసారి బద్వేలు టికెట్‌ను రోశన్న అనే దళిత నేతకు ఇవ్వాలని టీడీపీ అధినాయకత్వం అనుకుంది. పొత్తులో ఆ సీటు బీజేపీకి వెళ్లింది. అయితే రోశన్న బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. ఆనం గత ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన తర్వాత టీడీపీకి అనుకూలంగా మారారు. ఆయనకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు సీటు ఇచ్చారు.



శ్రీశైలంలోని బయలు వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న బాబు దంపతులు

వేళ్లు కోసుకోవద్దు... ఓటుతో వేటు వేయండి: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ దుర్మార్గాలపై నిరసన తెలపడానికి ప్రజలు వేళ్లు కోసుకోవద్దు. రాబోయే ఎన్నికల్లో ఓటు ఆయుధంతో వేటు వేయాలి' అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'రాష్ట్రంలో జగన్ అరాచక పాలనను దేశం దృష్టికి తేవడానికి గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి తన వేలిని కోసుకొన్నారన్న వార్త నన్ను కలిచివేసింది. తమ ప్రాంతంలోని అక్రమాల గురించి ఆమె ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి ఉంటే ఇప్పుడు ఇంత దారుణం జరిగి ఉండేది కాదు. రాష్ట్రంలో ప్రజల నిస్సహాయ స్థితికి ఇది నిదర్శనం. ప్రజలారా... మీ వేళ్లు కోసుకోవడం కాదు. రేపటి ఎన్నికల్లో అదే వేలితో బటన్ నొక్కి, ఓటు అనే ఆయుధంతో జగన్ దుర్మార్గ పాలనపై వేటు వేయండి. అంతే తప్ప నిర్వేదంతో నిస్పృహతో ఇటువంటి ఘటనలకు పాల్పడవద్దని కోరుతున్నా. ఇవి సమస్యలకు పరిష్కారం చూపవు. రేపు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాఫియా గాళ్లను, గ్యాంగులను రాష్ట్రం నుంచి తరిమేద్దాం. అక్రమాలను అణిచేద్దాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా, కడప జిల్లా పొద్దుటూరులో చోటు చేసుకొన్న ఘటనపై ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'పేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వడం చేతగాని వైసీపీ ప్రభుత్వానికి వాటిని కూల్చే అధికారం ఎక్కడిది? ప్రొద్దుటూరులో టిడ్కో ఇళ్ల నిర్మాణాల కూల్చివేతను తీవ్రంగా ఖండిస్తున్నా. పేదల ఇళ్ళను నిర్మించి ఇవ్వడం చేతగాని ఈ ప్రభుత్వానికి కూల్చే అధికారం ఎక్కడిది?అధికారం నుంచి దిగిపోయే రోజు దగ్గరపడినా మీ కూల్చివేతల సంస్కృతిని మార్చుకోరా? ఇళ్ళను, వ్యవస్థలను, రాష్ట్ర ప్రతిష్ఠనూ కూల్చిన మీ ప్రభుత్వాన్ని మే 13న ప్రజలు కూల్చబోతున్నారు' అని వ్యాఖ్యానించారు.



అభిమాని సైకిల్‌పై అధినేత

జనసేనాని పవన్ కల్యాణ్ గెలుపు కోసం ఆయన అభిమాని కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన మామిడి బాబ్జి 25 రోజులుగా పిఠాపురం నియోజకవర్గంలో సైకిల్‌పై ప్రచారం చేస్తున్నారు. ఒక పూట భోజనం, రాత్రి పూట అల్పాహారంతో యాత్ర సాగిస్తున్నారు. ప్రచారంలో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసం వద్దకు వచ్చారు. బయటకు వచ్చిన పవన్, తన అభిమాని బాబ్జీతో ముచ్చటించారు. ఆయన సైకిల్‌ను తొక్కారు. దీంతో బాబ్జి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. - పిఠాపురం/గొల్లప్రోలు రూరల్.



శ్రీకాళహస్తీశ్వరాలయం బిక్షాల గాలి గోపురం వద్ద హేమచంద్రారెడ్డి నిరసన

ముక్కంటికే మోసం

- దేవుడి సామగ్రి దోచేశారు
- శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థి మధుపై మాజీ అనుచరుడి తీవ్ర ఆరోపణలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: "ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మీరు అనుకుంటున్నంత మంచోడు కాదు. ఆయన మాటలు నమ్మి ఓటేస్తే జీవితాలు నాశనం అయిపోతాయి. ఈసారి చిత్తుగా ఓడించి, మీ జీవితాలను కాపాడుకోండి" అని శ్రీకాళహస్తి వైసీపీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాజీ అనుచరుడు హేమచంద్రారెడ్డి ప్రజలను హెచ్చరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెండి సామగ్రిని దోచేసి బెంగళూరులో అమ్మేశారని.. కరోనా సమయంలో మద్యం దుకాణాలను లూటీ చేసి బ్లాక్‌మార్కెట్లో సొమ్ము చేసుకున్నారని ఎమ్మెల్యే మధుపై తీవ్ర ఆరోపణలు చేశారు. వీటిపై ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సోమవారం ముక్కంటి ఆలయం బిక్షాల గాలిగోపురం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే చేసిన కుంభకోణాలపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. "13 ఏళ్లపాటు ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉన్నా. ఎమ్మెల్యే మధు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి ముక్కంటి ఆలయంలో వెండి పూజా సామాగ్రిని దోచేశారు. వాటిని బెంగళూరుకు నాతోనే చేరవేశారు. భారతీయ అనే మహిళ నా ఖాతాలో నగదు జమ చేశారు. ఆలయ అధికారులు ఆడిట్ నిర్వహిస్తే వెండి వస్తువుల మాయం విషయం తేలుతుంది. కరోనా సమయంలో భారీ లిక్కర్ స్కాం చేశారు. వెండి దోచేయడం, మద్యం కుంభకోణంపైనా ఫిర్యాదు చేశా. కానీ, ఇప్పటి వరకు అధికారులు స్పందించలేదు" అని వివరించారు. డీకేటీ భూముల వ్యవహారంలో ఎమ్మెల్యే పెద్ద కుంభకోణం చేశారని, ఎమ్మెల్యే మధు పైకి కనిపించేంత సౌమ్యుడు కాదని హేమచంద్రారెడ్డి తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో పొరపాటున ఇంకోసారి ఓటు వేసి గెలిపిస్తే ప్రజలను బతకనివ్వరని హెచ్చరించారు.

మెగా డీఎస్సీపై తొలి సంతకం ఈ పెన్నుతోనే!

జగన్ అహంకారానికి సైకోయిజం కూడా తోడైంది. అసలు తనేం చేస్తాడో అతడికే తెలియదు. రాయితో మనల్ని కొడతాడు. చెల్లెల్ని కొడతాడు. చివరకు అదే రాయితో తనను తాను కొట్టుకుంటాడు.

దోపిడీదారులు ఇళ్లలోకి వస్తే ఏం చేస్తాం.. చేతికి ఏది దొరికితే అది పట్టుకుని తరిమికొడతాం. అలాగే బందిపోటు దొంగ జగన్‌ను కూడా తరిమికొట్టి రాష్ట్రాన్ని అంతా కలిసి కాపాడుకోవాలి.

\- చంద్రబాబు



శృంగవరపుకోటలో చంద్రబాబు రోడ్‌షోకు హాజరైన జనం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ప్రజాగళంలో భాగంగా సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేట, విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రం భయంకర నేరస్థుల చేతిలోకి వెళ్లిపోయి నష్టపోతోందన్నారు. జగన్‌లాంటి దుర్మార్గుడు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల గతేంటో అందరూ ఆలోచించాలన్నారు. అసలే కోతి.. ఆపై కల్లు తాగిన చందాన ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో తానొక్కడే శాశ్వతం అనుకుని జగన్ ప్రవర్తిస్తున్నాడు. సినిమా రంగంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన చిరంజీవి, డైరెక్టర్ రాజమౌళి వంటివారిని ఇంటికి పిలిచి అవమానించిన నీచుడు. సజ్జల రామకృష్ణారెడ్డి సైతం చిరంజీవిని విమర్శిస్తున్నారు. వీళ్ల బలుపు తగ్గించే అస్త్రం టీడీపీ దగ్గర ఉంది. వైసీపీ దోపిడీ చేయడం తెలిసిన పార్టీ. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం తెలిసిన పార్టీ టీడీపీ. అందుకే జాబు రావాలంటే బాబు రావాలి. కానీ గంజాయి కావాలంటే జగన్ రావాలి. జగన్‌కు ఒకటే చాలెంజ్ చేస్తున్నా. వచ్చే నెల 1న వలంటీర్లను కాకుండా సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటింటికీ నేరుగా నెలకు రూ.4 వేల పింఛను ఇస్తాం. పెంచిన మొత్తం ఏప్రిల్ నుంచే అమలు చేస్తాం. పేదలకు రెండు లేదా మూడు సెంట్ల ఇంటి స్థలం అందిస్తాం. టిడ్కో ఇళ్లను ఉచితంగా పంపిణీ చేస్తాం. 3 గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తాం. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎందరున్నా ప్రోత్సహిస్తాం. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తాం. టీడీపీ అధికారంలోకి వస్తే ఆర్థికంగా ఎంత లాభమో మహిళలు లెక్కలు వేసుకోండి. ఇది పరీక్షా సమయం. ప్రతి ఒక్కరూ ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

పవన్ కాలిగోటికి కూడా సరిపోడు..

సీఎం జగన్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను బూతులు తిడుతున్నారు. ఎంత నీచం! అసెంబ్లీలో నా భార్యను కూడా తిట్టారు. అయినా పవన్ ఎక్కడ.. జగన్ ఎక్కడ? పవర్ స్టార్ కాలిగోటికి కూడా సరిపోడు. నేను కూడా జగన్ బాధితుడినే. నాజోలికి రావడానికి ఎవరైనా భయపడతారు. కానీ సైకో కావడం వల్ల జగన్ భయపడలేదేమో! అటు ఎంపీ రఘురామరాజును కూడా చంపించాలని చూశాడు. తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులపైనా సోషల్ మీడియా ద్వారా దాడి చేయించారు. అలా దాడిచేసిన వారిని ఇప్పుడు పక్కనపెట్టుకుని తిరుగుతున్నాడు. అందుకే జగన్ ప్రవర్తన గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. రాష్ట్రంలో పెరుగు, మీగడ తను తినేసి మజ్జిగ జనాలకు పోస్తున్నాడు. రాజధాని అమరావతిని దెబ్బతీశాడు. అలాంటి జగన్‌కు ఓట్లు వేయించుకునే అర్హత లేదు. వస్తున్నది కురుక్షేత్ర యుద్ధం.. ధర్మమే గెలుస్తుంది. మే 13న హుద్‌హుద్ తుఫాను కంటే భారీ తుఫాను రాబోతోంది. ఇందులో వైసీపీ కొట్టుకుపోతుంది. కూటమి ఉమ్మడి సభలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనే దీనికి నిదర్శనం. ఎన్డీయే ప్రభుత్వంతోనే ప్రశాంతత లభిస్తుంది. వైసీపీ మాటలు విని వలంటీర్లు రాజీనామా చేయొద్దు.

మల్లన్న సన్నిధిలో చంద్రబాబు దంపతులు

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని టీడీపీ అధినేత చంద్రబాబు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అనంతరం, అతిథి గృహంలో శ్రీశైలం, రాయదుర్గం, బనగానపల్లె, కదిరి అభ్యర్థులు బుడ్డా రాజశేఖరరెడ్డి, కాలువ శ్రీనివాసులు, బీసీ జనార్దన్‌రెడ్డి, కందికుంట ప్రసాద్‌కు చంద్రబాబు బీ-ఫాంలు అందజేశారు.

చంద్రబాబుతో నల్లమిల్లి భేటీ

అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జగ్గంపేట ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుతో మాట్లాడారు. అనపర్తి స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో తనకు జరిగిన అన్యాయంపై నల్లమిల్లి పోరాడుతున్నారు. టీడీపీకే ఈ సీటు ఇవ్వాలని కోరుతూ యాత్ర చేపట్టారు. దీంతో బీజేపీ అనపర్తి సీటుని టీడీపీకి వదులుకోవడానికి సిద్ధమైంది. బదులుగా బీజేపీకి కేటాయిస్తారన్న స్థానంపై టీడీపీ నుంచి సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తాను అనపర్తి నుంచి టీడీపీ తరఫున బరిలోకి దిగుతానని నల్లమిల్లి.. చంద్రబాబుకి చెప్పారు. బీజేపీకి ఇచ్చే సీటుపై వేగంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని బాబు హామీ ఇచ్చారు.

కుప్పంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- ఎన్నికల సంఘానికి చంద్రబాబు లేఖలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం లేఖ రాశారు. 'కుప్పంలో అధికార పార్టీ వైసీపీ చట్టవిరుద్ధమైన పద్ధతులను అవలంబిస్తోంది. గత ఐదేళ్లు టీడీపీ నేతలను ప్రభుత్వం వేధించింది. ఇప్పుడు కూడా కొంత మంది అధికారులు కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా పెద్దఎత్తున మద్యం, నగదు, బహుమతులు పంపిణీ చేసి, ఓటర్లను ప్రభావితం చేయాలని వైసీపీ యోచిస్తోంది. ఏ సంఘటన జరిగినా వీడియోలతో చిత్రీకరించే ఏర్పాట్లు చేయాలి' అని కోరారు.

పవన్ హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

- పశ్చిమగోదావరి జిల్లా పర్యటన రద్దు
- నేడు పిఠాపురంలో నామినేషన్

అమరావతి(ఆంధ్రజ్యోతి), గొల్లప్రోలు, ఏప్రిల్ 22: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రయాణించే హెలికాప్టర్‌లో ఆకస్మిక సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆయన తన పశ్చిమగోదావరి జిల్లా పర్యటన రద్దు చేసుకున్నారు. తిరిగి చేబ్రోలు నివాసానికి చేరుకున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం సాయంత్రం ఉమ్మడి పశ్చిమగోదారి జిల్లాలోని తాడేపల్లిగూడెం, ఉంగుటూరుల్లో ప్రచార సభల్లో పాల్గొనాల్సి ఉంది. ఇందు నిమిత్తం ఆయన గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసం నుంచి బయలుదేరి గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న వికలాంగులను పలకరించి తాడేపల్లిగూడెం వెళ్లేందుకు హెలికాప్టర్‌లో కూర్చొన్నారు. ఇంజన్ స్టార్ట్ అయినా టేకాఫ్ అవ్వడంలో సాంకేతిక సమస్య తలెత్తింది. కొంతసేపు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మరో హెలికాప్టర్‌లో వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే వాతావరణం ప్రతికూలంగా మారడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్న పవన్... తిరిగి చేబ్రోలులోని తన నివాసానికి వెళ్లిపోయారు. దీంతో తాడేపల్లిగూడెం, ఉంగుటూరు సభలను పవన్ వాయిదా వేసుకున్నారు. మరో రోజు ఈ సభలను నిర్వహించనున్నారు.

నేడు పవన్ భారీ ర్యాలీ

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిఠాపురం శాసనసభ అభ్యర్థిగా నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో మూడు పార్టీల నేతలు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొంటారు. టీడీపీ నుంచి వర్మ, బీజేపీ తరఫున కృష్ణంరాజుతో పాటు ఇతర పార్టీల నేతలు నామినేషన్ ర్యాలీలో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు గొల్లప్రోలు పట్టణం వద్ద జాతీయ రహదారిపై ర్యాలీ ప్రారంభమవుతుంది. ర్యాలీ ముగిసిన అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి జనసేనాని తన నామినేషన్ పత్రాలను అందజేస్తారు.

వివేకా హత్యలో.. జగన్ సైతం భాగస్థుడే!

- అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కూడా: దస్తగిరి



పులివెందుల, ఏప్రిల్ 22: వివేకా హత్యలో సీఎం జగన్ కూడా భాగస్థుడేనని అప్రూవర్‌గా మారిన దస్తగిరి(ఏ-4) ఆరోపించాడు. వివేకా కుమార్తె సునీతకు, తనకు చీకటి ఒప్పందం ఉందని అవినాశ్‌రెడ్డి అంటున్నారని.. ఆ విషయం నిరూపిస్తే జైలుకు వెళ్లేందుకు తాను సిద్ధమని.. నిరూపించలేకపోతే మీరు జైలుకు వెళ్లేందుకు సిద్ధమా అని ఆయనకు సవాల్ విసిరారు. సోమవారం పులివెందులలోని తన ఇంటి వద్ద దస్తగిరి విలేకరులతో మాట్లాడాడు. 'ఈ ఐదేళ్లలో జగన్ వివేకా హత్య గురించి మాట్లాడకుండా ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన సిద్ధం సభలో ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాడు. హంతకుడు బయట తిరుగుతున్నాడని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నాడు. దీనిని ఖండిస్తున్నా. హత్యలో జగన్మోహన్‌రెడ్డి, ఆయన పక్కన ఉన్న అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి.. వీళ్లందరూ భాగస్థులే. ఎవరు చెబితే ఈ హత్య చేశారో ప్రజలందరికీ తెలుసు. హంతకులు ఎవరో త్వరలో కోర్టులు నిర్ణయిస్తాయి' అని తెలిపాడు. 'జైభీమ్ భారత్ పార్టీ పులివెందుల అభ్యర్థిగా బుధవారం (24న) నామినేషన్ వేయబోతున్నా. 25న వేస్తానంటే.. ఆ రోజు జగన్ వస్తున్నారు.. 23 లేదా 24న వేసుకోవాలని చెప్పారు. ఆయనొక్కడికే ఆ రోజు నామినేషన్ వేసుకునే హక్కుందా? మరెవరికీ లేదా?' అని నిలదీశాడు. తాను ప్రతి ఇంటికి రాలేకపోయినా.. తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను దస్తగిరి కోరాడు.

వైసీపీ మహిళా ఎస్సీ అభ్యర్థికి అవమానం



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కోసం మండుటెండలో వేచి ఉన్న బద్వేలు వైసీపీ అభ్యర్థి సుధ

బద్వేలు, ఏప్రిల్ 22: సీఎం జగన్ సొంత జిల్లా కడపలోని ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గం బద్వేలులో వైసీపీ నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఈ విభేదాలు ఎస్సీ అభ్యర్థి, ఎమ్మెల్యే దాసరి సుధను తీవ్ర అవమానానికి గురి చేశాయి. సుధ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి.. ఆమెను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోవడంతో ఆమె దాదాపు 2 గంటలపాటు మండుటెండలో రోడ్డుపైనే ఉండిపోయారు. బద్వేలు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డిపై ఆయన బావమరిది విశ్వనాథరెడ్డితో తిరుగుబాటు జెండా ఎగురవేశారు. దీంతో పార్టీ అధిష్ఠానం వీరిమధ్య రాజీ చేసింది. ఈ క్రమంలో సోమవారం సుధ నామినేషన్ సందర్భంగా ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి ఉండడంతో తీవ్ర అసహనం వ్యక్తంచేసిన గోవిందరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాదాపు 2 గంటల పాటు సుధ నాలుగురోడ్ల కూడలిలో ఎండలో ఉండిపోయారు. విషయాన్ని ఎంపీ అవినాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన గోవిందరెడ్డి, విశ్వనాథరెడ్డితో మాట్లాడి ఇద్దరూ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేలా చేశారు.

'శిరోముండనం' తీర్పుపై.. త్రిమూర్తులు అప్పీల్

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో తనను దోషిగా నిర్ధారించి, శిక్ష ఖరారు చేస్తూ విశాఖపట్నం ఎస్సీ-ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసరంగా విచారించాలని ఆయన తరఫు న్యాయవాది వి.సాయికుమార్ సోమవారం కోర్టును అభ్యర్థించారు. పిటిషనర్ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారని... కేసులకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో పొందుపర్చాల్సి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్పీల్‌ను లంచ్‌మోషన్‌గా తీసుకుని అత్యవసరంగా విచారించాలని కోరారు. న్యాయస్థానం జోక్యం చేసుకుని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పిటిషనర్‌కు విధించిన శిక్షను ట్రయల్ కోర్టు నెల రోజులు సస్పెండ్ చేసిందని గుర్తుచేసింది. అప్పీల్‌పై మంగళవారం విచారణ జరుపుతామని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు సోమవారం ఆదేశాలిచ్చారు.

అవినీతి పార్టీకి ఓట్లు వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన మీరు... అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేశారు? ఈ ఐదేళ్లలో తట్టెడు మట్టి పోశారా? వైఎస్ఆర్ శంకుస్థాపన చేసి 60శాతం పూర్తిచేసిన వెలిగొండను పూర్తిచేయకుండా ఇన్నాళ్లు గాడిదలు కాశారా? వైఎస్ వారసులమని చెప్పుకోవడానికి సిగ్గులేదా? తాగునీరు, సాగునీరు లేక ప్రకాశం జిల్లాలో ప్రజలు అల్లాడుతున్నారు. ఉపాధి కోసం పేదలు, రైతులు వలసలు వెళ్తున్నారు. ఏటా జనవరిలో ఇస్తామన్న జాబ్ కేలెండర్ ఏమైంది?" అని ముఖ్యమంత్రిని షర్మిల ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బదులుగా స్పెషల్ స్టేటస్ బ్రాండ్ తెచ్చారని మండిపడ్డారు. రూ.8లక్షల కోట్లు అప్పు చేయడమే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమా అని ఎద్దేవా చేశారు. 'ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఎమ్మెల్యే బాగా సంపాదించాడటగా... అన్ని కమీషన్లు ఈయనకేనట కదా.. ఈయన మంచోడు అయితే ఇక్కడనుంచి ఎందుకు మార్చారు?' అని ప్రశ్నించారు. ఇలాంటి చెత్త పార్టీలకు, ఓట్లు వేయడం అవసరమా? అని ప్రజలను షర్మిల ప్రశ్నించారు.

డబ్బులిస్తే తీసుకోండి.. అవి మీవే...

'రాష్ట్రంలో మైన్, వైన్, ల్యాండ్, శాండ్ మాఫియా నడుస్తోంది. ఇష్టారాజ్యంగా దోచుకు తిన్నారని ఎమ్మెల్యేలను మార్చేశారు. ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే కలెక్షన్ కింగ్.. క్వారీల నుంచి కమీషన్లు వసూలు చేయటంలో వసూలు రాజా. దోచుకుతిన్నాడని ఆయనకు సీటు ఇవ్వలేదట. అయినా వైసీపీకి ఓటు వేస్తారా? దోచుకున్న డబ్బుతో ఓట్లు కొనటానికి వస్తారు. వాళ్లు ఇచ్చే డబ్బులు తీసుకోండి. అవి మీ డబ్బులే... కానీ పవిత్రమైన ఓటును మాత్రం ఆలోచించి వేయండి' అని ఓటర్లకు షర్మిల విజ్ఞప్తి చేశారు.



సంతనూతలపాడు నియోజకవర్గంలో జరిగిన సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న షర్మిల

'అంబటి రాంబాబు అంట.. గెలిస్తే మొత్తం ఎంపీలను బీజేపీకి ఇస్తాడట. ఇదీ వైసీపీ, బీజేపీ మధ్య ఉన్న దోస్తీ. లక్ష ఎకరాలకు సాగునీరు, ఒంగోలుకు తాగునీరిచ్చే గుండ్లకమ్మను వైఎస్ఆర్ పూర్తిచేస్తే ఆ ప్రాజెక్టు గేట్లు విరిగిపోయి రెండేళ్లయినా పట్టించుకోని జగనన్న... వైఎస్‌కు వారసుడు ఎలా అవుతాడు?' అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ ఐదేళ్లలో జగన్ పెద్దపెద్ద కోటలు కట్టుకున్నారు.. మంత్రులు, ఎమ్మెల్యేలకే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు.. ఇక సామాన్య ప్రజలను ఆయనేం కలుస్తారు' అని అన్నారు. ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే రాష్ట్ర భవిష్యత్ మారిపోయేదని, వేలసంఖ్యలో ఉద్యోగాలు వచ్చేవని చెప్పారు. చిన్నాన్నను చంపిన హంతకులకు జగన్ టికెట్ ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ, ఏడాదికి ఇంటికి రూ.లక్ష, పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని షర్మిల హామీ ఇచ్చారు.

చీరాలలో ఆమంచి.. పి.గన్నవరంలో చిట్టిబాబు

న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, పి.గన్నవరం(ఎస్సీ) ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కాంగ్రెస్ అధిష్ఠానం అవే అసెంబ్లీ టికెట్లు ఖరారు చేసింది. పార్టీ సీనియర్ నాయకురాలు సుంకర పద్మశ్రీని విజయవాడ తూర్పు అభ్యర్థిగా, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్క రాజు రామారావును విశాఖ ఉత్తరం అభ్యర్థిగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే మరో 38 మంది అభ్యర్థుల జాబితాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం ఢిల్లీలో విడుదల చేశారు. మొదటి జాబితాలో 114, రెండో జాబితాలో 12 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. వాటిలో 10 సీట్లలో అభ్యర్థులను మార్చారు. దీంతో ఇప్పటివరకూ ఏపీలో 154 మంది అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించినట్లయింది.

పారిశ్రామికవేత్తలకు బాబు దన్ను

- ఆయన గెలుస్తారన్న సంకేతాలతో రాష్ట్రంపై పలు ఇండస్ట్రీల ఆసక్తి: లోకేశ్
- కాజలో అపార్ట్‌మెంట్‌వాసులతో భేటీ

మంగళగిరి, ఏప్రిల్ 22: పారిశ్రామికవేత్తలను సీఎం జగన్ వేధిస్తే.. తమ అధినేత చంద్రబాబు వారిని ప్రోత్సహిస్తారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తెలిపారు. ఎన్నికల అనంతరం పెట్టుబడుల వరదను పారించడానికి ఆయన బృందం ఇప్పటి నుంచే వ్యూహాలను రచిస్తోందన్నారు. తద్వారా యువతకు ఉపాధి కల్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నదే చంద్రబాబు ఆశయమని వివరించారు. లోకేశ్ సోమవారం మంగళగిరి నియోజకవర్గం కాజలోని ఏఆర్ అపార్టుమెంట్ వాసులతో భేటీ అయ్యారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలసీలు మారడంవల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందని.. ఈ ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడుల పరిరక్షణకు పకడ్బందీ విధానాలతో సమగ్ర చట్టాన్ని తెచ్చే అంశమై యోచిస్తున్నామని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో అభద్రతా భావం తొలగించేందుకు ఓ ప్రత్యేక చట్టాన్ని తీసుకురావలసిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు, మైనింగ్ యజమానులతోపాటు ఉద్యోగులను జగన్ సైతం వేధించారని.. దీంతో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపారు. రాబోయే ఎన్నికలు యువతకు చాల కీలకమైనవని.. యువత ఆలోచించి ఓటేసి తమ భవిష్యత్‌ను కాపాడుకోవాలని లోకేశ్ పిలుపిచ్చారు



లోకేశ్‌కు మంగళగిరిలోని కాజా వద్ద హారతిచ్చి, తిలకం దిద్దుతున్న స్థానికులు



బేబీనాయనకు కూలిసొమ్మును విరాళంగా అందజేస్తున్న జగన్నాథం

వెలకట్టలేని అభిమానం!

- బేబీనాయనకు ఉపాధి కూలీ విరాళం

బొబ్బిలి, ఏప్రిల్ 22: విజయనగరం జిల్లా బొబ్బిలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీగా పోటీచేస్తున్న బేబీనాయనకు ఉపాధి హామీ పథకం వేతనదారుడు తన వారంరోజుల వేతనాన్ని విరాళంగా అందజేసి అభిమానాన్ని చాటుకున్నారు. బొబ్బిలి మండలం నారసింహునిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన కొండపల్లి జగన్నాథం రూ.1300 బేబీనాయనకు విరాళంగా అందజేశారు. దీనికి ఉబ్బితబ్బిబ్బయిన బేబీనాయన మాట్లాడుతూ ఈ అభిమానానికి వెల కట్టలేమని, జగన్నాథం విరాళంగా ఇచ్చిన ఈ సొమ్మును జగన్నాథస్వామి ప్రసాదంగా భావించి తన నామినేషన్ రుసుము కోసం వినియోగిస్తున్నానని తెలిపారు.

ఉండిలో రఘురామరాజు నామినేషన్



ఉండిలో నామినేషన్ దాఖలు చేస్తున్న టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు

ఉండి, ఏప్రిల్ 22: పశ్చిమగోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్డీఏ కూటమి తరఫున టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. భీమవరం నుంచి టాప్ లేని జీపులో ఉండి ఆర్వో కార్యాలయానికి ఆయన ఊరేగింపుగా బయలుదేరారు. ఆయనతోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు, నరసాపురం బీజేపీ ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జనసేన ఇన్‌చార్జ్ జుత్తుగ నాగరాజు ఉన్నారు.

బస్సు యాత్రకు జగన్ విరామం

- రేపు టెక్కలిలో 'సిద్ధం' ముగింపు సభ

విశాఖపట్నం, శ్రీకాకుళం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బస్సుయాత్రకు సీఎం జగన్ సోమవారం విరామం ఇచ్చారు. ఆదివారం విశాఖ నగరంలో రోడ్‌షో నిర్వహించిన ఆయన, పీఎం పాలెంలోని ఎంవీవీ సిటీ సమీపంలో రాత్రి బస చేశారు. సోమవారం ఆనందపురం, తగరపువలస మీదుగా బస్సు యాత్ర విజయనగరం జిల్లాలోకి వెళ్లాల్సి ఉంది. కానీ సోమవారం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు పార్టీ నేతలకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం పీఎంపాలెం నుంచి బస్సు యాత్ర మొదలవుతుంది. ఆనందపురం, తగరపువలస మీదుగా విజయనగరం జిల్లాకు జగన్ చేరుకుంటారు. మంగళవారం సాయంత్రం చెల్లూరు వద్ద ఏర్పాటు చేసే బహిరంగసభలో ఆయన పాల్గొంటారు. అదే రోజు రాత్రి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం అక్కివలస చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం శ్రీకాకుళం మీదుగా టెక్కలి చేరుకుంటారు. టెక్కలిలో బస్సు యాత్రను ముగించి.. తిరుగు పయనమవుతారు. అయితే ఈ యాత్రను పార్వతీపురం మన్యం జిల్లాకు కలపలేదు. మరి ఆయన ఆ జిల్లా వెళ్లకుండానే బుధవారం యాత్ర ముగిస్తారా..? లేక మన్యం జిల్లా మీదుగా వచ్చి..టెక్కలిలో యాత్రను ముగిస్తారా? అన్నది వైసీపీ నాయకుల్లో సందేహం నెలకొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

సానుభూతి కోసం వెలంపల్లి డ్రామాలు

● నిజ నిర్ధారణ కోసం ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రిలో పరీక్షలు చేయించాలి: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 22: వెలంపల్లి శ్రీనివాస్‌లో ఓటమి భయం ఉందని, దీంతో సానుభూతితో గెలవాలని గులకరాయి డ్రామాలు ఆడుతున్నాడని సెంట్రల్ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోనే ప్రఖ్యాతి గాంచిన ఎల్వీప్రసాద్ ఐ ఆస్పత్రిలో వెలంపల్లి కంటికి వైద్య పరీక్షలు చేయించి నిజనిర్ధారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వెలంపల్లి చెప్పింది అబద్ధమని రుజువైతే తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఎడమ కంటికి గాయమైతే ఈరోజు కుడి కంటికి కట్టి నట్టు ఉందని అన్నారు. వెలంపల్లి డ్రామాలను ప్రజలు గమని స్తున్నారన్నారు. జరగని దాడిని జరిగినట్లు ప్రజలను నమ్మించి డ్రామాలాడిన వెలంపల్లి నామినేషన్‌ను తక్షణమే ఎన్నికల సంఘం తిరస్కరించాలని ఓటర్లను తప్పుదారి పట్టిస్తున్న వెలంపల్లిపై సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గులకరాయి దాడి ఘటనలో నిజాలు బయటకు రావాలనే ఎన్నికల సంఘానికి, గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని వివరించారు.

టీడీపీకి చేరికల జోష్!

● పసుపు కండువా కప్పుకొన్న వైసీపీ నేత ఎంవీఆర్ చౌదరి


లోకేశ్ సమక్షంలో అనుచరులతో టీడీపీలో చేరిన ఎంవీఆర్ చౌదరి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన వైసీపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త మండవ వెంకట్రామ్ చౌదరి (ఎంవీఆర్) టీడీపీలో చేరారు. సోమవారం టీడీపీ యువనేత లోకేశ్ సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకొన్నారు. ఎంవీఆర్ చౌదరితోపాటు విజయవాడ తూర్పు, పెనమలూరు నియోజకవర్గాలకు చెందిన 50 మంది నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లిందని, రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని లోకేశ్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసి వచ్చే వారందరికీ ఆహ్వానం పలుకుతున్నట్లు ఆయన తెలిపారు. 1987 నుంచి టీడీపీతో తనకు అనుబంధం ఉందని ఎంవీఆర్ చౌదరి అన్నారు. తిరిగి సొంత గూటికి చేరుకోవడం ఆనందంగా ఉందని, తల్లిలాంటి పార్టీని వీడి వైసీపీలోకి వెళ్లామని, మళ్లీ తల్లి చెంతకు చేరడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో టీడీపీ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.

కోలవెన్ను సర్పంచ్, ఉప సర్పంచ్, మరికొందరు వార్డు సభ్యులు టీడీపీలో చేరిక


కోలవెన్ను సర్పంచ్ చోరగుడి సురేష్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్, తుమ్మల చంద్రశేఖర్

కంకిపాడు, ఏప్రిల్ 22: పెనమలూరు నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అయిపోయిందని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. కోలవెన్ను సర్పంచ్ చోరగుడి సురేష్‌తో పాటు ఉప సర్పంచ్ కంచర్ల వెంకట్రావు(చిన్ని), వార్డు సభ్యులు వల్లభనేని కరుణశ్రీ, గోవిందరావు, శంకర్, ఈశ్వర్‌రావు, మల్లికార్జునరావు, మాదాసువారి పాలెం వార్డు సభ్యులతో పాటు అనేక మంది వైసీపీ నాయకులు బోడె ప్రసాద్, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ సమక్షంలో టీడీపీలో చేరారు. పెనమలూరు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. జగన్‌ను నమ్మి ఓటేసి నట్టేట మునిగిపోయామని, విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుకు ఓటేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు కేశినేని చిన్ని, సుజనాచౌదరితో మాటామంతీ

వన్‌టౌన్, ఏప్రిల్ 22: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి భవిష్యత్‌లో వాటి పరిష్కారానికి తగిన హామీ పొందేందుకు బుధవారం మిల్క్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న కన్వెన్షన్ హాలులో సాయంత్రం 6 గంటల నుంచి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనాచౌదరిలతో మాటామంతీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కూటమి సమన్వయ కమిటీ నేతలు తెలిపారు. వన్‌టౌన్‌లోని సమన్వయ కమిటీ కార్యాలయంలో సోమవారం నాయకులు పిళ్లా శ్రీనివాసరావు, (పీసీ) రాంపిళ్ల శ్రీనివాసరావు, కొణిజేటి రమేష్, నూకల నాగేశ్వరావు, బెనర్జీ, రమణ తదితరులు కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు

లయోలా అధ్యాపకుడికి భారత్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

భారతీనగర్, ఏప్రిల్ 22: ఆల్‌ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) కో-ఆర్డినేటింగ్ అధికారి డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రసాద్ రెడ్డి నుంచి జేష్ఠ ఆచార్య భారత్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు(బీఈఈఏ)ను తమ కళాశాల సీఎస్ఈ విభాగం, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆకెళ్ల శ్రీనివాసరావు అందుకున్నారని ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.జోజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు ఎంపిక కమిటీకి 8000 కంటే ఎక్కువ నామినేషన్లు వచ్చాయని, వాటిలో 300 ప్రొఫైల్‌లను ఖరారు చేశారని, అందులో ప్రొఫెసర్ ఆకెళ్ల శ్రీనివాసరావుకు బీఈఈఈ అవార్డుకు ఎంపిక అయ్యారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డి.బాలస్వామి తదితరులు ప్రొఫెసర్ ఆకెళ్ల శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

కమిషనరేట్‌లో సీసీసీ ఏర్పాటు

విజయవాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కమిషనరేట్‌లో సీసీసీ(సెంట్రల్ కంప్లైంట్స్ సెల్) ఏర్పాటు చేశారు. దీనికి ప్రత్యేకంగా ఒక టోల్‌ఫ్రీ నంబరును కేటాయించారు. 1800-425-5049 నంబరుకు నగదు పంపిణీ, మద్యం, ఓటర్లను ప్రలోభపరిచే అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని సీపీ కాంతిరాణా తెలిపారు.

'తూర్పు'కు పద్మశ్రీ..జగ్గయ్యపేటకు అప్పారావు

● కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

విజయవాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మరో ఇద్దరు అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. విజయవాడ తూర్పునకు పీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీని ఎంపిక చేశారు. జగ్గయ్యపేటకు కర్నాటి అప్పారావు పేరును ఖరారు చేశారు. వారిలో పద్మశ్రీ విజయవాడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి ఆసక్తిని చూపించారు. ఆమెను అధిష్ఠానం తూర్పు అసెంబ్లీ నుంచి బరిలోకి దింపింది.

వైసీపీ పాలనలో అడుగంటిన మైనార్టీ సంక్షేమం

● ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి

వన్‌టౌన్, ఏప్రిల్ 22: వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీ సంక్షేమం అడుగంటిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీతో పొత్తుపెట్టుకుంది గనుక టీడీపీకి ముస్లింలు మద్దతు ఇవ్వవద్దని, ఓటు వేయవద్దని ప్రచారం చేసే అర్హత వైసీపీకి లేదన్నారు. కేంద్రంలో బీజేపీతో వైసీపీ సఖ్యతగా ఉండి, ముస్లింలకు అననుకూలమైన బిల్లులకు మద్దతు ఇవ్వలేదా అని ఆయన ప్రశ్నించారు. ముస్లింలు తిరుగుబాటు చేయడంతో బిల్లులను అమలు చేయడం లేదని వైసీపీ శాసన సభలో ప్రకటించిందన్నారు. టీడీపీ హయాంలోనే ముస్లింలకు సంక్షేమాలు అందాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని, అందుకే ఆయనకు మద్దతు ఇస్తున్నామని తెలిపారు.


గద్దె రామ్మోహన్‌కు అభినందనలు తెలుపుతున్న కేశినేని చిన్ని, నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు



కోలాహలంగా గద్దె నామినేషన్

భారీ సంఖ్యలో తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

పటమట/కృష్ణలంక ఏప్రిల్ 22: తూర్పు నియోజకవర్గ టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు గద్దె రామ్మోహన్ సోమవారం కోలాహలంగా తరలివెళ్లారు. గద్దె అనురాధతోపాటు వేలాది మంది టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పటమటలంక డీమార్ట్ దగ్గర నుంచి భారీ ర్యాలీగా ఆయన బయల్దేరి వెళ్లారు. జనసేన, టీడీపీ, నాయకులు, వంగవీటి రాధా అభిమానులు ప్రతి సెంటర్‌లోనూ క్రేన్ల ద్వారా గజమాలలు వేస్తూ ఆయనకు స్వాగతం పలికారు. గద్దె రామ్మోహన్‌కు మద్దతుగా అమరావతి సైక్లిస్టులు, అమరావతి రైతులు నామినేషన్‌లో పాల్గొన్నారు. పటమటలంక దగ్గర నుంచి మొదలైన బైక్ ర్యాలీ రామలింగేశ్వరనగర్, స్క్రూబిడ్జి, రాణిగారి తోట, ఎం హోటల్ సెంటర్, నల్లగేటు సెంటర్, సత్యం హోటల్ సెంటర్, స్వర్గపురి రోడ్డు వరకు కోలాహలంగా సాగింది. పాదయాత్రగా అభివాదం చేస్తూ వెళ్లిన గద్దె, ఆయన సతీమణికి అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. మహిళలు హారతులు పట్టారు. సత్యం హోటల్ సెంటర్‌లో వేద పండితులు గండికోట సుబ్రమణ్య శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు సతీసమేతంగా హారతులిచ్చి ఆశీర్వచనం పలికారు. టీడీపీ జిందాబాద్, బాబు రావాలి, గద్దె గెలవాలి అనే నినాదాలతో యువకులు హోరెత్తించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రామ్మోహన్ రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ముందుగా గద్దె రామ్మోహన్ ఇంటి వద్ద గోపూజ చేశారు. గద్దె ఇంటికి వచ్చిన ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, బీజేపీ నాయకుడు పోతంశెట్టి నాగేశ్వరరావు, వేములపల్లి రంగారావు, వల్లూరి మధు, గొరిపర్తి నామేశ్వరరావు, షాబు, పోడూరు పవన్, ఎస్వీ దుర్గారావు, తవ్వా ప్రకాష్, మహ్మద్ హాజీ, అమ్మిశెట్టి వాసు, కొప్పూరు కిరణ్ బాబు, పోతిరెడ్డి రమణ, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, బి.నాగేశ్వరరావు, గణపతి నాగార్జున, చలమలశెట్టి స్వామి, షేక్ సుభాని, షేక్ మురళి, నాగ లోకేష్, కె.అయ్యప్ప, సీహెచ్ భద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయం ఖాయం: గద్దె

పటమట: జగన్ ఈ ఐదేళ్లలో ప్రజలకు ఏం చేశారని గద్దె రామ్మోహన్ ప్రశ్నించారు. నామినేషన్ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌పై గులకరాయితో దాడి జరిగితే మైనర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి టీడీపీ నాయకులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మండుటెండను ప్రజలు లెక్కచేయకుండా స్వచ్ఛందంగా ప్రజలు తరలి వచ్చి మద్దతు తెలిపారని, మూడోసారి ఎమ్మెల్యేగా రామ్మోహన్ గెలవడం ఖాయమని జడ్పీ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ అన్నారు.

నామినేషన్ విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ, ఎమ్మార్పీఎస్ శ్రేణులు, అమరావతి వాకర్స్, అభిమానులు, ప్రజలకు గద్దె రామ్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

రియల్ ఎస్టేట్ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నరెడ్కో

నరెడ్కో జాతీయ అధ్యక్షుడు హరిబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 22: రియల్ ఎస్టేట్ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నేషనల్ రియల్ ఎస్టేట్ కౌన్సిల్(నరెడ్కో) వ్యవహరిస్తుందని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు జి.హరిబాబు అన్నారు. రియల్ ఎస్టేట్ పరిశ్రమ వృద్ధిని ప్రోత్సహించే వాతావరణాన్ని సృష్టించడమే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నామని ఆయన తెలిపారు. జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి సెంట్రల్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. మాలక్ష్మీ గ్రూప్ సీఈవో సందీప్ మండవ అధ్యక్షుడిగా మరో 20 మందితో కూడిన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా జి.హరిబాబు మాట్లాడారు. "సలహా, సంప్రదింపు ప్రక్రియల ద్వారా పరిశ్రమ, ప్రభుత్వాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. స్థిరాస్తి రంగంలో సభ్యుల మధ్య సమన్వయం, సహకారంతో ఈ రంగాన్ని ప్రభావితం చేసే కీలక విధానాలు, సంస్కరణల రూపకల్పనలో నరెడ్కో క్రియాశీలక భూమిక పోషిస్తుంది. ప్రాంతీయంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగైనప్పుడే స్థిరాస్తి రంగం వేగవంతమైన అడుగులు వేస్తుంది. విభిన్న రాష్ట్రాల్లో స్థిరాస్తి రంగం అకాశమే హద్దుగా ఎదుగుతోంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి." అని హరిబాబు పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవాలని నర్కెడో రాష్ట్ర అధ్యక్షుడు జి.చక్రధర్ సూచించారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి సాధించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలను సరళీకరించాల్సి ఉందని నరెడ్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామయ్య పేర్కొన్నారు.

సమాజానికి సంపద సృష్టించేది స్థిరాస్తి రంగం

స్థిరాస్తి రంగం బలోపేతానికి చర్యలు తీసుకుంటామని సందీప్ మండవ అన్నారు. స్థిరాస్తి రంగం అంటే సమాజానికి సంపద సృష్టించేది అని, ప్రభుత్వాల దృక్పథం ఆతీరుగా మారేలా సమన్వయం చేస్తామని అన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షిస్తామని పేర్కొన్నారు.

ప్రమాణస్వీకారం చేసింది వీరే..

నూతన కార్యవర్గంలో ప్రమాణస్వీకారం చేసిన వారిలో కార్యనిర్వాహక ఉపాధ్యక్షులుగా ఎం.రాంబాబు, శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాదినేని వెంకటరమణ, కోశాధికారిగా పొట్ల వెంకటకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.హరిప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.గణేష్‌కుమార్, సీహెచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా పి.రాజకుమార్, రత్నకుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరావు, శ్రీనివాస్ మోహర్, సురేష్, కృష్ణకిషోర్ ఉన్నారు. నార్కెడో రాష్ట్ర కార్యదర్శి కిరణ్ పరుచూరి, ఎన్నికల అధికారి కోనేరు రాజశేఖర్ పాల్గొన్నారు. నరెడ్కో సెంట్రల్ జోన్ గౌరవ చైర్మన్‌గా గద్దె రాజలింగం వ్యవహరించారు.

ఆరోగ్యకర జీవితానికి యోగా దోహదం

ఐజీఎంఎస్‌లో వేసవి ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు ● ప్రారంభించిన కలెక్టర్ దిల్లీరావు


యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ దిల్లీరావు

లబ్బీపేట, ఏప్రిల్ 22: ఆరోగ్యకర జీవితానికి యోగాసనాలు దోహదం చేస్తాయని, సర్వ రోగాలకు ఖర్చులేని చికిత్స యోగా మాత్రమేనని కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం(ఐజీఎంఎస్)లో వేసవి ప్రత్యేక యోగా తరగతులను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏటా 2వేల మందికి ఉచితంగా యోగ శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ పర్యవేక్షణలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ యోగాసనాలను వేశారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మే 13న ఓటేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డీపీపీ టి.హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కాశీ విశ్వనాథ్, అసోసియేషన్ కోశాధికారి ఎ.లావణ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో.. వీఎంసీ పాఠశాలల విద్యార్థుల సత్తా

ఇద్దరికి 594 మార్కులు


ఎస్టీవీఆర్‌ఎంసీహెచ్ స్కూల్ విద్యార్థి భవానీశంకర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సూర్యప్రభ

చిట్టినగర్, ఏప్రిల్ 22: పదోతరగతి పరీక్షల్లో నగరపాలక సంస్థ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించారు. పటమటలంక గోవిందరాజులు ఈనాం ట్రస్ట్ ప్రభుత్వ పాఠశాల(జీడీఈటీఎంసీహెచ్) విద్యార్థిని జి.సువర్షిత 594 మార్కులు, దుర్గాపురం ఎస్టీవీఆర్ ఎంసీహెచ్ స్కూల్‌కు చెందిన విద్యార్థి డి.భవానీశంకర్ 594 మార్కులతో టాపర్‌గా నిలిచారు. నగర పాలక సంస్థకు చెందిన 29 పాఠశాలల్లో 2621 మంది పరీక్షలు రాయగా వారిలో 2121 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎస్ఎన్ఎంసీ ఉర్దూ స్కూల్ 100శాతం ఉత్తీర్ణత సాధించగా గాంధీజీ మహిళా హైస్కూల్ 50.89 శాతంలో చివరి స్థానంలో నిలిచింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..


జీడీఈటీఎంసీహెచ్ఎస్ విద్యార్థిని జి.సువర్షిత

పటమట: తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తనకు పదోతరగతి ఫలితాల్లో 594 మార్కులు వచ్చాయని గోవిందరాజులు ఈనాం ట్రస్ట్ ప్రభుత్వ పాఠశాల((జీడీఈటీఎంసీహెచ్)లో చదువుతున్న గాడెల్లి సువర్షిత తెలిపింది. తండ్రి గాడెల్లి నాగరెడ్డిబాబు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్, తల్లి బేబీ సరోజిని గృహిణి అని, తాము ముగ్గురు ఆడపిల్లలమని పేర్కొంది. అన్ని విషయాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించారని తెలిపింది. వారి ప్రోత్సాహంతోనే తాను ఈ విజయం సాధించానని సువర్షిత తెలిపింది.

దళవాయి సుబ్బరామయ్య హైస్కూల్ బాలికల హవా

విద్యాధరపురం: పదో తరగతి ఫలితాల్లో దళవాయి సుబ్బరామయ్య మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ బాలికలు సత్తా చాటారు. బొడ్డేటి వస్సిక 566, హేమవరపు మహలక్ష్మి 561, దిగల చరిష్మారాణి 559 మార్కులు సాధించారు. తెలుగుమీడియంలో 29 మందికి 22 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లీషు మీడియం 82 మందికి 67 మంది ఉత్తీర్ణులయ్యారు.

జీఎన్ఆర్ స్కూల్‌లో 76 శాతం ఉత్తీర్ణత

భవానీపురం: 44వ డివిజన్ లేబర్‌కాలనీలోని జీఎన్ఆర్ హైస్కూల్ నుంచి 41 మంది హాజరు కాగా 31 మంది ఉత్తీర్ణులయ్యారని 76 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు స్కూల్ హెచ్‌ఎం రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వాకాడ దేవి 560 మార్కులు, వాడపల్లి విజయ్‌లక్ష్మి 560 మార్కులు, బండి నాగమోహన్‌కుమార్ 550, ఉప్పాడ రూప 543 సాధించారన్నారు. 13 మంది 500 పైన సాధించినట్లు వివరించారు.

ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 84.56 శాతం ఉత్తీర్ణత

లబ్బీపేట: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు 84.56 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి 259 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 219 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 69మంది బాలురకు 57మంది, 190 మంది బాలికలకు 162మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎ.కొండూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ స్కూల్, జగ్గయ్యపేట, విసన్నపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాలల పాఠశాలల నుంచి 69మంది పరీక్షలు రాయగా వారిలో 57 మంది నందిగామ, కొండపల్లి, మైలవరం, కొండపర్వ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాలికల పాఠశాలల నుంచి 190 మంది రాయగా 162మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

స్టార్ హోటల్‌లో ఫలితాల విడుదలా?

● తప్పుబట్టిన నార్నె వెంకట సుబ్బయ్య

అజిత్‌సింగ్‌నగర్: పదో తరగతి పరీక్షల ఫలితాలను ఈ ఏడాది ఓ ప్రైవేట్ స్టార్ హోటల్‌లో అధికారులు విడుదల చేయడాన్ని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య తప్పుబట్టారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అనేకం ఉన్నాయని వాటన్నింటిని వదిలేసి స్టార్ హోటల్‌లో ఫలితాల విడుదల చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. హోటల్‌కు అయ్యే ఖర్చు మొత్తాన్ని అధికారులే భరించాలని డిమాండ్ చేశారు.

వించిపేటలో 100శాతం ఉత్తీర్ణత

విజయవాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో వించిపేటలోని ఎస్ఎన్ఎంసీ ఉర్దూ బాలిక ఉన్నత పాఠశాల అధిక ఉత్తీర్ణతను సాధించింది. హాజరైన 22 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాల 100శాతం ఉత్తీర్ణతను సాధించి నగరంలో ప్రథమస్థానంలో నిలిచింది. పటమటలోని జీడీఈటీఎంసీ ఉన్నత పాఠశాల 96.31శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక్కడి నుంచి పరీక్షలు రాసిన 115 మంది బాలురులో 109 మంది, 102 మంది బాలికల్లో 100 మంది ఉత్తీర్ణులయ్యారు. 94.55శాతం ఉత్తీర్ణతతో కృష్ణలంకలోని వీఎంఆర్ఆర్ ఎంసీ బాలికల ఉన్నత పాఠశాల మూడో స్థానంలో నిలిచింది. ఈ పాఠశాల నుంచి పరీక్షలు రాసిన 55 మందిలో 52 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. నగరంలో మొత్తం 29 వీఎంసీ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ఈ మూడు పాఠశాలలు ముందు మూడు స్థానాల్లో నిలిచాయి.


లెనిన్ విగ్రహం వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు

వర్గపోరాటంతోనే శ్రామిక విముక్తి సాధ్యం

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 22: వర్గపోరాటం ద్వారానే శ్రామిక విముక్తి సాధ్యమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ప్రప్రథమ సోషలిస్టు రాజ్యస్థాపకుడు వీఐ లెనిన్ 154వ జయంతిని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద చిత్రపటానికి సోమవారం వామపక్ష పార్టీల నేతలు నివాళులర్పించారు. దేశంలో, రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలన అంతం కోసం ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని రాఘవులు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల పేరుతో తొలిసారిగా లెనిన్ విగ్రహాన్ని తెల్లటి వస్త్రంతో కప్పారని ఆయన అన్నారు. సంక్షోభం, సామ్రాజ్యవాద సంస్కృతి నుంచి విముక్తి కోసం సోషలిజం, మార్క్స్ సిద్ధాంతాల వైపు ప్రపంచ ప్రజలు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు రాజారావు, వామపక్ష పార్టీల నేతలు కె.పోలారి, వై.చెంచయ్య, మోతుకూరి అరుణ్‌కుమార్, మనోహర్‌నాయుడు, లక్ష్మయ్య, విశ్వేశ్వరరావు, కారుసాల శ్రీనివాసరావు, ప్రజాసంఘాలు, సాంస్కృతిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో సీవీఆర్ డిగ్రీ కళాశాలకు ద్వితీయస్థానం

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 22: ఎస్‌డీఎంఎస్ మహిళా కళాశాల ఆవరణలో ఈనెల 20న నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్‌బాల్ మహిళా టోర్నీలో మాచవరం ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం వశం చేసుకుంది. ఆతిథ్య జట్టు ఎస్‌డీఎస్‌ఎంతో జరిగిన హోరాహోరీ ఫైనల్స్‌లో ఒక్క పాయింట్ తేడాతో ఓటమి చవి చూసింది. కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కళాశాల మహిళా టీమ్‌ను సోమవారం అభినందించారు. టి.సుష్మ, జి.రాచెల్ కె.సాయిదుర్గ భావన, ఎస్.స్రవంతి, కె.వల్లిశ్రీ, పి.మౌనికలు అత్యంత ప్రతిభ కనపరిచారన్నారు. ప్రతిభ కనపర్చిన క్రీడాకారిణులు వచ్చే నెల 4 నుంచి ఏడో తేదీ వరకు క్యాలికట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ టోర్నీకి ఎంపికయ్యా రని తెలిపారు.

విచ్చలవిడిగా చేతులు మారుతున్న ప్రజల డేటా

● సంక్షేమం పేరుతో మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

● వైసీపీ మాజీ కార్యకర్త, నంద్యాల స్వతంత్ర అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపణ

ధర్నాచౌక్, ఏప్రిల్ 22: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అత్యంత గోప్యంగా ఉండాల్సిన ప్రజల వ్యక్తిగత సమాచారం విచ్చలవిడిగా చేతులు మారుతోందని మాజీ వైసీపీ కార్యకర్త, నంద్యాల స్వతంత్ర అభ్యర్థి కామిని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 14 ఏళ్లుగా తాను వైసీపీ కార్యకర్తగా పని చేశానన్నారు. కొందరు ప్రతిపక్షనేతలు ఆరోపించక ముందే తాను డేటా లీక్‌ను గుర్తించి సీఎం జగన్‌కు దీనిపై పూర్తి వివరాలతో లేఖ రాశానని తెలిపారు. అయినా ఫలితం లేదన్నారు. పార్టీలోని అనేక మంది ప్రముఖులకు కలిసి వివరించిన ఫలితం లేదన్నారు. పార్టీ పెద్దలకు ఈ డేటా లీక్ అంశం తెలుసని తాను గ్రహించానన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలకు వారి డేటా లీక్ అంశాన్ని తెలియజేయాలని నిర్ణయించుకుని నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ఎవరైనా తనతో చర్చకు వస్తే డేటా లీక్‌ను నిరూపిస్తానన్నారు. అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఆయా కంపెనీలతో వైసీపీ లాలూచీ పడటమే ఈ డేటా లీక్‌కు కారణమని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించలేకపోయారని, రాజధాని ఏర్పాటు చేయలేదన్నారు.

వడ్డెర యువకులకు జగన్ న్యాయం చేయాలి

● గులకరాయి ఘటనపై ఈసీ జోక్యం చేసుకోవాలి

● తాడి శకుంతల, జయబాబు, బేతు రామ్మోహన్ డిమాండ్

ధర్నాచౌక్, ఏప్రిల్ 22: జగన్‌పై జరిగిన గులకరాయి దాడి ఘటనలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని అమాయకులను ఈ కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని నగర మాజీ మేయర్ తాడి శకుంతల, సోషలిస్టు పార్టీ నేత లాం జయబాబు, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోహన్‌రావు ఆరోపించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఎన్నికల్లో మైలేజ్ కోసం వడ్డేర కులానికి చెందిన మైనర్లను పోలీసులు విచారణ జరిపిన తీరు దురదృష్టకరమన్నారు. చీకట్లో రాయి ఎవరు విసిరారో తెలియకుండా, కస్టడీలో పెట్టి న్యాయస్థానంలో హాజరుపరచకుండా వేధించడం అన్యాయమన్నారు. యువకులపై ఒత్తిడి తీసుకువచ్చి బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సీఎం జగన్ తక్షణమే స్పందించి అమాయకులైన వడ్డెర యువకులను న్యాయం చేయాలని కోరారు. ఆరోగ్యం సరిగా లేని వేముల సతీష్ వైద్య సేవలందించి క్షమాభిక్ష పెట్టాలన్నారు. వెలంపల్లి శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదును ఉపసంహ రించుకోవాలన్నారు. వెలంపల్లి చేసిన ఫిర్యాదుపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలన్నారు. వేముల సతీష్ తల్లిదండ్రులు వేముల దుర్గారావు, రమణ, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి మీనాకు సోమవారం వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

శాంతిభద్రతలు కాపాడే శక్తి లేకపోతే డీజీపీ తప్పుకోవాలి: వర్ల రామయ్య

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడే శక్తి లేకపోతే, ఎన్నికల సంఘానికి లేఖ రాసి, ఎన్నికల నిర్వహణను కేంద్ర బలగాలకు అప్పగించి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తన పదవి నుంచి తప్పుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలసి, రాష్ట్రంలో శాంతిభద్రతలను సరిగా లేవని ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'సీనియర్ ఐపీఎస్‌లను కాదని డీజీపీని చేసినందుకు రాజేంద్రనాథ్‌రెడ్డి.. జగన్‌పై స్వామి భక్తిని ప్రదర్శిస్తున్నారు. సీఎం ఎక్కడ పర్యటనకు వెళ్లినా.. ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు బస్సు డోర్ దగ్గర ఉండాలని డీజీపీ సర్క్యులర్ జారీ చేయడం సిగ్గుచేటు. ప్రతిపక్ష పార్టీల నేతలను హింసించిన వారిపై డీజీపీ చర్యలు తీసుకోవట్లేదు. వైసీపీ నేతలు చట్టాన్ని ఉల్లంఘించడంపై విచారణ జరపాలి' అని డిమాండ్ చేశారు.

ఏపీలో కాలు పెడితే చంపేస్తామంటున్నారు

▸▸ సీఈవోకు ఎన్నారై టీడీపీ నేత యశస్వి ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో కాలు పెడితే చంపేస్తామని వైసీపీ కార్యకర్తలు, రౌడీల నుంచి నాకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయి' అని ఎన్నారై టీడీపీ నాయకుడు బొద్దులూరి యశస్వి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. టీడీపీ తరఫున ప్రచారం చేస్తే.. చంపేస్తామని పదేపదే బెదిరిస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్‌ను కలసి, ఫోన్ కాల్స్ డేటాను అందించి, తనకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

ఎన్ఆర్ఐలను టెర్రరిస్టులంటారా?

▸▸ ఎన్ఆర్ఐ టీడీపీ కో ఆర్డినేటర్ కోమటి జయరాం

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 'వక్రభాష్యాలు, అసత్యాలు, అబద్ధాలు చెప్పడంలో వైసీపీ నేతలు పీహెచ్‌డీలు చేశారు. జన్మనిచ్చిన నేల రుణం తీర్చుకోవాలనుకుంటున్న ఎన్ఆర్ఐలను టెర్రరిస్టులంటారా?' అంటూ ఎన్ఆర్ఐ టీడీపీ కో ఆర్డినేటర్ కోమటి జయరాం మండిపడ్డారు. 'తెలుగువారి అభివృద్ధికి దోహదపడాలనే ఉద్దేశంతో ఎన్ఆర్ఐలు ఎన్నికల సమయంలో వచ్చి పనిచేయాలన్న నా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు. ఎన్ఆర్ఐలు టీడీపీవకి మద్దతు ఇవ్వడం దేశద్రోహమా? టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రవాసాంధ్రుల సమస్యలను తీర్చేందుకు కృషి చేసింది. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు విదేశాల్లో ఉన్నారంటే అందుకు కారణం చంద్రబాబు మాత్రమే' అని కోమటి జయరాం అన్నారు.

బ్రాహ్మణుల రక్షణకు చట్టం చేయాలి

▸▸ ఏపీలో ఆలయాలకు, పురోహితులకు రక్షణలేదు: యామినీ శర్మ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 'పురహితాన్ని కోరే బ్రాహ్మణులకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోతోంది. ఇది సమాజానికి ఏ మాత్రం మంచిది కాదు' అని బీజేపీ నాయకురాలు సాదినేని యామినీ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె ఓ వీడియో ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రంలో వరుసగా బ్రాహ్మణులపై జరుగుతోన్న దాడులపై స్పందించారు. "పెళ్లి జరిపించేందుకు వెళ్లి రెండు నిండు జీవితాలను ఆశీర్వదిస్తోన్న బ్రాహ్మణుడిని దారుణంగా అవమానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల విధ్వంసాలు, పురోహితులపై, హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులు బ్రాహ్మణ వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులు ప్రణాళికా బద్ధంగా చేస్తున్నవే. బ్రాహ్మణులకు రక్షణగా అట్రాసిటీ చట్టం తీసుకురావాలి' అని డిమాండ్ చేశారు.

భానుడు భగభగ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగిపోతోంది. ఉష్ణోగ్రత మళ్లీ 45 డిగ్రీలు దాటేసింది. కోస్తాంధ్రలో వడగాడ్పులు కొనసాగుతున్నాయి. సోమవారం నంద్యాల జిల్లా గోస్పాడులో 45.3, కడప జిల్లా వెదురూరులో 45.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 44.8, విజయనగరం జిల్లా జామిలో 44.6, ప్రకాశం జిల్లా దరిమడుగులో 44.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 65 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 98 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. అయితే, ఉత్తరకోస్తాంధ్రలో అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షాలు పడ్డాయి. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అనకాపల్లి జిల్లాల్లోని 43 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

29 వరకూ ప్రకాశం బ్యారేజీ నీటి విడుదల: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వేసవి తాగునీటి ఎద్దడిని అధిగమించేలా వివిధ సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపేందుకు వీలుగా ప్రకాశం బ్యారేజీ నుంచి కాలువల ద్వారా ఈ నెల 29 వరకు, నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఈ నెల 25 వరకు నీటి విడుదలను కొనసాగిస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. తాగునీటి సరఫరా పరిస్థితులు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల కల్పనపై సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. వేసవి తాగునీటి అవసరాలకు అనుగుణంగా వివిధ సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వీలైనంత వరకూ విద్యుత్ కోతలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా పరిస్థితులపై అమరావతి సచివాలయంలో ఇంధనశాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గులకరాయితో చంపడమేంటి?: నారాయణ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 22: జెడ్ కేటగిరి భద్రత ఉన్న వ్యక్తి, అందులోనూ సీఎంను గులకరాయితో చంపాలని యత్నించడమేంటి? అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విస్తుపోయారు. సోమవారం కర్నూలు జిల్లా పత్తికొండకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్‌రెడ్డి కూడా మోదీకి సపోర్టుగానే ఉన్నాడు. రూ.లక్షల కోట్లు దోచుకున్న సీఎం జగన్‌రెడ్డి ఏళ్ల తరబడి బెయిల్‌పై బయట తిరగడం ఏమిటి? మోదీ అండతోనే జగన్ జైలుకెళ్లకుండా ఉన్నాడు. మోదీకి ఈ రాష్ట్రంలో జగన్, చంద్రబాబు కూలీలుగా మారారు. రాష్ట్రంలో గులకరాయి డ్రామాకు జగన్ తెరలేపారు. ఒక గులకరాయితో జగన్‌ను ఎలా చంపుతారు? కేవలం సింపతీ కోసమే జగన్ ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారు' అని నారాయణ అన్నారు.

గెలిచినా, ఓడినా ప్రజల పక్షానే పోరాటం: రాఘవులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 22: 'మా అభ్యర్థులను గెలిపిస్తే శాసనసభలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తాం. ఓడితే రోడ్డుపై ప్రజల పక్షాన పోరాడతాం' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సీపీఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, ప్రజాతంత్ర పార్టీలు బలపరిచిన ఇండియా బ్లాక్ తరఫున మంగళగిరి సీపీఎం అసెంబ్లీ అభ్యర్థిగా జొన్నా శివశంకర్‌రావు నామినేషన్ సందర్భంగా సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. దేశంలో లౌకికత్వాన్ని కాపాడాలంటే బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని రాఘవులు పిలుపునిచ్చారు.

నూజివీడులో లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. నూజివీడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో 40 మంది ప్రస్తుత ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, బీసీ, ఎస్సీ నేతలు యువనేత లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో వారందరికీ పసుపు కండువాలు కప్పి లోకేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. కాగా, దారుణ పరాజయం తరుముకొస్తుంటే.. తట్టుకోలేని వైసీపీ మూకలు టీడీపీ కార్యాలయాలు, కార్యకర్తలపైనా దాడులకు తెగబడుతున్నాయని లోకేశ్ మండిపడ్డారు.

30 వారాల గర్భవిచ్ఛిత్తికి సుప్రీం కోర్టు అనుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గర్భవిచ్ఛిత్తిపై సుప్రీంకోర్టు అసాధారణ తీర్పు ఇచ్చింది. అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలికకు ఊరట కల్పించింది. 30 వారాల గర్భాన్ని విచ్ఛిత్తి చేయటానికి అనుమతించింది. మహారాష్ట్రకు చెందిన ఆ బాలిక గతంలో అత్యాచారానికి గురై గర్భం దాల్చింది. నెలలు నిండిన తర్వాతగానీ ఆమె తల్లి దాన్ని గుర్తించలేకపోయింది. తన కుమార్తె అబార్షన్‌కు అనుమతి ఇవ్వాలని ఆమె బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు నిరాకరించింది. దీంతో, బాలిక తల్లి సుప్రీంకోర్టుకు వెళ్లారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై ఈ నెల 19న అత్యవసర విచారణ చేపట్టి.. అబార్షన్ చేస్తే బాధిత బాలిక శారీరక, మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో నివేదిక ఇవ్వాల్సిందిగా ముంబైలోని సియాన్ ఆసుపత్రి మెడికల్ బోర్డును ఆదేశించింది. ఈ మేరకు సియాన్ ఆసుపత్రి తన నివేదికలో.. అబార్షన్‌కు సిఫారసు చేసింది. ఈ నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టు సోమవారం తీర్పును వెలువరించింది.



ఇది ఒక ప్రత్యేకమైన కేసని ధర్మాసనం పేర్కొంది. బాలికకు తక్షణమే గర్భ విచ్ఛిత్తి చేయాలని, వైద్యపరంగా అన్ని రకాల సంరక్షణ చర్యలు తీసుకోవాలని సియాన్ ఆసుపత్రి డీన్‌ను ఆదేశిస్తూ తీర్పును వెలువరించింది. మన దేశంలో గర్భవిచ్ఛిత్తికి (అబార్షన్) సంబంధించి మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) అనే చట్టం ఉంది. ఆ చట్టంలోని సెక్షన్ 3 బీ ప్రకారం వివాహిత మహిళలు, మైనర్లు, దివ్యాంగులు, అత్యాచార బాధితులు 24 వారాలలోపు గర్భాన్ని సురక్షితంగా, శాస్త్రీయంగా తొలగించుకోవటానికి అనుమతి ఉంది.



స్వర్ణరథంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

స్వర్ణరథంపై మలయప్ప విహారం



తిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి వసంతోత్సవాల్లో భాగంగా తిరుమల వసంత మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి సోమవారం స్నపన తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. తర్వాత స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరించారు.

ఇరాన్ ఎస్-300 డిఫెన్స్

వ్యవస్థ ధ్వంసం!

గత వారం ఇజ్రాయెల్ దాడి ఫలితం

▸▸ ఉపగ్రహ చిత్రాల ద్వారా అమెరికా వెల్లడి

వాషింగ్టన్/టెల్‌అవీవ్, ఏప్రిల్ 22: ఇజ్రాయెల్ గత వారం జరిపిన డ్రోన్, క్షిపణి దాడుల్లో ఇరాన్‌కు చెందిన ఎస్-300పీఎంయూ2 వ్యవస్థ ధ్వంసమైనట్లు అమెరికా గుర్తించింది. ఈ నెల 15కు ముందు ఆ ప్రాంతంలో ఎస్-300 డిఫెన్స్ వ్యవస్థ ఆ ప్రాంతంలో ఉన్నట్లు.. ఇజ్రాయెల్ దాడి తర్వాత కనుమరుగైనట్లు పేర్కొంటూ.. 'గూగుల్ ఎర్త్' ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది. న్యూయార్క్ టైమ్స్, బీబీసీల్లో ఈ మేరకు కథనాలు వచ్చాయి. ఇస్ఫహాన్ నగరంలో ఇరాన్‌కు చెందిన న్యూక్లియర్ ప్లాంట్లు, వైమానిక స్థావరాలు ఉన్న విషయం తెలిసిందే..! వీటికి రక్షణగా రష్యా నుంచి 2016లో కొనుగోలు చేసిన ఎస్-300పీఎంయూ2 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ఇరాన్ మోహరించింది. ఎస్-300 రాడార్లు శత్రువులు ప్రయోగించే క్షిపణులను గుర్తించి, వెనువెంటనే వాటిని ధ్వంసం చేస్తాయి. ఈ వ్యవస్థకు చెందిన బ్యాటరీలు ధ్వంసమైన ఉపగ్రహ చిత్రాలను బీబీసీ, న్యూయార్క్ టైమ్స్ తమ కథనాల్లో ప్రచురించాయి. ఇజ్రాయెల్ దాడిలో ఎస్-300 రాడార్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైపోయినట్లు స్పష్టమవుతోంది.

ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ చీఫ్ రాజీనామా

ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ అహ్రోన్ హలీవా సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. అక్టోబరు 7 హమాస్ దాడికి బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే.. తదుపరి చీఫ్‌ను ప్రకటించేవరకు అహ్రోన్ ఆ పదవిలోనే కొనసాగుతారని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది.

ప్రజాపంపిణీ వ్యవస్థలో భారీ దోపిడీ

▸▸ కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు రేషన్ బియ్యం

▸▸ దోపిడీ విలువ రూ.50 వేల కోట్లు

▸▸ ఎన్డీయే నేతలు మర్రెడ్డి, లంకా దినకర్, శివశంకర్

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో భారీ దోపిడీకి పాల్పడి జగన్ పేదల పొట్ట కొట్టాడని కూటమి నేతలు మండిపడ్డారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్, జనసేన ప్రధాన కార్యదర్శి శివశంకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. 'టీడీపీ హయాంలో 50 శాతం సబ్సిడీతో రేషన్ దుకాణాల్లో సరుకులు అందిస్తే.. అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ సరుకుల్లో కోతపెట్టిన ఘనుడు జగన్. జగన్ ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసి కొన్ని వాహనాల్లోనే అక్రమంగా బియ్యాన్ని ట్రాన్స్‌పోర్టు చేసుకుంటూ దాదాపుగా రూ.50 వేల కోట్లను ద్వారంపూడితో కలిపి జగన్ దోచుకున్నారన్నారు. శివశంకర్ మాట్లాడుతూ.. కేంద్రం సాయంతో అందుతున్న సబ్సిడీ సరుకులను దోచుకుని ప్రజా పంపిణీ వ్యవస్థను వైసీపీ నాశనం చేసిందని అన్నారు. లంకా దినకర్ మాట్లాడుతూ జగన్ కనుసన్నల్లో జరిగిన అవినీతి అక్రాలా రూ.50 వేల కోట్ల పైమాటేనన్నారు. కాగా, ఏపీలో ఎన్నికల నిబంధనలను వైసీపీ రౌడీ మూకలు లెక్కచేయడం లేదని, ప్రజాస్వామ్యాన్ని వైసీపీ నేతలు గౌరవించడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు మండిపడ్డారు. కాగా, సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు భైరి ఓంకార్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఇటీవల టీడీపీలో చేరిన దాదాపు 600 మంది గిరిజనులతో గిరిజన సమైఖ్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలోని దళిత, గిరిజన, మైనారిటీ, వెనుకబడిన తదితర వర్గాలన్నీ టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

'యాక్సిస్' పీపీఏలకు చెక్!

▸▸ డిస్కమ్‌లతో ఆ సంస్థ 21 ఒప్పందాలు

▸▸ వాటిని ఆమోదించబోమన్న ఈఆర్‌సీ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2021 యాక్సిస్ వెంచర్స్ అనే సోలార్, విండ్ సంస్థతో చేసుకున్న ఒప్పందాలను ఆమోదించబోమని రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) స్పష్టం చేసింది. దీనిపై తన ఆదేశాలను సోమవారం తన వెబ్‌సైట్‌లో ఉంచింది. వాస్తవానికి కమీషన్ల కోసం గత ప్రభుత్వం సోలార్, విండ్ సంస్థల నుంచి విద్యుత్తు కొనుగోలు చేసిందని జగన్ ఆరోపించారు. ఆయా ఒప్పందాలను అధికారంలోకి రాగానే రద్దు చేశారు. అయితే, ఆ సంస్థల్లో ఒకటైన యాక్సిస్ వెంచర్స్‌తో 2021లో ఆయన ప్రభుత్వం కొత్తగా ఒప్పందం చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. తమ ఒప్పందాలను రద్దుచేయడంపై సోలార్, విండ్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాయి. సోలార్, విండ్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థలకు సానుకులంగా హైకోర్టు ఆదేశాలు జారీ ఇచ్చింది. దీంతో.. పీపీఏలు యథాతథంగా కొనసాగాయి. కానీ.. జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 'యాక్సిస్' మాత్రం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించలేదు. దరిమిలా ఆ తర్వాతికాలంలో అదే సంస్థతో పలు కరెంటు కొనుగోలు ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. అయితే, వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా యాక్సిస్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని ఆమోదించడం లేదని ఈ నెల 19న రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) స్పష్టం చేసింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) పిలిచే బిడ్డింగ్‌లో పాల్గొనాల్సిందిగా ఆదేశించింది. 'యాక్సిస్' నుంచి 760 మెగావాట్ల విద్యుత్తు కొనుగోళ్ల కోసం డిస్కమ్‌లు చేసుకున్న 21 ఒప్పందాలను ఆమోదించడం లేదని తన ఆదేశాల్లో తెలిపింది. డిస్కమ్‌లతో ఒప్పందం చేసుకున్నందున విద్యుత్తు కొనుగోలు ధరను నిర్ధారించాలంటూ ఏపీఈఆర్‌సీని 'యాక్సిస్' కోరింది. అయితే, ఆ సంస్థ చేసుకున్న 21 పీపీఏలను ఈఆర్‌సీ తోసిపుచ్చింది.

ఉత్పత్తి సంస్థలకు 5వేల కోట్లు బకాయి

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్)తాము విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించడం లేదు. ఆ మేరకు 'ప్రాప్తి' వెబ్ పోర్టల్‌లో వివరాలను కేంద్రం పొందుపరిచింది. అందులో పేర్కొన్న లెక్కల ప్రకారం మన డిస్కమ్‌లు మొత్తం రూ.5,237.97 కోట్లు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సి ఉంది. విద్యుత్ కొనుగోళ్ల బిల్లులను చెల్లించడానికి సాధారణంగా 45 రోజుల గడువు ఇస్తారు. ఆ గడువు దాటితే ఓవర్ డ్యూగా పేర్కొంటారు.

కాస్త తగ్గిన విద్యుత్ డిమాండ్!

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కాస్త తగ్గింది. శనివారం 2,49,893 మిలియన్ యూనిట్ల డిమాండ్ నుంచి ఆదివారం నాటికి 2,44,888 ఎంయూలకు తగ్గింది. దీంతో బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లు కూడా స్వల్పంగా తగ్గాయి. శనివారం 36.155 ఎంయూల విద్యుత్‌ను రూ.26.949 కోట్లు చెల్లించి కొనుగోలు చేయగా, ఆదివారం 36.954 ఎంయూలను రూ.23.396 కోట్లతో కొనుగోలు చేశారు. మరోవైపు ఏ పూటకు ఆ పూటే అన్నట్లుగా బొగ్గు నిల్వలు ప్లాంట్లకు చేరుతున్నాయి. వీటీపీఎస్‌లో 2.40 రోజులకు సరిపడా 68,377 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్టీపీపీలో 3.48 రోజులకు సరిపడా 73,078 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. కృష్ణపట్నంలో 4.18 రోజులకు సరిపడా 29,000 టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయి. హిందూజాలో 1.64 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో 14.09 రోజులకు సరిపడా 20,000 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి.

నవ్య | చిత్రజ్యోతి



'కూలీ'గా రజనీకాంత్

తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ ఓ చిత్రంలో నటిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ నుంచే ఎంతో క్రేజ్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ వర్కింగ్ టైటిల్ 'తలైవర్ 171'. ఈ మూవీకి టైటిల్స్‌గా 'రాణా', 'తంగమ్' పేర్లు కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. సోమవారం చిత్ర బృందం ఈ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ టైటిల్‌ను ప్రకటించి ఓ టీజర్‌ను విడుదల చేసింది. ఆ టైటిల్ 'కూలీ'. ఈ టీజర్‌లో రజనీకాంత్ ఎంట్రీ, లుక్, సంభాషణలు చాలా స్టైలిష్‌గా ఉన్నాయి. ఈ టీజర్‌ను బట్టి సినిమా కథాంశం గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో నడుస్తుందని తెలుస్తోంది. ఈ టీజర్‌లో రజనీ పాత చిత్రం 'తంగ మగన్'లోని డిస్కో పాట, మెగాస్టార్ చిరంజీవి చిత్రంలోని 'అబ్బనీ తీయనీ దెబ్బ' సాంగ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ వినిపించడం అందరినీ ఆకర్షించేలా ఉంది. "ఇదొక ప్రయోగాత్మక చిత్రం. ఇందులో రజనీకాంత్ పోషించే పాత్రకు నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. మునుపెన్నడూ చూడని సరికొత్త సూపర్ స్టార్‌ను ఇందులో చూపించనున్నాను" అని దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సినిమాలో షారుఖ్ ఖాన్, రణవీర్ సింగ్, నాగార్జున, శ్రుతిహాసన్, శోభన కీలక పాత్రలు పోషించనున్నారని టాక్ వినిపిస్తోంది.

ఆ మ్యాజిక్ రిపీట్ చేసేలా...



ఒకే ఇండస్ట్రీకి చెందిన ఇద్దరు టాప్ హీరోలు ఓ పాటకు స్టెప్పులేస్తే అది అభిమానులకు పండగే. ఆ ఊహను 'ఆర్ఆర్ఆర్' సినిమాలో 'నాటునాటు' పాట నిజం చేసింది. అలా తెలుగు ఇండస్ట్రీకి చెందిన టాప్ డ్యాన్సర్స్‌గా పేరొందిన రామ్‌చరణ్, తారక్ ఆ పాటకు కాలు కదిపి వెండితెరపై పండగ వాతావరణాన్ని సృష్టించిన సంగతి తెలిసిందే. మరి, రెండు వేర్వేరు ఇండస్ట్రీలకు చెందిన సూపర్ హీరోలు ఇలా ఒక పాటకు డ్యాన్స్ చేస్తే? ఆ ఊహే ఎంతో గొప్పగా ఉంది కదూ. ఆ ఐ ఫీస్టేనే త్వరలో మనం 'వార్-2'లో చూడబోతున్నాం. ఈ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోన్న జూనియర్ ఎన్టీఆర్.. ప్రస్తుతం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కథాపరంగా ఈ సినిమాలో తారక్ ప్రతినాయకుడి పాత్రను, హృతిక్ రోషన్ హీరోగా 'వార్' మొదటి భాగంలోని కబీర్ పాత్రను కంటిన్యూ చేస్తూ పోషిస్తున్నారు. వీరిద్దరి ముఖాముఖి పోరును తెరపైన చూడటం కోసం యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ ఆసక్తిని మరింత పెంచే సూపర్ న్యూస్ ఒకటి ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతోంది. అదే.. తారక్, హృతిక్ రోషన్ ఒకే పాటకు కాలు కదపడం. ఈ సినిమాలో వీరిద్దరూ ఒక పాటకు కలసి డ్యాన్స్ చేసే ప్రత్యేక సందర్భాన్ని దర్శకుడు అయాన్ ముఖర్జీ సృష్టించారట. ఆ సందర్భంగా వచ్చే ఈ పాట 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాట మ్యాజిక్‌ను, 'వార్' మొదటి భాగంలోని 'జై జై శివ శంకర్' పాటలోని ఎనర్జీని రిపీట్ చేసేలా ఉంటుందట. ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలవడమే కాకుండా, సినిమా పాటల్లోనే ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటుందని దర్శకనిర్మాతలు భావిస్తున్నారు. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

దర్శకుల సంఘానికి ప్రభాస్ 35 లక్షల విరాళం



తెలుగు దర్శకుల సంఘానికి ఓ సంక్షేమ నిధిని సమకూర్చుకోవడమే ప్రధాన ధ్యేయంగా మే 4న (దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా) హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో 'డైరెక్టర్స్ డే'ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సంక్షేమ నిధి కోసం నటుడు ప్రభాస్ రూ. 35 లక్షల భారీ విరాళం ప్రకటించారు. సోమవారం జరిగిన 'డైరెక్టర్స్ డే' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో దర్శకుడు మారుతి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ ఈ విరాళం ఇచ్చిన ప్రభాస్‌కు, మిగిలిన చిత్ర ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుల దినోత్సవం ద్వారా సమకూరే నిధులను తమ సంఘ సభ్యుల ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో దర్శకుడు హరీశ్ శంకర్ మాట్లాడుతూ.. చిరంజీవి, ప్రభాస్, మోహన్‌బాబు, విజయ్ దేవరకొండ, రామ్ పోతినేని, కల్యాణ్ రామ్ తదితర హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఎందరో ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు దర్శకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నరేశ్ కామెడీని మిస్ అయ్యా



అల్లరి'నరేశ్ అందిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో నాని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'నరేశ్ అద్భుతమైన నటుడు. ఆయన బ్యాక్ టు బ్యాక్ కామెడీ సినిమాలు అప్పట్లో చేస్తుంటే వాటికి కొంచెం బ్రేక్ ఇవ్వమని నేనే కోరాను. కానీ ఈ సినిమా ట్రైలర్ చూశాక ఆ బ్రేక్‌లో తన కామెడీని మిస్ అయ్యానని అనిపించింది. ఇందులో పెళ్లి కంటెంట్ అందరికీ రిలేట్ అయ్యేలా ఉంది. ట్రైలర్ చూసి ఎంజాయ్ చేశా' అన్నారు. నరేశ్ మాట్లాడుతూ 'నాని మా ఫ్యామిలీ మెంబర్.. అతను ఈ వేడుకకు రావడం ఆనందంగా ఉంది. టీమ్ అంతా కష్టపడి చేసిన సినిమా ఇది. కచ్చితంగా ఈ సమ్మర్‌లో మిమ్మల్ని నవ్విస్తాను' అన్నారు నరేశ్. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, నిర్మాత రాజీవ్ చిలక, రచయిత అబ్బూరి రవి, దర్శకుడు మల్లి అంకం తదితరులు పాల్గొన్నారు.

లవ్.. ఫ్యామిలీ ఎమోషన్స్



అంకిత్ కొయ్య, విశాఖ ధిమన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. రావు రమేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాల సుబ్రమణ్యమ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎ.విజయ్‌పాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దర్శకుడు మారుతి క్లాప్ కొట్టగా, డైరెక్టర్ బుచ్చిబాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కలగలిపి తెరకెక్కుతోందీ చిత్రం. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేశ్, సినిమాటోగ్రఫీ: మనోహర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ప్రకాశ్ రౌతు.

పవర్‌ఫుల్‌పోలీస్ ఆఫీసర్ పాత్రలో...



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. ఈ సినిమాలో కాజల్ ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌ను పోషిస్తున్నారు. నవీన్‌చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. 'మేజర్' మూవీ డైరెక్టర్ శశికిరణ్ తిక్క స్క్రీన్‌ప్లే అందించి ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తూ మేకర్స్ ఓ ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. మే 17న ఈ సినిమాని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బి.విష్ణు, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

దళితుడిపై వైసీపీ నాయకుల దాడి

▸▸ తీవ్ర రక్తగాయాలతో ఆసుపత్రిలో చేరిక



రక్తగాయాలతో చంద్రశేఖర్

గడివేముల, ఏప్రిల్ 22: నంద్యాల జిల్లాలో ఓ దళితుడిపై వైసీపీ నాయకులు దాడులకు తెగబడ్డారు. గడివేముల మండలంలోని దుర్వేసి గ్రామంలో సోమవారం రాత్రి దళితుడిపై వైసీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడి చేశారు. బాధితుడు పెరుమాళ్ల చంద్రశేఖర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా... పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత దుర్వేసి గ్రామంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారం కార్యక్రమంలో పెరుమాళ్ల చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు. ప్రచారం ముగిసిన అనంతరం పెరుమాళ్ల చంద్రశేఖర్ ఇంటికి వెళ్తుండగా వైసీపీ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి ఇంటి వద్ద అతడి కుమారుడు సాయికుమార్‌రెడ్డి ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడపడంతో పెరుమాళ్ల చంద్రశేఖర్ అభ్యంతరం తెలిపారు. దీనిపై కోపోద్రిక్తుడైన సాయికుమార్‌రెడ్డి 'నువ్వు ఎన్నికల ప్రచారానికి వెళ్లేంతటి వాడివా రా..' అంటూ పెరుమాళ్ల చంద్రశేఖర్‌పై కర్రతో దాడి చేశారు. తీవ్ర రక్తగాయాలపాలైన పెరమాళ్ల చంద్రశేఖర్‌ను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి జరిగిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

డిప్యుటేషన్ అధికారులతో అడ్డగోలుగా దోపిడీ

▸▸ రాష్ట్రంలోని కీలక ప్రభుత్వ శాఖలన్నీ వారి చేతుల్లోనే!

▸▸ జగన్ తరపున పైరవీకారుడిగా మారిన ధర్మారెడ్డి

▸▸ ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి: నీలాయపాలెం

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తెచ్చుకొన్న అధికారుల చేతుల్లో కీలక శాఖలన్నీ పెట్టి జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా దోపిడీ చేస్తోందని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారులను పక్కనబెట్టి డిప్యుటేషన్‌పై వచ్చిన సొంత సామాజిక వర్గం వారికి పెద్దపీట వేసి వారితో వ్యవహారాలు నడిపిస్తోందని ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా ఉండి జగన్ సేవలో తరించిన డిప్యుటేషన్ అధికారి వాసుదేవ రెడ్డిని పంపించినట్లుగా మిగిలిన అధికారులపై కూడా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'మైన్స్, మైన్స్, లాండ్, శాండ్, అడ్వర్టయిజ్‌మెంట్, ఫైనాన్స్, రెవెన్యూ ఇంటలిజెన్స్.. ఇలా భారీగా రాబడి వచ్చే శాఖలన్నీ డిప్యుటేషన్‌పై వచ్చే వారి వద్దే ఉన్నాయి. వారెవరూ ఐఏఎస్‌లు కాదు. కేంద్రంలోని డిఫెన్స్, ఐఆర్‌టీఎస్, పర్సనల్ తదితర శాఖల నుంచి తమకు కావాల్సిన వారిని తెచ్చుకొని కీలక శాఖల్లో పెట్టుకొన్నారు. వీరంతా ఐదేళ్లపాటు చేయాల్సిన అరాచకాలన్నీ చేసి తర్వాత సొంత శాఖలకు వెళ్లిపోతున్నారు. ఉదాహరణకు తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ఐఐఎస్ విభాగం నుంచి వచ్చి జగన్ పత్రిక సాక్షికి వందల కోట్ల రూపాయలు ప్రకటనల రూపంలో దోచి పెట్టడానికి సహకరించారు. సాక్షి ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా వేతనాలు చెల్లించారు. ఎస్.రమణారెడ్డి పునరుత్పాదక విద్యుత్ సంస్థలో ఉండి వైసీపీ నాయకులకు, వారికి కావాల్సిన వారికి దశాబ్దాలపాటు చెల్లుబాటు అయ్యేలా విద్యుత్ ఒప్పందాలు చేశారు. ప్రభుత్వానికి కావాల్సిన కంపెనీలకు సౌర విద్యుత్ పేరుతో లక్ష ఎకరాలు కట్టబెట్టారు. రక్షణ శాఖలో స్టేట్ ఎస్టేట్స్ విభాగంలో పనిచేసే ఏవీ ధర్మారెడ్డి టీటీడీ పదవిని అడ్డుపెట్టుకొని ఢిల్లీలో జగన్ తరపున పైరవీకారుడిగా మారారు. ఇటువంటి అధికారులు ఈ ప్రభుత్వంలో కోకొల్లలుగా ఉన్నారు' అని నీలాయపాలెం విమర్శించారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ బస్తర్ డివిజన్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రాంతంలో పనిచేస్తున్న ఆరుగురు మావోయిస్టులు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. చత్తీస్‌గఢ్‌కు చెందిన వీరందరిపైనా రివార్డులు ఉన్నాయి. విశాఖలోని పాత జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు, కిస్టారం ఏరియా కమిటీ సెక్రటరీ అయిన కుహరం మిథలేష్ అలియాస్ రాజు (37), కిస్టారం ఏరియా కమిటీ సభ్యుడు బరసె మాసా (30), కొంట ఏరియా కమిటీ సభ్యుడైన వెట్టి భీమా (32). కిస్టారం ఏరియా కమిటీ సభ్యురాలైన వంజమ్ రామే అలియాస్ కమల (28), కిస్టారం ఏరియా కమిటీ దళ సభ్యులైన మడకం సుక్కి (27), దూడి సోని (23)పై లొంగిపోయారని వివరించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 23 ఏప్రిల్ 2024

నమస్కారం ఎందుకు పెడతారో తెలుసా!

ఇంటర్వ్యూల్లో కొన్ని సందర్భాల్లో విచిత్రమైన ప్రశ్నలు ఎదురవుతుంటాయి. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలో నాకు ఇలాంటి అనుభవమే ఎదురయింది. సాధారణంగా మనం ఎవరినైనా పలకరించాలన్నా, గౌరవించాలన్నా పెద్దవారైతే నమస్కారం, సమ వయస్కులు లేదా చిన్నవారు అయితే హలో చెబుతాం. నేను ఇంటర్వ్యూ రూమ్ లోపలికి వెళుతూనే అందరికీ నమస్కారం పెట్టాను. దాంతో అసలు నమస్కారం ఎందుకు పెడతారని ప్రశ్నించారు. నమస్కారానికి ఉన్న ప్రాధాన్యం, దాంతో కలిగే ప్రయోజనాలు, ఏర్పడే బంధాలు తదితరాలపై అడిగి తెలుసుకున్నారు.

- సాధారణంగా వ్యక్తుల ప్రవర్తన, హఠాత్తుగా ఏదైనా ప్రశ్న ఎదురైతే ఎలా స్పందిస్తారు, తను చేసే పనుల పట్ల ఎంత అవగాహన ఉంది తదితరాలు ఇలాంటి వాటివల్ల తెలుస్తాయి అని నేను అనుకుంటున్నా. సివిల్స్‌లో దినేష్ దాసా బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది. నా ఆప్షనల్ సబ్జెక్టు సోషియాలజీ. నా సబ్జెక్టు మొదలుకుని పలు రంగాలపై నన్ను బోర్డు ప్రశ్నించింది. వాటన్నిటికీ సంతృప్తికరంగానే జవాబు ఇచ్చాను.
- గ్రాడ్యుయేషన్ తరవాత ఐటి కంపెనీ 'క్యాప్ జెమినీ'లో ఉద్యోగం చేశాను. అక్కడ నా జాబ్ నేచర్, నేను అందించిన సేవలు, నిర్వర్తించిన పనుల గురించి అడిగారు. ఐఐఎఫ్‌టీ విద్యార్థిని కావడంతో వాణిజ్య యుద్ధాల(ట్రేడ్ వార్స్)పై ప్రశ్నించారు. సోషియాలజీలో ఆత్మహత్యలపై ఒక థియరీ ఉంది. నా ఆప్షనల్ అదే కావడంతో ఆ థియరీని ప్రస్తావిస్తూ మహారాష్ట్రలో రైతులు, అలాగే కోటాలో విద్యార్థులు ఆత్మహత్యలపై నా అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. రెంటినీ కంపార్ చేస్తూ చెప్పమన్నారు. ఒకవేళ కోటా కలెక్టర్‌గా వెళితే, అక్కడ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా మీరు ఏమి చర్యలు తీసుకుంటారని అడిగారు. అలా పుస్తకంలో ఉన్న థియరీని, ప్రాక్టికల్ సమస్యలకు ఎలా అప్లయ్ చేయగలనో తెలుసుకునే ప్రయత్నం చేశారు.
- నా హాబీ ట్రావెల్ అని చెప్పడంతో ఏయే ప్రదేశాలను సందర్శించావు, భారతదేశంలో పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలేమిటి అని అడిగారు. ప్రతీదీ నా బయోడేటా ఆధారంగా అడిగారు. ఎలా పరిష్కరించవచ్చో తెలుసుకునే ప్రయత్నం చేశారనిపించింది. దాదాపుగా నా డీటెయిల్డ్ బయోడేటా చుట్టూనే ప్రశ్నలన్నీ ఉన్నాయి.

కోచింగ్ తీసుకోలేదు

సివిల్స్ కోసం నేనెక్కడా కోచింగ్ తీసుకోలేదు. సొంత ప్రిపరేషన్‌పైనే ఆధారపడ్డాను. ప్రిలిమ్స్‌లో జనరల్ స్టడీస్ కోసం చదువుతున్నప్పుడు సోషియాలజీపై ఆసక్తి పెరిగింది. జనరల్ స్టడీస్‌లో ఎక్కువగా సమాజంపై వివిధ అంశాలు చూపే ప్రభావం ఎక్కువ ఉంటుంది. అదే నన్ను సోషియాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొనేలా చేసింది. పరీక్షల్లో కూడా 2013 నుంచి జనరల్ స్టడీస్ పేపర్లన్నీ చూశాను. అలా మెయిన్స్‌లో అడిగే ప్రశ్నల తీరును సునిశితంగా పరిశీలించగలిగాను. ప్రిలిమ్స్ క్లియర్ అయ్యాక మెయిన్స్‌కి సంబంధించి గంటకు ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాసేవాడిని. ఇది నా రెగ్యులర్ ప్రాక్టీస్. గూగుల్‌లో టాపర్ల సమాధానాలు, ఇంటర్వ్యూలు లభిస్తాయి. వాటితో నా సమాధానాలను సరిపోల్చుకునేవాడిని. లోపాలు ఏమైనా ఉంటే సరిదిద్దుకొని ముందుకు వెళ్లాను. అలా నా మెయిన్స్ ప్రిపరేషన్ కొనసాగింది. మొత్తమ్మీద మొదటి యత్నంలోనే సివిల్స్‌లో 82వ ర్యాంకు సాధించగలిగాను.

- నేను చూసిన కొందరు ఐపీఎస్ అధికారుల పనితీరు నన్ను సివిల్స్ వైపు మొగ్గుచూపేలా చేసింది. ఢిల్లీలో చదువుతున్నప్పుడు, అది మరింత బలపడింది. అదే నన్ను సివిల్స్ రాసేలా చేసింది. సివిల్స్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు కనీసం పది పదిహేనుమంది టాపర్ల ఇంటర్వ్యూలను యూట్యూబ్‌లో చూడాలి. ఆ టాపర్లు తమ ప్రిపరేషన్ ఎలా జరిగిందనేది చెబుతుంటారు. వాటిలో మనకు నచ్చిన విషయాలు తీసుకుని సొంతంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. మరీ ముఖ్యంగా పాత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ఎగ్జామ్ సరళి తెలుస్తుంది. ప్రశ్నలు అడిగే విధానం అర్థమవుతుంది. పరీక్షపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. అదే మన ప్రశ్నకు చుక్కానిలా పనిచేస్తుంది.

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్



మెరుగు కౌషిక్
ర్యాంకు: 82

స్వస్థలం: జనగామ(తెలంగాణ)
తండ్రి: సుధాకర్(కన్‌స్ట్రక్షన్ బిజినెస్)
తల్లి: సుజాత(గృహిణి). **సోదరి:** నివేదిత
అర్హత: ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజి నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్. ఢిల్లీలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) నుంచి ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో ఎంబీఏ.
ఉద్యోగం: క్యాప్ జెమినీలోని ఆర్థిక సేవల విభాగంలో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా ఒక ఏడాది అనుభవం.

నోటిఫికేషన్స్



ఏపీ డీఈఈ సెట్

ఇబ్రహీంపట్నం(విజయవాడ)లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్య విభాగం- డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(డీఈఈ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ) కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ డైట్‌లు(డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్), ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ట్రెయినింగ్ సంస్థల్లో అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో 25 శాతం సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ డైట్‌లలోని సీట్లు, ప్రైవేట్ సంస్థల్లోని ఎ కేటగిరీ సీట్లను సింగిల్ విండో పద్ధతిలో; ప్రైవేట్ సంస్థల్లోని బి కేటగిరీ సీట్లను ఆ సంస్థల నిర్ణయం మేరకు భర్తీ చేస్తారు. ఇంగ్లీష్ మీడియం సీట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటికి ఆంగ్ల మాధ్యమంలో చదివినవారు మాత్రమే అర్హులు. ఏపీ డీఈఈ సెట్ 2024కు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఒకేషనల్ కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. డిప్లొమా కోర్సులో మేథమెటిక్స్‌ను ఎంచుకోవాలంటే ఇంటర్‌లో మేథ్స్ ప్రధాన సబ్జెక్టుగా చదివి ఉండాలి. అలాగే ఫిజికల్ సైన్స్‌కు ఫిజిక్స్, కెమిస్ట్రీ; బయలాజికల్ సైన్స్‌కు బోటనీ, జువాలజీ; సోషల్ స్టడీస్‌కు సివిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, కామర్స్‌లలో ఏవైనా రెండు సబ్జెక్టులు చదివి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

డీఈఈ సెట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 60, రెండో పార్ట్‌లో 40 చొప్పున మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. మొదటి పార్ట్‌లో టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్, తెలుగు అంశాలనుంచి ఒక్కోదానిలో 5; ఎంచుకొన్న లాంగ్వేజ్(తెలుగు/తమిళం/ఉర్దూ/ఇంగ్లీష్), మేథమెటిక్స్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో అభ్యర్థులు సబ్జెక్టులు ఎంచుకోవాల్సి ఉంటుంది. మేథమెటిక్స్‌లో 40; ఫిజికల్ సైన్స్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ఒక్కోదానిలో 20; బయలాజికల్ సైన్స్‌లో బోటనీ, జువాలజీల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. సోషల్ స్టడీస్‌లో హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ నుంచి ఒక్కోదానిలో 13 ప్రశ్నలతోపాటు ఆ సబ్జెక్టుల్లో ఒకదాని నుంచి మరో ప్రశ్న ఇస్తారు. మొదటి పార్ట్‌లో ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు ఏపీ స్టేట్ సిలబస్ ఆధారంగా; రెండో పార్ట్‌లో ఏపీ ఇంటర్ బోర్డు సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థి ఎంచుకొన్న ప్రకారం తెలుగు/ఉర్దూ/తమిళం/కన్నడం/సంస్కృతంతోపాటు ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రశ్నపత్రం ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. డీఈఈ సెట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు రావాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు వస్తే చాలు. వీరు జనరల్/ఎన్‌సీసీ/సీఏపీ/స్పోర్ట్స్ కేటగిరీ సీట్లకు పోటీ పడాలంటే మాత్రం 50 శాతం మార్కులు తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 8
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 9
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 21 నుంచి
- **ఏపీ డీఈఈ సెట్ 2024 తేదీలు:** మే 24
- **ఫలితాలు విడుదల:** మే 30
- **వెబ్ ఆప్షన్స్:** జూన్ 6 నుంచి 8 వరకు
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూన్ 10
- **సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** జూన్ 12 నుంచి 15 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూన్ 20 నుంచి
- **వెబ్‌సైట్:** https://apdeecet.apcfss.in

యూజీసీ నెట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(యూజీసీ నెట్) జూన్ 2024కి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయడానికి, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)నకు, పీహెచ్‌డీ అడ్మిషన్స్‌కు నెట్ అర్హత తప్పనిసరి. ఎస్ఎఫ్ఎస్సీ, ఎస్ఎఫ్ఓబీసీ, ఎస్ఎఫ్‌పీడబ్ల్యూడీ ఫెలోషిప్‌లకు కూడా నెట్ అర్హతనే ప్రామాణికంగా తీసుకొంటారు. మొత్తం 83 సబ్జెక్టుల్లో ఈ టెస్ట్‌ని నిర్వహిస్తున్నారు.

అర్హత: హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ (లాంగ్వేజ్‌లు సహా), కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్ సైన్స్ తదితర విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు; కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ(నిర్దేశ కాలపరిమితి) అభ్యర్థులను జేఆర్ఎఫ్/పీహెచ్‌డీ అడ్మిషన్‌కు మాత్రమే అనుమతిస్తారు. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసేందుకు వీలు లేదు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)నకు అప్లయ్ చేసుకొనే అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హతకు/పీహెచ్‌డీ అడ్మిషన్‌కు అప్లయ్ చేసుకొనే అభ్యర్థులకు వయోపరిమితి నిబంధనలు లేవు.

యూజీసీ నెట్ 2024 వివరాలు: దీనిని ఓఎంఆర్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. రెంటిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి పేపర్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థికి ఉన్న టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ పరిజ్ఞానాన్ని పరీక్షించేలా రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, డైవర్జెంట్ థింకింగ్, జనరల్ అవేర్‌నెస్ అంశాలకు సంబంధించి 50 ప్రశ్నలు అడుగుతారు. రెండో పేపర్ 200 మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్టు నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లలో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1150; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.325
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరక్షన్స్:** మే 13 నుంచి 15 వరకు
- **యూజీసీ నెట్ జూన్ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in, www.nta.ac.in



భారత్ సొంత సూచీలను ఏర్పాటు చేసుకునే తరుణం ఆసన్నమయ్యిందా?

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



కొలమానం ఒకటే అయినప్పుడు, పోలిక సమఉజ్జీల మధ్య ఉండాలి. ఒకవేళ అసమానులను, సమానులను ఉమ్మడిగా తూచాలంటే తదనుగుణమైన కొలమానాన్ని నిర్మించుకోవాలి. అప్పుడే అంచనాల్లో కచ్చితత్వం వస్తుంది.

అయితే ఇటీవలికాలంలో విడుదలైన ప్రపంచ సంతోష సూచీ, ప్రపంచ ప్రజాస్వామ్య సూచీ(లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్), ప్రపంచ పాత్రికేయస్వేచ్ఛా సూచీ(వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్) వంటి సూచీల అంచనాల్లో డొల్లతనం వాటి సూచీ నిర్మాణ లోపాలను, ఆ సంస్థల విశ్వసనీయతను గురించిన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఈ సూచీల కారణంగా భారతదేశానికి సంబంధించి తప్పుడు సమాచారాన్ని ప్రపంచ వేదికలపై ప్రకటిస్తున్న కారణంగా భారీగా నష్టపోతున్న భారత్ తన సొంత సూచీల నిర్మాణం దిశగా సమాయత్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవలి సూచీల్లో ప్రకటితమైన అసంబద్ధ అంశాలను, ఆ సూచీల నిర్మాణంలో నిర్హేతుకతనూ, భారత్ సొంత సూచీలను నిర్మించుకోవాల్సిన ఆవశ్యకతను గురించి చర్చిద్దాం.

వివిధ నివేదికలు వాటిలోని అసంబద్ధ అంశాలు

మార్చి మొదటివారంలో విడుదలైన 'లిబరల్ డెమోక్రటిక్ ఇండెక్స్(ప్రపంచ ప్రజాస్వామ్య సూచీ)-2024' ప్రకారం సర్వే చేసిన 179 దేశాల్లో, అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్ 104వ ర్యాంకును పొందింది. అయితే ఇదే సూచీలో భారత్‌కు ఎగువ ఉన్న 103వ స్థానంలో నిజేర్ ఉండగా, మరింత మెరుగైన స్థానంలో(98) కువైట్ ఉంది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే గత నెలలో ఒక పార్లమెంటు సభ్యుడు ఆ దేశ రాజు(అమిర్)ను విమర్శించిన కారణంగా మొత్తం పార్లమెంట్‌నే రద్దు చేశారు. ఇక నిజేర్‌లో గత సంవత్సరం జూలై నుంచి ఆ దేశ అధ్యక్షుడు గృహనిర్బంధంలో ఉండగా, అక్కడ మిలిటరీ జుంటా చేతిలోకి పరిపాలన వెళ్లిపోయింది. ఇలాంటి దేశాలు భారత్ కంటే మెరుగైన ర్యాంకులను పొందగా, క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతూ, ఎప్పుడూ మిలిటరీ పాలనను చవిచూడని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్, అసలు ప్రజాస్వామ్యం ఊసే లేని దేశాలకంటే అథమస్థాయి ర్యాంకును పొందడం ఆశ్చర్యకరం.

- ఇటీవల విడుదలైన ప్రపంచ సంతోషసూచీలో 143 దేశాల్లో భారత్ స్థానం '126'. అయితే ఈ నివేదికలో మయన్మార్ 118వ స్థానంలో, పాకిస్థాన్ 108వ స్థానంలో, పాలస్తీనా 103వ స్థానంలో, ఉక్రెయిన్ 106వ స్థానంలో ఉన్నాయి. ఈ దేశాల్లో దేనిలోనూ ప్రశాంత పరిస్థితులు లేవు. మయన్మార్‌లో ఏడు దశాబ్దాలుగా అంతర్యుద్ధ(సివిల్ వార్) పరిస్థితులు నెలకొని ఉన్నాయి. పాకిస్థాన్‌లో అస్థిర ప్రభుత్వం, ద్రవ్యోల్బణం, మిలిటరీ ఆధిపత్యం, ఉగ్రవాద ప్రాబల్యం, నిరుద్యోగిత, కనీస అవసరాలకు కటకట వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఇక పాలస్తీనా దశాబ్దాల తరబడి ఒక దేశంగా గుర్తింపు కోసం పోరాడుతూనే ఉంది. నిరంతరం దాడులు, పేదరికంతో అలమటిస్తోంది. ఉక్రెయిన్ విషయానికి వస్తే ఇటీవలకాలంలోనే కాదు, కొద్ది సంవత్సరాలుగా యుద్ధ పరిస్థితుల్లో ఉంది. మత్తు మందు కొరత ఏర్పడింది. దాంతో మత్తు ఇవ్వకుండానే క్షతగాత్రులకు శస్త్రచికిత్సలు చేస్తున్న హృదయవిదారక పరిస్థితి అక్కడ ఉంది. ఆహార ధాన్యాల కోసం ఇతరదేశాల సాయం కోసం చూడాల్సిన దైన్యం. రష్యా నుంచి బాంబుల వర్షం. ఇలాంటి భయానక పరిస్థితులు నెలకొన్న దేశాలతో పోలిస్తే ఎంతో ప్రశాంతంగా ఉన్న భారతదేశం ఆనందసూచీలో ఈ దేశాల కన్నా వెనుకబడి ఉండటం విస్తుగొలుపుతోంది. ఏ ప్రాతిపదికన ఈ సూచీని తీసుకున్నారు? దానికి కొలమానాలేంటి అనే సందేహాలు ముప్పిరిగొంటున్నాయి. ఇక ప్రపంచ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్‌లోనూ ఇదే ధోరణి కనబడుతోంది. దీనిలో 180 దేశాల్లో భారత్‌ది 161వ స్థానం. ఆఫ్ఘనిస్థాన్ 152వ స్థానంలో, పాకిస్థాన్ 150వ స్థానంలో, యూఏఈ 145వ స్థానంలో సొమాలియా 141వ స్థానంలో, ఉగాండా 133వ స్థానంలో ఉన్నాయి.
- తాలిబన్ల కనుసన్నల్లోనే ఏదైనా జరిపే ఆఫ్ఘనిస్తాన్, నియంతృత్వ పోకడలు ఉన్న ఉగాండా, సొమాలియా, యూఏఈ, పాకిస్థాన్ వంటి దేశాల కంటే సమాచారాన్ని ఒక ప్రాథమిక హక్కుగా కల్పించిన భారతదేశంలో తక్కువగా పాత్రికేయ స్వేచ్ఛ ఉందనడం హాస్యాస్పదం. ఈ దృష్టాంతాలు సూచీలను వెల్లడిస్తున్న సంస్థల విశ్వసనీయతను, వాటి దత్తాంశ సేకరణ ప్రమాణాలను ప్రశ్నిస్తున్నాయి.

ఎన్నుకున్న ప్రమాణాల్లో లోపాలు

- ఐక్యరాజ్యసమితికి చెందిన 'సస్టయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్' ఏటా గాలప్ వరల్డ్ పోల్, ఆక్స్‌ఫర్డ్ వెల్ బీయింగ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో ప్రపంచ ఆనందసూచీ(వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్)ని విడుదల చేస్తుంది. వీరు ఈ రిపోర్ట్/సూచీ తయారుచేయడానికి సంతోషాన్ని కొలవడానికి ఆరు కొలమానాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. అవి-

1) సామాజిక మద్దతు(సోషల్ సపోర్ట్)
2) ఆదాయం 3) స్వేచ్ఛ 4) దాతృత్వం
5) ఆరోగ్యం 6) అవినీతి లేకపోవడం.

గాలప్ వరల్డ్ పోల్ సంస్థ ఈ ఆరు అంశాలకు సంబంధించి ప్రపంచవ్యాప్త సర్వే నిర్వహిస్తుంది. అన్ని దేశాల్లో ఒక నిర్ణీత సంఖ్యలో అనగా ప్రతి దేశంలో రమారమీ వెయ్యిమంది పౌరులను సర్వే చేస్తుంది. ఆరు కొలమానాలపరంగా తమ సంతృప్తి స్థాయిల ప్రకారం సున్నా నుంచి పది పాయింట్ల మధ్య ఒక నంబరును ఎంచుకుంటారు. ఈవిధంగా వెయ్యిమందిలో గరిష్ఠంగా ఎంచుకున్న సంఖ్య, కనిష్ఠంగా ఎంచుకున్న సంఖ్యల మధ్య గల వ్యత్యాసం(హ్యాపీనెస్ గ్యాప్) ఆధారంగా ఆ దేశపు ర్యాంకు నిర్ణయించవచ్చు. వ్యత్యాసం తక్కువగా ఉంటే మెరుగైన ర్యాంక్ లభిస్తుంది. అదే వ్యత్యాసం భారీగా ఉంటే అథమస్థాయి ర్యాంకులు లభిస్తాయి. అయితే భారతదేశం వంటి అత్యధిక వైవిధ్యతలు, విభిన్న సంస్కృతి సంప్రదాయాలు, కుల, మత, ప్రాంత, భౌగోళిక, భాషాపరమైన వైవిధ్యతలు, ఆదాయ, విద్యాపరమైన స్థాయిలో భారీ వ్యత్యాసాలు గల దేశంలో అభిప్రాయాల్లో ఏకరూపత ఉండదు. అందువల్ల ఒకేతరహా పరిస్థితులను ఎదుర్కొంటున్న అల్లకల్లోల పరిస్థితులున్న దేశాల ప్రజల అభిప్రాయాల్లో ఉన్న ఏకత్వం ఇక్కడ కనపడదు. అంతమాత్రంతో కేవలం అభిప్రాయాల్లో ఉన్న వ్యత్యాసాలు ఆధారంగా సంతోష స్థాయిలు నిర్ణయించడం నిర్హేతుకం.

- భారతదేశం వంటి భారీ జనాభా గల దేశంలో వెయ్యిమందిని సర్వే శాంపిల్స్‌గా తీసుకోవడం అంటే చాలా తక్కువమంది అభిప్రాయాలను దేశం మొత్తానికి అంటగట్టడమే. అదేవిధంగా భారతదేశంలో ఒకరాష్ట్రంలో ఉన్నంత జనాభా కూడా లేని దేశాలను, భారతదేశాన్ని ఒకే గాడిన కట్టి, ఒక నిర్ణీత సంఖ్యలో అభిప్రాయ సేకరణ జరపడం అహేతుకం.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



క్షమాపణలు చెప్పిన సింహం

ఒక అడవిలో సింహరాజు ఉండేది. అసలే అడవికి రాజు. దానికి గర్వం బోలెడంత. ఏ జంతువు ఎదురుగా వచ్చినా సహించేది కాదు. ఆఖరికి ఏనుగు వచ్చినా.. తానే గొప్ప అనుకునేది. ఏనుగులు కూడా పెద్దగా పట్టించుకునేవి కావు. అయితే ఆ సింహానికి మాత్రం ఎవరూ అసలు విషయం చెప్పేవారు కాదు. ఎందుకంటే సింహమంటే భయం. పైగా రాజుల దగ్గర నిజాలు ఎవరూ చెప్పరు.

సింహానికి ఓ కుందేలు అడవిలో జరిగే విషయాలన్నీ చెప్పేది. అయితే ఆ తర్వాత ఆ కుందేలుని ఓ నక్క వేటాడి తినేసింది. ఆ కుందేలు సమాచారం ఇవ్వకపోవటంతో సింహం గిలగిలలాడేది. దీంతో ఓ నక్క ఆ సింహం పంచన చేరింది. ఆ నక్కను నమ్మే పరిస్థితి లేదు సింహానికి. దీంతో నక్కను దూరం చేసుకుంది. ఇలా అడవిలో అన్నీ ఆలోచించటం వల్ల ఇబ్బంది. అయినా ప్రశాంతత కోసం ఏమీ పట్టించుకోకూడదు అనుకుంది. అయితే సింహానికి కోపం ఎక్కువైంది. ఎంతైనా రాజు కదా!


ఒక రోజు సింహం గుహలో నిద్రపోతోంది. ఒక చిట్టెలుక బొరియ చేసుకుంది. అయినా సింహం నిద్రపోతూ ఉంది. ఈ సింహం అయితే నేనేమీ చేయాలి అనే ఆలోచన చిట్టెలుకది. సింహం పడుకున్న చోటే చిట్టెలుక బొరియ తవ్వింది. ఆ తర్వాత సింహం మీద ఆడుకుంది. పరిగెత్తింది.




సింహం పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత సింహం మీద ఎగిరింది. దీంతో ఒక్క ఉదుటున పంజాతో చిట్టెలుకను పట్టేసుకుంది. 'పిల్లల మీద మీ కోపమా? నేను ఆదుకుంటాను మిమ్మల్ని. ఇప్పుడు విడిచిపెట్టు' అన్నది చిట్టెలుక. దీంతో సింహం వికటాట్టహాసం చేస్తూ నవ్వింది. పిడికెడు లేవు నువ్వు నన్ను కాపాడడమా? అన్నది. అయినా నీ ధైర్యం, నీ మాటలు బావున్నాయి. బతుక్కో అంటూ వదిలేసింది.

అడవిలో సింహానికి సమాచారం ఇచ్చేవారు లేరు. ముగ్గురు వేటగాళ్లు అడవిలోకి వచ్చారు. వలలు పన్నారు. అది కూడా సింహం ఆనవాళ్లు, జాడ చూసి వలలు వేశారు. గుహలోంచి వచ్చిన సింహం ఆ వేటగాళ్లు పడిన వలలో పడింది. ఇక చావే శరణ్యం అనుకుంది సింహం. ఆ చెట్టు మీద చిట్టెలుక ఉంది. సింహం పరిస్థితి చూసి కిందకు వచ్చి నిముషాల్లో ఆ వలను కొరికేసింది. తుంటలుగా వల పడిపోయింది. 'నీ ఆకారం చూసి తక్కువ అంచనా వేశా. క్షమించు. ఈరోజు నుంచి నువ్వు నా దగ్గరే ఉండు' అని సింహం అడిగింది. అప్పటినుంచి వారిద్దరి స్నేహం అలా కొనసాగింది.

జత ఉన్న బొమ్మ ఏది?





దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?

10 తేడాలు గుర్తించండి



8			2					
					6			3
4		9		1		8	6	
		8				3	1	9
5	2	6				4		
	9	7		4		2		6
1			5					
					3			7

డైలీ సుడోకు - 288

సుడోకు - 287 సమాధానం

9	6	4	1	3	7	5	8	2
3	5	2	8	6	4	1	9	7
1	8	7	9	5	2	3	6	4
2	7	8	6	9	3	4	5	1
5	9	6	2	4	1	8	7	3
4	1	3	7	8	5	9	2	6
6	3	5	4	7	9	2	1	8
8	4	1	5	2	6	7	3	9
7	2	9	3	1	8	6	4	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.